# మనసు మాట వినదు

నవల

– కమలాగాయత్రి(క్రొవ్విడి)చెనిమెళ్ళ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 231

కౌముది మాసపత్రికలో

జనవరి 2017 సంచిక నుంచి ఆగస్ట్ 2018 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

*జీవితంలో కొన్ని పరిచయాలు శాశ్వతమైన బంధాలుగా మారడానికి అద్భుతాలే జరగనక్కరలేదు. ఒక చిన్న ఘటనే చాలు.*

*ఓ సాధారణమైన పరిచయం, ఎప్పుడు స్నేహంగా ఎదుగుతుందో, ఎలా ప్రేమగా మారుతుందో తెలుసుకోగలవారెవరు!!*

"ఏయ్ మనూ ఇంత పొద్దున్నే, ఈ చలిలో ఎక్కడికే? హాయిగా ముసుగుతన్ని పడుకోక..." దుప్పట్లోంచే బద్ధకంగా చూస్తూ అడిగింది రేఖ.

షూ లేస్ బిగించుకుంటున్న మనోజ్ఞ తలెత్తి చూసి చిన్నగా నవ్వింది. "హాయిగా ముసుగుతన్ని పడుకోవడానికైతే ఇలా హిల్ స్టేషన్ లో పెట్టిన సెమినార్స్ కి రావడం దేనికి మిస్? చక్కగా పది ఆప్షన్స్ ఇచ్చారుగా! వేరే ఎక్కడో చూస్కుంటే పోయేది. ఇడియట్! లేచి, అలా ఓసారి బయటికి చూడు. ఇంత మంచి కొండ గాలి, చల్లటి వెదర్, ఈ సీనిక్ బ్యూటీ, ఇవన్నీ ఎప్పుడెంజాయ్ చేస్తాం చెప్పు? అసలూ..." అంటూ ఇంకేదో చెప్పబోయి అప్పటికే మళ్ళీ నిద్రలోకి జారుకున్న రేఖని చూసి చెప్పడం ఆపేసి, నవ్వుకుంటూ బయటకు దారి తీసింది.

చుట్టూ పొగమంచు పల్చని తెరలా పరుచుకుని వుంది. వీధి దీపాలు అక్కడక్కడా మేమున్నామంటూ మత్తుగా మినుకు మినుకు మంటున్నాయి. దారంతా మంచు దుప్పటిలో దాగినట్టు రోడ్లు చిత్తడిగా మెరుస్తున్నాయి. మెల్లగా తనచుట్టూ వున్న ప్రకృతి అందాలని ఆస్వాదిస్తూ 'గ్రీన్ లాన్స్' లోపలికి నడిచింది. చలికి ముడుచుకున్న పొదలూ– చెట్లతో ఆ పార్క్, ఇంకా రెక్కలు రాని గువ్వపిట్టలా మంచుతెర మాటున ఒద్దికగా ఒదిగినట్టే వుంది. ఎముకలు కొరికేస్తున్న ఆ చలిలో కాస్తంత వెచ్చదనం పుట్టించేందుకు చేతులు రాపిడి చేసుకుంటూ అలవాటు ప్రకారం పార్క్ వెనక గేట్ నుంచి కనిపించే హిల్ వ్యూ కోసం నడిచింది. అక్కడి బెంచ్ మీద కూర్చుని సూర్యోదయం కోసం ఉత్సాహంగా ఎదురు చూడసాగింది. మెల్లగా వెచ్చబడాల్సిన ఉదయం హఠాత్తుగా విపరీతంగా చల్లబడసాగింది. రివ్వు..రివ్వుమంటూ వీస్తున్న చల్లనిగాలుల మధ్య చిటపటమంటూ చినుకు రవ్వలు నేలరాలడం మొదలైంది. 'మంచువాన... వావ్. ..!' హుషారుగా అనుకుంది.

అక్కడంతా ఓ మంచి చిత్రకారుడి కాన్వాస్ లాగా అందంగా పరుచుకున్న అద్భుతమైన దృశ్యం.... చిక్కటి చీకటిలో ముత్యాలే నేల రాలుతున్నంత తెల్లగా, చల్లగా, మెల్లగా చినుకులు కురుస్తుంటే, పచ్చటి చెట్లు తమ రెమ్మల చేతులని మరింత విశాలంగా సాచి ఆ మంచు ముత్యాలని అందుకుని మురిసిపోతున్నట్టు తళతళ్లాడుతున్నాయి. ఆ

దృశ్యం చూసి కళ్ళార్పడం కూడా మర్చిపోయి కొద్ది క్షణాలలా నిశ్చలంగా ఉండిపోయింది మనోజ్ఞ. అంతలో చలి–వర్షాల ధాటీ ఎక్కువ కావడంతో అయిష్టంగానే వెనుదిరిగింది.

ప్రకృతి లోని ప్రతీ అంశమూ ఎంతటి ఆనందాన్నిస్తుందో అంతకంటే ఎక్కువ భయపెడుతుంది కూడా..

పూర్తి నిశ్శబ్దంలో చినుకుల సడి కాకుండా ఏదో సవ్వడి, ఎవరో ఉన్న ఫీలింగ్. బెదురుగా చుట్టూ చూసింది. దూరంగా సిమెంట్ బెంచ్ మీద ఎవరో పడుకున్న ఆనవాలు. ఎవరో తనలాగే వచ్చారా.. అలా ఐతే ఇక్కడెందుకు పడుకుంటారు. మరీ టూఎర్లీ గా వచ్చేసిందా తను. కనీసం ఆరు దాటాకైనా రావల్సిందేమో! కాస్త జనాలైనా ఉండేవారు.. అనుకుంటూ బెరుకుగా బెంచ్ దాటబోతుంటే కదిలిందా ఆకారం. కెవ్వుమన్న కేక ఆమె గొంతులోనే ఆగిపోయింది. భయంగా అటు చూసింది. అంతలో అవతలి వ్యక్తి ఏదో ఆపదలో ఉన్నట్టనిపించి కళ్ళు చికిలించి మళ్ళీ చూసింది. ఎవరో వ్యక్తి మంచుకి ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. చప్పున అతన్ని చేరుకుంది. "అయాం.." అంటూ అతి కష్టం మీద ఏదో చెప్పడానికి ప్రయత్నించబోయి... బెంచ్ మీద నుండి కిందకి తూలాడతను. కంగారుగా అతన్నిఒక్కవుదుట్న పట్టుకుని ఆపింది. బలమంతా వుపయోగించి అతన్ని లేవదీసే ప్రయత్నం చేయబోయింది. ఆమె వల్ల కాలేదు.

నిస్సహాయంగా చుట్టూ చూసింది. చీకటి తప్ప మరో మనిషి జాడ లేదు. అతను ఆయాసంతో ఎగసిపడుతున్నాడు. "హెలోవ్... హేయ్ మిస్టర్... ఆర్ యూ ఓ.కే." కంగారుగా పిలిచింది. తలూపాడు. అంతలోనే ఆమె చేతుల్లో అతని శరీరం బరువుగా వెనక్కి వాలసాగింది. క్షణాల్లో అతనికి స్పృహ తప్పింది. "హెల్ప్.. ఎనీబడీ హియర్.." గట్టిగా అరిచింది. ఆ నిశ్శబ్దంలో ఆమె గొంతే మరింతగా ప్రతిధ్వనించింది.

ఎమర్జెన్సీ... డాక్టర్ గా కర్తవ్యం స్ఫురించి చప్పున వంగి అతని ఛాతీ మీద వత్తుతూ "హలో సర్...హెలోవ్.. " కంగారుగా అతన్ని తడుతూ గట్టిగా పిలువసాగింది. రెస్పాన్స్ లేదు. తప్పదు. సీ.పీ.ఆర్. నీడెడ్... గాఢంగా ఊపిరి తీసుకుని అతనివైపు చూసింది. గుండె దడదడా కొట్టుకోసాగింది. ..తప్పదు మనూ.. హీవిల్ డై అదర్వైజ్.. తనకి తాను ధైర్యం చెప్పుకుంటూ అతని మీదుగా వంగి అతనిలో గాలి నింపసాగింది. మధ్య మధ్యలో కంగారుగా పాదాలు, చేతులు రుద్దుతూ, ఛాతీ మీద వత్తుతూ, మళ్ళీ అతని నోటిద్వారా గాలి నింపుతూ సతమతమవ్వసాగింది. అంతలో కదలిక తగ్గి అతని శరీరం నిశ్చలమైంది. దేవుడా ఇతన్ని బతికించు!! గాడ్..ప్లీజ్... తన చేతుల్లోనే నిర్జీవమౌతున్న అతన్ని చూసి మనోజ్ఞ కళ్ళలో నీళ్లు తిరిగాయి. కనీసం సెల్ కూడా తీసుకురాలేదీరోజు పోనీ ఎవర్నన్నా పిలుద్దాం అంటే.. ఆమె శరీరం కంపిస్తోంది, ఓపిక కూడా సన్నగిల్లుతోంది. ఒక్కత్తీ ఎంతని చేయగలదు. ఎముకలు కొరికే ఆ చలికీ, మంచుకీ నిలవడమే కష్టంగా వుంది. ఆ పరిస్థితుల్లో గాలి నింపే శక్తి సరిపోవట్లేదు. కానీ కళ్ళ ముందే ప్రాణం పోతుంటే.. దుఃఖం ముంచుకొస్తుంటే ఆపుకుంటూ, ""ప్లీజ్ హాంగ్ ఆన్ మిస్టర్... మీకేంకాదు.. ప్లీజ్.. లేవండి.." అంటూనే చివరి ప్రయత్నంగా

గాఢంగా శ్వాస తీసుకుని మళ్ళీ ఊపిరందించడానికి అతని మీదకు ఒంగింది. అతని నోటిని ఆమె పెదాలు స్పృశిస్తూండగా అతనిలో చిన్న కదలిక. నమ్మలేనట్టుగా చూస్తూ అదిరిపడి పైకి లేచింది.

"యా..మ్.. నేను..", అస్పష్టంగా కదిలాయతని పెదాలు. రిలీఫ్ గా చూసింది. థ్యాంక్ గాడ్.. బతికాడు చాలు... తన కష్టం ఫలించింది.. అంతలో అతను లేవడానికి ప్రయత్నం చేయడం గమనించి చప్పున చేయందించింది. లేచి కూర్చున్నాడతను. తెలుగువాడే.. అప్రయత్నంగా అనుకుంటూ తలతిప్పి చుట్టూ చూసింది, కంగారులో తను గమనించలేదు, వాన ఎప్పుడు ఆగిందో గానీ, చుట్టూ మంచుని చీల్చుకుంటూ, వెలుగు రేఖలు మెల్లగా పరుచుకోవడం మొదలుపెట్టాయి. పక్కనున్న వాటర్ బాటిల్ తీసి అందించింది. వెంటనే అందుకుని గటగటా తాగాడు.

కొంతసేపటికి తేరుకుని తలెత్తి చూశాడతను. ముఖంలో అలసట తెలుస్తోంది. "ఆర్ యూ ఓ.కే. ఎలా ఉన్నారు? ", ఆత్రంగా అడిగింది.

తలూపి, "యామ్.. ఓ.కే. ఐమీన్ కాదు.. కాదు.. మచ్.. బెటర్ నౌ.. మీరు.. యూ.. సేవ్డ్ మై.. లైఫ్..." ఒక్కో పదమే కూడబలుక్కుంటూ చెప్పాడు నెమ్మదిగా.

ఇబ్బందిగా చూసింది. "ఓహ్.. దట్స్ ఆల్ రైట్.. అయామ్.. ఎ.. డాక్.. ఐ మీన్.. నేను.. నేనో డాక్టర్ని.." అంది అస్పష్టంగా.

చుట్టూ చూశాడతను "నా స్టిక్..? " అంటూ.

నేలమీద పడున్న స్టిక్ తీసి అందించింది. స్టిక్ సహాయంతో లేవడానికి ప్రయత్నించడం గమనించి మెల్లగా తన చేయందించింది. సిట్యుయేషన్ నార్మల్ అవడంతో ఆమెలో మొహమాటం మొదలైంది. అతనివైపు సూటిగా చూడాలంటే ఏదో తెలియని ఇబ్బంది ఎదురవగా అనీజీగా తలతిప్పుకుంది. ఆమె ఆక్వర్డనెస్ ని గ్రహించినట్టు అతనూ ఏమీ మాట్లాడే ప్రయత్నం చేయలేదు. ఇద్దరూ మౌనంగానే కాటేజెస్ వైపు నడకదారి పట్టారు. రోడ్ చేరుతూనే పరుగున వచ్చారో నలుగురు గార్డ్స్. "సర్.. ఎక్కడికి వెళ్ళిపోయారు?" అంటూ.

అంతమంది గార్డ్స్ ని చూసి ఆశ్చర్యంగా అతని వైపు చూసింది.

అప్పటికి పూర్తిగా విచ్చుకున్న వెలుగురేఖల్లో అతన్ని చూసి, "ఓహ్, మై గుడ్ నెస్.. మీరు..మీరు.. హోమ్ మినిస్టర్.. జే.కే.బీ. కదూ!!?" అని సంభ్రమంగా అనేసి చప్పున కళ్ళు దించుకుంది.

తలూపి చిన్నగా నవ్వాడతను, "పోయే ప్రాణం నిలబెట్టారు. ఒక చిన్న థ్యాంక్స్ చెప్పేసి మీ ఉపకారం విలువ తగ్గించలేను. ఏమిచ్చి... మీకేమిచ్చి ఋణం తీర్చుకోగలను. ఏం చేయమంటారు..? ఎనీథింగ్ యూ సే.. చెప్పండి.." అన్నాడు గౌరవంగా.

మొహమాటంగా చూసింది మనోజ్ఞ. "అయ్యో.. అంతేం లేదు.. ఓ.. డాక్టర్ గా అది.. అది.. ఇట్స్ మై.. నా డ్యూటీ.. ఉంటానూ." తడబాటుగా చెప్పి గిరుక్కున వెనుదిరిగింది.

"నిజమా...!!" ఒకేసారి గట్టిగా అరిచారు మిత్రబృందమంతా.

అవునన్నట్టు తలూపింది మనోజ్ఞ.

"నువ్వు సేవ్ చేసింది జే.కే.బీ. నా..? అంటే మన హోమ్ మినిస్టర్నా?" ఆశ్చర్యంగా అన్నాడు ఆనంద్.

"అవును"

"అంటే ఈయన్నేనా.....?" అనుమానంగా చూసి పక్కనున్న ఇండియా టుడే తీసి కవర్ పేజ్ చూపిస్తూ అడిగాడు.

కోపంగా చూసింది "చాల్లేరా.. మరీ టూ మచ్ చెయ్యకు. అంటే, కనీసం మన స్టేట్ కి హోమ్ మినిస్టర్ ఎవరో కూడా గుర్తు పట్టలేనంత ఘోరంగామనా నేను?.. అంతేగా.. నీ ఒపీనియన్... అసలు ఏమనుకుంటున్నావ్ నా గురించి. పైగా మన సెమినార్స్ ఇనాగరేషన్ కు కూడా వచ్చాడు కదా, అదీ జస్ట్ మొన్ననే కదా. ఆయన్నే నేను సేవ్ చేసింది... నమ్మకపోతే పోరా.."చెప్పింది గట్టిగా.

"నో.. నో... మనూ .. అలా కోపం తెచ్చుకోకు ప్లీజ్.. ఐనా నమ్మకం కాదురా ఇక్కడ ఇష్యూ. ది గ్రేట్ జే.కే.బీ. ఆఫ్ అవర్ స్టేట్., అలా ఏ ఎస్కార్ట్ లేకుండా రావడం, మంచువానలో చిక్కుకోవడం, నువ్వు మన టిపికల్ సినిమాల రేంజ్ లో కిస్ ఆఫ్ లైఫ్ ఇచ్చి కాపాడ్డం..." అల్లరిగా నవ్వాడు ఆనంద్.

"షటప్.. లైఫ్ సినిమా కంటే, డ్రామా కంటే చాలా ట్రిక్కీ రా ఇడియట్.. అయినా సే సీ.పీ.ఆర్. నాట్ కిస్ ఆఫ్ లైఫ్. ఓ.కే. ఇట్స్ జస్ట్ ఏ లైఫ్ సేవింగ్ టెక్నిక్.. డాక్టర్లం మనం. దూయూ గెట్ మీ...? కనీసం ఆ సంగతైనా మర్చిపోకు." రోషంగా అంది.

"మీ గొడవ పక్కన పెట్టండర్రా... ఐనా ఏదయితేనేం మొత్తానికి ఆ జే.కే.బీ. మహా అదృష్టవంతుడు బాస్..నక్కని తొక్కి వచ్చాడు. ఈ ఏజ్ లో కూడా ఏం లక్కూ, ఏం లక్కూ.." కొంటెగా అన్నాడు సంజయ్ ఓరగా మనోజ్ఞని చూస్తూ. అందరూ తలలూపారు గట్టిగా నవ్వుతూ.

మనోజ్ఞ మొఖం ఎర్రబడింది. "అంటే...!?" కోపంగా అరిచింది.

"అబ్బా అంటే ఏం లేదులేవే. లక్కీగా సేవ్ అయ్యాడూ అంటున్నారంతే. వాళ్ళేదో అంటే... పోనీలే.. ఇంక గొడవపడకండి.." అతికష్టం మీద నవ్వాపుకుంటూ చెప్పింది రేఖ.

"ఛీ.. మీకనవసరంగా చెప్పాను.. పొండి అసలు.." విసురుగా లేచింది మనోజ్ఞ, ఉక్రోషంతో మరింత ఎర్రబడిందామె ముఖం.

నవ్వేశారంతా. "అరే...ఛిల్ మనూ..సారీ..సారీ..అలా ఏంలేదురా. ఏదో జోక్ గా అన్నాం కానీ. ఒక్కదానివి అంత సాహసం చేసావంటే నిజంగానే చాలా పెద్ద అఛీవ్ మెంట్ రా. నువ్వేం ఫీలవకు. సరే గానీ నువ్వు కొంచెంసేపు రెస్ట్ తీస్కోరాదూ. మేం బ్రేక్ ఫాస్ట్ ఇక్కడికే తెచ్చేస్తాం నీకు", ఆమె భుజం చుట్టూ చెయ్యి వేస్తూ లాలనగా అన్నాడు ఆనంద్.

వెంటనే తగ్గిపోయింది మనోజ్ఞ కోపం. అతని కళ్ళలోకి చూసి చిన్నగా నవ్వి తలూపింది"సర్లేరా.. ఇట్స్ ఓకే... మరైతే మీరు వెళ్ళిరండి మరి... మళ్ళీ కాంటీన్ క్లోజ్ ఐపోతుందేమో.."చెప్పింది.

"డన్... బై ఐతే.. యూ జస్ట్ రిలాక్స్ ఓ.కే. ... " అంటూ బయటకి నడిచారంతా.

అందరూ వెళ్ళగానే సోఫాలో వాలింది అలసటగా. ఓసారి తలుపు వైపు చూసి ఎవరూ లేరని నిర్ధారించుకుని నెమ్మదిగా పక్కనున్న ఇండియాటుడే చేతుల్లోకి తీసుకుంది. ఫుల్ బ్రైట్ స్మైల్ తో అతని ఫొటో.., '... జయ కృష్ణ భరద్వాజ... జే.కే.బీ... నాట్ బ్యాడ్.. అందగాడే...' అనుకుంది. అంతలో.. అతన్ని సేవ్ చేసిన విధానం గుర్తొచ్చి ఆమె మొఖం ఎర్రబడింది. మెల్లగా తన పెదాలని వేలితో రాసుకుంది. అతని పెదవులు, మీసాలు తనకి వత్తుకోవడం గుర్తొచ్చింది. చిన్న లిప్ లాక్ లాంటి ఆ క్షణం... తలుచుకోగానే ఏదో థ్రిల్ లా.. పుస్తకం జారి కిందపడడంతో చప్పున స్పృహలోకి వచ్చింది.

'అదో లైఫ్ సేవింగ్ టెక్నిక్..అంతే కదూ.. నందూకి చెప్పి తానేంటిలా. ఐనా ఆ సమయంలో తామిద్దర్లో ఏ ఒక్కరూ కూడా దాన్నేమీ ఎంజాయ్ చేసింది లేదు. మరి దానికెందుకంత ఆలోచన...! ఏమైంది తనకి.. ఛ... ఛ.. మరీ డ్రమెటిక్ గా, సిల్లీగా ఏదో టీనేజ్ కిడ్ లా బిహేవ్ చేస్తోంది..' తనని తాను మందలించుకుంటూ కింద పడ్డ బుక్ చేతిలోకి తీసుకుని చూసింది. ఎన్నో ఏళ్ళనుండీ పరిచయమున్న వ్యక్తిలా, ఎంతో దగ్గరగా అనిపించాడతను. అప్రయత్నంగా ఫొటోలో అతని పెదాలని స్పృశించి, చప్పున చేయి వెనక్కి తీసుకుంది. ఇంకా నవ్వుతున్నాడతను, 'ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగలను..' అని ఫొటోలోంచే అడుగుతున్నట్టు అనిపించి చప్పున పక్కకి పెట్టేసింది.

"ఈ శారీ వద్దు బాబూ.. అదిగో ఆ క్రీమ్ కలర్, అదే రెడ్ బార్డర్.. చూడూ.. అది తియ్యి.."

"ఆహాహా.. అది కాదూ.. ఇదీ.. ఆరెంజ్ వన్.. దాని పక్కన చూడు.. "

"ఓ..ఇది చీరా.. నే బ్లాంకెట్ అనుకున్నా లే..."

శారీహౌస్ మొత్తం వాళ్ళ నవ్వులతో నిండిపోయింది. సేల్స్ మాన్ కూడా అమ్మాయిల్ని చూసి హుషారుగా స్టాక్ మొత్తం తీసి చూపిస్తూనే ఉన్నాడు.

వాళ్ళ అల్లరిని దూరం నుంచే గమనించి నవ్వుకున్నాడు భరద్వాజ. మనిషి జీవితం మొత్తంలోకి చాలా అద్భుతమైనదా ఏజ్..! ఆ సందడీ, అల్లరీ, ఉత్సాహం మళ్ళీ రావు.. అనుకున్నాడు. వాళ్ళని గమనిస్తూనే తల్లి కోసం

తీసుకున్న షాల్ పాణికి ప్యాక్ చేయించమని అందించి వెనక్కి తిరిగాడు, యధాలాపంగా వాళ్ళని చూస్తూ బయటకి దారితీయబోతుంటే, సరిగ్గా అప్పుడు పడిందతని దృష్టి మనోజ్ఞ మీద. 'ఓహ్..ఈ అమ్మాయే కదూ తనని కాపాడింది.', అనుకుంటూ ఆగి కుతూహలంగా వాళ్ళని గమనించసాగాడు.

"ఏయ్ ఇది.. చూడండి.. బ్యూటిఫుల్ శారీ... కదూ..", అన్నమాటకి మనోజ్ఞ వంక చూశారంతా. నిండైన రంగులో.., చక్కటి వర్క్ తో అందంగా ఉన్న ఆ చీర, అంతకంటే అందమైన ఆమెను చుట్టుకునేసరికి అద్భుతంగా ఉంది. "ఎలావుంది నాకు.. ?"మెరిసే కళ్ళతో అడిగింది.

"వావ్..." అరిచారంతా ఒకేసారి.

"బ్యూటిఫుల్ శారీ కాదు మనూ... బ్యూటిఫుల్ యూ... నిజంగా.. స్టన్నింగ్.. చాలా బాగున్నావ్ అందులో..." మనస్ఫూర్తిగా చెప్పింది అమల.

మనోజ్ఞ ఉత్సాహంగా సేల్స్ మాన్ వైపు తిరిగింది. "ఇది ప్యాక్ చెయ్యండి..."చెప్పింది.

"ఓ.కే. మేడమ్" అంటూ తలూపి ఉత్సాహంగా తీస్కున్నవాడల్లా గతుక్కుమని ఆమెకేసి చూసాడు.

"అదీ మేడమ్..", నీళ్ళునమిలాడు.

"ఏమైంది.. ?"

"అదీ మేడమ్.. సారీ.. ఇదీ.. "

"ఏమైందీ, వేరేవాళ్ళ సెలక్షనా..?" అయోమయంగా అడిగింది.

"లేదు మేడమ్..అదీ..దీని కాస్టూ.."

"నాన్చకు బాసూ చెప్పెయ్...లేడీస్ కి నచ్చాలే గానీ కాస్టూ, కేస్టూ పెద్ద ఇష్యూనా.." నవ్వాడు ఆనంద్.

"అదీ..ఎనభై ఆరు...వేలు సర్.."

"ఏంటీ ..?" అడిగారంతా అదిరిపడి.

"అవున్సార్.. "

"మా బ్యాచ్ అందరికీ తలోటీ అక్కర్లేదమ్మా, ఒక్క చీర చాలు.. సింగిల్ పీస్... ఆ ఒక్కదాని కాస్ట్ చెప్పు చాలు.."నవ్వాడు సంజయ్.

"ఒక్క చీర కాస్టే సర్.. డిజైనర్ పీసు.. " గొణిగాడు.

"ఓహో.. డిజైనర్ పీసా..? చెప్పవేం మరీ.. వెరీగుడ్.. ఐనా అలా గుండాగిపోయే పీసులొద్దు బాబూ. మేం పెళ్ళి చీరలు కొనడానికి రాలేదు. ఏదో పాపం సెమినార్ కోసమనీవచ్చాం. కాబట్టీ.. అందులో ఒకటో, రెండో సున్నాలు కొట్టేసి,.. ఏదో.. అలా చూపించు.. చాలు" గుండె మీద చెయ్యివుంచుకుని నొప్పి నటిస్తూ చెప్పాడు ఆనంద్. నవ్వేశారందరూ.

నవ్వుల మధ్య షాపింగ్ ముగించి బయటకు నడుస్తుండగా, అప్పుడు చూశాడు సంజయ్. "'హేయ్..లుక్.. జే.కే.గారు... అక్కడా..!?" అంటూ ఆయన వైపుకు నడిచాడు.

కారెక్కబోతున్నవాడల్లా ఆగి చిరునవ్వు నవ్వాడు భరద్వాజ వాళ్ళని చూసి. చప్పున ఆయన దగ్గరకు చేరారంతా. మనోజ్ఞకేసి చూసి పలకరింపుగా నవ్వాడతను. పెదాలు విడీవిడకుండా నవ్వి కళ్ళు దించేసుకుంది.

"సర్ గుర్తుపట్టారా? దయాల్స్ హాస్పిటల్ లో మెడికల్ సెమినార్స్ ఇనాగరేషన్ లో కలిశాం.." ఉత్సాహంగా ముందుకెళ్ళాడు సంజయ్.

తలూపాడు గుర్తుపట్టినట్టుగా,"యస్ అఫ్కోర్స్ యంగ్ మ్యాన్...డాక్టర్ సంజయ్ అండ్ డాక్టర్ ఆనంద్.. రైట్..?" సాలోచనగా అడిగాడు.

"ఓహ్, సర్.. మీరు మా పేర్లు కూడా గుర్తు పెట్టుకున్నారంటే, వి ఆర్ రియల్లీ ఆనర్డ్ సర్." సంతోషంగా చెప్పాడు సంజయ్.

"వైనాట్ డాక్టర్.? ఆరోజు త్రూ అవుట్ నాతో ఉండి అన్నీ ఎక్స్ప్లెయిన్ చేశారు కదా అలా ఎలా మర్చిపోతాను. ఇంతకీ మీ షాపింగ్ అయిపోయిందిగా?" గాంభీర్యంతో కూడిన చిరునవ్వు భరద్వాజ అస్సెట్.

"ఆ.. సర్.. అయిపోయింది.."

"దెన్... వై డోన్ట్ యూ ఆల్ జాయిన్ మీ ఫర్ కాఫీ నౌ..?"సాదరంగా ఆహ్వానించాడతను.

ఊహించని ఆ ఇన్విటేషన్ కి మొహమాటంగా చూశారంతా. "అయ్యో అదేం వద్దు సర్.. మేం వెళ్తాం..", కంగారుగా చెప్పాడు ఆనంద్.

"అంటే మీకు వేరే అర్జంట్ వర్క్ లేకపోతేనే రండి.. ఆబ్లిగేషన్ ఏమీ కాదు. ప్లీజ్ కమ్ ఓన్లీ ఇఫ్ యూ కేన్ మేక్ ఇట్ బట్ ఇట్ వుడ్ బీ మై ప్లెజర్ అఫ్కోర్స్.."మృదువుగా చెప్పాడు.

అంత పెద్ద స్థాయిలో వ్యక్తి అంత రిక్వెస్టింగ్ గా పిలిచేసరికి కాదనలేక, బెరుకుగానే అనుసరించారతన్ని.

కాసేపటి తర్వాత అందరూ కాఫీ షాప్ లో ఉన్నారు.

"సర్.. లెట్ మీ ఇన్ట్రడ్యూస్ మై ఫ్రెండ్స్.. మేమిద్దరం మీకెలాగూ తెలుసనుకోండి, ఇక వీళ్ళు మా టీమ్ సర్ రఘు, సుధీర్, రేఖ, మనోజ్ఞ, నవ్య, అమల.." అంటూ అందర్నీ పరిచయం చేశాడు సంజయ్.

"నైస్ మీటింగ్ యూ ఆల్... అయాం జే.కే. తెలుసుగా, ఇక తను పాణి.. సారంగపాణి.. మై ఫ్రెండ్ అండ్ మై పర్సనల్ అడ్వైజర్ టూ..", అంటూ భరద్వాజ కూడా తనతో పాటూ ఉన్న పి.ఏ.ని పరిచయం చేశాడు.

కాసేపటి కబుర్ల తరవాత గమనించాడతను. మనోజ్ఞ తననే తదేకంగా చూస్తూ, అంతలో తను గమనించగానే కళ్ళు తిప్పుకోవడం. 'పొరపడ్డాడా,లేక..!', సందిగ్ధంగా ఆలోచిస్తూ తన దృష్టి మరల్చుకున్నాడు.

"మీ కాలికేమైంది సర్?"

''చిన్న ఫ్రాక్చర్. మెట్ల మీంచి పడ్డాను. ఆక్ట్యువల్ గా ఈ వంక పెట్టుకునే రిలాక్స్ అవడానికి వచ్చేశాను." అంటూ నవ్వేశాడు.

భరద్వాజ చూడనప్పుడు మనోజ్ఞ వైపు చూసి కళ్ళెగరేశాడు సంజయ్ అల్లరిగా, అంతలో భరద్వాజ తనకేసి చూడగానే ఏమీ ఎరగనట్టు అడిగాడు, "ఎవ్రీ ఇయర్ వస్తారా సర్ మీరిక్కడికి..?"

"అవును.. ఇక్కడో నాకు కాటేజ్ వుంది. సమ్మర్ లో ఓ వన్ వీక్, టెన్ డేస్ కోసం మాత్రం ఖచ్చితంగా వస్తాను... అంతకంటే వుందామన్నా కుదరట్లేదు.... ఈసారే అన్ సీజన్ లో వచ్చాను.. "

"ఓ.. లక్కీ సర్.."ఓరగా మనోజ్ఞని చూస్తూ అన్నాడు సంజయ్. ఉలిక్కిపడి చూసిందా లక్కీ అన్నమాట వింటూనే.

"ఉంటారా సర్ కొన్నాళ్ళు.. ? " అడిగాడు ఆనంద్

"వెల్... చూడాలి ఆనంద్... కాలు కూడా ఇప్పుడు బెటర్ గానే వుంది.. ఆల్రెడీ వచ్చి ఫైవ్ డేస్ అయ్యింది.. సో హావ్ టూ డిసైడ్.. అసెంబ్లీ సెషన్స్ ఐతే లేవు గానీ తెలియనిదేముంది జనరల్ వర్క్ ఐతే చాలావుంది.. వెళ్ళాలి.."అంటూ నవ్వాడు.

కాసేపటి తరువాత లేచి బయల్దేరుతుంటే కాజువల్ గా అడిగాడు భరద్వాజ మనోజ్ఞ వైపు చూసి, "మళ్ళీ కనిపించలేదు , రోజూ చేయరా వాకింగ్?"

ఒక్కసారిగా మనోజ్ఞ మొఖం వెలిగిపోయింది. తన సంతోషాన్ని ఏ మాత్రం దాచుకోకుండా., "లేదూ, ఆక్ట్యూవల్ గా రోజూ చేస్తాను. టూ డేస్ గా కుదరలేదు. రేపొస్తారా కలిసి వెడదాం, 6.00 కి మీకు ఓ.కే.నా..?" అని ఉత్సాహంగా అడిగేసింది.

ఆమె తొందర చూసి అతని పెదాల మీద పల్చటి నవ్వు కదలాడింది. "ఓ.కే.. ష్యూర్... బట్ లెట్స్ మేక్ ఇట్ ఎట్ ఫైవ్.. షార్ప్.." గంభీరంగా చెప్పాడు.

"ఓహ్ గ్రేట్..ఐతే చమన్ దగ్గర వెయిట్ చేస్తానూ.." ఆనందంగా చెప్పేసిందామె.

ట్రాక్ సూట్స్ అన్నీ తిప్పి, తిప్పి చూసింది మనోజ్ఞ. ఏది బాగుంటుంది.. తనకి బ్లూ బాగా సూటౌతుందని నవ్య ఎప్పుడూ అంటుంటుంది.. కానీ.. మరీ బ్రైట్ ఐపోతుందేమో.. పోనీ గ్రే ఐతే... నో.. మరీ డల్ అవుతుంది..పోనీ.. అనుకుంటూ.. చాలాసేపు తర్జనబర్జన పడ్డాకా తర్వాత చివరికి ఫుల్ వైట్ లో రెడీ అయింది. జే.కే.బీ. ని మళ్ళీ కలవబోతోందన్న ఊహ రాత్రి నుండీ ఆమెని నిలవనీయట్లేదు. ఆ ఆలోచనతో రాత్రి మొత్తం నిద్రలేక పోయినా మనసు మాత్రం ఉత్సాహంతో ఉరకలేస్తోంది. అసలు అంత కొద్ది పరిచయం లో అతని గురించి ఎన్ని సార్లు తలుచుకుందో

లెక్కలేదు. ఏంటిదంతా.. అని ఆలోచిస్తున్నదల్లా షార్ప్ ఫైవ్.. అన్న అతని మాట గుర్తొచ్చి త్వరత్వరగా రెడీ అయి పావుగంటముందే అక్కడికి చేరుకుంది.

సరిగ్గా 5.00 కి వచ్చాడతను. 'నాలాగే ఈయనకీ రాత్రింతా నిద్దర్లేదేమో ఈ వాక్ ని తల్చుకుని అందుకే అంత ఈగర్ గా..' అనుకుని నవ్వుకుంటూ అతనివైపు అడుగులు వేయబోయి ఆగిపోయింది., అతని వెనుకగా కాస్త దూరంలో నలుగురు గార్డ్స్.. గాలి తీసేసినట్టనిపించింది. అంతలోనే దగ్గరకొచ్చాడతను.

"గుడ్ మార్నింగ్ సర్.." తనలోని డిసప్పాయింట్మెంట్ కప్పిపుచ్చుకుంటూ నీరసంగా విష్ చేసింది.

"వెరీ గుడ్ మార్నింగ్ .. జాగింగ్ కి ప్రిపేర్ అయినట్టున్నారు.. ఈ కుంటికాలితో నాకు వాకింగే ఎక్కువ మేడమ్.." నవ్వుతూ అన్నాడు.

అతని నవ్వు చూస్తూనే డిసప్పాయింట్మెంట్ మొత్తం చేత్తో తీసేసినట్టు మాయమయ్యింది.

"ఓహ్.. అదేం లేదు .. నాకూ వాకింగే ఇష్టం. షూస్ జస్ట్ సరదాగా వేస్తానంతే.." నవ్వేసి చెప్పింది. వాకింగ్ షూస్ కీ, జాగింగ్ షూస్ కీ తేడా ఆ చీకటిలో కూడా గమనించిన అతని అబ్జర్వేషన్ కి ఆశ్చర్యపడుతూ.

"పదండి..లెట్స్ గో.."

దారి మొత్తంలో పెద్దగా ఏం మాట్లాడలేకపోయారు. నెమ్మదిగా గ్రీన్ లాన్స్ లోకి ప్రవేశించారు.మనోజ్ఞ గుండె వేగంగా కొట్టుకోసాగింది. అతనికి బాగాఅలవాటైన దారేమో మామూలుగా వెళ్ళిపోతున్నాడు. అప్పుడొచ్చిందా బెంచ్. అప్రయత్నంగా ఆగిపోయారిద్దరూ. మనోజ్ఞ తలెత్తలేదు. రెప్పల మీద ఎవరో టన్నులకొద్దీ బరువు పెట్టినట్టుంది. మొఖం కందిపోయింది. అతనోసారి ఆమె వైపు చూశాడు. ఆమె పరిస్థితి గమనించనంత అమాయకుడేమీ కాదు. 'ఆ లేలేత పెదవులతో నాలో ప్రాణం నింపింది ఇక్కడే కదూ..' అప్రయత్నంగా అనుకున్నాడామెని చూసి. మాటలు పెగలని ఏదో ఇబ్బంది., ముందుకు కదలబోయి, "కూర్చుంటారా కాసేపు?" అనడిగాడు ఏమీ తెలియనట్టు. బిడియంగా తల అడ్డంగా తిప్పింది వద్దన్నట్టుగా.

"వెళ్దామా.. మరి..?" అడిగాడు కాజువల్ గా. మౌనంగా అతన్ని అనుసరించింది. కాసేపటికి సర్దుకుని అడిగింది, "మీరు వెంట గార్డ్స్ లేకుండా బయటకి రారా.. ?"

"నైన్టీ పర్సంట్ ఐతే అంతే. కాకపోతే మొన్నా ఇన్సిడెంట్ తర్వాత పాణి టార్చర్ తట్టుకోలేక 100 పర్సంట్ చేయాల్సొచ్చింది."

"ఓహ్... ఒక పి.య్యే. మాటకి అంత వెయిటేజ్ ఉంటుందా. నిజమేనా.. లేక భయమా..?" ఆశ్చర్యంగా అడిగింది.

"వెల్... అది ఆమాట వేల్యూని బట్టి కూడా ఉంటుంది కదా. చెప్పిందెవరైనప్పటికీ..."అంటూ ఆగి ఆమెవైపు చూసి చెప్పాడు.

"'అయాం సారీ. అతి చనువు తీస్కున్నాను", తడబడింది.

తేలిగ్గా నవ్వేసాడు, "నో.. నో.. అదేం లేదు. మోరోవర్ పాణి నా పి.య్యే. కంటే ముందు చిన్ననాటి స్నేహితుడు కూడా కదా. అందుకే కొన్నిసార్లు వినక తప్పదు. ఇక భయమంటారా ఆక్షణంలో అనిపించింది మరీ దిక్కులేని చావు వస్తోందేమోనని. తర్వాతేం లేదు. ఐనా తెలియనిదేముంది.. ప్రైవసీ అనేది మాకో లగ్జరీ కదా.." చెప్పాడు.

అంతలో చమన్ రావడం గమనించి వీడ్కోలు తీసుకున్నారిద్దరూ.

"సర్... జే.కే.సర్... హెలో.. మిస్టర్ జే.కే... జయకృష్ణ భరద్వాజ గారూ.." ఎవరో పిలుస్తున్నట్టై ఆగి వెనుదిరిగి చూశాడు. పొగమంచు ని చీల్చుకుంటూ లేన్ మలుపు లోనుంచి పరుగులాంటి నడకతో వచ్చి అతన్ని చేరుకుంది మనోజ్ఞ.

"ఓహ్.. మీరా..." పలకరించాడు.

"మీరాని కాదండీ.. మనోజ్ఞ... అహ్... అ.. అప్పుడే పేరు మర్చిపోయారా. నిన్ననేగా కలిశాం.." అడిగింది రొప్పుతూనే.

చిన్నగా నవ్వాడతనామాటకి. "ముందు కూర్చోండి. అంతలా ఆయాసపడుతూ వచ్చారు...?" రోడ్ పక్కగా ఉన్న బెంచ్ చూపిస్తూ అడిగాడు. దాని మీద కూలబడి రొప్పుతూనే నవ్వింది.

"ఏం చేయమంటారు.... కాస్... కాస్త లేటయ్యాను. మీరు వెళ్లిపోయారు. సో.. మరికాస్త ఫాస్ట్ గా రావల్సివచ్చింది. పోనీ కనిపించాకైనా అందుకుందామని డౌన్ రోడ్ లోంచి పిలుస్తూనే వస్తున్నాను. ఊహు.. ఎక్కడా మీరు వినిపించుకుంటేనా. అప్ హిల్ కదా.. ఐనా మీరా కాలితో అంత స్పీడ్ గా ఎక్కుతున్నారంటే రియల్లీ చాలా గ్రేట్ థింగ్.. ఐనా మీరు.. ఏ లోకం లో ఉన్నారు సర్ అసలూ?"

"ఓహ్. అయామ్ సారీ.. కారణం ఇదీ.." చేతిలో చిన్న ఐ-పాడ్ చూపించాడు ఆమెకి కాస్త దూరంగా బెంచ్ కి చివరగా కూర్చుంటూ.

"మీరు వాకింగ్ చేసేటప్పుడు పాటలు వింటారా..!" ఆశ్చర్యంగా అడిగింది.

"యప్.. ఇయర్స్ నుండి ఒక అలవాటులా అయిపోయింది."

"వెల్.. సిటీ లో ఐతే ఓ.కే. ఆ ట్రాఫిక్ గోల, పొద్దున్నే చెత్త ఊడ్చే చీపుర్ల చప్పుళ్ళు ఇవన్నీ అవాయిడ్ చేయొచ్చు. బట్ ఇక్కడ... ప్చ్ ... బాడ్ ఐడియా. చూడండి ఆ పక్షుల కిలకిలలూ, ఉడుతల కిచ్ కిచ్ లూ, చెట్ల పలకరింపులూ.. ఇన్ఫాక్ట్ .. దిస్ డాన్ ఇట్ సెల్ఫ్ ఈజ్ లైక్ ఎ బ్యూటిఫుల్ మెలోడీ, డోన్ట్యూ ఫీల్ యూ ఆర్ మిస్సింగ్ ఎలాట్ అని..?"చుట్టూ వున్న ప్రపంచాన్ని ఇష్టంగా చూస్తూ అంది.

తలతిప్పి ఆమెవైపు చూశాడు. "డోన్ట్ మైండ్. నాకనిపించింది. చెప్పేశాను." తనవైపే చూస్తున్న అతన్ని చూసి గతుక్కుమని మొహమాటపడుతూ చెప్పింది.

నవ్వి చుట్టూ చూశాడు. తన మెడ చుట్టూ ఉన్న ఇయర్ ఫోన్స్ తీసేస్తూ అన్నాడు, "యూ ఆర్ రైట్. అసలెప్పుడూ అలా ఆలోచించలేదు. థాంక్స్ ఫర్ ద సజేషన్" చెప్పాడు మనస్ఫూర్తిగా. ఆమె కళ్ళలో సన్నటి మెరుపు.

"ఓహ్ యూ ఆర్ మోస్ట్ వెల్కమ్... అన్నట్టూ ఈరోజు నేను కొంచెం లేటయ్యాను, అంతలోనే మీరు వెళ్ళిపోయారు.." అంది ఆరోపణగా.

ఇబ్బందిగా చూశాడు. అనుకున్న టైంకల్లా వాక్ కి వెళ్ళడం ఏళ్ళ నుండీ వున్న అలవాటు. రెగ్యూలర్ గా తనతో వచ్చేవాళ్ళ కోసం కూడా తానెప్పుడూ ఎదురుచూడడు. ఎంత పొలైట్ గా ఐనా అదే మాట చెప్తే ఫీల్ అవుతుందేమో! ఎంతైనా ఆడపిల్ల, అందులోనూ తన ప్రాణదాత. ఐనా ఇప్పటి వరకూ ఇలా డైరెక్ట్ గా అడిగే ధైర్యం ఎవ్వరూ చేయలేదు. అతను ఏం చెప్పాలా అని ఆలోచిస్తుండగానే అంతలో మనోజ్ఞే అంది, "రేపట్నుంచీ ఎగ్జాక్ట్ టైం కి వచ్చేస్తాను. మరి నా కోసం చూస్తారు గా...?"

"ఓహ్.. ష్యూర్. తప్పకుండా కలిసే వద్దాం..." వెంటనే బదులిచ్చాడు. అంతలో సెల్ రింగయింది. "చెప్పు పాణీ... " ఆన్ చేసి అన్నాడు.

"సర్ మీరింకా రాలేదనీ.." పాణి గొంతులో చిన్నపాటి ఆదుర్దా. ఆ రోజు తర్వాత పాణికి తన హెల్త్ గురించి బాగా భయం పట్టుకుంది. వాచ్ చూసుకున్నాడు. తన రెగ్యులర్ రిటర్నింగ్ టైం దాటి అరగంటైంది.

"వస్తాను పాణీ. డోన్ట్ వర్రీ. అయామ్ ఆల్ రైట్..." క్లుప్తంగా చెప్తూ అప్పుడు చూశాడు. కన్నార్పకుండా తననే చూస్తోందామె తదేకంగా. అతను చూడగానే చప్పున చూపు పక్కనున్న చెట్లవైపు మరల్చుకుంది. ఏదో తెలీని ఇబ్బంది. భ్రమా... అంతలో ఆ రోజు కాఫీ షాప్ లోనూ మనోజ్ఞ తననే చూడ్డం గుర్తొచ్చింది. సెల్ ఆఫ్ చేస్తూ, "సో.. ఎలా జరుగుతున్నాయి మీ సెమినార్స్?" ఏమీ గమనించనట్టే అభావంగా అడిగాడు.

"ఎక్సలెంట్ సర్. మీరూ రారాదూ..! ఈ రోజు నాదో చిన్న ప్రెజంటేషన్ కూడా ఉంది." ఉత్సాహంగా అడిగేసి అతని మొహం చూసి నాలిక్కరుచుకుంది. తాను మాట్లాడుతున్నది ఒక స్టేట్ కి హోమ్ మినిస్టర్ తోటి అని రియలైజ్ అయిందేమో, "సారీ..అంటే .. ఐ మీన్.. మీకు .. మీకు... టైం.. వుంటేనే .." తడబడింది.

"వెల్.. ఐ విల్ ట్రై.. ఏ టైం కి?"సాలోచనగా అడిగాడు.

"మధ్యాహ్నం 2.30. కి." ఉత్సాహంగా చెప్పింది.

"ఓ.కే. దెన్ వెళ్దామా మరి.." అంటూ లేచాడు. దారి మొత్తం గలా గలా మాట్లాడుతూ, ఏవేవో చెప్తూనే ఉంది.

భరద్వాజ తనదైన మార్క్ చిరునవ్వుతో ఆమె చెప్పేదంతా ఓపికగా వింటూ మధ్యమధ్యలో హుందాగా 'హూ' కొడుతూ వున్నాడు.

కాటేజ్ దారులు వేరయ్యే చోట ఆగారు. ఏదో పట్టి ఆపినట్టు చిన్న ఫీలింగ్. ఆమెకేసి చూసాడు. ఎందుకో వెళ్ళాలనిపించలేదు. ఆమె కూడా సందిగ్ధంగా ఆగడంతో అది రెట్టింపైంది. 'ఆమెకీ తనలాగే అనిపిస్తోందా లేక ఏదో కర్టెసీ కొద్దీ నిల్చుందా...' ఆలోచనల్తో కన్ఫూజ్ అవుతూ ఏం మాట్లాడాలో అర్థం కాక, చుట్టూ చూశాడు. కాస్త దూరం లో కనిపించిందో చిన్న కాఫీ షాప్.

"కాఫీ.?." అప్రయత్నంగా అడిగాడు. ఆమె మొఖం వెలిగిపోయింది."అఫ్కోర్స్.. ఐ వుడ్ లవ్ టూ హావ్ వన్ విత్ యూ..." తన సంతోషాన్ని ఏమాత్రం దాచుకోకుండా చెప్పింది. అతనిలో ఏదో తెలీని చిన్న అలజడి.

"ఏం తాగుతారు ? చెప్పండి మనోజ్ఞా.." మెనూని ఆమె వైపు జరుపుతూ అడిగాడు.

"ఊహు...అస్సలేం తాగను.." అంటూ పెదాలు బిగించింది.

అయోమయంగా చూశాడు, "మరి..." అంటూ.

"మీరా అండీ, గారూ, మీరూ అనే పిలుపులు మానేవరకూ..." నవ్వింది.

"ఓహ్..సరే..మానేస్తాలెండి..."

"అదుగో మళ్ళీ..."

"ఓ.కే. ఓ.కే.... మానేస్తాను.. మరి చెప్పైతే ఏం కావాలో.." నవ్వేశాడు.

అడ్మైరింగ్ గా చూసింది. "మీ నవ్వు చాలా బాగుంటుంది సర్. మరెందుకు ఎప్పుడూ అలా సీరియస్ నెస్ లో దాచేస్తారు.?" చనువుగా అడిగింది.

ఒక్కసారిగా అంత పర్సనల్ టాపిక్ కి తెల్లబోయాడు. అంతలో తమాయించుకుని చిన్నగా నవ్వాడు. "హూ సెడ్. ఐనా నేనెప్పుడూ నవ్వుతూనే వుంటానుగా. ఇన్ఫాక్ట్ మా కాబినెట్ లో అందరూ కాల్ మీ..."

"ఛీయర్ ఫుల్ ఫేస్..." పూర్తి చేసిందామె. తలూపాడు ఔనన్నట్టు.

"వాళ్ళ మొహాలతో కంపేర్ చేస్తే కరెక్టే గానీ.. ఇలా హోల్ హార్టెడ్ గా నవ్వడం చూడలేదు ఎప్పుడూ.."

"వెల్.. అంటే పర్సనల్ గా తెలీదు కదా నేను మీకు. ఐ మీన్... నీకు.."

"నాకూ తెల్సుకోవాలనే వుంది.." నవ్వుతూ చెప్పింది.

ఆశ్చర్యంగా చూశాడు.

కాఫీ సిప్ చేస్తూ అడిగింది, "మీ కాలెలా ఉంది సర్..?"

"పెర్ఫెక్టలీ ఫైన్.. ఇప్పుడు స్టిక్ కూడా అవసరపడట్లేదు.."

"ఐ నో సర్.. ఇందాకా మిమ్మల్ని రీచ్ అవ్వడానికి ఆల్ మోస్ట్ పరిగెట్టాల్సొచ్చింది. "

"ఓహ్..."నవ్వేశాడు "...అది సరే నువ్వుకూడా నన్ను సర్, మీరూ, గారూ అంటున్నావ్ కదా.."

"అయ్యో భలేవారే.. ఇంకానయం పేరు పెట్టి పిలవమంటారా ఏంటి...?"

"అఫ్ కోర్స్.. అదేగా నేనూ చెప్తున్నది. నీకో రూల్, నాకోరూలా? యూ కెన్ కాల్ మీ బై నేమ్.. సే జే.కే.. జస్ట్.. జే.కే... అండ్.. నువ్వు.. అని కూడా.." కూల్ గా చెప్పాడు.

అదిరిపడిచూసింది, "ఏంటీ., అమ్మో.. నా వల్ల కాదు.. జస్ట్ ఇంపాజిబుల్.." చెప్పింది.

"ఐతే నావల్లా కాదూ.. నో వే.. మనోజ్ఞ గారూ.." కుర్చీలో వెనక్కి ఆనుకుంటూ నవ్వాడు. 'ఆమెతో ఇలా మాట్లాడ్డం బాగుంది. ఎందుకు కేవలం ఒక అమ్మాయి కంపెనీ అనా.., అందులోనూ అందమైనది కావడం వల్లనా.. లేక ఇంకేదైనా...'

"అబ్బా.. మీరూ.. మరీ ఇరుకులో పెట్టేస్తున్నారు... సరే.. పేరుతో పిలుస్తా.. కానీ నువ్వు అని అనడం మాత్రం నావల్ల కాదండీ. చాలా కష్టం .. కాదనకండి ప్లీజ్.."

"ఊ..." అంటూ ఒక్క క్షణం ఆలోచించి నవ్వాడు "ఓ.కే.. యాక్సెప్టెడ్.. ఇంతకీ ఏమని పిలుస్తావు.. పొద్దున్నలాగా.. జయకృష్ణ భరద్వాజ గారూ..... అనా.. నాకంత పొడుగాటి పేరుందని నేనే మర్చిపోయాను. థ్యాంక్స్ ఫర్ రిమైండింగ్..."

"ఓ..సారీ..అదీ నేను ఎంత పిల్చినా మీరు పలక్కపోతేనూ..ఐనా అలా ఛస్తే పిలవను.. ఏదో లాల్ కృష్ణ అద్వానీ అన్నట్టుంటుంది."

ఫకాల్న నవ్వాడు, "అదేమీ తిట్టు కాదండీ బాబూ, పాపం నా పేరుకి ఆయనే ఇన్స్పిరేషనట మా వాళ్ళకి.."

"అదిగో.. మళ్ళీ అండి అనేస్తున్నారు చూశారా.."

"సరే.. అనన్లే గానీ.. నేనడిగింది చెప్పు మరి.."

"జే.కే. వద్దూ... మీకభ్యంతరం లేకపోతే ఐ విల్ కాల్ యూ.. క్రిష్... నో.. ఐ మీన్.. భరద్వాజా.. ఏమంటారు?" నవ్వేసింది మొహమాటంగా.

"దట్స్ బెటర్..", నవ్వాడు. చాలా దగ్గరవాళ్ళకి తప్ప అందరికీ తను చాలా ఏళ్ళుగా జే.కే. మాత్రమే. అతని కళ్ళలో సన్నటి సంతోషవీచిక. మనోజ్ఞ నోటి నుంచి తన పేరు.. బాగుంది... ఒక సరికొత్త ఫీలింగ్.. చప్పున తమాయించుకున్నాడు. ఆ అమ్మాయి చిన్నపిల్ల. ఐనా.. తనేంటిలా..

వెంటనే సర్దుకుంటూ అడిగాడు, "సో.. మీ ఫ్రెండ్స్ ఎలా ఉన్నారు?"

తలూపింది,"బాగున్నారు. వాళ్ళలో సగం మంది మీ ఫ్యాన్స్.. తెలుసా.."

"ఫ్యాన్సా.."ముఖం చిట్లించాడు. "డోన్ట్ యూజ్ సచ్ వర్డ్స్. నేనేమన్నా సినిమా హీరోనా, క్రికెటర్నా , లేక రాక్

స్టార్నా నాకు ఫ్యాన్స్ వుండడానికి..." విసుగ్గా అనేశాడు.

"అలా చెప్పాలంటే వాళ్ళకంటే ఎక్కువే సర్ ఆమాటకొస్తే.. స్టేట్ లో క్రైమ్ రేట్ తగ్గింది, మన పోలీసులు ఎప్పుడూ లేనిది కాస్త చురుగ్గా పని చేస్తున్నారు, గొడవలు, గోలలూ, ఈవ్ టీజింగ్ లూ, దొమ్మీలు, అన్నీ తగ్గాయి. అసలు మన సిటీ లో జనం రిలాక్స్డ్ గా వున్నారంటేనే పెద్ద విషయం కాదా..!!"

పొగడ్తలు, గాలి కొట్టడాలు, అనవసరమైన డబ్బా భజనలు విని, విని రోత పుట్టింది. నిజమైన కాంప్లిమెంట్ ని కూడా గుర్తించలేనంతగా తయారయ్యింది తన పరిస్థితి. ఇబ్బందిగా చూశాడు. "ఆల్ దట్ కమ్స్ విత్ టీమ్ ఎఫర్ట్.. ఐనా అదంతా... అదంతా పార్ట్ ఆఫ్ డ్యూటీ మనోజ్ఞా.. మా వృత్తి ధర్మం.."

"అబ్బా మరీ ఫార్మల్ డబ్బా డైలాగులొద్దు సర్. యాక్టింగ్ చేయడం యాక్టర్స్ ధర్మం, ఆడడం ప్లేయర్స్ డ్యూటీ అని అనుకుని వదిలేయచ్చుగా? మరి ఎందుకిన్ని అవార్డులూ, రివార్డులూ, అభినందనలూ, బిరుదులూ, సన్మానాలూ, సత్కారాలూ, ఎందుకూ.. ?" సూటిగా అడిగింది.

తలెత్తి ఆమెని చూశాడు. తనని ఇంప్రెస్ చేయడానికో, లేక పొగడడానికో కాదు. నిజంగానే నమ్మిన అంశాన్ని సపోర్ట్ చేస్తోందని ఆమె ముఖమే స్పష్టంగా చెప్తోంది. అతని ఆలోచనలతో సంబంధం లేనట్టు చెప్పుకుపోతోందామె.

"..ఐనా ఈ రోజుల్లో ఎవరి డ్యూటీ వాళ్ళు ఓ మాదిరిగా చేస్తేనే గొప్ప విషయమైపోయింది, అలాంటిది అద్భుతంగా చేస్తున్న మీరే అలా అనుకుంటే ఎలా సర్...!?"

"ఓ.కే. ఓ.కే... రాష్ట్రం 'ది గ్రేట్ నా పరిపాలన ఐ మీన్ సంరక్షణ' లో సుభిక్షంగా ఉంది అని ఒప్పేస్కోమంటావ్.. అంతేనా.?." నవ్వాడు.

"అఫ్ కోర్స్.. ఆబ్సల్యూట్లీ... ఎవ్వరైనా ఇంతకు మించి ఏం చేస్తారు. లేకపోతే ఒకేఒక్కడు మూవీలో అర్జున్ టైప్ లో స్ట్రీట్ ఫైట్ చేయాలా.. ?" అంతే చురుగ్గా అంది.

మెచ్చుకోలుగా చూశాడామెని. "ఓ.కే. ఫైన్. ఫైన్. ఒప్పేస్కుంటాను. నాకు ఫ్యాన్స్, ట్యూబ్ లైట్స్ అందరూ వుండచ్చని గానీ, మళ్ళీ సర్ అంటున్నావ్ చూడూ..."

"ఓ.కే. భరద్వాజా.. థాంక్యూ.. మరింతకీ మధ్యాహ్నం వస్తారుగా..!" తియ్యగా నవ్వుతూ అడిగింది.

"నువ్వింత బాగా మాట్లాడతావంటే రానామరి.. ష్యూర్ గా వస్తాను.." చెప్పాడతను.

"ఇది మొన్న గొడవైన కొత్త పోలీస్ అకాడెమీ డీటైల్స్ సర్. మీరడిగారు.., ఇక ఇదేమో గోవర్ధన్ గారు మిమ్మల్నోసారి పర్సనల్ గా చూడమని పంపిన ఫైల్..." వరసగా చెప్పుకుపోతున్నాడు పాణి. ఒక్కొక్కటీ పరిశీలిస్తూ వింటున్నాడు భరద్వాజ.

ముత్తు స్వామి లోపలికొచ్చాడు. డెబ్బై ఏళ్ళ సిసలైన తెలుగు వంటవాడు. తమిళియన్స్ కి వంటవాళ్ళుగా డిమాండ్ ఎక్కువని సినిమాల్లోచూసి అతిగా ఇన్ఫ్లుయెన్సై స్వామి అన్న పేరుని ముత్తు స్వామిగా మార్చుకున్నాడు చిన్నతనంలోనే. యజమానికి మంచి భోజనం పెట్టడమే తన ధ్యేయంగా మసిలే సిసలైన స్వామి భక్తుడు.

"సారూ...భోజనం.." నసిగాడు వాళ్ళు పనిలో ఉండడం చూసి.

"అప్పుడే వద్దు స్వామీ.. తర్వాత తింటాలే..", సంతకాలు సరి చూసుకుంటూ చెప్పాడు.

"అయ్యో అలాగంటారు సారూ....ఇలాగైతే నేనమ్మగారికేం చెప్పేది. మీకు వేళకి భోజనం పెట్టమని మరీమరీ చెప్పారు నాకు. ఇప్పడికే రెండు దాటుతుంటే ఇంకా తర్వాతంటే... ఇట్లైతే.. మీ ఆరోగ్యం...", అంటూ ఏదో చెప్పుకుపోతున్నాడు. చప్పున వాచ్ చూసుకున్నాడు. 2.15. ఇంక పావుగంటే ఉంది. చప్పున ఫైల్ మూసి ఒక్క ఉదుట్న లేచాడు.

"ఇవన్నీ తర్వాత చూస్తాలే పాణీ.."అంటూ సెల్ తీసి "డేవిడ్ కారుతియ్.." డ్రైవర్ కి చెప్తూనే బయటకి నడిచాడు.

"సారూ మరి భోజ.. "వెనకే వచ్చిన ముత్తుస్వామి చప్పున అడుగుతుండగానే, "తర్వాత.. టైం లేదు.."అంటూ కారెక్కాడు భరద్వాజ.

"దయాల్స్ హాస్పిటల్ కి పోనివ్వు..." చెప్పాడు డేవిడ్ కి.

కారెక్కబోతున్న పాణి కంగారుగా చూశాడు. "సర్ ఎనీ ప్రాబ్లమ్..నేనూ..."

"వద్దు పాణీ.. చిన్న పనే. నేనొక్కడినీ వెళ్తానులే.." అతన్ని వారించి డ్రైవర్ కి సైగ చేశాడు పదమని. తలూపి ఆశ్చర్యంగా వెనక్కి తగ్గాడు పాణి. తనకి తెలీని వర్క్ భరద్వాజకి ఏముందో అతనికంతుపట్టలేదు. అంతలోనే రయ్యిమంటూ అతని కారు, వెనకే సెక్యూరిటీ వెహికిల్స్ రోడ్డెక్కాయి వేగంగా.

"రండి సర్.., ప్లీజ్ వెల్కమ్..." ప్రొఫెసర్ రాజారాం గారి మొఖంలో అంతులేని ఆశ్చర్యం.

"ఎలా జరుగుతున్నాయి మీ సెమినార్స్ డాక్టర్? అందరి దగ్గరా చాలా మంచి రివ్యూస్ వింటున్నాం..", లోపలికి నడుస్తూ అడిగాడు భరద్వాజ.

"అవును సర్. మంచి రెస్పాన్సే వచ్చింది లక్కీలీ.. చాలా ఇన్ఫర్మేటివ్ సెషన్స్. పిల్లలెన్నో విషయాలు తెలుసుకుంటున్నారు. ఈ రోజు మీరిలా రావడం నిజంగా చాలా సంతోషం సర్. జే.కే. గారే తమంతట తాముగా రివ్యూ విని వచ్చారంటే అంతకంటే గొప్ప విషయం మాకు ఏముంటుంది. వి ఆర్ ఆనర్డ్.." సగౌరవంగా చెప్పాడు ప్రొఫెసర్ రాజారాం.

"నో.. నో.. ఇట్స్ మై ప్లెజర్ ఇన్ఫాక్ట్ సర్.. ఏదో పని మీద వెళ్తుంటే అనిపించింది.. ఎలాగూ ఇక్కడే ఉన్నాను కనీసం

కొన్ని సెషన్స్ అన్నా చూద్దామని.." చెప్పాడు సిసలైన పొలిటీషియన్ లా తన సహజ సిద్ధమైన చిరునవ్వుతో.

"ఓహ్.. తప్పకుండా మిస్టర్. జే.కే. ఇప్పుడు కూడా మన వైదేహీ హాస్పిటల్స్ తరఫు నుంచి మా స్టూడెంటే ప్రెజంటేషన్ ఇవ్వబోతోంది. టాపిక్ కూడా వండర్ ఫుల్ వన్.. ఇట్సెబౌట్ కరోనేరీ..." రాజారాం గారు వివరిస్తుండగానే సెమినార్ హాల్ ఎంటరయ్యారు. అప్పుడే స్టేజ్ మీదకు వెళ్తున్న మనోజ్ఞ కళ్ళు భరద్వాజని చూస్తూనే ఆనందంతో చప్పున వెలిగాయి. సన్నగా నవ్వి కళ్ళెగరేశాడు. స్టేజ్ మీద అతని కోసం అప్పటికప్పుడే వేయబడిన ప్రత్యేకమైన ఛైర్ లో కూర్చుంటూ ఆమె వైపు చూశాడు. "థ్యాంక్స్.." పెదాలు విడీవిడకుండా కదిపి పైకి శబ్దం రాకుండానే చెప్పింది. కళ్ళతోటే అందుకుని బొటనవేలు పైకెత్తి బెస్టాఫ్ లక్ చెప్పాడు.

సెమినార్ మెదలైంది. చాలా చక్కగా మాట్లాడుతోంది. చాలామంది పెద్దవాళ్ళు సైతం మైక్ ని, జనాన్ని చూసి వణకడం తెలుసు. ఆమె అంత చక్కగా, రిలాక్స్డ్ గా, ఈజ్ తో మాట్లాడుతోంది. పచ్చటి చుడీదార్ ఆమె వంటికి మరింత మెరుపు తెచ్చింది. లైట్ల కాంతి లో ఆమె ముఖం అందంగా తళుకులీనుతోంది. పూరేకుల్లాంటి పెదాలు లిప్ స్టిక్ వన్నె లేకుండానే ఎర్రగా మెరుస్తున్నాయి. పెద్ద పెద్ద కళ్ళు దూరం నుంచి కూడా ఆల్చిప్పల్లా విశాలంగా కదులుతున్నాయి. శంఖంలాంటి మెడ, పిడికిట పట్టే నడుము, అంటూ కవులు మరీ ఎక్కువగా వర్ణిస్తుంటూరనుకునే వాడు గానీ నిజమే సుమా.. పోత పోసిన వెన్నెల బొమ్మలా ఉందామె. ఎంతటి వాళ్ళకైనా మతి పోగొట్టే తీరైన అందమా..., లేక వీడని ఆభరణం లాంటి నవ్వా.. ఏది... ఏది అంతగా కట్టిపడేసే అంశం ఆమెలో... ఐనా అందమొక్కటే కాదు.. వెలిగే ఆ కళ్ళలో.. ఏదో తీవ్రమైన ఆకర్షణ దాగుంది... ఎస్....

చప్పట్ల హోరుతో చప్పున తేరుకుని చూశాడు. ప్రెజంటేషన్ అయిపోయింది. తను విననేలేదు... మై గాడ్.. అంటే.. అంటే.. ఇంతసేపూ తను మనోజ్ఞని చూస్తూ కూర్చున్నాడా..! ! ! 'ఏమైంది జే.కే. నీకు.. సడెన్ గా..వాట్స్ రాంగ్..' తనని తాను మందలించుకుంటూ చిన్నగా తలవిదిల్చాడు.

"ఎలా ఉంది సర్..?", ప్రొఫెసర్ రాజారాం గొంతులో ఆత్రం.

"స్ప్లెండిడ్.. డాక్టర్..."ఆగాడు భరద్వాజ. ఏం చెప్తాడు. మెదటి నాలుగు వాక్యాలు విన్నాడేమో, చిన్న ఇరకాటం. కానీ కప్పిపుచ్చుకోవడం తామందరికీ వెన్నతో పెట్టిన విద్య కదూ.. ".... బ్రిలియంట్ డాక్టర్.. మీ స్టూడెంట్స్ కి ఉన్న నాలెడ్జ్, సబ్జక్ట్ మీద ఉన్న కమాండ్ అపారం, ఇన్డీడ్.. గ్రేట్.." చెప్పాడు ఇంప్రెసివ్ గా. రాజారాం మొఖంలో ఆనందం. "ఓహ్.. థ్యాంక్యూ సో మచ్ మిస్టర్ జే.కే. ఆ అమ్మాయి నిజంగానే దేశం గర్వించదగ్గ డాక్టర్ అవుతుంది సర్ చాలా తొందర్లో. ఇండియా ఈజ్ గోయింగ్ టూ బీ వెరీ ప్రౌడ్ టూ హావ్ సచ్ ఛిల్డ్రన్.." చిరుగర్వం తొణికిసలాడిందాయన గొంతులో.

టీ బ్రేక్ కావడం తో అందరూ బయట కి నడిచారు.

"టీ తీస్కోండి జే.కే. సర్..."అన్నమాటకి తలతిప్పాడు. మెరిసే కళ్ళతో తననే చూస్తూ మనోజ్ఞ. గిల్టీగా ఫీలయ్యాడామెని చూడగానే.

"ఓ.. హాయ్.. మంచి ప్రెజంటేషన్.. అందరూ చాలా మెచ్చుకుంటున్నట్టున్నారు.." తడబాటుని కవర్ చేసుకుంటూ అన్నాడు.

"ఇక్కడ ఏం చెప్పినా బాగుందనక తప్పదు కదా వాళ్ళకి... " నవ్విందామె.

"డోన్ట్ బీ సిల్లీ.. ఎంతలా అప్రీషియేట్ చేశారంతా.. మనసులోంచి వచ్చిన అభినందన స్వీకరించాలి. పొద్దున్న నువ్వే చెప్పినట్టున్నావీ మాట.. చప్పట్లు వినలేదూ..."

"అయ్యో నమ్మేశారా.. అది ప్రెజంటేషన్ అయిపోయిందన్న ఆనందం సర్.. హమ్మయ్య వదిలిందిరా బాబూ అనుకునీ.. రిలీఫ్ లో కాస్త చప్పట్లెక్కువ కొట్టేశారు.." అల్లరి గా చెప్పింది.

నవ్వేశాడు"నువ్వూ..." అంటూ.

"టీ సర్.. చల్లారిపోతోంది.. "

"వెల్.. నేను.. టీ తాగను.. ఐ మీన్.. ఈ టైం లో తాగను.." అన్నాడు భోజనం చేయలేదని చెప్పడానికి మొహమాటపడి.

"ఓహో.. మేం మాత్రం తెల్లారింది మొదలు అన్ని వేళలా టీ యే తాగుతాం...24/7, తాగకపోతే బతకలేం.. యూ నో.. అడిక్షన్ లాగా అన్నమాట...", సీరియస్ గా చెప్పింది. బిత్తరపోయి చూశాడు.

అతని ముఖం చూసి అల్లరిగా నవ్వేసింది. "లేకపోతే ఏంటి సర్. అంత కష్టపడి వచ్చారు కదా పోనీ పాపమని టీ ఇస్తే మరీ ఫోజ్ కొట్టేస్తున్నారు.. తెచ్చినందుకన్నా ఒక్క సిప్ ఐనా చేయొచ్చు గా.."

"నువ్వు చాలా మొండి పిల్లవి.. డూ యూ నో దట్.." అంటూ నవ్వేసి కప్పు చేతిలోకి తీసుకున్నాడు.

అంతలో ప్రొఫెసర్ రాజారాంతో పాటు దయాళ్స్ డైరెక్టర్ తనకోసం రావడం గమనించి వారివైపు నడిచాడు.

కాసేపటికి కారెక్కాడు అందరికీ వీడ్కోలు చెప్పి. అంతలో డోర్ దగ్గరకొచ్చి మెల్లగా అడిగింది మనోజ్ఞ, "సర్ ... మీరేం అనుకోకుంటే నాక్కొంచెం కాటేజ్ వరకూ లిఫ్టిస్తారా..." అంటూ. వింతగా చూశాడు.

"అదేం? సాయంత్రం వరకూ వుండవా..?"

"లేదూ.. కొంచెం హెడేక్ అనీ..."

"ఓ.. కమ్.. కమ్.. గెట్ ఇన్..", ఆహ్వానించాడు. ఉత్సాహంగా అతని పక్కన కూర్చుని డోర్ వేసింది.

"నిజంగా తల నొప్పేనా..?" ఆమెని పరిశీలనగా చూస్తూ అడిగాడు కారు కదిలాకా.

"కనిపెట్టేశారా.. లేదు.. వేరే చిన్న పని..."గిల్టీగా చెప్పింది.

"డూ యూ వాంట్ మీ టూ డ్రాప్ యూ సమ్ వేర్ ఎల్స్..", సందేహంగా అడిగాడు బాయ్ ఫ్రెండ్ ఎవర్నైనా కలవడానికేమోనని.

"వెల్ .. వద్దూ.. పర్లేదు.. కాటేజ్ దగ్గర లేన్ చివర కాఫీ షాప్ దగ్గర దింపితే చాలు.. "నోరుజారింది.

"ఓ.కే. అక్కడెవరైనా.. వెయిటింగా..?"అర్థవంతంగా నవ్వుతూ అడిగాడు.

"ఛ.. ఛ.. అదేం లేదు సర్..", సందిగ్ధంగా ఆగిపోయింది.

"సారీ టూ ఇన్సిస్ట్.. ఇట్స్ ఓ.కే. డోన్ట్ బాదర్. నువ్వేం ఇబ్బంది పడకు అక్కడే దింపుతానులే." చెప్పాడు ఆమె ఇబ్బంది గమనించి.

అతని అభిప్రాయం అర్థమై ఖంగారుగా అందామె, "అయ్యో.. అదేం కాదు సర్. నథింగ్ పర్సనల్. చెప్పేస్తాన్లెండి. మధ్యాహ్నం మీరెప్పుడొస్తారో తెలియలేదు. వన్ ఓ క్లాక్ నుంచీ బయటే ఉన్నా.. సో.. లంచ్ కి వెళ్ళడం కుదర్లేదు. సెమినార్ అయ్యాకా ఫెల్ట్ హంగ్రీ.. అంతే.. చెప్తే మరీ ఓవర్ గా వుంటుందని చెప్పలేదు.."

"ఓహ్.. అయాం సో సారీ... నేనూ ఏదో పనిలో పడి లాస్ట్ మినిట్ లో స్టార్ట్ అయ్యాను.. సరే.. నావల్లే తినలేదు కదా.. ట్రీట్ ఆన్ మీ.. నేనే లంచ్ కి తీస్కెళ్తాను. ఐనా ఆ కాఫీషాప్ లో ఏం దొరుకుతుందిప్పుడు. హాయిగా రెస్టారెంట్ కి వెళ్దాం.. ఏమంటావు.. ఓ.కే.నా..?" అడిగాడు.

"అరె.. అదేం వద్దు సర్.."మొహమాటపడింది.

"నేనయితే తినాలిగా.. కంపెనీ ఇద్దువులే.."ఖచ్చితంగా చెప్పేశాడు.

కబుర్ల మధ్య లంచ్ ఎప్పుడు పూర్తైందో తెలియలేదిద్దరికీ. కాటేజ్ దగ్గర దింపాడామెని.

"ఓ.కే.వుంటాను మరి. అన్నట్టు వీలైతే నీ ప్రజెంటేషన్ సీ.డీ. ఓ కాపీ ఇవ్వు నాకు. మధ్యలో ఎక్కడో ఆలోచిస్తూ సరిగ్గా వినలేదు. వింటానని మాటిచ్చానుగా. నిజంగా విన్నాకా చెప్తాన్లే ఎలా ఉందో.." అంటూ చెప్తున్న అతన్ని ఆశ్చర్యం గా చూసింది.

"ఏమైంది?అలా చూస్తున్నావు?" అడిగాడు.

"ఏంలేదు భరద్వాజ గారూ..మరీ ఇంత నిజాయితీగా మాట మీద నిలబడే మీరు మంత్రెలా అయ్యారా అనీ.." నవ్వుతూ చెప్పింది.

"తెల్సుకుందువుగానీ.., మరోసారి తీరిగ్గా ఎప్పుడైనా చెప్తాలే.. ఐనా అంత నిజాయితీపరుణ్ణి కూడా కాదు నేను. అనవసరంగా గొప్పవాణ్ణి చేయకు గానీ.. బై.. మళ్ళీకలుద్దాం.."అంటూ కదలబోయాడు.

"ఎప్పుడు..??" వెంటనే అడిగింది. తలతిప్పి చూశాడు. కళ్ళు దించుకుంది.

"వెల్. రేపు వాకింగ్ కి వస్తావు కదా.." అన్నాడు. ఆమె జవాబు చెప్పలేదు. మళ్ళీ అదే తెలియని ఇబ్బంది. సరిగ్గా

పొద్దుటిలాగే వదిలి వెళ్ళాలనిపించని ఏదో భావన. కనిపించని బంధమేదో కట్టిపడేస్తున్నట్టు...అనీజీగా కదిలాడు. మౌనంగా అలాగే నిలబడింది.

"వెళ్తానూ.. వర్క్.. వుంది.. చాలా..." తను వెళ్ళడానికి ఆమెకి ఎక్స్‌ప్లనేషన్ ఎందుకు చెప్తున్నాడో,అసలేం చెప్తున్నాడో, జీవితంలో మొదటిసారి తనేం మాట్లాడుతున్నాడో తనకే అర్థం కాని స్థితి. మాటల్తో అసెంబ్లీ మొత్తాన్ని కన్ఫ్యూజ్ చెయ్యగల జే.కే. ఒక ఆడపిల్ల ముందు మాటలు తడుముకుంటున్నాడు. ఇది ప్రారంభం మాత్రమే.. అని మనసు చెప్తోంది. ఇంకా అలాగే ఆగడం మంచిదికాదని వెళ్ళబోయాడు.

"భరద్వాజా.."బెరుగ్గా పిలిచిందామె.

"చెప్పు.."ఆగాడు.

"సాయంత్రం.. సెవెన్ కి.. రాక్ గార్డెన్స్ లో మంచి.. మ్యూజికల్ ఫౌంటేన్.. చూ..చూద్దామనీ.. అంటే.. మీరు .. ఎప్పుడైనా చూశారా.. అంటే మీకు ఇంట్రస్ట్ ఏమన్నా... ఐ మీన్.. అంటే..." తడబడింది. సూటిగా చూశాడు. ఆమె భయంగా తలదించుకుంది. "సారీ.."అస్పష్టంగా గొణిగింది. ఒక్క క్షణం నిశ్చలంగా ఆమెకేసి చూశాడు.

"షార్ప్ సెవెన్.. రాక్ గార్డెన్స్.." చెప్పాడు గంభీరంగా. చివ్వున తలెత్తింది. "అంటే.. మీరు.. మీరు.. "ఆమె మొఖంలో అంతులేని సంతోషం. పర్స్ లోంచి కార్డ్ తీసి అందిస్తూ చెప్పాడు, "నా పర్సనల్ నంబర్.. స్టార్ట్ అయేముందు జస్ట్ గివ్ మీ  ఎ కాల్.. ఓ.కే.."తలూపింది కలలోలా. వెంటనే వెనుదిరిగి కారెక్కాడు.

ఫైల్స్ యాంత్రికంగా ముందు పెట్టుకున్నాడే గానీ ఏవేవో ఆలోచనలు కమ్మేస్తున్నాయి. ఏదో ఆకర్షణ, తెలియని మాగ్నెటిజం తనని లాగేస్తోంది. అందమైన స్త్రీ ని చూసి ఎవరి మనసైనా చలించడం సహజం, కానీ తాను ఎన్నడూ చూడని అందమేమీ కాదే.. ఐనా తానెరగని అందమా.. స్త్రీ పరిచయం, సాంగత్యం, అవతలివారు చూపే ఆసక్తీ, ఏదీ తనకి కొత్త కాదు.  ఐనా ఏదో ఉంది. ఆమె కళ్ళల్లో తనపై కనిపిస్తున్న ఇష్టం, అభిమానం, మొదటిసారి కలిసినప్పట్నుంచీ ఆమె పట్ల కలిగిన ఆత్మీయత, ఆమె ముగ్ధత్వం, ఆ అందం, అన్నీ కలగలిసి.. ఒకవేళ.. 'తలవిదిల్చాడు. ఎక్కువగా ఆలోచిస్తున్నాడా..? మరీ ఊహించుకుంటున్నాడా.. ఒక సెలబ్రిటీ తో టైం గడపడానికి ఎవరు ఇష్టపడరు!?. అంతే వుండచ్చు. అంతే అయ్యుంటుంది. మే బీ.. కానీ, ఒకవేళ అంతే కాకపోతే.. తనతో మాట్లాడేటప్పుడా కళ్ళలో కనిపించే మెరుపు.. మాటల్లో ధ్వనించే అడ్మిరేషన్.. మరి వాటర్థం ఏమిటి..? నో వే.. చిన్నపిల్ల ..అలాంటిదేం ఉండివుండదు. లేక టీజ్ చేస్తోందేమో. మే బీ అంతే అయ్యుంటుంది. లేకపోతే తన వయసెక్కడా.. మనోజ్ఞ వయసెక్కడా.. ఆమెతో అంకుల్ అని పిలిపించుకోవల్సిన వయసు కదూ తనది...శైలూ వయసేగా ఈమెకూడా.. ఇదేం ఆలోచన.. ఫూలిష్... అంతలో స్టేజ్ మీద ఆమెని చూసి మైమరచిపోవడం గుర్తొచ్చింది. అలాగే చూశాడా తను.. కానే కాదు.. ఛ.. కానీ ఆ కళ్ళూ, కోటేరులాంటి ముక్కు, ఎర్రెర్రని

పెదవులూ, చిన్ని గడ్డం, నవ్వినప్పుడు వింతగా మెరిసే ఆ అందమైన ముఖం.. వెనక్కి వాలి కళ్ళు గట్టిగా మూసుకుని నుదురు రుద్దుకున్నాడు అసహనంగా. సాయంత్రం కలుస్తానని చెప్పి తప్పుచేశాడా! పొద్దున్న కాఫీ, మధ్యాహ్నం లంచ్, సాయంత్రం పార్క్... ఎక్కడికి వెళ్తోంది ఈ పరిచయం..??

రాక్ గార్డెన్స్ ముందు కారాపాడు. చాలా రోజుల తర్వాత డ్రైవర్ ని వద్దని తానే కార్ తీశాడు. ఎందుకో ఆమెతో వెళ్ళేటప్పుడు కారులో డ్రైవర్, సెక్యూరిటీ, అంతా అడ్డులా అనిపించారు.

కారుదిగుతున్న భరద్వాజని చూస్తూనే ఆమె కళ్ళు మెరిశాయి. మనోజ్ఞ వంక ఆశ్చర్యంగా చూశాడతను. కాస్త ప్రత్యేకంగా రెడీ అయిందేమో తళుకులీనుతోందామె అందం. కళ్ళలో మెరుపూ, బుగ్గల్లో ఎరుపూ ఆ అందాన్ని మరింత పెంచాయి. ఆ మెరుపు తన కోసమే అన్న తలపుకే గర్వంతో వుప్పొంగిందతని హృదయం.

మ్యూజికల్ ఫౌంటేన్ మొదలయ్యింది. జనానికి కాస్త దూరం గా వున్న కుర్చీల్లో కూర్చుని చూస్తున్నారు వాళ్ళు. ఆ ఫౌంటేన్ లో మారే రంగులు ఆమె మోములో వెలుగై పరావర్తనం కావడాన్ని ఆసక్తిగా చూసి బలవంతంగా కళ్ళు తిప్పుకున్నాడు. కాసేపటి మామూలు కబుర్ల తరువాత ఫౌంటేన్ అయిపోయింది. జనం పల్చబడుతున్నారు. అక్కడక్కడా కూర్చున్న హనీమూన్ జంటలు ఒకరికొకరు మెల్లగా దగ్గర కాసాగారు. అది గమనించి, "వెళ్దామా?", అంటూ మొహమాటంగా అడిగింది. తలూపాడు. లేచి కారు దగ్గరకి నడుస్తుంటే తెలీని దిగులు. ఈ క్షణం ఇలాగే ఆగిపోతే బాగుండునన్న భావన. ఏదో చెప్పాలని, ఎంతో చెప్పాలని, ఏమీ చెప్పలేని ఇబ్బంది. ఆమె కూడా అదే స్థితి లో ఉందని మనసుకి బలంగా తోస్తోంది.

తెల్లని చుడీదార్ లో ఆమెని చూస్తుంటే తాను డైరీ లో ఆమె గురించి రాసుకున్న 'ఏంజిల్' అనే మాట కి ప్రాణం పోసినట్టుంది. ఆమె పక్కన తన రెగ్యూలర్ ఫుల్ వైట్ అటైర్ లో తనూ, ఇద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్ లా ఉన్నారా... లేక మ్యాడ్ ఫర్ ఈచ్ అదరా.., అనుకుని అంతలో తన పిచ్చి ఆలోచనకి తానే నవ్వుకున్నాడు. తనని ఓరగా చూస్తున్న ఆమెని గమనించి అతని గుండె చప్పుడు మరింత వేగమైంది.

కార్ డోర్ తీస్తుంటే ఆశ్చర్యంగా అడిగింది, "మీ బెటాలియన్ ఏదీ?"

చిన్నగా నవ్వాడు, "వద్దన్నాను. సిటీలో ఎలాగూతప్పదు. ఇక్కడన్నా కాస్త సొంతంగా డ్రైవ్ చేద్దామనీ.. రిలాక్స్డ్ గా వుందామనీ..."

"గ్రేట్.."ఆమె ముఖంలో దాగని ఆనందం చూసి కాస్త గర్వపడ్డాడు. వ్యక్తిగా దిగజారిపోతున్నాడా లేక... ఇంక ఆలోచించే ఓపిక లేక ఆలోచనలని పక్కకి నెట్టేసి కారు స్టార్ట్ చేశాడు.

కాటేజ్ ముందు కారాగింది.

"గుడ్ నైట్ భరద్వాజా.. థ్యాంక్స్.. అండ్ సారీ.. మీ టైం కిల్ చేసినందుకు...", చిరునవ్వుతో చెప్పిందామె.

"ఛ.. ఛ.. డోన్ట్ సే దట్. ఐ హాడ్ ఏ మెమోరబుల్ ఈవెనింగ్.."మనస్ఫూర్తిగా చెప్పాడు.

"ఆక్చ్యువల్ గా నేను కూడా..ఇట్ వాజ్ ఏ వండర్ఫుల్ ఈవెనింగ్ ఫర్ మీ..అండ్ అల్టిమేట్ థింగ్.. ఐసింగ్ ఆన్ ది కేక్ లాగా... మీరే.. స్వయంగా మీరే డ్రైవింగ్ మీ హోమ్, కలలా ఉంది. థ్యాంక్స్ ఎ లాట్.." మెరిసే కళ్ళతో చెప్పింది.

"యూ ఆర్ మోస్ట్ వెల్ కమ్..సో రేపు షార్ప్ ఫైవ్.. రైట్.."నవ్వాడు. తలూపిందామె.

రాత్రి పదకొండుకొచ్చిందా వార్త. బెనర్జీగారి కూతురు శైలజ.. ఆత్మహత్యా యత్నం చేసిందని. బెనర్జీ గారు కంగారుగా ఫోన్ చేస్తే, హడావిడిగా బయల్దేరి దయాల్స్ హాస్పిటల్ లో అడుగుపెట్టాడు భరద్వాజ. ఆ అమ్మాయి పెళ్ళై నాలుగు నెలలైందేమో. భార్యాభర్తలిద్దరూ డాక్టర్లే. ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. సెమినార్, హనీమూన్ రెండూ కలిసొస్తాయని వచ్చారిద్దరూ అక్కడకి. ఇద్దరూ బెనర్జీ గారి ప్రైవేట్ గెస్ట్ హౌస్ లోనే ఉన్నారు. హఠాత్తుగా ఈ దుర్వార్త. చేరుతూనే అర్థమైపోయింది.. ఆ అమ్మాయి ప్రాణం పోయిందని.

అప్పటికే ఆమె తోటి జూనియర్ డాక్టర్లందరూ దుఃఖంలో మునిగిపోయున్నారు. అందరూ అక్కడే ఉన్నారు, మనోజ్ఞా, సంజయ్, ఆనంద్, నవ్య, రఘు, అమల, రేఖ.., వాళ్ళకేసోసారి జాలిగా చూసి వడివడిగా బెనర్జీ గారి వైపు నడిచాడు.

"అంతా అయిపోయింది జే.కే..." భరద్వాజని చూస్తూనే అతని చేతులు పట్టుకుని బావురుమన్నారు బెనర్జీగారు. జాలిగా చూస్తూ ఆయన్ని దగ్గరకి తీసుకున్నాడు. ఆయన బాధ ఎవ్వరూ తీర్చగలిగేది కాదు. శైలజ ఆయనకి ఒక్కగానొక్క కూతురు. ఆమె అంటే ఆయనకెంత ప్రాణమో అందరికీ తెలుసు.

సెమినార్ ఇనాగరేషన్ కి తానొచ్చినప్పుడు "జే.కే.సర్, నేను బెనర్జీగారమ్మాయిని, తను దిలీప్, మై హస్బెండ్, మా పెళ్ళికి మీరొచ్చారు కూడా, గుర్తుందా సర్.." అంటూ పలకరించిన అమాయకమైన శైలజ ముఖం ఒక్కసారి కళ్ళముందు కదలాడి మనసు భారమైంది. అప్రయత్నంగా చుట్టూ చూసాడు. ఎక్కడా దిలీప్ జాడ లేదు.

"ఏమయ్యింది సర్, ఎలా..శైలజ...ఎందుకంత తొందర పడింది..?"బాధగా అడిగాడు.

"తొందరపడింది నా కూతురు కాదయ్యా..., నా..అల్లుడు.. ప్రాణంగా ప్రేమించాను అదీ, ఇదీ అన్నాడు.. నమ్మింది.. ఇప్పుడేమో వేరే ఆడదానితో మంచమెక్కి దాని కళ్ళబడ్డాట్ట. పిచ్చిది మొగుణ్ణొదిలేయలేక ప్రాణాలొదిలేసింది జే.కే.!, నా కూతురు ప్రాణాలే వదిలేసింది." భోరుమన్నాడాయన.

ఉలిక్కిపడ్డాడు భరద్వాజ. ఎవరి ద్వారానో వినటం వేరు. కళ్ళారా చూడటం వేరు. భర్తనలా చూసిన ఆ అమ్మాయి మనఃస్థితి తలుచుకుంటే గుండె వికలమైంది. పిచ్చి పిల్ల... పాపమామె వయసెంతని అంత దారుణమైన వ్యవహారాలు

చూసి తట్టుకోవడానికి.. జాలిగా ఆయన్ని ఓదార్చసాగాడు. నెమ్మదిగా సంబాళించుకున్నాడాయన. కాసేపటికి అందరూ వచ్చారు. దాదాపుగా ఒంటిగంట అవుతుంటే, శైలజని తీస్కుని వాళ్ళంతా స్పెషల్ ఫ్లైట్ లో బయల్దేరారు.అంత దుఃఖంలోనూ, నిబ్బరంగా వెళ్తున్న ఆయన్ని చూసి నివ్వెరపోయారంతా.

జీవితం నేర్పినంత గొప్పగా ఇంక ఏ గురువూ పాఠాలు నేర్పలేరేమో...

ఆ కొద్ది రోజుల్లోనే శైలజ తో బాగా క్లోజ్ ఐన డాక్టర్లంతా దిగాలుగా కూర్చుని ఉన్నారు. ఫ్లైట్ వెళ్ళిపోవడంతో ఏర్ పోర్ట్ సద్దుమణిగింది. మధ్యమధ్యలో వినిపిస్తున్న అమ్మాయిల ఏడుపులూ, వెక్కిళ్ళూ తప్ప అక్కడంతా స్తబ్దంగా ఉంది.

"..డీటెయిల్స్ కనుక్కున్నాను సర్. మనం చేయగలిగిందేమీ లేదు.. తన స్యూసైడ్ కి ఎవరూ బాధ్యులు కారని ఆ అమ్మాయే నోట్ రాసి పెట్టింది. అండ్ మోరోవర్.. పైగా ఎవర్నీ దోషుల్ని చేయవద్దని కూడా రాసి.." తటపటాయిస్తూ ఆగాడు పాణి.

తల పరికించాడు భరద్వాజ. అంతలో విసురుగా తలెత్తాడు ఆనంద్. అతని కళ్ళు ఎర్రబారివున్నాయి.

"రాసిపెట్టదూ మరి. వేల, కోట్లమంది అమ్మాయిల మూర్ఖత్వానికి, వెర్రితనానికి ప్రతినిధిలా పెద్ద రాసింది.. ఎవరూ బాధ్యులుకారట.. మైండ్ లెస్ ఇడియట్.... సెన్స్ లెస్ క్రీచర్..." కసిగా అన్నాడు ఆనంద్. అప్రయత్నంగా అందరూ అతని వైపు చూశారు.

"స్టాప్ ఇట్ రా. నీకు శైలూ మూర్ఖత్వమే కనిపిస్తోందా.. పాపం పిచ్చిదిరా.. అలా రాయడంలో ఆ పాపమా పిచ్చిదాని ప్రేమ లోతు తెలీటంలేదూ.." కోపంగా అంది మనోజ్ఞ.

"ప్రేమా... మై ఫుట్... ఏదా ప్రేమ మనూ... షో మీ...ఐ సే... ఎక్కడుంది? ప్రేమంటే ఇద్దరికీ ఉండాల్సిన ఫీలింగ్.. అంతేగానీ ఒకరిస్తే ఇంకొకరు ఫ్రీ గిఫ్ట్ లా పుచ్చుకుని పోయేది కాదు. ఏమన్నావ్ పిచ్చిదా.. యూ ఆర్ హండ్రడ్ పర్సంట్ రైట్.. ఎస్ పిచ్చే దానికి.. వాడో వెధవపని చేశాట్ట, అందుకని తన ప్రాణం తీసేస్కుంటుందా..! పైగా వాణ్ణి రక్షించడానికో చెత్త వుత్తరం. చేతకాని దద్దమ్మలు, ఎమోషనల్ ఫూల్స్ మీ ఆడవాళ్ళు.. అదే నేనైతేనా.. ముందు వాడ్ని చంపి ఆ తరవాత ఆలోచించేవాడ్ని." కర్కశంగా పలికిందతని గొంతు.

నెమ్మదిగా తలెత్తింది మనోజ్ఞ, ఆమె కళ్ళ నిండుగా నీళ్ళు, "అవున్రా.. చంపేస్తావు.. ఎంతైనా అదే జాతి కదా.. మగాడివి కదూ..! నిమిషం పట్టదు.. కానీ మేము.. కరెక్టేరా చాలా బాగా చెప్పావు.. శైలూ లాగా.. మేం అంతా .. అందరం.. ప్యూర్లీ మైండ్ లెస్ క్రీచర్స్ మేరా.. దద్దమ్మలమే. ప్రేమంటే నథింగ్ లెస్ దాన్ ఎ బిజినెస్ డీల్ అనీ,ఇచ్చి పుచ్చుకోవాలనీ, డిమాండ్ చెయ్యాలనీ తెలియక ముందే తనువూ–మనసూ, అన్నీ ఇచ్చేసి, ఖాళీ చేతులతో మీరిచ్చే రవంత ఆప్యాయత కోసం దేహీ.. అని బిచ్చగత్తెల్లా ఎదురుచూస్తాం కదూ..! మాకిదే కరెక్ట్. ఈ మోసపోవడమే కరెక్ట్ యాంటీడోట్, అండ్ చావే కరెక్ట్ పనిష్మెంట్... నీకు శైలు పిచ్చితనమే కనిపిస్తోందేమో, నాకు మాత్రం చావులోనూ ప్రేమించినవాణ్ణి

బాధపెట్టలేని నిండుమనసే కనిపిస్తోంది. అరె ఎంత పిచ్చిది కాకపోతే తన చావు వల్ల అతని జీవితం పాడవకూడదనుకుంటుంది.. ఆఖరి నిమిషంలో అది మాట్లాడిన నాలుగు మాటలూ గుర్తులేవా నందూ.. నీకు? అది చనిపోయినది మోసపోయానని కాదురా.. తన ప్రేమ ఓడిపోయినందుకు, తనతో వుండి కూడా అతను వేరే వ్యక్తితో బెడ్ షేర్ చేసుకోగలిగాడంటే.. అసలలాంటి ఆలోచన వస్తేనే, అది తమ ఫెయిల్యూర్ అనుకునేంత లోతైన ఫీలింగ్స్ కలిగున్న మేమంతా పిచ్చివాళ్ళమే, దద్దమ్మలమే.. ఎస్.. మా చేతకానితనానికి కనీసం.. ఎవ్వరి.. ఎవ్వరి సానుభూతి.. కూ..డా వద్.. వద్దు.. అసలూ..." ఇక మాట్లాడలేక అరిచేతుల్లో మొఖం దాచుకుని వెక్కి, వెక్కి ఏడవసాగింది.

నిశ్చేష్టులై చూస్తుండిపోయారంతా.. ఆమె మాటల్లో చేదు నిజాన్ని గుర్తించి, ఏమీ మాట్లాడలేక మౌనంగా ఉండిపోయారు.

ఆ నిశ్శబ్దంలో వాళ్ళ విషాదాన్ని పంచుకుంటున్నట్టు బాధగా కళ్ళుమూసుకున్నాడు భరద్వాజ. 'అక్షరం అబద్ధంలేదు. ఎందరో ఆడపిల్లల నిర్వేదానికి నిర్వచనాలే ఆ మాటలు..' అనుకుని గాఢంగా నిట్టూర్చాడు. అంతలో అక్కడ సిట్యూయేషన్ సరిచేయాల్సిన బాధ్యత గ్రహించి మెల్లగా తేరుకున్నాడు.

"పాణీ.. అందరికీ ఏమన్నా తాగడానికి వేడిగా ఏ కాఫీయో, టీయో ఉన్నాయేమో చూడు..", అని చెప్పి వాళ్ళకేసి చూశాడు. మనోజ్ఞ, రేఖల వెక్కిళ్ళ శబ్దం తప్ప అక్కడ ఏమీ వినిపించట్లేదు. ఆనంద్ మోకాళ్ళమీద చేతులాన్చి, అరచేతుల్లో మొఖం దాచుకుని కూర్చున్నాడు. మిగతావారంతా జీవంలేనట్టే స్తబ్దంగా కూర్చున్నారు. టీ రాగానే నెమ్మదిగా లేచి ఆనంద్ పక్కన కూర్చుని అతని భుజం మీద తట్టాడు ఓదార్పుగా. మనోజ్ఞ, రేఖలకేసి చూసి అన్నాడు, "చూడండి, ముందీ టీ తాగండి, ప్లీజ్. మిమ్మల్ని మీరు కంట్రోల్ చేస్కోండి. మనోజ్ఞా.. ఆనంద్.. మీరిద్దరు చెప్పినదాంట్లోనూ నిజముంది. మీ బాధలో, ఆవేశంలో అర్థమూ వుంది. కానీ, ఇది ఆవేశాలు పడే టైమ్ కాదు. ఇప్పుడది కాసేపు వదిలేయండి. కారణాలేవైనా మీకందరికీ శైలజంటే ఇష్టమే కదా..?" ప్రశ్నించాడు. తలలూపారు."మరి తన వల్ల ఈ వాదులాట జరుగుతోందంటే అంత సెన్సిటివ్ అమ్మాయి మనసు బాధపడదూ, ఇదంతా చూసిన తన సోల్ కి పీస్ ఉంటుందా చెప్పండి? తన వల్ల ఎవరూ కష్టపడకూడదంది కదూ మీ స్నేహితురాలు.. అవునా.." స్తబ్దంగా అతని వంక చూసి తలలూపారందరూ అతను చెప్పినదానికి కన్విన్స్ అయినట్టు, "సో ప్లీజ్, నా మాటవిని ముందు టీ తాగండి. కాస్త వేడిగా ఏదైనా గొంతు దిగితే యూ విల్ ఫీల్ బెటర్.." చెప్పాడు మృదువుగా. కళ్ళుతుడుచుకుంటూ మౌనంగా గ్లాసులందుకున్నారు. రిలీఫ్ గా చూశాడు. కాసేపు వేరే విషయాలు మాట్లాడి ధైర్యం చెప్పి కాటేజ్ కి బయల్దేరదీశాడు.

మనోజ్ఞ వాళ్ళ కాటేజ్ ముందు ఆగారంతా.

"థ్యాంక్స్ ఫర్ ఎవ్రీథింగ్ సర్. మా కోసం మీరింత శ్రమ..", మొహమాటంగా చెప్పబోయాడు సంజయ్.

వారిస్తూ అన్నాడు భరద్వాజ, "..శ్రమేంటి సంజయ్, మనిషిని కానా, సాటి మనిషితో బాధని పంచుకోవడం కూడా శ్రమేనా... ఇప్పుడవన్నీ ఎందుకు గానీ మీరంతా జరిగినది మర్చిపోయి కాస్త ధైర్యంగా వుండండి... టేక్ కేర్.."

"లోపలికి రండి సర్.."తేరుకుని పిలిచింది మనోజ్ఞ. రిలీఫ్ గా చూశాడు. అంతసేపూ ఆమెనలా దుఃఖంలో చూడటం నిజంగానే చాలా బాధించిందతన్ని.

"ఇప్పుడు కాదు. మరోసారి మీరంతా ప్రశాంతంగా వున్నప్పుడూ, నవ్వుతూ పిలిచినప్పుడు వస్తాను. సరేనా.. జాగ్రత్త మరీ..." అని చెప్పి బయల్దేరాడు.

మనోజ్ఞ మాటలు, ఆమె కన్నీళ్ళు రాత్రి మొత్తం కళ్ళముందు కదుల్తూనే ఉన్నాయి. ఈ కొద్ది రోజుల్లో ఆమెతో వాకింగ్ పేరుతో ప్రతిరోజూ చాలా టైమ్ గడపడంతో ఆమె సున్నితత్వం, మనస్తత్వం బాగా అర్ధమయ్యాయతనికి. తెల్లవారుతూనే ఫోన్ చేశాడు. ఒక్క రింగ్ కే లిఫ్ట్ చేసిందామె.

"సర్.." బరువుగా వుందామె గొంతు.

"రాత్రంతా నిద్ర పోనేలేదా..?"లాలనగా అడిగాడు.

"ఊహు..రాత్రంతా శైలూనే గుర్తొచ్చీ..."వణికిందామె గొంతు దుఃఖంతో.

"వాక్ కి రా. మాట్లాడుకుందాం. కాస్త ఛేంజ్ గా ఉంటుంది. యూ విల్ ఫీల్ బెటర్." చెప్పాడు.

ఏడ్చి ఏడ్చి కళ్ళు ఎర్రగా, ఉబ్బిపోయి, వాడిపోయిన మొఖంతో ఒక్క రోజులో పది లంఖణాలు చేసినట్టుందామె ముఖం.

"ఏంటిది? మనోజ్ఞా.. ఇంతగా దిగులు పడితే ఎలా.. ఏం చేస్తాం చెప్పు. మన చేతుల్లో ఏముంది. ఐ నో ఇట్స్ డిఫికల్ట్.. కానీ ఇక.. జరిగింది మర్చిపోవాలి.. తప్పదు.." ఆమె వైపు బాధగా చూసి అన్నాడు.

"మర్చిపోతాన్లెండి సర్. దిలీపే క్షణంలో దులిపేస్కున్నాడు. నాకు తనతో ఉన్న పరిచయం ఎంతని? ఈ కొద్ది రోజులేగా, కాసేపాగితే అసలామె పేరే గుర్తురానంత.." ఆమె కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఒక్కసారిగా చలించిపోయాడు. జాలిగా ఆమె తల నిమరబోయి అంతలో సంకోచంగా చెయ్యి వెనక్కి తీసుకున్నాడు.

ఆమె సన్నగా రోదించసాగింది.

"మనోజ్ఞా, ప్లీజ్.. నిన్నిలా చూడలేను. స్టాప్ క్రయింగ్.. కనీసం నాకోసమన్నా మామూలవ్వాలి నువ్వు.. ప్లీజ్ నా కోసం.. ఫర్ మై సేక్...", వేదనగా అన్నాడు.

చప్పున తలెత్తింది. ఏదో మంత్రించినట్టుగా తలూపింది. కళ్ళు తుడుచుకుని బలవంతంగా నవ్వడానికి యత్నిస్తూ, "ఓ.కే. భరద్వాజా.. మీ కోసం అవుతాను... ఎనీథింగ్ ఫర్ యూ..." అంది ఆర్తిగా.

అతని గుండెని సూటిగా తాకాయా మాటలు. భయంగా చూశాడు. 'అంత బాధ తనకోసం పక్కన పెట్టగలదా. లేక బాధ పక్కనపెట్టినట్టు నటిస్తుందనా.. అసలు ఏపాటి పరిచయం వుందని ఎనీథింగ్ ఫర్ యూ అనడానికి.. ఏమిటి ఆ మాటకర్థం?' మైండ్ లో తిరుగుతున్న రకరకాల ఆలోచనలనీ, భావాలని కవర్ చేస్కుంటూ నవ్వాడు. "ఓ.కే. దట్స్ లైక్ ఎ గుడ్ గర్ల్.. ఇంతకీ ఇది చెప్పూ, నువ్వూ, ఆనంద్.. బెస్ట్ ఫ్రెండ్సా..?" టాపిక్ మారుస్తూ అడిగాడు.

"ఔను. అసలు పుట్టడమే కలిసి పుట్టామంటారంతా. నాకంటే వారం రోజులే పెద్ద వాడు.. అంతే.. నాన్న.. అంకుల్ చాలా క్లోజ్ ఫ్రెండ్స్.. సో.. వాళ్ళలాగే మేము కూడా.." చెప్పింది.

"ఓ.. ఐ సీ... కాకపోతే కొంచెం కొట్టుకునే టైప్ ఫ్రెండ్స్ ఏమో కదా.." నెమ్మదిగా నార్మల్ అవుతున్న ఆమెని తృప్తిగా పరికిస్తూ అన్నాడు.

"మరీ అంత మొహమాటపడక్కర్లేదు సర్.. పిల్లి-ఎలుక టైప్ లో పోట్లాడుకుంటూనే ఉంటాం. వాడిదీ, నాదీ ఒక్క ఒపీనియన్ కూడా కలవదు. కాకపోతే ఒక్కరోజు కూడా నాతో మాట్లాడందే.., ప్రతీ విషయంలో నా సలహా లేనిదే గడవదు వాడికి. నాకూ.. అలవాటైపోయిందా యుద్ధం, ఒక్కరోజు పోట్లాడుకోకపోయినా ఏంటోగా ఉంటుంది.." చెప్పింది.

"ఓ.కే. అంటే.. కేవలం స్నేహమేనా...!?" మామూలుగానే అడిగినా ఏదో చేదు మింగిన ఫీలింగ్.

"లక్షా తొంభై..." నవ్వింది. చాలాసేపటి తరవాత విరిసిన ఆమె నవ్వుకేసి రిలీఫ్ గా చూశాడు.

"ఏమిటా లక్షా తొంభై..?"

"మా ఇద్దరి గురించీ ఈ ప్రశ్న అడిగినవాళ్ళు.."

"ఔనా.. ఇంతకీ మరి మీ సమాధానం..??" సందేహంగా అన్నాడు.

"హీ ఈజ్ మై బెస్ట్ బడ్డీ.. నా వరకూ ఐతే.."

"అంటే అతను.. బట్ ఐ థింక్ హీ లైక్స్ యూ.. అతని కళ్ళలో క్లియర్ గా కనిపిస్తుంది. మిమ్మల్ని మొదటిసారి షాపింగ్ సెంటర్ దగ్గర చూసినప్పుడే అనుకున్నాను.. ఇఫ్ అయామ్ నాట్ రాంగ్..?" సాలోచనగా అన్నాడు.

"... వెల్.. యూ ఆర్ రైట్ సర్. తనకా ఉద్దేశ్యం ఉంది. బట్.. మెల్లగా తెలుసుకుంటాడు. ఎప్పుడూ డైరెక్ట్ గా మాట్లాడుకోలేదు. బట్ ఐ నో.. హీ విల్ గెట్ ఓవర్ ఇట్.." అంది మామూలుగా.

"కానీ ఏదైనా ఓపెన్ గా మాట్లాడుకోవడం బెటరేమో మనోజ్ఞా! ..అదీ నీకా ఉద్దేశ్యం లేనప్పుడు. లేదంటే లేని పోని అపార్థాలొచ్చే ఛాన్స్ వుంటుంది కదా. అతనూ హర్ట్ అవుతాడు కదా మరీ లోతుగా వెళ్ళాకా కాదని తెలిస్తే. ఐ మీన్. ఇది మీ పర్సనల్ విషయం అనుకో.. ఐ గెస్ అయామ్ ఇన్ట్రూడింగ్ టూ మచ్ ఇన్ టూ ఇట్..సారీ.."

"నో.. నో.. సర్.. నాట్ ఎటాల్.. నందూకి తెలుసు భరద్వాజా.. నాకతని మీద అలాంటి ఒపీనియన్ లేదని. అందుకే నాతో ఓపెన్ గా చెప్పడు. నాకూ ఈ విషయం మాట్లాడేస్తే ఇప్పుడున్న ఈక్వేషన్ పాడైపోతుందని భయం. అందుకే.. అలా దాటేస్తున్నాం.. బట్ ఐ నో.. హీ విల్ గెట్ ఓవర్ ఇట్ వెరీ సూన్.."అంది నెమ్మదిగా.

"హోప్ సో.. అది సరే మరి నీ సంగతేంటి.. ఇంకెవరైనా ఉన్నారా.. ఆనంద్ కంటే స్పెషల్ ప్లేస్ లో.." చిరునవ్వుతో అడిగాడు.

కళ్ళెత్తి ఒకసారి అతని కేసి చూసి మెల్లగా దించుకుంది. ఆ ఒక్క చూపులో సర్వం అర్ధమైన భావన. భరద్వాజ ముఖంలో నవ్వు ఇంకిపోయింది. ఒక్కసారిగా ఒళ్ళంతా భయంతో వణికిన ఫీలింగ్. అంత చల్లటి వాతావరణం లో కూడా ఒక్కసారిగా చెమటలు అలుముకున్నాయతనికి. ఔననలేదు. కాదనలేదు. ఐనా, మీకు తెలియదా అన్నట్టు ఉందా చూపు. అనవసరంగా అడిగాడా. నిజంగా తెలియకే అడిగాడా.. ఛెళ్ళున చరిచినట్లై తటాల్న ముఖం తిప్పుకున్నాడు.

"కాఫీ తాగుదామా..?" మెల్లగా అడిగింది. తలూపాడు. ఏదో అస్పష్టమైన భావన నెమ్మదిగా ఆకృతి దాల్చుకుంటున్న ఫీలింగ్.. తెలిసీ తెలీని ఇబ్బంది. హఠాత్తుగా మాటలు కరవైనట్టు తోచగా నెమ్మదిగా లేచి నడక సాగించారు. దూరంగా చెట్లను కొట్టి పార్క్ కి మరోవైపు నుండి దారి చేస్తున్నారు. ఒక్కో గొడ్డలి వేటు తన గుండెనే తాకుతున్న అనుభూతి. 'తన వయసేంటి,ఆ పిల్ల వయసేంటి? ఏమిటిదంతా...? తప్పుకదూ.. అట్రాక్ట్ అవడం వేరు.. కానీ ఇది అట్రాక్షన్ మాత్రమే కాదు.. తెలుస్తోంది... మరైతే ఇదేంటి... అయితే తానూహించింది నిజమేనా .. ఐతే... మనోజ్ఞ తనని...'

ఒక్కసారిగా ఫట్టుమన్న శబ్దంతో ఓ పెద్ద బెరడు ముక్క విసురుగా వచ్చి మనోజ్ఞ కాలిని తాకింది.

"అమ్.. మా...", ఒక్కసారిగా బాధతో కాలు పట్టుకుని ముందుకు వంగింది.

చప్పున ఆమెని చేరాడు,"మై గాడ్.. ఏంటది.. చూస్కుని కొట్టొద్దా.." కోపంతో గట్టిగా అరిచాడా వర్కర్స్ మీద.

త్వరత్వరగా ఆమెని పక్కనున్న బెంచ్ మీద కూర్చోబెట్టి వాటర్ బాటిల్ ఓపెన్ చేసి "ఏదీ గాయం ..ఎక్కడ తగిలింది.?" కంగారుగా అడిగాడు. నొప్పిని పంటి బిగువున అదిమి పెట్టి మెల్లగా ట్రాక్ పాంట్ పైకి జరిపింది. పాదం నుండి మోకాలి కింద వరకూ పరుచుకుందో నెత్తుటి చార. "ఓ..నో.. ఇట్స్ బ్లీడింగ్..." అంటూ జేబులోంచి కర్చీఫ్ తీసి తడిపి గాయాన్ని అద్దాడు జాగ్రత్తగా. "స్స.."బాధ గా మూలిగింది. "ఫ్రాక్చర్ కాదుగా.." కంగారుగా అడిగాడు.

"ఊహు..నేను బాగానే ఉన్నాను మీరు ముందు లేవండి.. అలా కాళ్ళ ముందు నుంచీ..", మొహమాటంగా అంది. అప్పుడు గమనించాడు. ఆమె పాదాన్ని చేతుల్లో పెట్టుకుని తన మోకాలి మీద ఆనించుకుని సినిమా హీరో లెవెల్లో ఆమె ముందు కింద కూర్చుని ఉన్నాడు. అప్రయత్నంగా అతని పెదాలమీద నవ్వు వెలసింది. లేవకుండానే అడిగాడు,"నిజంగా ఓ.కే. నా..?"

"ఊ.." అంటూ కాలు వెనక్కి తీసుకుంది పాంట్ కిందకి జరుపుతూ, సర్దుకునే ప్రయత్నంలో ఇబ్బందిగా. చప్పున మొఖం పక్కకి తిప్పుకుంటూ పైకిలేచాడు. అది గమనించి ఆమె పెదాలమీద తనదైన రెగ్యూలర్ అల్లరి నవ్వు ప్రవేశించింది. ఒక నిమిషమాగిన తర్వాత ఆమె వైపు తిరిగి, "కాసేపు కూర్చుంటావా.. కాఫీ తీసుకురానా.." ఆప్యాయంగా అడిగాడు.

నవ్వి లేచి నిలబడింది. "ఊహు.. ఏమొద్దు.. వస్తాను..", అంటూ ఒక్క అడుగు వేస్తూనే "అబ్బా..", అంటూ ఆగిపోయింది.

"అరెరే.. కేన్ యూ వాక్.. వెయిట్.. కార్ తెప్పిస్తానుండు.."అంటూ సెల్ తీశాడు.

"అహాహా.. కారొద్దు.. కాకపోతే ఇక ముందుకెళ్ళాలంటే మీ తోడు లేకుండా ఐతే కాదు భరద్వాజా.. "ఆమె ముఖంలో అదిమి పట్టిన చిరునవ్వు మనసులో మాటని చెప్పకనే చెప్తోంది. ఒక్కసారిగా భరద్వాజ గుండె లయ తప్పింది. అతనేమీ అమాయకుడు కాదు, ఆ మాటల్లో లోతూ, అర్థమూ తెలుసుకోలేకపోవడానికి. మరో సమయంలో అయితే మందలించేవాడేమో. ఆమె వున్న స్థితి లో ఏమీ అనలేక, ఏమనాలో తెలీక.. ఒక్క క్షణం తటపటాయించి చేయి సాచాడు. కళ్ళార్పకుండా అతని చేతిని ఒక్కసారి తదేకంగా చూసింది. వెంటనే అపురూపంగా ఆ చేతిని అందుకుని పైకి లేచింది. లేస్తూనే అతనికి దగ్గరగా జరిగింది అల్లరిగా. మొహమాటంగానే ఆమెని పట్టుకుని నడిపించసాగాడు.

మెల్లగా ఆగుతూ, నడుస్తూ కాటేజ్ దగ్గరకి చేరారు. కాటేజ్ మెట్లు చూడగానే అంతదూరం కష్టపడి కాలీడ్చుకుంటూ వచ్చిన మనోజ్ఞ కళ్ళలో నీళ్ళొచ్చినంతపనైంది. "ఓహ్ గాడ్.." అంటూ డీలాగా చివరి మెట్టుమీదే కూర్చుండిపోయింది.

"చెప్పానా. కారులో వద్దాం అంటే విన్నావు కాదు. అంత దూరం నడిచొచ్చావు. ఇప్పుడు చూడు ఆ ఎనర్జీ మిగుల్చుకునుంటే ఇక్కడ మెట్లెక్కగలిగేదానివి కదా.."మందలింపుగా అన్నాడు.

"ఆహా.. కారు లో వస్తే ఇంత మంచి గోల్డెన్ ఛాన్స్ మిస్సయిపోయేదాన్ని కదా.." అల్లరిగా అంది. సీరియస్ గా చూశాడు. చప్పున సర్దుకుని, "అదే.. ఒక స్టేట్ మినిస్టర్ తో సేవలు చేయించుకునే భాగ్యం ఎంతమందికి దొరుకుతుంది చెప్పండీ..", కొంటెగా నవ్వింది.

"మాటలు దాటెయ్యడం బానే వచ్చు. ముందు మెట్లెలా దాటాలో చూడు.. " తనూ తగ్గకుండా చెప్పాడు. తలూపి లేవబోయింది. వల్లకాలేదు. "ఎంతా ఒక్క ఫైవ్ మినిట్స్ కూర్చుంటే అదే సెట్ అయిపోతుంది. ఏం టెన్షన్ పడకండి. హ్యాపీ గా ఎక్కేస్తాను."తేలిగ్గా చెప్పేసింది.

చుట్టూ చూశాడోసారి. చలికి ఎవ్వరూ ఇంకా కాటేజీలలోంచి బయటకి రాలేదు. చప్పున వంగి ఆమెని రెండు చేతులమీదా పైకి లేపాడు. ఊహించని ఆ పరిణామానికి, అతనేం చేస్తున్నాడో అర్థంకాక కెవ్వున అరిచిందామె, "ఓ మై.. గాడ్.."అంటూ. ఆమె అరుపు పూర్తయ్యేలోపు నాలుగు అడుగుల్లో మెట్లెక్కి ఆమెని డోర్ ముందు దింపేశాడు. మనోజ్ఞ

ఇంకా షాక్ నించి తేరుకోలేదు. అంతలో లోపల్నుంచీ రేఖ పరుగున వచ్చింది. "ఏమైంది మనూ అరిచావా..?"కంగారుగా అడిగింది. అవునన్నట్టో, కాదన్నట్టో తెలీకుండా అడ్డదిడ్డంగా తలూపింది. "మనూ.. ఏమైందే..?", అయోమయంగా అడిగింది రేఖ.

తాను కలిగించుకోక తప్పదని గ్రహించి చెప్పాడు భరద్వాజ, "ఏం లేదూ, చిన్న దెబ్బ తగిలించుకుంది". అప్పటికి తేరుకున్న మనోజ్ఞ బుగ్గల్లో ఎరుపుదనం చోటుచేసుకుంది. సిగ్గుని కవర్ చేసుకోవడానికి ట్రై చేస్తూ కళ్ళు తిప్పుకుంది.

అదేం పట్టని రేఖ "మీరా సర్... అవునా.. దెబ్బా.. ఓ.. మై గాడ్.. ఏమైంది..?"మరింత కంగారు పడుతూ అడిగింది.

ఒక్కసారిగా ఫకాల్న నవ్వేశాడు భరద్వాజ. "ఈ ఓ మై గాడ్ అన్నది మీ అందరికీ కామన్ ఊత పదమా.. ఎనీవేస్.. చిన్నదే కంగారుపడకండి."

మనోజ్ఞ ముఖం దించుకుంది. సంతోషంతో తేలిపోతున్నట్టుందామెకి అతను సాయంలాగే చేసినా ఏదో తీయని అనుభూతి మనసంతా పరుచుకున్న భావన.

"రండి సర్. లోపలికి రండి.. బయటేనించోబెట్టాము సారీ.. "మొహమాటపడుతూ ఆహ్వానించింది రేఖ. నవ్వి మనోజ్ఞ వంక చూశాడు. "రండి.. ప్లీజ్.."కళ్ళు బలవంతంగా పైకెత్తి చూసి పిలిచింది. తలూపి లోపలికి నడిచాడు వారి వెంట.

"బాగుంది మీ కాటేజ్.." సోఫాలో కూర్చుంటూ చెప్పాడు.

"థాంక్యూ సర్...కాఫీ..టీ..ఏం తీసుకుంటారు.." అడిగింది రేఖ సగౌరవంగా.

"ఏం వద్దమ్మా..వెళ్తాను..ఇంతకీ ఆనంద్ వాళ్ళేరి..మీకు తోడుంటామన్నారుగా నిన్న?"అడిగాడు.

"అంటే అమ్మాయిల కాటేజ్ కదా. రాత్రిపూట బాగోదని కాసేపు కూర్చుని వెళ్ళిపోయారు."చెప్పింది మనోజ్ఞ.

"ఐ.సీ. అదిసరే. నువ్వా కాలికి ఏదన్నా చెయ్యి స్ప్రే, ఆయింట్మెంట్ ఏదన్నా..?", ఆదుర్దాగా అన్నాడు.

"నో ప్రాబ్లెమ్ భరద్వాజా. ఇప్పుడు బానే వుంది." నవ్వుతూ చెప్పింది. వింతగా చూసింది రేఖ ఆ పిలుపుకి.

"ఇంతకీ సెమినార్ వీడియో అన్నావ్.. వచ్చిందా..?" అడిగాడు.

"ఆ తెప్పించాను... ఇప్పుడే తెస్తానుండండి.."అంటూ చప్పున లేచింది.

"ఏయ్..కాలు.." ఒకేసారి చెప్పారు భరద్వాజ, రేఖలు కంగారుగా.

"అయామ్ ఓ.కే."నవ్వేసి చెప్తూ కాలీడ్చుకుంటూ నెమ్మదిగా లోపలికి వెళ్ళింది.

"థాంక్యూ సర్.. థాంక్యూ వెరీ మచ్.."చెప్పింది రేఖ, మనోజ్ఞ లోపలికి వెళ్ళాగానే.

మొహమాటంగా చూశాడు. "అదేం మాట రేఖా.. మీరైతే ఆమాత్రం సాయం చేయరా. అయినా ఆ అమ్మాయి నాకు చేసిన సహాయంతో పోల్చుకుంటే ఇదెంత.."

"లేదు సర్. ఈ దెబ్బ గురించి కాదు నేననేది. నిన్న, ఇవాళ పొద్దున్న మనూని చూసిన వాళ్ళెవరూ అనుకోరు తను మళ్ళీ ఇంత త్వరగా మామూలౌతుందని. పేషంట్ లా తయారయింది. చాలా భయం వేసింది తనని చూస్తే. రాత్రి మీరు బలవంతంగా తాగించిన టీయే. తర్వాతంతా ఏడుస్తూనే ఉంది. పచ్చి మంచినీళ్ళు ముట్టలేదు. కోలుకోడానికెన్నాళ్ళు పడుతుందో అని భయం వేసింది. మీరు మళ్ళీ తనని మామూలుగా నవ్వేలా చేశారు. మీరు చెప్పిన ధైర్యానికి చాలా చాలా థాంక్స్.." అంది కృతజ్ఞతగా చూస్తూ.

ఇబ్బందిగా కదిలాడు. 'పొగడ్తలు కొత్త కాదు గానీ, కనిపించకుండా తమ మధ్య నడుస్తున్న ఆ ఫీలింగ్ తెలిస్తే వీళ్ళంతా ఇలా గౌరవిస్తారా. తాను ధైర్యం చెప్పడం కాదూ, ఏమాటంటే మనూ తన దుఃఖాన్ని పక్కన పెట్టిందో తెలిస్తే...గాడ్..' తల విదిల్చాడు.

"ఇదిగోండి సెమినార్ వీడియో.." పెన్ డ్రైవ్ అందించింది అప్పుడే వచ్చిన మనోజ్ఞ.

"ఓహ్.. ఓ.కే. థాంక్స్ .. చూసి చెప్తానైతే. వెళ్తాను మరి." అది అందుకుంటూ లేచాడు.

"అప్పుడేనా...?" చప్పున అనేసింది. భరద్వాజ కంగారుగా, రేఖ వింతగా చూశారు.

"ఐ మీన్.. కనీసం టీ.. బిస్కట్స్.. ఐనా తీసుకోరా..? మొదటిసారి వచ్చారు కదా.."తడబడింది.

"అయ్యో. మాటల్లో మర్చేపోయాను. ఒక్క పది నిమిషాలు కూర్చోండి సర్. ప్లీజ్.. "అంటూ భరద్వాజ వారిస్తున్నా వినకుండా హడావిడిగా లోపలికి నడిచింది రేఖ.

ఇబ్బందిగా ముళ్ళ మీదున్నట్టు కూర్చున్నాడు.

"సారీ.." మెల్లగా అంది. తలతిప్పి చూశాడు. అప్పుడే విరిసిన గులాబీలా, స్వచ్ఛంగా, లేతగా, సున్నితంగా.. వుందామె ముఖం.. కానీ.. ఛ.. జే.కే. నీ ఆలోచనలని దారి తప్పనీయకు, చిన్నపిల్ల ఆమె. ఈ తీవ్రమైన ఆకర్షణ నుంచి తనే తప్పించుకోలేకపోతే పాపం ఆమెంత. కానీ ఆపాలి. తాను కూడా కొంతవరకూ బాధ్యుడే ఆమెలో అలాంటి ఆలోచనలు రావడానికి. ఐనా ఇకనైనా ఈ ప్రవాహాన్ని ఇక్కడతో ఆపేయాలి. ఎస్..చెప్పాలి. ఆమెకి తమ మధ్య వయసు లో ఉన్న అంతరాన్ని గుర్తుచేయాలి. ఎలా..ఎలా..'

అంతలో టీ తీస్కుని రేఖ రావడంతో అతని ఆలోచనలకి బ్రేక్ పడింది. కాసేపటి మామూలు సంభాషణ తర్వాత వెళ్తానంటూ లేచాడు.

అతన్ని సాగనంపడానికి లేచారిద్దరూ.

"జాగ్రత్త మరి. రేపు రెస్ట్ తీసుకో. వాక్ కి వద్దు." చెప్పాడు.

"ఊహు.. తగ్గిపోతుంది. వస్తాను. చిన్నదెబ్బేగా.." ,

"మనోజ్ఞా.. నా మాట విను. చిన్నదిగా వున్నప్పుడే కేర్ తీసుకుంటే తొందరగా తగ్గిపోతుంది.." మృదువుగా అన్నాడు.

"అదేంలేదు, నే బానే ఉన్నా..." పంతంగా చెప్పింది.

"అలా అంటావేంటి జే.కే. సర్ అంతగా చెప్తుంటే..."మందలింపుగా అంది రేఖ.

"పర్లేదు.. ఆయనకి ఫ్రాక్చరయినప్పుడు వాడిన స్టిక్ అప్పుడుగుతాలే.."నవ్వుతూ చెప్పింది.

చిన్నగా తలకొట్టుకుంది రేఖ, "ఇంత వాకింగ్ పిచ్చెలా పట్టుకుందే నీకూ.." అనేసి భరద్వాజని చూసి నాలిక్కరుచుకుంది.

తేలిగ్గా నవ్వేశాడు. "దాన్నే సహవాస దోషం అంటారు తెలుగులో . మీ కాన్వెంట్ పిల్లలకి తెల్సో, లేదో.. "

"అబ్బా..అక్కడికి మీరేదో పెద్ద తెలుగు విద్వాన్ అయినట్టు..." అల్లరిగా అంది మనోజ్ఞ.

"అఫ్కోర్స్ అయామ్... చాలా కష్టపడి బోలెడు భాష నేర్చుకున్నాను తల్లీ. మీలాంటి వాళ్ళకి స్పీచ్ లివ్వడానికి.." బదులిచ్చాడతను. ఇద్దరూ నవ్వేశారా మాటకి.

బయటికి వెళ్ళబోతుండగా పిలిచింది మనోజ్ఞ, "భరద్వాజా.. వన్ మినిట్.." అప్రయత్నంగా ఆగాడు. కాస్త వింతగా చూసింది రేఖ, అంతలో మనోజ్ఞ అతనితో ఏదో మాట్లాడాలనుకుంటుందని గ్రహించి సందిగ్ధంగానే లోపలికి తప్పుకుంది ఏదో పనున్నట్టుగా.

అతనితో పాటు బయటకి నడిచింది మనోజ్ఞ.

"యామ్ సారీ... నువ్వు ఎక్కలేవనిపించి చనువు తీసుకుని అలా దాటించాను. వేరేలా అనుకోకు.." గిల్టీగా చెప్పాడు.

"తెలుసు. థాంక్యూ.. ఐనా.. యూ నీడ్ నాట్ బీ సారీ ఫర్ దట్.. " మెల్లగా అంది.

"ఇక చాలు ఆగిపో. మెట్లు చూశావా.." బెదిరింపుగా అన్నాడు.

"నాకేం భయం మీరుండగా.." ధీమాగా చెప్పింది.

ఆగి ఆమెకేసి చూశాడు, "నేనేమన్నా సూపర్ మేన్ ని అనుకుంటున్నావా.. లేక యంగ్ అండ్ డైనమిక్ హీరోని అనుకుంటున్నావా నిన్ను ఎత్తుకుని పైకీ, కిందకీ తిరగడానికి.. నీకసలు.... తెలుసా..." ఆగి అన్నాడు "అసలు డూ యూ నో వాట్ మై ఏజ్ ఈజ్.. 46.. నలభై ఆరేళ్ళు నాకు.." సూటిగా చూస్తూ చెప్పాడు.

మనోజ్ఞ ఏం మాట్లాడలేదు. తన మాటలు తనకే చిరాకేశాయి. ఒక చక్కటి భావాన్ని బలవంతంగా కరెప్ట్ చేస్తున్నట్టు ఏదో బాధ. కానీ తప్పదు. మనసుని నొక్కిపట్టినట్టున్న అనీజీనెస్ తో వెళ్ళబోయాడు.

"నాకు 24 భరద్వాజా...." హఠాత్తుగా అంది. ఉల్కిపడి, గిరుక్కున వెనుదిరిగాడు. అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ చెప్పింది, "నా వయసు ఇరవైనాలుగు. మీకు సరిగ్గా తెలీదేమో.. నిన్న మాటల్లో అన్నారు కదా నిండా ఇరవై ఏళ్ళైనా లేవు అని. అందుకే చెపుతున్నాను. మీకూ-నాకూ 22 ఏళ్ళు తేడా.. నాకు తెలుసు.. మీకంటే ముందే..." స్థిరంగా వుందామె గొంతు.

భరద్వాజ ముఖం పాలిపోయింది. ఆమె భావం అర్థమైంది. ఇక మాటలూ, సమర్థింపులూ ఏమీ లేవు.

"వస్తాను.."చెప్పాడు హీనస్వరంతో. తలూపింది. మెల్లగా మెట్లుదిగాడు భారమైన మనసుతో. 'ఈ పర్యవసానం నిజంగానే తాను ఊహించనిదా!! '

"ఎలా ఉంది.. ?" అడిగాడు.

"ఊ.. బెటర్.." నవ్వింది.

"ఎందుకొచ్చావసలు..?"మందలింపుగా అన్నాడు.

"మీరు రీజన్ లేకపోయినా, ఫ్రాక్చర్ కాలు పెట్టుకుని మరీ తిరిగారు కదా! మరి నాకు రీజన్ వున్నా మళ్ళీ, మళ్ళీ ఎందుకలా అడుగుతారూ..?" అతన్నే చూస్తూ అంది.

క్రాఫ్ లోకి వేళ్లు పోనిచ్చుకుంటూ విసుగ్గా చూశాడు., "ఏమిటో ఆ రీజన్...?"

"మీరే.." ఠక్కున చెప్పింది.

ఒక్కసారిగా ఏదో సుడిగాలి చుట్టుముట్టినట్టు ఉక్కిరిబిక్కిరయ్యాడు. "మనోజ్ఞా..!!"

"అవును. భరద్వాజా.. ఈ సమయం మళ్ళీ వస్తుందా..? మనం మళ్ళీ కలిసినా సిటీ లో ఇంత మంచి వాతావరణం, ఈ తీరిక, ఏకాంతం, ఈ ప్రశాంతత, ఇవన్నీ మళ్ళీ వస్తాయా చెప్పండి? మీరు కూడా.., మీరూ నాకోసం ఎదురు చూశారు. చూశారా లేదా, నిజం చెప్పండి..?" సూటిగా ప్రశ్నించింది.

అప్రయత్నంగా తలూపాడు. "మరి ఎందుకు భరద్వాజా.. ఈ క్షణాలని ఎందుకు వేస్ట్ చేసుకోవాలి? అందుకే వచ్చాను. వస్తాను. మీరొద్దన్నాసరే.. మీ కోసం.. ఇది నిజం.." ఉద్వేగంగా అంది.

మౌనంగా ఉండిపోయాడు భరద్వాజ. ఆ ఒక్కో మాటా బాణమై గుండెని నిలువునా చీలుస్తున్న భావన. ఆమె ఉద్దేశ్యం పూర్తిగా అర్థమయ్యింది. తన మనసూ తెలుస్తోంది. తెలియనిదొక్కటే. గమ్యం ఏమిటి..? ఇదంతా ఎక్కడకి దారి తీస్తోంది.. లేదు.. ఆపాలి.. తప్పుకోవాలి. కానీ.., ఆమెని నొప్పించకుండా తప్పుకోగలడా? అసలు తప్పుకోవాలని తనకి ఉందా? వద్దు. ఈ వయసులో లేని పోని ఆశలొద్దు. మన స్పియర్స్ వేరు మనోజ్ఞా... అని ఎలా నచ్చజెప్పను.. నిన్నెలా బాధ

పెట్టను. దిగులుగా అనుకున్నాడు. చిరుగాలిలా మొదలై సుడిగాలిలా తనని చుట్టేస్తున్న ఆమెని కాదని తప్పుకుని తిరగడానికి సరిపడ మానసిక స్థైర్యం తనలో ఉందా?

"కాఫీ చల్లారిపోతోంది భరద్వాజా.." ఆమె తియ్యని పిలుపుకి తేరుకున్నాడు. ఎప్పుడు కాఫీషాప్ కి చేరినదీ, ఎప్పుడు కూర్చున్నదీ కూడా తెలీనంతగా ఆలోచనల్లో మునిగిపోయాడా!

యాంత్రికంగా కప్ అందుకుంటూ,"ఇంతకీ నా కర్చీఫ్ ఏదీ.." ఏదో ఒకటి మాట్లాడాలని అడిగాడు.

గాయం తుడిచిన కర్చీఫ్ కదా వాష్ చేసిస్తానని ఆమె ముందురోజు తీస్కోవడం గుర్తొచ్చి.

"**అది విడిగా రాదు సర్**.. కావాలంటే నాతోపాటే.. ఎవ్రీథింగ్ కమ్స్ ఇన్ ఎ ప్యాకేజ్ యూ నో..." అల్లరిగా చెప్పింది. చిరుకోపం చూపిస్తూ మందలించబోతే టాపిక్ ఛేంజ్ చేసేసింది.

తాను గుర్తించానని తెలిడంతో ఆమె అల్లరి ఎక్కువైపోయింది. ఇలాంటివే అల్లరి మాటలూ, కొంటె చేష్టలు. తాను మందలించబోతే టాపిక్ మార్చేసి తప్పించుకుంటుంది. మగవాడు రిజర్వ్డ్ గా ఉంటే స్త్రీ అతని రోల్ తీసుకుంటుందని ఎక్కడో చదివాడు. అంటే ఏమిటో అప్పుడు సరిగ్గా తెలియలేదు. ఇప్పుడామె చొరవ చూస్తే ఆ మాటకి అర్థం తెలియడం ప్రారంభించింది.

ఇంత దూకుడైన ఆమె ప్రేమ వరద తాకిడికి తన బింకం ఏ క్షణం లో సడలిపోతుందో తెలియట్లేదు. ఆలోచిస్తున్నాడు. ఇంకామె ని దూరం పెట్టడమే మంచిదేమో.. వారించే నిగ్రహం తనకి లేనప్పుడు అవాయిడ్ చేస్తేనే మనోజ్ఞకి మంచిదేమో..!! కానీ.. కానీ.. ఆమెని హర్ట్ చేయగలడా.. తను చేయగలడా... ఊహూ.. ఇంపాజిబుల్...

"కారా.. ఎందుకు నడిచే వెళ్ళేవాళ్ళం కదా..!" దిగాలు గా చూస్తూ అంది. కార్లో అయితే త్వరగా చేరిపోతామనే బాధ ఆమె ముఖంలో స్పష్టమైంది. అది గమనించి చిన్నగా నవ్వాడు భరద్వాజ.

"కార్లో వెళ్ళేది మీ కాటేజ్ కి కాదులే.. "

"మరెక్కడికి?"ఉత్సాహం వెల్లివిరిసిందామెలో.

"పద చెప్తాను."

కొద్దినిమిషాల తర్వాత ''పర్ణశాల'' ముందాగింది కారు. ఆమె ముఖం విప్పారింది.

"ఆక్ట్యువల్ గా నన్ను సేవ్ చేసినరోజే ఇన్వైట్ చేద్దామనుకున్నా. ఆ రోజే రావల్సింది. కానీ ఆ రోజు నీ ఆక్వర్డనెస్ చూసి ఇన్సిస్ట్ చేయలేకపోయాను. మళ్ళీ సందర్భం కుదరలేదు. సరే ఊరికే కాఫీ షాప్ ఎందుకూ, నా ఆతిథ్యంకూడా కాస్త

రుచిచూద్దువని తీసుకొచ్చాను. వాట్ యూ సే.. ఇదే నా ఫేవరిట్ ప్లేస్.. నేమ్డ్ ''పర్ణశాల'', నా కుటీరం, ఎలా ఉంది?" కారు డోర్ తీశాడామెకి.

కళ్ళు విప్పార్చుకుని చూసింది. "ఎక్స్టీరియర్ అయితే జస్ట్ సుపర్బ్.. అల్టిమేట్..." మెచ్చుకోలుగా చెప్పింది.

నవ్వాడు. "మొత్తం చూసిన తర్వాత చెబ్దువుగానీ.. పద.."అంటూ లోపలికి దారితీసాడు.

దగ్గరుండి పర్ణశాల మొత్తం తిప్పి చూపించాడు. ఇది ఆఫీస్ రూమ్, ఇది విజిటర్స్ వస్తే కూర్చునేందుకు, ఇది గెస్ట్ రూమ్, ఇది కిచెన్, ఇది అమ్మానాన్నలొస్తే వాళ్ళ కోసం రెడీ చేసిన రూమ్, పూజ గది," అంటూ అన్నీ.. చివరకి కళాత్మకంగా మెరుస్తున్న ఓ డోర్ ముందాగాడు..

"ఇది నా గది.. నా పర్సనల్ ఛాంబర్.. ప్లీజ్ వెల్కమ్.. "అంటూ తలుపుతీశాడు. లోపలికి అడుగుపెడుతూనే సంభ్రమంగా చూసింది. శాండల్ వుడ్ పరిమళం చుట్టుముట్టిందామెని. "వావ్.." అప్రయత్నంగా వెలువడిందామె గొంతులోంచి ఆ ఛాంబర్ ని పరికిస్తూనే.

"స్ప్లెండిడ్ భరద్వాజా.. ఇంత ఆర్టిస్టిక్ గా అస్సలూహించలేదు. రిచ్ నెస్ వేరు. ఆర్టిస్టిక్ థాట్ వేరు.. నిజంగా తీర్చిదిద్దినట్టు,అద్భుతానికి మరో పేరులా ఉంది..."మనస్ఫూర్తిగా చెప్పింది.

పట్టరాని సంతోషంతో ఉప్పొంగిపోయాడు. తన ఛాంబర్ చూసిన వారెవరైనా పొగడకుండా ఉండలేరు. కానీ కొన్నిసార్లు ఎన్నో పొగడ్తలు, అవార్డులు, రివార్డులు ఇవ్వని తృప్తిని ఓ చిన్ని అభినందన, నచ్చిన వ్యక్తి కళ్ళలో కనిపించే మెప్పు ఇస్తాయి. సరిగ్గా అలాంటి తృప్తే కలిగిందతనికి. అదే చెప్పాడామెకి దాచకుండా.

నవ్వుతూ అడిగింది, "ఇంతకీ ఈ ఆర్టిస్టిక్ ఛాంబర్ డెకరేషన్ లో రిఫ్లెక్ట్ అయ్యేది మీ ఆర్టిస్టిక్ వ్యూ నా లేక మీ ఆర్కిటెక్ట్ దా..??"

నవ్వేశాడు, "ఇద్దరిదీను. ఎక్కడో చూశానిలాంటివి, వేర్వేరు చోట్ల, నెట్ లోంచి కొన్ని శాంపిల్స్, నా సెల్ లో కొన్ని ప్లేసెస్ లో తీసుకున్న ఫోటోలు, మరికొన్ని నా ఊహలు కలిపి ఆమె క్రియేట్ చేసింది. చాలా కష్టపడ్డాం, ఫైనల్ గెటప్ తెచ్చేటప్పుడు." చెప్పాడు.

"ఓ.. అంటే.. మీ ఇంటీరియర్ డెకరేటర్ లేడీనా.. ?"

అల్మరా లోంచి ఆల్బమ్ తీస్తున్నవాడల్లా ఆశ్చర్యంగా చూశాడు. ఆమె మనసర్థమైంది. ఆ డెకరేటర్ ఎవరో చెప్పబోయి ఆగాడు. చిన్న చిలిపి ఊహ మెదిలింది.

"హా.. లేడీనే.. చాలా క్రియేటివ్ తను తెలుసా. నిమిషంలో పది ఐడియాస్ చెప్పేది. అసలు డిస్కషన్స్ లో టైమే తెలిసేది కాదు మాకు.. గంటలు గంటలు కూర్చున్నా కూడా.." ఓరగా చూస్తూ చెప్పాడు.

"ఓహో.." అసహనంగా కదిలింది. "ఇక.. నేను వెళ్తాను".

"అప్పుడేనా.. అంతలా పొగిడావ్.. అంత మంచి డెకరేటర్ ఫొటో చూడవా మరి..?"నవ్వాపుకుంటూ అడిగాడు.

"ఓ..డెకరేటర్ ఫొటో కూడా దాచుకున్నారా... మరింకేం ఆవిడని కూడా ఈ ఛాంబర్లోనే ఎక్కడో అలంకరించకపోయారా.." రోషంగా అనేసింది.

కోపం తెచ్చుకోకుండా నవ్వుతూ, "అనుకున్నా, కానీ పాపం వీడొప్పుకోలేదు.." ఆల్బమ్ తెరిచి ఒక ఫొటో చూపుతూ అన్నాడు. చప్పున చూసింది, నవ్వుతోన్న ఒక జంట మధ్య లో ఒక చిన్నపాప.

"నా బెస్ట్ ఫ్రెండ్ జతిన్.. భార్య నిరుపమ.. నా ఇంటీరియర్ డెకోరేటర్ ..."

"ఓహ్.. మీరూ.. మరలా చెప్తారేం.." దొరికిపోయిన దొంగ లా ఫీలవుతూ అంది ఉక్రోషం గా.

"నువ్విలా రియాక్టవుతావని నాకేం తెలుసూ. వెళ్తావా.. మరైతే మిగతా వాళ్ళని పరిచయం చెయ్యొద్దా? "

"ఏమొద్దు.. అసలూ.. మీతో మాట్లాడను పొండి.." బుంగమూతి పెట్టుకుని కూర్చుంది.

"ఏదో సరదాగా అన్నాను. అంతలోనే అలకా.. నాకీ అలకలు తీర్చడాలూ అవీ రావమ్మా తల్లీ.. యామ్ నాట్ మేడ్ దట్ వే.. సరే.. పోనీ నువ్వే చెప్పు ఏం చెయ్యాలో నీ కోపం పోవాలంటే.." బతిమాలుతూ అడిగాడు.

అతనికి కొత్తగా వుంది. ఎప్పుడూ ఇలా అలకలూ, అల్లర్లూ, బతిమాలడాలూ.. అలాంటి వాటికి దూరంగా వేరే ప్రపంచంలో బతికాడిన్నాళ్ళూ. కానీ మొదటిసారి ఒక ఆడపిల్ల ముందు తనని తాను మర్చిపోతున్నాడు.

"ఊహు... అస్సలు మాట్లాడను...." అతను బతిమాలడం చూసి ఇంకా బెట్టు చేసినట్టు యాక్ట్ చేస్తూ పెదాలు బిగించింది.

"మనోజ్ఞా.. ప్లీజ్... మాట్లాడవూ..." తటపటాయిస్తూనే మునివేళ్ళతో ఆమె గడ్డం తగిలీ తగలకుండా పట్టుకుని బతిమాలాడు.

సిగ్గుగా నవ్వేసింది. "సరే, చాల్లెండి.. నేనూ తమాషా కే చేశాను. మీరంత బతిమాలాలనుకున్నారు. అది చాలు. మిగతా ఆల్బమ్ చూద్దాం.."

"గుడ్.. ఇదిగో , ఇది నేను, చిన్నప్పుడు.. అంటే నీ వయసున్నప్పుడు.." అంటూ నవ్వాడు అర్థవంతంగా. కోపంగా చూడబోయి తమాయించుకుంది.

'చాలా హాండ్సమ్ గా ఉన్నారూ.. అప్పటికీ, ఇప్పటికీ ఏ మార్పూ లేదు, కాస్త లావయ్యారంతే..' ఓరగా చూస్తూ ఫొటోని స్పృశించింది. మొహమాటంగా చూశాడు. ఆమె ఫొటోని కాదు తననే తాకినట్టనిపించింది. చప్పున షీట్ తిప్పేశాడు.

"వీళ్ళు.. మా అమ్మా-నాన్నా.. "

"చాలా బాగున్నారు.. మేడ్ ఫర్ ఈచ్ అదర్ లా..ఇంతకు ముందు ఏదో ఫంక్షన్లో చూశాను.. ఎక్కడా.. ఎస్.. సుబ్బారాయుడుగారింట్లో అనుకుంటా.. యా.. అక్కడే.. అప్పుడందరూ చెప్పుకున్నారు.. జే.కే.గారి పేరెంట్స్ అని.... మీరు మీ నాన్నలా వుంటారా?" ఫొటో పరిశీలనగా చూస్తూ అడిగింది.

"ఊహు.. మా తాతయ్యలా.. ఐ మీన్ మదర్స్ ఫాదర్.. గ్రేట్ మ్యేన్.. ఒక లెజండ్ ఆయన.." ఎక్కడో ఆలోచిస్తూ చెప్పాడు.

"వీళ్ళెవరూ..?" తరువాతి పేజ్ తిప్పుతూ అడిగింది.

"ఇతను.. కేశవ.. నా కజిన్. మా పెద తాతయ్యగారి మనవడు., పెద్దమ్మ వరసవుతుంది వాళ్ళ మదర్ నాకు. అమ్మా, నాన్నలిద్దరూ వాళ్ళ వాళ్ళిళ్ళల్లో ఒక్కరే కదా.. సో కజిన్స్ కూడా లేరు నాకు. కాస్త క్లోజ్ అంటే వీడొక్కడే. మిగతావాళ్ళంతా హాయ్, హలో.. అంతే. వీడు మాత్రం నేనంటే ప్రాణం పెడతాడు. బై నేచర్ చాలా మంచివాడు.. చూడ్డానికలా మామూలుగా కనిపిస్తాడు గానీ, కోటీశ్వరుడు.. చాలా పెద్ద ఆస్తి, పెద్ద కుటుంబం.. తను మా వదిన.. గుజరాతీ..."

"ఔనా.. అచ్చం తెలుగావిడలాగేవున్నారు..", ఆశ్చర్యంగా అంది.

"అదే కదా.. వాళ్ళ స్టోరీ కూడా వెరైటీ గా ఉంటుంది. మావాడికి వూళ్ళు తిరగడం పిచ్చి.. అలా తిరుగుతూ, గుజరాత్ లో ఏదో టూరిస్ట్ ప్లేస్ లో ఆవిణ్ణి కలిశాడు. అసలు సీనేంటంటే, సారుకి చదువెప్పుడూ వంట పట్టలేదు బిజినెస్ తప్ప. ఇంగ్లీష్, హిందీ రెండూ రావు. ఆవిడకా తెలుగసలే రాదు. ఎలా ప్రేమలో పడ్డారో, ఏం మాట్లాడుకున్నారో ఆ భగవంతుడికే తెలియాలి.. మొత్తానికి పెళ్ళైతే చేసేస్కున్నారు.తర్వాత చూడాలి. అప్పడికి కుర్రాళ్ళం మేమంతా. బాగా వెక్కిరించే వాళ్ళం ప్రేమకి కులమతాల్లేవు సరే, భాషే లేకపోతే ఎలారా బాబూ..అని.."

నవ్వింది మనోజ్ఞ, "ఔను కదా.. మరి పెళ్ళయ్యాకన్నా మాట్లాడుకోవాలిగా.. అప్పుడన్నా హిందీ నేర్చుకున్నారా..?"

"ఆహా... ఆ ముచ్చటా అయ్యింది. ట్యూషన్ టీచర్ ని పెట్టుకుని మరీ చాలా కష్టపడి ట్రై చేశాడు గానీ నాలుగు ముక్కలు కూడా రాలేదు. అంతలో మా వదిన శుభ్రంగా తెలుగు నేర్చేసుకుంది. ప్రాబ్లెమ్ సాల్వ్డ్. ఇప్పుడు తనెంత స్వచ్ఛంగా మాట్లాడుతుందంటే మనకే సిగ్గేస్తుంది మనం మాట్లాడేదసలు తెలుగేనా అని.."

"గ్రేట్.."

"ఇక వీళ్ళంతా నా బ్యాచ్. మీ గ్యాంగ్ లాగే మేం కూడా స్కూల్ టూ కాలేజ్ ఫ్రెండ్స్. పాణి తెలుసుగా. ఇక వీడు జతిన్, ఇందాక చూపించాను చూడు వీడి ఫ్యామిలీయే. ఇతను మురళి, యూ.ఎస్ లో సెటిలయ్యాడు. ఈమె స్నిగ్ధ.. మా బ్యాచ్ మొత్తానికి ఒకే ఒక గర్ల్ ఫ్రెండ్. దయాకర్రావు గారనీ.. తెలుసా.. ఎక్స్ సీ.ఎమ్... వాళ్ళమ్మాయి.."

"ఓ..యా.. ఆయన పోయినప్పుడు మాకు హాలీడే వచ్చింది కూడా" టక్కున అనేసి నాలిక్కరుచుకుంది, "...స్స్.. సారీ.. " .

ఫకాల్న నవ్వేశాడు. "ఫర్లేదులే.. సో ఈ అమ్మాయిని, ఐ మీన్ ఇప్పుడు అమ్మాయి కాదనుకో.. పైగా చిన్న సైజ్ సూమో ఫైటర్ లా తయారైంది. మేమంతా ఏడిపిస్తాం ఇంక స్నిగ్ధ అన్న పేరు సూటవట్లేదూ మార్చేసుకోమని. ఏం చెప్తున్నానూ.. ఎస్.. ఈమెని పెళ్ళి చేసుకోమని అప్పట్లో ఫుల్ ప్రెజర్ రెండు వైపులా ఇళ్ళనుంచీ.. ఫుల్ ఫోర్స్.. పాపం... స్నిగ్ధ కూడా చాలా ఆశ పడింది.."

చప్పున తలెత్తి చూసింది మనోజ్ఞ. అదేం పట్టనట్టు చెప్పుకుపోతున్నాడతను.

"...మన పాణే ఆవిడగారి రాయబారి. అందరూ బుర్ర తినేసే వాళ్ళు. నేనే ఎందుకో కన్విన్స్ కాలేక వద్దనేశాను. అందరికీ చాలా కోపాలొచ్చాయి. స్నిగ్ధైతే కొన్నేళ్ళ పాటు నాతో మాట్లాడలేదు. తర్వాత ఓ ఎన్నారై డాక్టర్ని చేస్కుంది. ఇద్దరు పిల్లలు. ఇప్పుడు ఓ.కే.అనుకో, వాళ్ళాయన కూడా మంచి ఫ్రెండయ్యాడు., యూ.ఎస్ వెళ్తే వాళ్ళింటికి తప్పక వెళ్తాను. 'నాకు చాలా అన్యాయం చేశారు జే.కే. మా స్నిగ్ధను చేసుకోక..', అంటూ వుంటాడు. వెరీ జోవియల్ పర్సన్. ఏంటీ... సుత్తి కొడుతున్నానా..?"

"ఊహు.. చాలా బాగుంది.. పేపర్లోనో, టీ.వీ.లోనో కాకుండా మీ లైఫ్ గురించి, మీనుంచే తెలుసుకోవడం.. చెప్పండి.. ఇంతకీ ఎక్కడ చదివారు మీరు?"

"డిగ్రీ వరకూ అందరం నిజాం కాలేజ్. తర్వాత నెహ్రూగారు చదివిన యూనివర్సిటీ.. ట్రినిటీ కాలెజ్, కేమ్ బ్రిడ్జ్, లండన్ లో...."

"అవునా.. గ్రేట్.."

"ఇంట్లోవాళ్ళని పీక్కుతిన్నాను అక్కడే చదువుతానని.. ఒక్కడ్నేకదా అంత దూరం పంపించాలంటే చాలా బాధ పడ్డారు. మనం వింటేగా.. నాన్నకి బెదిరింపూ.. అక్కడ చదివిస్తేనే పాలిటిక్స్.. లేదంటే..." నవ్వాడు.

"లేదంటే.. " కుతూహలంగా అడిగింది.

"పాండిచ్చేరీ వెళ్ళి సన్యాసం తీసేస్కుంటాననీ.." గట్టిగా నవ్వేశాడు, "...పాపం నాన్న భయపడి ఒప్పేసుకున్నారు. మొండి వాణ్ణి కదా ఎక్కడ కాషాయం కట్టేస్తానో అని..."

"అబ్బో.. కనిపించరు గానీ మీరూ ఏమీ తక్కువకాదూ. నన్నంటారు గానీ నాకంటే ఎక్కువే అల్లరీ.."

"అదంతా అప్పటి మాట మనూ.. ఐ మీన్.. మనోజ్ఞా.. నిన్నా, మొన్నా మీ వాళ్ళతో అలవాటైనట్టుంది.."

"ఊహు... మనూ అనే పిలవండీ.. బాగుంది. దగ్గరగా అనిపిస్తుంది.." చెప్పింది అతని కళ్ళలోకి చూస్తూ. భరద్వాజ కాదనలేదు. మనసులో ఎక్కడో ఒక చల్లటి హాయి, గుండె బరువు తేలికైన భావన.

"అవునూ అప్పటి మాటంటున్నారు. మరి ఇప్పుడూ.. బుద్ధిమంతులైపోయారా..?"నవ్వుతూ అడిగింది.

"కాలం గాంభీర్యం నేర్పింది.. ఢక్కామొక్కీలు వయసునీ, అల్లరినీ దూరం చేసేశాయి. అయినా అల్లరి చేసే వయసులో కూడా నా దృష్టంతా పాలిటిక్సే. స్టూడెంట్ యూనియన్ లీడర్ని. ఎప్పుడూ టెన్షన్సూ, గొడవలూ, గోలలూ. ఐనా అది కూడా మొండితనమే గానీ అల్లరి కాదు. నా వయసు వాళ్ళ కంటే ఎక్కువే సీరియస్ నెస్ వచ్చేసింది నాకు. అది కూడా చాలా ఎర్లీగానే.." గాఢంగా నిట్టూర్చాడు.

"...ఇక డైరెక్ట్ పాలిటిక్స్ లోకి ప్రవేశించాకా మొదలయ్యాయి అసలు తిప్పలు. ఎమ్మెల్లేగా నెగ్గే వరకూ ఆహా..ఓహో అన్నారు. తీరా నెగ్గాకా.. ఏదో స్టూడెంట్ లీడరంటే ఏదో నలుగురు కాలేజీ పిల్లల్ని పోగేసి గొడవలు తెచ్చేవాడిలా చూసేవారు. మధ్యలో రెండేళ్ళు లండన్ లో చదివొచ్చానేమో, ఇంగ్లీష్ అదీ ధాటీ గా, యాక్సెంట్ తోటి వచ్చేది. దాంతో అంతా వీడిది హై క్లాస్ లెవెలనేసేవారు. ఎందులోనూ మాట్లాడనివ్వరు. అందరూ సీనియర్సే. మాట్లాడితే నీకేం తెలుసు పిల్లకాకివి.. అని ఆపేవారు. మాట్లాడకపోతే ప్రజా సమస్యలంటే లెక్కేలేదు, డబ్బు పొగరు అనేవారు. ఏదో తాతయ్య, నాన్నల వారసుడిగా తప్ప నాకంటూ ఏమీ వుండేది కాదు. నాన్న దగ్గర ఎంత నేర్చుకున్నా ఏమీ చేసే అవకాశం ఉండేది కాదు.

ఆ టైమ్ లో పాణి, జతిన్ నాకు చాలా సపోర్టివ్ గా వున్నారు. జతిన్ అప్పటికే ఈ.ఆ.శ్. డైరెక్ట్ రెక్రూట్. ఏ విషయమైనా వీలైనంత డీటైల్డ్ గా అన్నీ వివరించేవాడు. పాత రాజకీయాల గురించీ, అన్ని ముఖ్యమైన దేశాల రాజ్యాంగాలు, రాజకీయ వ్యవహారాలు విపరీతంగా చదివేవాణ్ణి. మెల్లగా నిలదొక్కుకున్నాను. ఆ తర్వాత అందరి మీదా ఎలా ప్లే చేయాలో, ఎవర్ని ఎక్కడ తొక్కాలో, ఎలా లేపాలో.., అన్నీ కాలమే నేర్పింది. దాని తర్వాత కథ అంతా రహదారే.. మీకందరికీ తెల్సిందే..."

"సో ద రిజల్ట్ ఈజ్.. దేశంలోనే యంగెస్ట్ హోమ్ మినిస్టర్.. గ్రేట్..'' చిన్నగా నవ్వుతూ అంది. అంతలో చప్పున చెప్పింది, 'భరద్వాజా.. మీరు బార్న్ విత్ సిల్వర్ స్పూన్ అనీ మొత్తం పొలిటికల్ బ్యాకింగ్ తో హోమ్ మినిస్టర్ అయిపోయారనీ కొంతమంది అంటారు. ఆక్ట్యువల్ గా మేం కూడా కొంతవరకూ అలానే అనుకునే వాళ్ళం. మంచి మంత్రేగానీ, వారసత్వంవల్లే అంత తొందరగా ఆ రేంజ్ వచ్చిందనీ.." గిల్టీగా అంది.

"అందులో తప్పేముంది. అది చాలావరకూ నిజమే కదా. బ్యాకింగ్ వల్లేగా నాకు ఎర్లీ గా ఎంట్రీ దొరికింది. కాకపోతే ఎంట్రీ ఐతే దొరికింది గానీ మిగతాదంతా కృషి లేకుండా ఇంపాసిబుల్. ఐనా ఎవ్వరికీ ఏదీ ఈజీగా రాదు మనోజ్ఞా. ఎన్నో నిద్ర లేని రాత్రులు, తిండిలేని రోజులు, అలుపెరగని పరుగులూ, వాల్యూస్ తో రాజీలు, ఇవన్నీ కలిస్తేనే గమ్యం చేరగలం లేదంటే బతుకంతా జీవిత కాలపు ప్రయాణమే.." సాలోచనగా చెప్పాడు.

తలూపింది. అక్షరసత్యాలవి. కాదనే ప్రశ్నేలేదు.

"...అందుకేనేమో లాస్ట్ టర్మ్ మీ పార్టీ రాకపోయినా, అందరూ మిమ్మల్నేగుర్తుచేసుకున్నారు కదూ. సీ.ఎమ్ కంటే కూడా మీకే ఎక్కువ ఫాలోయింగ్ వుందని కూడా చెప్పుకుంటారుగా. దీ రాక్ హార్డ్ హోమ్ మినిస్టర్ ఆంధ్రా ఎవర్ హాడ్' అన్న ద వీక్ మాగ్జైన్ కవర్ స్టోరీ చాలా పెద్ద సెన్సేషన్.. మేం చదివాం. నాకు గుర్తుంది. అందుకే మీరీ టర్న్ హోమ్ గా రాగానే స్టేట్ లో చాలా సెలిబ్రేషన్స్ జరిగాయి. పీపుల్ రియల్లీ లైక్ యూ ఎ లాట్.."

నవ్వాడు, "మళ్ళీ వచ్చానని బాధపడ్డవాళ్ళు అంతకంటే ఎక్కువమందే వున్నారు మేడమ్. ఎంతమంది ఇష్టపడతారో అంతకు రెట్టింపు శత్రువులున్నారు నాకు, మేగ్జైన్స్ లో రివ్యూ లా సుగర్ కోటెడ్ గా ఉండదేదీ ఇక్కడ..."

"తెలుసు. మీ మీద నక్సల్ అటాక్ జరిగింది కదూ లాస్ట్ ఇయర్.. "

"వెల్... అటాకే.. కాకపోతే.. నక్సల్స్ కాదనుకో..."

"మై గాడ్.. అంటే ఎవరో మీకు తెలుసా.."

నవ్వాడు, "నేను హోమ్ మినిస్టర్ని మనోజ్ఞా. నా చుట్టూ ఏం జరుగబోతోందో తెలీకపోయినా, కనీసం జరిగాకైనా తెలుసుకోవాలి కదా.."

"మరి.. మరి తెలుసుకుని ఏంచేశారు..?"

నవ్వి ఆల్బమ్ క్లోజ్ చేశాడు. తను మరీ చిన్నపిల్లలా ఫూలిష్ గా అడిగిందని అర్థమైందామెకి.

"రియల్లీ సారీ.. ఐ షుడున్ట్ హావ్ సెడ్ సో..." సిగ్గుపడింది తన పిచ్చితనానికి.

తేలిగ్గా నవ్వేశాడు, "నో.. నో... ఇట్స్ ఓ.కే. చెప్పదగినదైతే చెప్పేవాడినే.. కానీ.. ఒకరికి మాటిచ్చాను అందుకే ఆగాను.. నీకు చెప్పకూడదని కాదు.."

"ఓ.కే. లీవ్ ఇట్ సర్.. ఇంతకీ.."

"ఏంటీ.. ఏమన్నావ్.. ?" రెట్టిస్తూ అన్నాడు.

"ఓ.కే. సర్... ఐ మీన్.. లీవిట్ భరద్వాజా... ఇంతకీ జతిన్ గారూ వాళ్ళూ ఇప్పుడెక్కడ ఉన్నారు?" అతని హింట్ అర్థమై పిలుపు మార్చి నవ్వుతూ అడిగింది.

"వెస్ట్ బెంగాల్ లో.. వాడక్కడ ఫైనాన్స్ సెక్రటరీ ఇప్పుడు..."

"వాళ్ళది లవ్ మ్యారేజ్.. ఐ మీన్ ప్రేమ పెళ్ళే.. కదూ.." కుతూహలంగా అడిగింది.

"యప్... బానే గెస్ చేశావు. కానీ పెళ్ళి కాదది. చిన్న సైజ్ ప్రళయం అనుకో.. చాలా పెద్ద స్టోరీలే ఇంకోసారి చెప్తాను. ఆతిథ్యం అదీ.. అని పిల్చి స్వీయ చరిత్రతో బాగా బాదేస్తున్నాను." అంటూ లేవబోయాడు.

"ఊహు.. ఇప్పుడే చెప్పండి.. అంత బిల్డప్ ఇచ్చి ఇప్పుడు తర్వాతంటే ఎలా.."

"క్యూరియాసిటీ కిల్స్ ద క్యాట్..." నవ్వాడు.

"లెట్ ఇట్ కిల్ హూ కేర్స్... చెప్పండి భరద్వాజా...ప్లీజ్..."

"ఓ.కే. ఓ.కే. చెప్తాను, వినూ... మావాడు, నిరుపమ ఢిల్లీలో కలిశారు. ప్రేమించుకున్నారు. ఆ అమ్మాయిది ఏదో జమిందారీ కుటుంబం. ఈ ప్రేమా, దోమా కుదరవని వేరే పెళ్ళి సెటిల్ చేసేశారు. దాంతో మావాడెళ్ళి ఫ్రెండ్స్ సాయం తో అమ్మాయిని లేవదీసుకొచ్చేశాడు. అప్పటి కి ఇంకా నేను పార్టీ కార్యకర్త టైప్ లో తిరుగుతున్నాను. పెళ్ళని ఫోన్ చేస్తే వెళ్ళాం. తీరా పెళ్ళి జరిగిన రెండు గంటలకి నిరుపమ పేరంట్స్ ఇద్దరూ అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు.. "

"మై.. గాడ్.. దారుణం.. " తలుచుకుంటేనే వళ్ళు గగుర్పొడిచింది మనోజ్ఞకి.

"అవును... చాలా ఘోరమైన రోజది. నిరుపమా వాజ్ ఇన్ ఎ డీప్ షాక్. చాలా ట్రౌమా లో ఉందామ్మాయి. ఈలోపల వాళ్ళ బంధువులు కేస్ పెట్టారు. మా వాణ్ణి పోలీసులు పట్టుకుపోయారు. అది వాడి ట్రైనింగ్ కంప్లీట్ అయి, పోస్టింగ్ కోసం చూస్తున్న టైం. ఒక్క కేస్ చాలు వాడి కెరీర్, లైఫ్ అన్నీ సర్వనాశనం అయిపోవడానికి. ఓ పక్క నిరుపమని ఓదార్చాలో, ఇంకోపక్క వీడి సంగతి చూడాలో తెలీని పరిస్థితి. ఆ టైంలో నాన్నగారు ఆదుకున్నారు. చాలా కష్టంమీద జతిన్ మీద కేస్ విత్ డ్రా చేయించారు. కానీ బ్యాడ్ లక్.. నిరుపమ కోలుకోలేదు. జరిగిన సంఘటనతో ఆమె మెంటల్ బాలెన్స్ కోల్పోయింది. హిస్టీరిక్ గా అరవడం, కొట్టడం, వస్తువులు విసిరేయడం, దారుణంగా తయారయ్యింది. దాంతో జతిన్ బయటకొచ్చేలోపే ఆమెని బంధువులు తీసుకెళ్ళి పిచ్చాసుపత్రిలో వేసేశారు. అది తెలిసి మాకు మతి పోయినంతపనైంది. వెంటనే వెళ్ళి ఇమ్మీడియట్ గా ఆమెని తీసుకొనివచ్చాం. కానీ జతిన్ పేరెంట్స్ ఒక పిచ్చిపిల్లని కోడలిగా తీసుకురావడానికి ఒప్పుకోలేదు. దాంతో మా ఇంటికి తీసుకెళ్ళాం. అంతలో జతిన్ కి ఓ మారుమూల ప్రాంతంలో పోస్టింగ్ వచ్చింది. నానా తిప్పలు పడి పోస్టింగ్ సిటీకి మార్పించుకున్నాం. మా వల్ల అయ్యేది కాదు నిరుపమని కంట్రోల్ చేయడం. అప్పటికే జతిన్ పేరెంట్స్ బాగా భయపడిపోయారు. ఆమెని పిచ్చాసుపత్రిలో వేసి వేరే పెళ్ళి చేసుకోమని ఒకటే గొడవ. కానీ జతిన్ మాత్రం ససేమిరా వినలేదు. వేరే ఇల్లుతీసుకుని నిరుపమని తీసుకెళ్ళిపోయాడు. ఆమె చెల్లెల్నీ, తమ్ముడినీ తెచ్చుకుని వాళ్ళ బాధ్యత కూడా తీసుకున్నాడు. నర్స్ ని పెట్టీ, ట్రీట్మెంట్ చేయించుకునీ.. ఆల్మోస్ట్ రెండేళ్ళు నరకం చూశాడు.. ఇదిగో ఈ గాటు ఆమెని కంట్రోల్ చేయబోతే పడ్డదే.. ఇలాంటివి వాడికెన్నో.." కుర్తా జరిపి మోచేతి కిందుగా ఉన్న గాటు చూపిస్తూ అన్నాడు.

"మై గాడ్.. ఊహించుకోలేకపోతున్నాను. పాపం.. తర్వాత ఎప్పుడు కోలుకున్నావిడ..?"

"అక్కడా ఒక ట్విస్ట్ ఉంది. తను దాదాపు రెండేళ్ళ తరువాత కోలుకుంది. కానీ కోలుకున్నాకా జతిన్ తో ఉండనంది. వాడిని చూస్తే గతం గుర్తొస్తోందనీ, తన పేరెంట్స్ మరణం తనని జీవితాంతం వెంటాడుతుందని ఏడ్చేది., మళ్ళీ తనకి పిచ్చి పడితే వాడి జీవితం పాడౌతుందని భయపడింది. అది విని వాడు చాలా షాటర్ అయ్యాడు. కానీ

ప్రయత్నం మానలేదు. తర్వాత డాక్టర్లూ, ఫ్రెండ్సూ, ఆమె చెల్లెలూ, తమ్ముడూ అందరూ చాలా నచ్చజెప్పగా, చెప్పగా ఒప్పుకుంది. చివరికి జతిన్ తనకోసం ఎంత తపిస్తున్నాడో, తన ఒక్క తొందరపాటుకి ఎంత బాధపడ్డాడో మా అందర్నుంచీ వినీ, వాడి బాధ చూసి, చాలా ప్రయత్నాల తర్వాత మెల్లగా రియలైజ్ అయింది. కాకపోతే అందుకోసం కూడా వీడు ఆల్మోస్ట్ ఒక సంవత్సరం పాటు ఎదురుచూడాల్సొచ్చింది. చివరికి సుఖాంతమే అనుకో. నౌ దే హావ్ ఎ గుడ్ లైఫ్.. ఓ పాప కూడా.. తనూ ఆతర్వాత కెరీర్ స్టార్ట్ చేసి అందులో బిజీ ఐపోయింది. అసలు ఆ నీరూయేనా అనిపిస్తుంది ఇప్పుడామెని చూస్తే..." గతాన్ని తలుచుకుంటూ అన్నాడు.

"..నిజంగా చాలా గొప్ప లవ్ స్టోరీ.. మూడేళ్ళు.. గ్రేట్ నిజంగా మీ ఫ్రెండ్... అసలు దిలీప్ ని చూసాకా ఒకలాంటి భయంవేసింది. మంచి ముసుగులో కూడా అంత వంచనా, దుర్మార్గం వుంటాయా అని. శైలూ ఎంత మంచిది.. అలాంటమ్మాయిని ఎంతలా ఛీట్ చేశాడు. అక్కడ చూస్తే మీ ఫ్రెండ్.., పిచ్చిదైపోయిన అమ్మాయిని వదిలేసే ఛాన్స్ వుండి కూడా ఎంత కష్టపడి మామూలు మనిషిని చేసుకున్నాడు. ఎంత కాంట్రడిక్టరీ స్టోరీస్ కదా...!?" ఆలోచిస్తూ అంది.

తలూపాడు, "అందరి జీవితాలూ ఒకేలా వుండవు కదా మనోజ్ఞా. తరచి చూస్తే ప్రతీ జీవితం వెనకా ఓ కథుంటుంది. ఇంక ఈరోజు కి చాలేమో జే.కే. గారి ఆత్మకథ.. ప్లస్ ఉపన్యాసం.... ఇక వెళ్ళి కాస్త తిందామా మిస్.. "

"ఓ.. ష్యూర్ మిస్టర్...", అంతే స్పీడ్ గా అనేసి నాలుక్కర్చుకుంది. తల అడ్డంగా తిప్పుతూ చెప్పాడు "యూ ఆర్ జస్ట్ ఇంపాసిబుల్.." గలగలా నవ్వేసింది అతనన్న విధానానికి.

"బిజీ గా ఉన్నారా..?" ఫోన్ తీస్తూనే మనోజ్ఞ వేసిన మొదటి ప్రశ్న.

"అదేం లేదు చెప్పు.."

"లంచ్ కి వస్తారా..?" బెరుగ్గా అడిగింది.

ఉలిక్కిపడి అంతలోనే సర్దుకుని అడిగాడు. "ఏం సెమినార్ కి వెళ్ళలేదా..?"

"అక్కడే ఉన్నాను.. వస్తారా..?"

ఏం చెప్పాలో తెలీక మౌనం వహించాడు. అతని మౌనాన్ని మరోలా అర్థం చేసుకుని దిగులుగా చెప్పిందామె, "సరే మీకిష్టంలేకపోతే వద్దులెండి.."

"ఛ.. అదేం కాదూ.."

"సారీ టూ బాదర్ యూ... వుంటాను.. "

"హేయ్.. వెయిట్.."

"చెప్పండి.. "

"అవతలివాళ్ళ మాట వినే అలవాటుకూడా చేసుకోవాలి మేడమ్, కనీసం అప్పుడప్పుడు.."

"సారీ, చెప్పండి.."

"ఏమైందీ.. ఫీలయ్యావా..?" లాలనగా అడిగాడు.

"...."

"మనోజ్ఞా.." మృదువుగా పిలిచాడు.

"ఊ.."

"ఏమయిందీ..?"

"మీరు డైరెక్ట్ గా వద్దనలేక సైలెంట్ గా వున్నారనిపించింది. మరీ వెంటపడుతున్నానే ఫీలింగ్ వచ్చేసి.. "

"ఛ.. ఛ.. షటప్..అదేం ఆలోచన.. నేనేదో థాట్స్ లో ఉంటే నువ్విలా పిచ్చిపిచ్చిగా ఊహించేస్కోవడమేనా.."

"అంటే..? " తడబడింది.

"సర్లే.. వన్ కి పిక్ చేస్కుంటాను. వచ్చాకా సెల్ కి రింగ్ ఇస్తాను బయటికి రా.. ఓ.కే.నా.?." ఆప్యాయంగా చెప్పాడు.

"ఓ.కే. కానీ మీరు ఒకటి మర్చిపోయారు.."

"ఏంటది? "

"మేక్ ఇట్... వన్.. షార్ప్.." సీరియస్ గా అతన్ని ఇమిటేట్ చేస్తూ చెప్పింది. రిలీఫ్ గా నవ్వాడు.

"వావ్.. కార్లో లంచ్.. బాగుంది ఎరేంజ్ మెంట్.. " హుషారుగా చెప్పింది.

"థ్యాంక్స్.. సెమినార్స్ మధ్యలో కదా.. నీకెక్కువ టైం వేస్ట్ అవకుండా.. " చెప్పాడు.

అప్పటికి నాలుగు రోజులుగా తాము కలుస్తూనే వున్నారు. మూడుపూటలా కలిసి గంటలతరబడి గడిపినా ఇంకాస్త టైం కావాలనిపిస్తోంది. మధ్యాహ్నం సెమినార్ కోసం లంచ్ అవ్వగానే త్వరగా బయల్దేరాల్సొస్తోంది. అందుకే ఈ కొత్త ఏర్పాటు. కార్ లో లంచ్ ఏర్పాటు చేయమని చెప్పగానే పాణి కళ్ళలో చిన్న అనుమానం. ఆ సందేహాలకి తాను జవాబివ్వలేదు. తను మనోజ్ఞను అవాయిడ్ ఐతే చేయలేదు. తెలిసిపోయింది. తన శక్యం కాని పనది.

"ఓహ్.. సో నైసాఫ్ యూ.." ఆమె మాటతో ఆలోచన ఆగింది.

కబుర్ల మధ్యలో భోజనం పూర్తయింది.

"అవునూ.. స్వామి నాయుడు గారు తెలుసా మీకు.. ?"

"ఓ.. మా అపోజిషన్ లీడర్ తెలీదా.. ఆయన గురించేగా నువ్వడిగేది.. "

"యప్.."

"ఏంటి విషయం..? "

"వాళ్ళబ్బాయి మా బ్యాచే. ఇప్పుడు ఇక్కడే ఉన్నాడు.."

"ఆహా.. ఎనీ థింగ్ స్పెషల్ ఎబౌట్ హిమ్..?"

"చాలా.. పెళ్ళి కుదిరింది.. కట్నమెంతో అడగరేం..?"

తలెత్తి చూశాడు. ఏదో కాలేజ్మేట్ తో మాట్లాడినట్టే క్యాజువల్ గా మాట్లాడేస్తుంది తనతో. వేరే వాళ్ళందరూ ఒక్కోమాటా ఆలోచించుకుని మాట్లాడతారు తన ముందు. చాలా చనువిచ్చేస్తున్నాడా లేక ఆమే తీసుకుంటోందా.. గాడ్ నోస్...

"సంజూ చెప్పాడు. వాడికి చాలా క్లోజ్ అతను.. యూనో... వెయ్యికోట్లు.. తెలుసా.. కేన్ యూ ఇమేజిన్.. ఏమాలోచిస్తున్నారు మీరూ..?"

"ఏంలేదు..చెప్పు.."

"మీకు ఆశ్చర్యం వేయలేదా..?"ప్రపంచపు ఎనిమిదో వింత చూస్తున్నట్టు విచిత్రంగా అడిగింది.

చిన్నగా నవ్వాడు, "అలవాటైపోయింది. చాలా వింటున్నాం ఈమధ్య.. అదో స్టేటస్ సింబల్ లా తయారయ్యింది.. అనఫీషియల్ పబ్లిసిటీ.."

"ఐనా.. వెయ్యి కోట్లంటే కొంచెం ఓవర్ గా లేదూ.. అది సరే.. ఇంతకీ మీ మినిస్టర్లెలా తీసుకుంటారో చెప్పరాదూ..? "అడిగింది.

"వాళ్ళ పిల్లలకి కోట్లలో తీసుకుంటారు. ఇంకొన్ని చెప్పనా... అసలు వాళ్ళేం చేస్తున్నారో కూడా అర్థంకాదు, గుండాగిపోయే నంబర్లుంటాయి కొన్ని.., మనం కల్లో కూడా ఊహించని ప్రాపర్టీస్ చేతులుమారతాయి కట్నం పేరుతో.." అంటూ తనకు తెలిసిన కొన్ని ఎగ్జాంపుల్స్ చెప్పాడు.

"మరి ఈ హోమ్ మినిస్టర్ గారేం తీసుకుంటారో..? "అల్లరిగా చూస్తూ అడిగింది.

ఉలిక్కిపడిచూశాడు. ఒక్కసారిగా ఏదో బలమైన అల ఉవ్వెత్తున ఎగసి, తనని నిలువునా ముంచెత్తిన భావన. తటాలున తమాయిచుకుని, స్పృహలోకి వచ్చాడు. ఇప్పుడు తన నోటివెంట వచ్చే ఒక్కమాట చాలు అనవసరమైన భావాలకి లిఫ్ట్ ఇవ్వడానికి. ఇప్పటికి చేస్తున్నది చాలు. అందుకే అర్థంకానట్టే చూస్తూ, "ఈ వయసులోనా.. నా ఏజ్ ఎంతో తెలుసా నీకు..? సరైన టైంలో పెళ్ళి చేసుకునుంటే ఈపాటికి నా కూతురికివ్వాల్సొచ్చేదా కట్నం.." నవ్వాడు. పైకి నవ్వినా మనసులో చురుక్కుమన్న బాధ. అన్ని రోజులుగా తామిద్దరి మధ్యా నిశ్శబ్దంగా ప్రవహిస్తున్న సున్నితమైన ప్రవాహాన్ని తనే రాళ్ళేసి చెదరగొట్టిన అనుభూతి. కానీ తప్పదు.

తేలిగ్గా నవ్వేసింది, "నలభై ఆరు, ఐతే ఏం.. మరీ చెప్తారు మీరు. ఎనభైలలో ఉన్నవాళ్ళే మూడేసి పెళ్ళిళ్ళు చేసుకుంటూ, వి ఆర్ సో యంగ్ అంటుంటే మీరు మరీ ఏజ్, ఓల్డ్ అని కబుర్లు చెప్తారేం.. ఐనా మీకేం తక్కువ చెప్పండి..? చదువుకి చదువు, మంచి హోదా, ఏ హీరోలకీ తీసిపోని పర్సనాలిటీ, వీటన్నింటినీ మించిన మంచి వ్యక్తిత్వం.. ఇన్ని పెట్టుకుని మీరలా మాట్లాడ్డం ఏం బాలేదు.." అంది సూటిగా.

ఒక్కసారిగా గుండె గొంతులోకి వచ్చినట్లైంది. వెంటనే సర్దుకుని, "నా సంగతొదిలేయ్. మరి ఆనంద్ కి నువ్వేం ఇస్తున్నావ్..?"వాతావరణాన్ని తేలిక చేయడానికి బలవంతంగా ముఖంలోకి లేని నవ్వు కొనితెచ్చుకుంటూ అడిగాడు.

ఎప్పుడూ నవ్వే మనోజ్ఞ ముఖం గంభీరంగా మారింది. సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ, "ఆనంద్ నాకు కేవలం ఓ ఫ్రెండ్ మాత్రమే భరద్వాజా అది మీకూ బాగా తెలుసు. ఐనా నేను ఏం కట్నం ఇవ్వగలనో తెలుసుకోవాలంటే మీ దగ్గర ఒక్కటే మార్గం ఉంది...." అంటూ ఆగింది.

ఆమె నుదుట చిరు చెమటలు పట్టాయి., పెదవులు సన్నగా అదురుతున్నాయి.

"భరద్వాజా.. "అంటూ ఏదో అనబోయేంతలో షార్ప్ గా రియాక్టయ్యాడతను. ఇంకేమీ ఆలోచించలేదు. ఇక్కడితో కట్ చేయాలి. ఐ కాన్ట్ బీ దట్ అమెచ్యూర్... అనుకుంటూ, "సెమినార్ కి లేట్ అవుతోంది కదా మనోజ్ఞా, తొందరగా జ్యూస్ ఫినిష్ చెయ్యి" అన్నాడు అబ్రప్ట్ గా సంభాషణ తుంచేస్తూ.

మౌనంగా తలదించుకుంది. వెళ్తూ, వెళ్తూ కనీసం వస్తానని కూడా చెప్పలేదు. నిశ్శబ్దంగా కారు దిగి ఒక్కసారి అతని వంక చూసి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది. ఆ లేత మొఖంలో తీవ్రమైన ఆశాభంగం.

నిస్త్రాణ గా సీట్లోకి జారిపోయాడు. ఓహ్ గాడ్.. ఎంతగా హర్ట్ చేశాడు తను.. హౌ కుడ్ ఐ బీ సో రూడ్.. కళ్ళు మూసుకున్నాడు.

ఆలోచిస్తున్నాడు.. తదేకంగా.. తీవ్రంగా...

ఏం చేస్తున్నాడు తను? ఏమైంది జీ.కే.నీకు? ఎంతమంది అందమైన స్త్రీలని చూసుంటాడు. అంత చిన్నపిల్లకి తానెలా అట్రాక్ట్ అయ్యాడు..! ఇది ఆకర్షణ మాత్రమే కాదు. దాన్ని మించినదేదో. ఏంటది..? ఎందుకామె కలవమంటే కాదనలేకపోతున్నాడు? ఏమిటా మాగ్నెటిక్ పవర్? ఎందుకామె వెంట వద్దనుకుంటూనే పిచ్చివాడిలా వెళ్ళిపోతున్నాడు.

....తను సరే. ఈ ఏజ్ లో ఒక యంగ్ అండ్ బ్యూటిఫుల్ అమ్మాయి దగ్గరకొస్తే తనేంటి, అపర ప్రవరాఖ్యుడైనా చలిస్తాడు. ఆఫ్ట్రాల్ తానెంత. కానీ మనోజ్ఞ.. అంత అందమైన అమ్మాయి.. చిటికేస్తే చాకుల్లాంటి కుర్రాళ్ళు లైన్ లో నించుటారు. అలాంటి అమ్మాయి తనకెందుకంత ప్రాముఖ్యం ఇస్తోంది? తననెందుకలా కన్ఫ్యూజ్ చేస్తోంది? అంతమంది రిచ్, హాండ్సమ్ అండ్ యంగ్ ఫ్రెండ్స్ వున్న అమ్మాయికి తనతో పనేంటి..

నిజంగానే ఇష్టపడుతోందా..? ఏం తెలుససలు తన గురించామెకి. తమ పరిచయమెంతని ఇష్టపడడానికి. లేక తనని కవ్వించి, ఆశ చూపి, తాను గిలగిల్లాడుతుంటే, తన వెనక స్నేహితులంతా కలిసి నవ్వుకోవట్లేదు కదా!! ఆ ఊహకే ఉలిక్కిపడ్డాడు. అవును. అంతే అయ్యివుంటుంది. లేకపోతే తనతో ఏం పని. ఈ హిల్ స్టేషన్లో ఇంత కంటే మంచి టైంపాస్ ఎక్కడ దొరుకుతుంది. హఠాత్తుగా మదిలో మెదిలిన చిన్న అనుమానం పెనుభూతమై క్షణాల్లో అతని మనసు కలిచివేసింది.

ఆ ఆలోచనతో పిచ్చి పట్టినట్టైందతనికి. కళ్ళలో నీళ్ళుతిరిగాయి మనోజ్ఞ గురించి అలా ఆలోచించినందుకు. మనసు చెప్తోంది ఆమె అలాంటిది కాదని కానీ ఆలోచనకి రీజన్ దొరకట్లేదు. చాలిక.. ఈ వ్యథతో తల పగిలిపోయేట్టుంది.

విసురుగా లేచి బయటికి నడిచాడు. "పాణీ.." అరిచినట్టే పిలిచాడు. పరుగున వచ్చాడతను.

"సర్.."భయంగా అన్నాడు. భరద్వాజని ఎప్పుడూ అలా చూడలేదు.

"ఫ్లైట్ బుక్ చెయ్ హైదరాబాద్ కి.." కారెక్కుతూ చెప్పాడు.

"ఎప్పుడు సర్.. అంటే వెదర్ బాలేదు కదా ఈరోజు, రేపూ కొన్ని కాన్సిల్ అయ్యాయనీ..." తెల్లబోయి చూస్తూ చెప్పబోయాడు పాణి.

"నో వే.. ఎప్పుడు దొరికితే అప్పుడు.. వెళ్ళిపోవాలి ..వెంటనే... " అంటూ కార్ స్టార్ట్ చేశాడు.

మరీ లవ్ ఫెయిల్యూర్ ఐన చిన్నకుర్రవాడిలా ప్రవర్తిస్తున్నాడా. ఏమన్నా అనుకోనీ, టూ హెల్ విత్ ఎవ్రీవన్. తాను వెళ్ళిపోవాలి. ఇంకా ఇక్కడే వుండి ఓ జోకర్ లా మిగలలేడు. కోపం లో ఎటుపడితే అటు టర్న్ చేశాడు. అంతలో గ్రీన్ లాన్స్ కనిపించింది. ఇక్కడే కదూ తను ఆమెని కలిసింది, ఆమె సాన్నిహిత్యంలో మైమరచిపోయింది., ఆ తీవ్రమైన ఆకర్షణా ప్రవాహంలో ఉధృతంగా కొట్టుకుపోయింది! రోషంతో అతని మొఖం ఎర్రబారింది. దాటబోతూ వెనక గేట్ దగ్గర అప్రయత్నంగా కారు ఆపి స్టీరింగ్ మీద తల ఆనించి కళ్ళు మూసుకున్నాడు.

తనని అల్లరి పెట్టి, ఆశపెట్టి తానో వెర్రి వాడిలా ఆమె చుట్టూ తిరుగుతుంటే అంత పెద్ద హోదాలో వున్నవాడూ, మంత్రీ, తనకంటే వయసులో రెట్టింపున్నవాడు, ఎవ్వరైనా ఆడదాని ఓరచూపుకి బానిసలేనని, ఆమె గర్వంగా నవ్వుకుంటున్నట్టు అనిపించింది. ఉక్రోషం తన్నుకొచ్చింది. ఎంతలా అభిమానించాడు. పిచ్చివాడిలా... తలవిదిల్చి లేచాడు.

విసుగ్గా కారు స్టార్ట్ చేయబోతూ ఆగాడు. దూరం నుంచీ ఆ సిమెంట్ బెంచ్ కనపడుతోంది లీలగా. అక్కడే కదూ తననామెకాపాడింది. తనామెకి అంత దగ్గరైంది. ఎన్ని కబుర్లూ, పర్సనల్ విషయాలు షేర్ చేసుకున్నాడామెతో..! అసలు ఆమెని పరిచయం చేసిన ఆ బెంచ్ ని లాగి తన్నాలన్నంత కోపం ముంచుకొచ్చింది. కోపంతో చేసే పనులకి రీజనింగ్ వెతక్కూడదన్న మాట నిజం చేస్తూ విసురుగా కారు దిగి అటు నడిచాడు. బెంచ్ దగ్గరౌతూనే గుర్తించాడు. అక్కడెవరో కూర్చున్నారు. కోపాన్ని అణుచుకుంటూ, తన ప్రయత్నాన్ని విరమించుకుని, వెనుదిరగబోయి తుళ్ళిపడి మళ్ళీ తిరిగి

చూశాడు. ..అక్కడ...అక్కడున్నది.. మనోజ్ఞ కదూ.. ఈ సమయంలో ఆమె అక్కడుండడం యాదృచ్చికమా.. లేక..!! ఆలోచిస్తూ కలలోలా నాలుగడుగులు ముందుకేశాడు.

ఆమె అరచేతుల్లో ముఖం దాచుకుని నిశ్శబ్దంగా రోదిస్తోంది. పక్కనో పుస్తకం డైరీ కావచ్చు అస్తవ్యస్తంగా సగం రాసి పడుంది. అదికాదతడు చూస్తున్నది దాని మధ్యగా పెట్టున్న ఫొటో... తనదే...!! జీవితంలో అంత షాక్ కి ఎప్పుడూ గురవ్వలేదు భరద్వాజ. అతని మొఖం తెల్లగా పాలిపోయింది. నమ్మలేనట్టు వంగి మళ్ళీ చూశాడు. తనదే.. ఏదో మాగ్జైన్ కవర్ పేజీ కటింగ్.. స్థాణువై నిలబడ్డాడు. ఆమె ఇంకా ఏడుస్తోంది... సన్నగా వెక్కుతూ..

మధ్యాహ్నం తనామెని కర్ట్ గా తుంచేయడం గుర్తొచ్చింది. ఒక్కసారిగా నిలువునా చీల్చినంత బాధ... చేసిందంతా చేసి తానేదో మోసపోయినట్టు గా ఎంత ఫీలైపోయాడూ.. తన మీద తనకే అసహ్యం వేసింది. తన ఆలోచనల్లో వికృతత్వానికి సిగ్గుపడ్డాడు.

అలా ఎంతసేపు నిలబడ్డాడో తెలీదు. ఆమె కదలడంతో చప్పున పక్కకి తప్పుకున్నాడు. అంతలో ఆమె నెమ్మదిగా కళ్ళుతుడుచుకుని బెంచ్ మీద తానెప్పుడూ కూర్చునే వైపుచూసింది. మెల్లగా మునివేళ్ళతో ఆ బెంచ్ ని స్పృశించింది. మామూలుగా చూసేవాళ్ళకది సాధారణ దృశ్యమేమో గానీ, ప్రేమలో వున్నవారికే అర్థం అవుతుందా సున్నితమైన భావం. తాము ప్రేమించిన వారు తాకిన గడ్డిపూవు కూడా వారికో అద్భుతమే. ఇక అనుమానపు తెరలని తొలగించుకుని కళ్ళు తెరిచిన భరద్వాజకైతే అది ఓ అపురూపమైన దృశ్యమే.. వెల కట్టలేని కానుకే...

నెమ్మదిగా వెనుదిరిగాడు. ఆలోచనల్లో నిమగ్నమైవున్న ఆమె ఏకాంతాన్ని భగ్నం చేసే హక్కు తనకెక్కడిది? ఆ ఆలోచనలు తనవే అయినా సరే ..

ఎలాగో కారులో వచ్చి కూలబడ్డాడు. నీరసంగా కారు స్టార్ట్ చేయబోయి ఆగాడు. చప్పున ఏదో గుర్తొచ్చి డాష్ బోర్డ్ లో వున్న కేమెరా బయటకి తీసాడు. జూమ్ చేసి ఆమెని చూశాడు. ఇష్టంతో చేసే పనులకి కూడా అసలే రీజనింగ్ వుండదు కదూ. ఆమె ఇంకా అలాగే కూర్చుని వుంది డీలాగా. ఇన్నాళ్ళుగా దగ్గరకి తీసి, హఠాత్తుగా ఒక్కమాటతో ఆమెని ఇంతగా బాధించింది తనేగా. అంతకన్నా కూడా తన ఆలోచనలు ఎక్కువ అసహ్యకరమైనవి కదూ. ఇలా చూసి వుండకపోతే రేపు తానెళ్ళిపోయేవాడు. తనెందుకు అలా చెప్పకుండా దూరమయ్యాడో తెలీక విలవిల్లాడిపోయేదీ పిచ్చిపిల్ల. ఎంత క్రూరుడు... స్వప్రయోజనం లేకుండా ఏ పనీ చేయని కలుషితమైన లోకం తనది. ఆ బురదలో వున్న తనకి అంతకంటే మంచి ఆలోచనలు ఎక్కడ్నుంచి వస్తాయి. చుట్టూ సముద్రమంత అభిమానులున్నా, దాహం తీరే దారిలేక అలమటిస్తున్నతన దగ్గరకి చిరుజల్లులా వచ్చింది కదూ ఆమె... క్షణకాలమైనా ప్రేమ రూపురేఖలెరుగని తను అది మోసమనుకుని భ్రమపడ్డాడు. ఎంత మూర్ఖుడు.

అంతలో ఆమె దగ్గరకి ఎవరో వచ్చారు. పార్క్ వాచ్ మేన్ లా వున్నాడు. వెళ్ళమని చెప్పినట్టున్నాడు. మెల్లగా లేచిందామె. టైం చూశాడు. ఏడున్నర... భారంగా అడుగులేస్తూ వెళ్తున్న ఆమెని చూస్తే పాపమనిపించింది. హటాత్తుగా తన కర్తవ్యం అర్థమైంది.

ఆమె ఆప్యాయతని అందుకుని, నెమ్మదిగా సర్దిచెప్తాడు తను. ఇలా సడెన్ గా గాయపరిచి నిర్దాక్షిణ్యంగా ఆమె జీవితంలోంచి హఠాత్తుగా నిష్క్రమించే హక్కు తనకి లేదు.

ఆ ఆలోచన రాగానే మనసు తేలిక పడింది. ఆమె రూపం కనుమరుగయ్యేలోపే ఫోన్ తీసి డయల్ చేశాడు. ఊపిరిబిగబట్టి చూస్తున్నాడు. ప్రకాశంగా వెలుగుతున్న లైట్ల వెలుతురులో ఆమె మొహం జూమ్ చేసిన కెమెరాలో స్పష్టంగా కనిపిస్తోంది. బ్యాగ్ లోంచి సెల్ తీసి చూసిన ఆమె కళ్ళలో ఒక్కసారి గా మెరుపొచ్చింది. నమ్మలేనట్టుగా చూసి చప్పున ఒక్కసారిగా సెల్ ని ముద్దుపెట్టుకుంది. ఉలిక్కిపడ్డాడు. చాలాసేపటి తర్వాత అతని పెదాల మీద నవ్వు వెలిసింది. అంతలో సెల్ లో మనోజ్ఞ గొంతు వినిపించింది.

"హలో..భరద్వాజా.. ..సర్ " ఆమె లో చిన్న సందిగ్ధత.

"మనోజ్ఞా.." ఒక్కసారి అతని గొంతు ఆర్తిగా పలికింది. చప్పున సద్దుకున్నాడు. మరీ ఎమోషనల్ అయిపోకూడదు. తనని తాను మందలించుకున్నాడు.

"చెప్పండి.. "

"బిజీ గా వున్నావా..?"

"లేను.. మీరెందుకంత డల్ గా వున్నారు?"వెంటనే ప్రశ్నించింది.

ఉలిక్కిపడ్డాడు. బానే గుర్తించింది. మరి తనో.. ఆమెలోని స్వచ్ఛతని కూడా గుర్తించలేక...

"భరద్వాజా.." ఆమె పిలుపుతో తేరుకున్నాడు.

"ఏంలేదు.. కాస్త మూడ్ బాగాలేదు.."

"ఔనా.. ఎక్కడున్నారు?"

తడబడ్డాడు "ఇక్కడే.. బయటికి వెళ్తున్నాను.."

"ఒంటరిగానా.. పాణిగారు లేరా..?"

"ఊహు.. మూడ్ బాలేనప్పుడు వేరేవాళ్ళని ఎందుకు ఇబ్బంది పెట్టడం.. అది సరే నువ్వెలా వున్నావ్..?" ఆప్యాయంగా అడిగాడు. మధ్యాహ్నం కలిసి, సాయంత్రం ఎలా వున్నావని అడగడం వెర్రితనమేమో తెలీదు గానీ ఆ క్షణం అడగకుండా వుండలేకపోయాడు.

"ఊ... ఓ.కే."

"నాతో వస్తావా..?"

"తప్పకుండా.." వెంటనే చెప్పింది.

"ఎక్కడికో అడగవా..?"

"ఎక్కడికైనా సరే..", ఆమె కంఠం సిన్సియర్ గా ధ్వనించింది.

ఎంతగా ఆమె మనసు తన సాంగత్యం కోరుకుంటోందో అర్థమై అతని మనసు చలించిపోయింది.

"చమన్ దగ్గరకు రా.. పిక్ చేసుకుంటాను.."

"ఓకే.. "అనేసి, అంతలోనే "లేదు.. లేదు... ఒక్క.... హాఫ్ ఏన్ అవర్.." చప్పున ఏదో గుర్తొచ్చినట్టు అంది.

"ఇప్పుడేగా వస్తానన్నావ్.."

"వస్తానూ.. కానీ కొంచెమన్నా రెడీ అవ్వొద్దా.." బిడియంగా అంది.

గట్టిగా నవ్వేశాడు. " ఓహ్.. కమాన్.. పెళ్ళిచూపులకెళ్ళడంలేదు మనం, వున్నపళాన వచ్చెయ్.. "

"..జెంట్స్ కైతే ఎలా వచ్చినా ఓ.కే. కదా... కానీ, బయటికి వెళ్ళాలంటే ఆడపిల్లలకుండదా చెప్పండి.. జస్ట్ ఛేంజ్ చేసుకుని వచ్చేస్తా ప్లీజ్...." బతిమాలుతూ అంది. కరిగిపోయాడు.

"ఓ.కే. కమ్ ఫాస్ట్ .. ఐ విల్ వెయిట్.. "

అరగంట తర్వాత చమన్ దగ్గర కారాపాడు. త్వరత్వరగా వచ్చి కారెక్కింది మనోజ్ఞ, "సారీ,వెయిట్ చేయించానా..?" అంటూ. ఒక్కసారి నిశ్చలంగా ఆమెకేసి చూశాడు. లైట్ పింక్ శారీ లో ఏంజిల్ లా వుందామె. మంచులో తడిసిన గులాబీలా, అద్భుతంగా.... స్టన్నింగ్...నిజంగా చీరకున్న సెక్సప్పీల్ ఇంకే బట్టలకీ రాదు. ముఖ్యంగా, మనోజ్ఞ నిజంగానే మనోజ్ఞంగా వుంది, వెన్నెల బొమ్మలా..

"ఏమైందలా చూస్తున్నారు..? "ఆమె ప్రశ్నకి తేరుకుని నవ్వాడు.

"రెడీ అయ్యే వచ్చావు మొత్తానికి. " ఆ రెడీ అవడం తనకోసమే అని తెలుస్తుంటే ఆ ఫీలింగ్ అద్భుతంగా వుంది.

"ఎక్కువేం లేదు.. బయటికెళ్ళాను కదా రావడానికే టైం పట్టింది.." సిగ్గుగా నవ్వేసింది.

"ఎక్కడ్నుంచీ.."ఠక్కున అడిగాడు. ఆమె చేతిలో డైరీ కూడా వుంది. మళ్ళీ ఎందుకు తెచ్చిందో అర్థం కాలేదు.

"అదీ.. చిన్న పనుండీ.. బయటకెళ్ళాను.." తడబడింది.

"ఓ.. వెళ్దామా మరి.." అడిగాడు ఆమెని ఎక్కువ ఇబ్బంది పెట్టకుండా. తలూపింది. కాసేపటికి ఓ రెస్టారెంట్ లో ఉన్నారు.

"డూ యూ మైండ్ ఇఫ్ ఐ డ్రింక్..? అండ్ వాట్ అబౌట్ యూ.. వుడ్ యూ లైక్ టూ హావ్ టూ..?"మెనూ చూస్తూ అడిగాడు. ఆమెని చూసే ధైర్యం రాలేదు. కళ్ళు తిప్పుకోనీకుండా వుందామె రూపం.

"నో.. అండ్ థ్యాంక్స్.."

"దేనికి... డ్రింక్ ఆఫర్ చేసినందుకా..?"తెల్లబోతూ అడిగాడు.

"ఛ.. కాదులెండి.. మూడ్ బాలేనప్పుడు వేరేవాళ్ళని ఇబ్బంది పెట్టనన్నారు కదా. అంటే నన్ను మీరు.. పరాయి అనుకోలేదని... అంటే.. ఐ మీన్ .." అతను తననే సూటి గా చూడ్డం గమనించి తడబడింది.

"ఎక్సప్లనేషన్స్ అక్కర్లేదు. అర్థమైంది.. " అన్నాడు క్లుప్తంగా. ఆమె కళ్ళలోకి వెలుగొచ్చింది మళ్ళీ.

"సో వాట్ డూ యూ లైక్ టూ హావ్..?" మెనూ ఆమెవైపు జరుపుతూ అడిగాడు.

"యూ మీన్ డ్రింక్స్ ... వద్దొద్దు.." కంగారుగా అంది.

"అదేంటి మీ జనరేషన్ లో పబ్స్, డిస్కోస్, డ్రింక్స్, ఇవి వద్దనే వాళ్ళు కూడా వుంటారా..?"అడిగాడు.

"నేను తాగుతానో, లేదో డైరెక్ట్ గా అడిగితే చెప్తాను కదా. ఇలా అడగడం దేనికీ, మంచిపిల్లనో, కాదో డిసైడింగా..?" వెక్కిరింతగా అంది.

చిన్నగా నవ్వాడు "నో... నో... ఐనా తాగినంత మాత్రాన చెడూ అయిపోవు, తాగకపోతే మంచిదానివీ కాలేవు మనోజ్ఞా. అంతైతే విచక్షణుంది నాకని నమ్మొచ్చుగా..."

ఉలిక్కిపడిచూసింది. "ఓహ్.. మీ గురించి తెలీక కాదు. ఏదో జోక్ గా అనేసాను. మూడ్ బాలేదని బయటికొస్తే మరీ విసిగిస్తున్నానా? సారీ.."

"హేయ్.. నేనూ ఊరికనే అన్నానులే. ఫీలవకు. ఐనా నా మూడ్ సెట్ అయిపోయింది. డోన్ట్ వర్రీ ఎబౌట్ ఇట్. సరే. డైరెక్ట్ గా అడిగేస్తున్నా. ఎనీ.. మైల్డ్ డ్రింక్ ఫర్ యూ..? "

"నో థ్యాంక్స్... ఐ మీన్ మీ ముందు నావల్ల కాదు.. మీ ప్రశ్నకు సమాధానం.. అంటే నేను మరీ అంత రెగ్యూలర్ బూజర్ ని కూడా కాదనుకోండి.. ఎప్పుడైనా... ఫ్రెండ్స్ తో పార్టీస్ లో అంతే... ఐనా ఇప్పుడు మీరు భరించలేరు.." నవ్వేసింది.

"ఓ.కే. యాజ్ యూ ప్లీజ్... నీకు జ్యూస్ చెప్తానైతే..." అంటూ ఆర్డర్ ఇచ్చాడు.

మెల్లగా మామూలు మాటల్లో పడ్డారు.

కాసేపటి తర్వాత తటపటాయిస్తూ అడిగింది. "మిమ్మల్నొకటి అడగనా.. అదీ.. మీరేం అనుకోరంటేనే...?"

"నువ్వేం అడిగినా ఏమీ అనుకోను. గో ఎహెడ్.."

"అప్పుడు స్నిగ్ధ గార్ని కాదన్నారని చెప్పారు కదా. తర్వాత మీరు.. అంటే.. ఎప్పుడూ బాధ పడలేదా..?"

"అంటే యూ మీన్.. నాకర్థం కాలేదు మనోజ్ఞా.. అడుగు పర్లేదు.."

"అంటే మీరూ.. ఐ మీన్.. నెవర్ మ్యారీడ్ కదా.. మే బీ.. తర్వాత మే బీ ఫీలయ్యా, మే బీ ఆవిడనీ... " తడబడింది.

"స్నిగ్ధని ప్రేమించానా అనడుగుతున్నావా..?"

బెరుగ్గా తలూపింది. పకాల్న నవ్వాడు.

"తర్వాత ఫీలైన మాట నిజమే.. కానీ తనని హర్ట్ చేసినందుకు ఫీలయ్యాను. పెళ్ళి చేసుకోనందుకు కాదు... అప్పుడో డెసిషన్ కూడా తీసుకున్నాను.." ఆగి మనోజ్ఞను చూశాడు "వింటావా నా హరికథ...?."

నవ్వి తలూపింది.

"నేను కాదన్నాకా స్నిగ్ధ బాధ చూడలేకపోయాను. నా కారణం గానే ఆమె అంత బాధపడుతోందని అందరి మొఖాల్లో ఒకటే ఎక్యూజేషన్. ఇక అలాక్కాదని వెళ్ళి ఆమెకి చెప్పాను, 'మనం పెళ్ళి చేసుకుందాం' అని. ఎగిరిగంతేస్తుందనుకున్నాను. పైనుంచి కిందకి చూసి, 'మెహర్బనీయా లేక త్యాగమా..?' అంది సింపుల్ గా. తెల్లముఖం వేసుకుని, 'అదేంకాదు, నేనే రియలైజ్ అయ్యాను. నేను కూడా నిన్ను ప్రేమిస్తున్నాను' అన్నాను దబాయింపుగా. నవ్వేసింది. 'నీకా ఫీలింగ్ లేదురా. నాకోసం నువ్వేం కష్టపడి బలవంతంగా లేని ప్రేమని ఒప్పుకోకు.' అని చెప్పింది.

'మరైతే పాణి, జతిన్ లతో రాయబరాలు, పెద్దవాళ్ళతో ఆ పెళ్ళి మాటలు దేనికో.' అన్నాను కోపంగా.

'రాయబారాలు నా ఇష్టాన్ని తెలపడానికే తప్ప బలవంతంగా ఒప్పించడానికి కాదు. పెద్దవాళ్ళు అడిగిన విషయం ముందుగా నాకు తెలీదు. తరవాత మే బీ నువ్వు అరేంజ్డ్ మ్యారేజ్ ప్రిఫర్ చేస్తున్నావేమో అని చిన్న ఛాన్స్ తీసుకున్నాను.' అని చెప్పింది.

'మరైతే ఈ విషాదయోగం దేనికి? నేనే వచ్చి అడిగినా ఒప్పుకోలేని ఈగో నీది' అనేశాను కోపంలో. అవును మరి, నేను కష్టపడి త్యాగం చెయ్యడానికెళ్తే అది కాస్తా తుస్సుమన్న ఉక్రోషం వుంటుందిగా.

'ఐనా తనేం ఫీలవలేదు. నా ప్రేమ విఫలమయ్యిందనే బాధే గానీ మరేమీ లేదురా. ఇది ఈగో కాదు. నీ దగ్గరలేని ప్రేమని నేను ఎన్నటికీ పొందలేను...పెళ్ళైతే చేసుకోగలవుగానీ ప్రేమించలేవు కదా.' అంటూ ఓపిగ్గా వివరించింది. దాంతో నాకు మరీ చిరాకొచ్చింది.

'అరే నేనే చెప్తున్నాగా ప్రేమిస్తున్నాననీ, ఇంకేం కావాలి.. 'విసుగ్గా అడిగాను.

'లేదు. అది నీ కళ్ళలో నాకు కనపడటంలేదు. 'చెప్పేసింది స్థిరంగా.

'అదేమన్నా కళ్ళకి పెట్టుకున్న కాటుకా చూడగానే కనబడ్డానికి, జతిన్ లా ఆరాధనగా చూడ్డాలు, సురేంద్రలా ప్రేమలేఖలివ్వడాలు, ఇవన్నీ అనుకుంటున్నావేమో, అవి నేనెన్నటికీ చేయలేను.' అంటూ వెటకారం చేశాను. తను కోపం తెచ్చుకోలేదు.

'ఆ విషయం నాకు తెలుసు బిట్టూ, అవి నువ్వెన్నటికీ చేయలేవని..' ఆమె కళ్ళనిండా నీళ్ళు . జాలేసింది. ఎంతైనా నా స్నేహితురాలే కదా.

'సరే పోనీ ఆ కళ్ళల్లో ప్రేమ కనపడ్డం ఏంటో చెప్పు. చూపిస్తా.. 'అని సిన్సియర్ గా చెప్పాను. తను నవ్వింది.

'థ్యాంక్స్ ఫర్ సేయింగ్ సో బిట్టూ. నా కోసం నువ్వంత చెయ్యాలనుకున్నావ్. అది చాలు. ఇక కళ్ళ లో ప్రేమంటావా.. నువ్వు నిజంగా ఎవర్నైనా ప్రేమించిన రోజు నీకు తప్పకుండా తెలుస్తుంది. అప్పుడు మాత్రం ఆ అమ్మాయి కళ్ళలో కూడా నీకు అదే కనపడాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను. ఆ క్షణం నీకెవ్వరూ చెప్పక్కర్లేదు, అప్పుడు నేను కాదు నువ్వే చెప్తావు...అదేంటో..' అనేసి వెళ్ళిపోయింది. చాలా బాధగా అనిపించింది. ఎ వెరీ గుడ్ ఫ్రెండ్ ఆఫ్ మైన్.. తర్వాత చాలా ఏళ్ళవరకూ నన్ను అవాయిడ్ చేసేసింది.. పిచ్చి పిల్ల.."

కళ్ళు మూసుకుని గ్లాస్ లో డ్రింక్ మెల్లగా గల్ప్ చేశాడు గతాన్ని తరుస్తూ.

"తర్వాత..మీకు.. మీకు ఎవ్వరూ కలవలేదా..? ఐ మీన్ ఆవిడ చెప్పినట్టు.." నెమ్మదిగా అడిగింది.

కళ్ళువిప్పి ఆమెకేసి చూశాడు. మనోజ్ఞ గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఉద్విగ్నంగా చూస్తోందతని సమాధానం కోసం. నవ్వి ఆకాశం వంక చూశాడు.

"చాలా రోజులు గుర్తుచేసుకునేవాడ్ని తన మాటలు. ఏ అమ్మాయిని కలిసినా స్నిగ్ధ మాటలే గుర్తొచ్చేవి. తరవాత్తరవాత ఆ ఏజ్ అండ్ స్టేజ్ దాటిపోయానని రియలైజ్ అయ్యి తలుచుకోవడం మానేశాననుకో..." ఆగాడు.

మనోజ్ఞ మొఖం పూర్తిగా విప్పారింది. కళ్ళు తళుక్కుమన్నాయి. "థ్యాంక్స్..." మనసంతా ఒక్క ముక్కలో వ్యక్తపరుస్తూ చెప్పింది.

ఏం మాట్లాడలేదు భరద్వాజ. నిశ్శబ్దంగా ఆకాశంలో కదులుతున్న మేఘాలని పరికిస్తూండిపోయాడు.

అతని వైపు రెప్పార్పకుండా కొద్దిసేపుచూసింది. మనసులో అలల్లా పొంగుతున్న ఆలోచనల ఆత్రాన్ని ఆపుకోలేక "ఒక మాట చెప్పనా... మీరు.. మీరింకొంచెం తాగితే బాగుణ్ణనిపిస్తోంది..." అనేసింది.

తెల్లబోయి చూసి అంతలోనే, పకాల్న నవ్వేశాడు. "అంటే.. యూ మీన్.. ఓహ్.. తాగి అవన్నీ చెప్పాననుకుంటున్నావా?" ఇబ్బందిగా తలదించుకుంది. లేచి నిటారుగా కూర్చుని ఆమె తల మీద చిన్నగా ఓ మొట్టికాయ వేసి మళ్ళీ నవ్వాడు., "మాకు ఆల్మోస్ట్ ప్రతీ మీటింగ్ లో డ్రింక్స్ ఉంటాయి. ఫుల్ ప్రాక్టీస్. ఎంత తాగినా అనుకున్నదే మాట్లాడతాం. నోరుజారం మేడమ్.." అని చెప్పాడు.

ఆశ్చర్యంగా తలెత్తింది. "అంటే మీరు...?" ఆగింది ఎలా ప్రశ్నించాలో తెలీక.

"రీజన్స్ వద్దు. చెప్పాలనిపించింది.. చెప్పాను. దట్సాల్. ఇంకేమన్నా మాట్లాడదామా..?" సంభాషణ కట్ చేస్తూ అడిగాడు.

అతనికేసి మెరిసే కళ్ళతో చూసింది. "యాజ్ యూ సే మిస్టర్ బిట్టూ.. " అంటూ నవ్వేసింది.

"ఏయ్.."బెదిరింపుగా వేలు చూపిస్తూ చెప్పాడు, "నాకస్సలు నచ్చని పిలుపది. అందరితో మానిపించడానికి నానా తంటాలు పడ్డాను. ఇంకేమన్నా పిలువు, ఇంకా కావాలంటే తిట్టు, ఓ.కే. అది మాత్రం వద్దు."

"పిలిస్తే.. కొడతారా... ఏం చేస్తారూ..?"అల్లరిగా అడిగింది.

"నిజంగానే కొట్టేస్తాను చూడూ.." వేలు చూపిస్తూ బెదిరించాడు.

"ఊ.. కొట్టండి.." చెయ్యిచాపింది.

నవ్వి చెయ్యి తోసేశాడు. "బాగా ధైర్యం పెరిగిపోయింది నీకు..." అంటూ. కాటేజ్ దగ్గర్లో కారాపాడు.

తలతిప్పి అతని వంక చూసింది.

ఆమె చేతిలో ఉన్న బుక్ చూపుతూ అడిగాడు, "ఇంతకీ ఇదేంటి, వదలకుండా పట్టుకుతిరుగుతున్నావ్?" యధాలాపంగా అడిగాడు.

దాన్ని గుండెకి హత్తుకుని చెప్పింది. " నా డైరీ..నా..... మనసు.. కావాలా...?"

చివ్వున తలెత్తాడు. ఒంట్లో రక్తం మొత్తం పొంగినట్టు ఎర్రబడిందతని ముఖం. కొంటెగా నవ్వి "చదువుతారా అని అడుగుతున్నాను.. " అంది.

"అలా ఇంకొకరి డైరీ చదవడం మేనర్స్ కాదు.." కాస్త వణికిందతని గొంతు.

"ఇంకొకరికైతే నేనూ ఇవ్వను.." నవ్వింది. మౌనంగా ఉండిపోయాడు.

"సరే ఇబ్బంది పడకండి. మీరడిగి తీసుకుంటేనే.. నా బలవంతం ఏమీ లేదు.." నర్మగర్భంగా అంది.

ప్రాణం నువ్వౌతున్నావని చెప్పలేని వాడిని, నీ లోకం నేనంటే ఎలా ఒప్పుకోను...!

"మనూ.. ప్లీజ్.. ఇంక వెళ్ళు గుడ్నైట్.." బెరుగ్గా చెప్పాడు. ఇంకాసైతే.. తాను బయటపడిపోవడం ఖాయం.

"వచ్చే ఫ్రైడే మీ పర్ణశాలకి వస్తున్నా.." టాపిక్ మారుస్తూ చెప్పింది.

రిలీఫ్ గా చూసి, చెప్పాడు, "రా, నిన్నెవరాపారు?"

"కొద్దిసేపటి కోసం మాత్రం కాదు మిస్టర్ భరద్వాజా...", ఒక్కోపదమే వత్తి పలుకుతూ అంది.

ఉలిక్కిపడి చూశాడు, "అంటే..."

"అంటే.. ఆ రోజు మ్యాచ్ వుందనీ.. అంత పెద్ద హోమ్ థియేటర్ పెట్టుకుని పిలవరా చూద్దాం రమ్మని... " అల్లరిగా నవ్వుతూన్నాయామె కళ్ళు. భరద్వాజకింకా నోట మాటరాలేదు. "ఏమైందలా ఫ్రీజ్ అయిపోయారు. మీరేం అనుకున్నారేంటీ.. ?"నవ్వాపుకుంటూ అడిగింది.

"ఏమనుకున్నానా నిన్నూ.." చెయ్యెత్తి చిన్నగా కొట్టబోయాడు. చప్పున వెనక్కు తగ్గింది. తటాల్న చేతిని కంట్రోల్ చేసుకుని వెనక్కి తీసుకున్నాడు. ఆమెతో తనకి పెరుగుతున్న చనువుని గమనించి అతనిలో అలజడి మొదలైంది. చప్పున తనని తాను నిభాయించుకుంటూ, "ఓ.. తప్పకుండా రండి.. మీ అందరికీ అరేంజ్మెంట్స్ రెడీగా వుంటాయి.. యూ ఆల్ ఆర్ మోస్ట్ వెల్ కమ్.." తడబాటుగా చెప్పాడు.

కోపంగా చూసింది, "ఆల్ ఏంటి.. వచ్చేది నేనే.. చూసేది మనమిద్దరమే.. లేదంటే అక్కర్లేదు.. రాను పోండి.." అంది అలుకగా.

నవ్వుతూ, "సరే, సరే.. నీ ఇష్టం.. రా.."అనేశాడు. రోజు మొత్తం తన ఛాంబర్లో, మనోజ్ఞా, తనూ.. ఆ ఊహే చాలా టెంప్టింగ్ గా ఉంది. కంట్రోల్ తప్పిపోతున్నాడు. తెలుస్తోంది. ఇదే మూడ్ కంటిన్యూ అయితే తన పని ఇక అయినట్టే.

"వెళ్ళు మనూ.. ఇప్పటికే చాలా ఆలస్యమైంది.. బాగోదు.." మృదువుగా చెప్పాడు. తలూపి దిగబోతూ అడిగింది, "అదీ.... శారీ లో మొదటిసారి చూశారు కదా ఎలా వున్నానో చెప్పరా మరీ..? " బిడియంగా అడిగింది.

భరద్వాజ కళ్ళార్పకుండా ఒక్క క్షణం తదేకంగా చూశాడు. ఆమె రెప్పలు సిగ్గుతో వాలిపోయాయి. వేగంగా కారుదిగి, వెళ్ళబోయింది. చప్పున వంగి చెప్పాడు. "ఏంజిల్ లా.. మనోజ్ఞా.. ఏంజిల్ లా...". ఆమె బుగ్గలు ఎర్రగా కందిపోయాయి. ఇక తనని తాను నిగ్రహించుకోలేనేమో అని భయం వేసిందతనికి. వెంటనే కారు స్టార్ట్ చేసుకుని వచ్చేశాడు.

తుఫానులా వెళ్ళి, మేఘాల్లోవున్నట్టు తేలుకుంటూ వచ్చిన భరద్వాజని ఆశ్చర్యంగా చూశాడు పాణి. సరాసరి రూమ్ లోకి వెళ్ళి షూస్ కూడా తీయకుండానే మంచంమీద వాలిపోయాడు. ఏదో తీయని అనుభూతి మనసంతా పరుచుకున్న భావన. మత్తుగా కళ్ళు మూసుకున్నాడు.

"సర్.. "

"ఊ... "

"రేపు ఈవెనింగ్ *8.00* కి ఫ్లైట్ బుక్ చేశాను.. సర్... "

"చేసేశావా..?" కళ్ళు తెరవకుండానే అడిగాడు.

"ఎస్ సర్.. మీ ప్యాకింగ్ అదీ.."

"ఐతే కేన్సిల్ చేసేయ్..."

"సర్.." తాను సరిగ్గానే విన్నాడో లేదో పాణికి అర్థం కాలేదు.

"ఏ సెడ్ కేన్సిల్ ఇట్.. కేన్సిల్ కరో.. నాకింకే భాషలూ రావు పాణీ.. నీకర్థమయేలా చెప్పడానికి.. కేన్సిల్ చెయ్యి..."

"ఓ.... ఓ.కే. సర్.." అయోమయంగా చూసి బయటకి నడిచాడు.

మత్తుగా కళ్ళు తెరిచి మళ్ళీ మూసుకున్నాడు. ఇంకా కొద్ది రోజులిలా ఆమెతోనే ఉంటే తమ మధ్య అంతరాన్ని తానే మర్చిపోయేస్థితి వస్తుందేమో. ఫ్రైడే కదూ తనొస్తానంది.. వెళ్ళిపోవాలి తొందరగా ఆమెకి నచ్చజెప్పి, దూరంగా... పింక్ శారీ లో ఎంత అందంగా మెరిసిందీ రోజు. శారీ.. అంటే గుర్తొచ్చింది ఆరోజూ ఇలాగే శారీలో బాగుందని, చీర చూసి ముచ్చటపడిందని, ఆమెకి నచ్చిందనిపించిన శారీ కొనేశాడు. కొనడం ఐతే కొన్నాడు కానీ ఏమనుకుంటుందోనని ఇచ్చే ధైర్యం మాత్రం చాల్లేదు. ఇప్పుడిస్తే.. తనకి తెలుసు... చాలా మురిసిపోతుంది... ఇస్తాడు.. ఆ వెన్నెల కళ్ళలో ఈ రోజు నీళ్ళు తెప్పించాడు.. రేపు మెరుపులు చూడాలి.... చూసి తీరాలి.. చూసి....!

కళ్ళుమూతలుపడ్డాయతనికి.

"హాయ్ గుడ్ మోర్నింగ్" హుషారుగా విష్ చేసింది. నవ్వి తలూపాడు.

"ఏంటీ మౌనవ్రతమా.. చేతిలో ఏంటది?"కుతూహలంగా అడిగింది.

"చెప్తా పద.." అంటూ గ్రీన్ లాన్స్ కేసి నడిచాడు.

"ఏ స్మాల్ గిఫ్ట్ ఫర్ యూ.." భరద్వాజ వేళ్ళు కాస్త కంపించాయి.

"గిఫ్ట్.. ఎందుకూ.. ఏ సెలిబ్రేషన్లో...? " ఆశ్చర్యంగా అడిగింది.

"ముందు తీస్కో.." అందించాడు.

ఆమె మొఖంలో సన్నటి చిలిపినవ్వు, కళ్ళెగరేస్తూ, "ఏంటీ కొంపదీసి ప్రపోజ్ గానీ చేస్తున్నారా..? మీడియాకి చెప్పేస్తానూ.." అంది.

సూటిగా చూశాడు. నవ్వలేదతడు. ఒక్కసారి ఆమెకేసి ఆర్తిగా చూసి చప్పున మొఖం తిప్పుకున్నాడు. కంగారుగా చూసిందామె, "సారీ.. జోక్ చేశాను.. ఓవర్ ఐందా.?. అతి చనువు తీసుకున్నాను కదూ.." అంది మెల్లగా.

"ప్లీజ్ మనూ.. అలాంటి మాటలొద్దు. నా దగ్గర నువ్వెలాగైనా వుండచ్చు. నీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడచ్చు. నీకే రెస్ట్రిక్షన్ లేదు. యూ హావ్ ఎవ్రీ రైట్.. " భరద్వాజ గొంతు వణికింది.

నమ్మలేనట్టు చూసింది మనోజ్ఞ. అంత ఎమోషనల్ గా, అంత ఓపెన్ గా భరద్వాజ ఎప్పుడూ లేడు. ఆమెకేదో అర్థమైనట్టు చూసింది.

ఏదో అనబోయి ఆగింది. బయటపడనీ. అతనంతట అతనే ఓపెన్ అవ్వాలి. తానెదురు చూడగలదు. ఏమీ అర్థం కానట్టు, కామ్ గా నవ్వేసి, "ఇంతకీ ఏముందిందులో..? "అంటూ ప్యాకెట్ విప్పదీసింది. అదేంటో చూస్తూనే ఆమె కళ్ళు పెద్దవయ్యాయి, అంటే ఆ చీర తనకి నచ్చడం చూసి... అంటే తన కోసం.. తనకోసం... ఆమె కళ్ళలో నీళ్లు నిలిచాయి.

"థ్యాంక్యూ సో.. మచ్.. కానీ.. ఐ కాంన్ట్ టేక్ దిస్.. ఇంత కాస్ట్లీ గిఫ్ట్..." చప్పున తన చేత్తో ఆమె నోరు మూశాడు.

"నచ్చిందా లేదా..?" అంటూ చెయ్యి తీశాడు.

"నచ్చడం కాదు భరద్వాజా... ఇంత కాస్ట్.... "మళ్ళీ ఆమె నోటికి అతని చేతి వేలి తాళాలు పడ్డాయి.

"నచ్చిందో లేదో చెప్పు చాలు. కాస్టడగలేదు నేను.." నవ్వుతూ చెప్పాడు. ఈసారి మనోజ్ఞ ఏమీ మాట్లాడలేదు. అతన్నోసారిచూసి తన పెదవులు మూసిన వేలికొసలని ముద్దాడింది. అదిరిపడి చెయ్యి వెనక్కి తీసుకున్నాడు. మెల్లగా చీర ఒళ్ళోపెట్టుకుని అతని చేతిని తన చేతిలోకి తీసుకుని తన ఎదకి హత్తుకుంది. భరద్వాజ రియాక్ట్ అవలేదు. షాకింగా ఆమెనే చూస్తున్నాడు. నెమ్మదిగా అతనికి దగ్గరగా జరిగి అతని భుజానికి తలాన్చుకుని, అతని చేతిని మరింత చేరువగా హత్తుకుంది. అప్పుడు కదిలాడతను...

...విసురుగా లేచి, ఆమెని తన దగ్గరకి లాక్కున్నాడు. మునివేళ్ళతో ఆమె ముఖాన్ని తన వైపుకి తిప్పుకున్నాడు, సన్నగా కంపిస్తున్న ఆమె పెదవులను సున్నితంగా వేలికొసలతో తాకాడు. అది ఒక్క క్షణమే, ఇక అతని మనసు పూర్తిగా వశం తప్పింది. ఆ లేత పెదవులని గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు. ఆ లేత పెదాలు, ముద్దొచ్చే ముఖం, విశాలమైన నుదురు, నల్లని కళ్ళు, పొడవాటి నాసిక, చిన్నిగడ్డం, చూపుకే ఎర్రబారే బుగ్గలు... ఆమె ముఖంలో అణువణువూ ఎక్కడా వదలకుండా ముద్దాడాడు. అన్ని రోజుల నిగ్రహం ఆనకట్ట తెగినట్టు తెగితే ఎలా వుంటుందో తెలిసిందామెకి. సంతోషంతో కళ్ళ నీళ్ళుతిరిగాయి. అతని కౌగిలి బిగువులో ఆనందంతో ఉక్కిరిబిక్కిరైంది. అంతలో స్త్రీ సహజమైన సిగ్గుతో అతన్ని విడిపించుకోబోయింది. నడుం వెనకగా చేయి వేసి అతను దగ్గరగా హత్తుకోవడంతో అంత బలమైన అతని చేతుల్ని తప్పించుకోవడం అసాధ్యమైందామెకి. అంతలో మరింత తమకంగా ఆ లేత పెదాలని మళ్ళీ అందుకున్నాడు.

హఠాత్తుగా షాక్ తిన్నట్టు, అకస్మాత్తుగా అతను స్పృహలోకొచ్చాడు. తటాల్న ఆమెని వదిలేశాడు. అప్పటికే అతని స్పర్శతో ఆమె శరీరం మొత్తం చిగురుటాకులా కంపిస్తోంది. సిగ్గుతో కందిపోయిన ముఖంతో అతని వంక బిడియంగా చూసింది.

"వాట్ యామై డూయింగ్.. ?" అంటూ తనని తాను పైకే మందలించుకున్నాడు. చప్పున లేచి "అయామ్ సో సారీ.. సో సారీ మనోజ్ఞా..." అని చెప్పి వెనక్కి వడివడిగా అడుగులేశాడు. తెల్లబోయి చూసింది. దుఃఖం పొంగుకొచ్చిందామెకి. అంతలో అర్థమైంది.. అతని బాధకి కారణం.. తన వయసు.. తామిద్దరి మధ్యలో నిలిచిన ఏకైక అడ్డుగోడ.. అది గ్రహిస్తూనే రివ్వున అతని వెంట పరుగున వెళ్ళి అతన్నివెనక నుండీ పట్టుకుని హత్తుకుపోయింది. బాధగా ఆమె చేతులు విడిపించుకున్నాడు, "వద్దు మనోజ్ఞా, నన్ను వెళ్ళనీ, ఇది తప్పు.. ఐ కాన్ట్ డూ దిస్ టూ యూ... నేను నిన్ను తప్పుగా ప్రొవకేట్ చేశాను. ఇలా జరిగినందుకు సిగ్గుపడుతున్నాను. అయామ్ సో సారీ..." అతని కళ్ళల్లో బాధ స్పష్టమైంది.

"ఊహు... ఇప్పుడు వెళ్ళనిస్తే మీరు నాకు దక్కరు... నేను మిమ్మల్ని వదులుకోలేను.. ఐ కాన్ట్ లూజ్ యూ భరద్...", అతని చేతులు గట్టిగా పట్టుకుంటూ చెప్పి ఏడవసాగింది, భయంతో. తన కోసం కన్నీళ్ళ పర్యంతం అయిన ఆ కళ్ళని చూసి చలించిపోయాడతను.

అప్పుడప్పుడే వాకింగ్ కి వస్తున్నవాళ్లు , వారిద్దరినీ విచిత్రంగా చూస్తున్నారు. ఆ విషయం పట్టించుకునే పరిస్థితిలో ఆమె ఎలాగూ లేదు. తన అన్నేళ్ళ సెలబ్రిటీ హోదానీ, చుట్టుపక్కల ప్రపంచాన్నీ మొదటిసారిగా మర్చిపోతూ ఆమెని దగ్గరకి తీసుకున్నాడు.

"ఓహ్.. ప్లీజ్ డోన్ట్ క్రై మనూ.. వద్దు..మనోజ్ఞా, అయామ్ సో సారీ.., ఏడవద్దు మనూ.. ప్లీజ్.. అసలిదంతా నేను ముందే ఊహించివుండాల్సింది. నా వయసు..నీ ఏజ్.... " తడబడ్డాడు. "....నీకంటే చాలా... మోర్ దాన్ ఇరవయ్యేళ్ళు పెద్దవాణ్ణి. ప్లీజ్ వద్దిదంతా.. లెట్స్ బీ ఆనెస్ట్. నేనూ..." హఠాత్తుగా ఆమె ఏడుపు ఆపి ఇంకేదో చెప్పబోతున్న అతని పెదాల మీద గాఢంగా ముద్దుపెట్టుకుంది. భరద్వాజ అప్రయత్నంగా దూరం జరిగాడు. "వద్దు మనూ.. దిస్ ఈజ్ నాట్ రైట్.. నువ్వు చిన్న పిల్లవి. నీ ఏజ్.. "

అతనికేసి సూటిగా చూసింది."ఐ లవ్ యూ భరద్.. అండ్ ఐ నో దట్ యూ టూ రియల్లీ లవ్ మీ ద మోస్ట్ అని... ", మొట్టమొదటసారి తన మనసుని మాటల్లో చెప్పిందామె. నిశ్చేష్టుడై నిలబడ్డాడు. అతనా షాక్ నుంచి కోలుకునే లోపు అతని చెంపని ముద్దాడి అక్కడ్నుంచి కదిలింది. స్తబ్దంగా పక్కనున్న బెంచ్ మీద కూలబడ్డాడు. ఆమె వెళ్ళి తానిచ్చిన గిఫ్ట్ ప్యాకెట్ తీసుకుని, చిరునవ్వుతో తనవైపోసారిచూసి అక్కడనుంచి వెళ్ళిపోవడం నిశ్చలంగా చూస్తూ కూర్చున్నాడు.

గాల్లో తేలుతున్నట్టే వెళ్ళి మంచం మీద వాలింది. ఆ చీరని అలాగే అపురూపంగా గుండెకి హత్తుకుని ఉండిపోయింది. సెల్ రింగవ్వడం వినిపిస్తోంది. భరద్వాజే.. తెలుస్తోంది మనసుకి. ప్రేమిస్తే మనసుకి దివ్య దృష్టి వచ్చేస్తుందేమో కూడా... అనుకుంది. తనకి తెలుసు ఎందుకు చేస్తున్నాడో, ఏజ్ గురించి చెప్పి భయపెట్టడానికి.. ఇప్పటివరకూ ఇన్డైరెక్ట్ గా అయింది. ఇక డైరెక్ట్ గా చెప్తాడు. కానీ అవన్నీ పైపై మాటలే.. కళ్ళుమూసుకుని అలాగే పడుకుంది.

రేఖ అడిగింది ఆశ్చర్యంగా, "హాస్పిటల్ కి రావా, ఇప్పుడు పడుకున్నావ్.. ?"

"ఊహు.."

"చేతిలో ఆ ప్యాకెట్ ఏంటి? "కుతూహలంగా అడిగింది.

మనోజ్ఞ జవాబు చెప్పలేదు. రేఖ విచిత్రంగా చూసి వెళ్ళిపోయింది.

సెల్ ఆగకుండా రింగవుతూనే వుంది.. చూడకుండా అలానే పడుకుంది. దాదాపు గంట తర్వాత కాలింగ్ బెల్ మోగడంతో లేచి బలవంతంగా లేచి తలుపు తీసింది. ఎదురుగా భరద్వాజ.. అప్రయత్నంగా వెనకడుగు వేసింది.

"ఏం.. ఫోన్ ఎందుకు తియ్యవు? ఎంత భయంవేసిందో తెల్సా.. ఏమనుకుంటున్నావసలు నీ గురించి నువ్వు..?" లోపలికొస్తూనే కోపంతో గట్టిగా అరిచాడు. గోడనానుకుని నిశ్శబ్దంగా చూస్తోంది.

ఆమె సైలెన్స్ తో అతని కోపం రెట్టింపయ్యింది. రోషంగా మళ్ళీ అరవబోయి ఆమె కళ్ళలోకి చూసి ఆగిపోయాడు. "కాఫీ.. " నెమ్మదిగా అడిగింది. వద్దన్నట్టు తల అడ్డంగా తిప్పాడు.

"నేనూ చాలా బాగా పెడతాను భరద్వాజా.. టేస్ట్ చేయండి.. అలవాటు చేసుకోవాలి మీరు, లైఫ్ లాంగ్ తాగాలి కదా మరి.. " అంటూ లోపలికి నడవబోయింది.

విసురుగా చెయ్యి పట్టి ఆపాడు. "నువ్వేం మాట్లాడుతున్నావో తెలుస్తోందా అసలూ...?" అడిగాడు తీవ్రంగా చూస్తూ.

"ఊహు..తెలీదు. కానీ మీకెంతిష్టమో నేనంటే తెలుస్తోంది.. " అంది అంతే సీరియస్ గా. ఉలికిపాటుతో ఆమె చెయ్యి వదిలేసాడు.

కొద్ది నిమిషాల తర్వాత ఆమె తీసుకుని వచ్చిన కాఫీ మౌనంగా తాగాడు. తర్వాత లేచి వెళ్ళబోతూ, ఆమె వైపు చూశాడు, "వస్తాను. సెల్ ఆన్సర్ చెయ్యి."చెప్పాడు సీరియస్ గా. ఆమె పెదాలు సన్నటి నవ్వుతో అందంగా విచ్చుకున్నాయి. తలూపింది చిరునవ్వుతో.

మర్నాడు మొదటిసారి అరగంట లేట్ గా వచ్చాడు భరద్వాజ, రాత్రంతా నిద్రే లేదని అతని వాలకం చెప్తోంది. అలసటగా, విసుగ్గా వున్నాడతను. మౌనంగా నడిచారు దారంతా. కాఫీకి కూడా ఆగలేదు తిరిగొచ్చేటప్పుడు. మధ్యాహ్నం ఫోన్ లేదు. రాత్రీ లేదు.

ఎన్నోసార్లు అతనితో మాట్లాడాలని, సెల్ చేతిలోకి తీసుకుని, డయల్ చేయాలని ప్రయత్నం చేసి, అంతలో అతని సీరియస్ నెస్ గుర్తొచ్చి ధైర్యం చాలక ఆగిపోయింది. రాత్రి దాటుతుంటే ఇంక వల్లకాలేదు. వణికే చేతులతో డయల్ చేసింది.

"జే.కే. హియర్....", కరుగ్గా వినిపించిందతని గొంతు. కాలర్ పేరు చూడలేదని అర్థం అయ్యింది.

"నేనూ.." ఆగిపోయింది.

"ఓహ్.. నువ్వా.?" అతని గొంతులో చిన్న సంభ్రమం. "ఏంటీ ఈ టైంలో చేశావ్.. ఈజ్ ఎవ్రీథింగ్ ఆల్ రైట్...?" సందేహంగా అన్నాడు.

"ఆ.. అదేం లేదు. ఎందుకో.." ఆగిపోయింది. అతనితో మాట్లాడి సంవత్సరాలైనట్టుంది ఒక్కరోజే తనవల్ల కావట్లేదు. పైగా ఈ ఆగి, ఆగి ఆలోచించి మాట్లాడ్డం మరీ నరకంగా ఉంది. కానీ ఎలా.. చెప్పేది.

"ఏమీ లేదు. గుడ్ నైట్.." వీక్ గా చెప్పింది.

"మనోజ్ఞా..."

"చెప్పండి.." ఉద్వేగంగా అంది.

"నాకు రేపు.. పనుంది.. నువ్వు వెళ్ళిపో వాక్ కి.. నాకూ... కుదరదు.." మాటలు కూడబలుక్కుంటూ చెప్పాడు. మనోజ్ఞకి అతని ముందు ఏడవకుండా ఉండడానికి చాలా కష్టపడాల్సొచ్చింది.

"సరే.." ఆమె గొంతులో జీర అతన్ని దాటిపోలేదు.

మర్నాడు, ఆ తర్వాత రోజూ కూడా అతనికి కుదరలేదు. మూడోరోజు లాన్ లో కూర్చుని అన్యమస్కంగా ఫైలేదో చూస్తున్నాడు.

"హలో మిస్టర్ జే.కే.బీ.." అన్న పలకరింపుకి తటాల్న తలెత్తాడు. మనోజ్ఞ!!

"ఓహ్, నువ్వా కమ్.. కమ్.. ఏంటా కొత్త పిలుపు..?" తడబాటుగా అడిగాడు. ఆమెని ఏదో ఒకరోజు ఫేస్ చేయాలని తెలుసు. కానీ ఏదో తత్తరపాటు.

"కూర్చోవచ్చా సర్..?" అతని ప్రశ్నకి జవాబివ్వకుండా అడిగింది.

"ప్లీజ్. కూర్చో మనూ.. మనోజ్ఞా.." ఆగిపోయాడు. ఆమె హర్టయిందనీ, కారణం తానేననీ తెలుసు. కానీ తప్పదు.

తేరుకుని, "కాఫీ, టీ ఏం తీస్కుంటావు?"ఇంటర్కమ్ తీస్తూ అడిగాడు.

"ఇవి ఇచ్చేసి శలవు తీసుకుంటాను సర్. ఐనా జే.కే. సర్ పనిని డిస్టర్బ్ చేసేంత ధైర్యం నాకు లేదు.." అంది వ్యంగ్యంగా. ఆమె చేతిలో అతని స్వెట్టర్, అతనిచ్చిన గిఫ్ట్ పాకెట్ రెండూ వున్నాయి. అభావంగా చూశాడు. కేవలం తాను రియాక్ట్ కావాలనే ఆమె అలా మాట్లాడుతోందని అర్థమైంది. ఆమె కళ్ళే చెప్తున్నాయి. అవి ఇవ్వడానికంటే ముందు తనని చూడాలని వచ్చిందని.. ఆ కళ్ళలో తన కోసం కురిసే ప్రేమని తాను గుర్తించలేడా.. సడెన్ గా స్నిగ్ధ మాటలు గుర్తొచ్చాయి.

'జీవితంలో మొదటిసారి... నా కళ్ళలో ఉన్న ప్రేమ, తన కళ్ళలోనూ కనిపించింది, కానీ చాలా ఆలస్యంగా.. ఒప్పుకునే ధైర్యం నాకు ఏమాత్రం లేని ఈ పరిస్థితుల్లో...' దిగులు గా అనుకున్నాడు.

"వస్తాను" లేవబోయింది.

"కూర్చో మనోజ్ఞా.. నువ్వు నా పనికి ఇంటరప్షన్ అని ఎప్పుడైనా అన్నానా..డిడ్ ఐ ఎవర్ సే దట్..?"మృదువు గా అడిగాడు.

"కాదని అనుకునే ఇన్నాళ్ళూ మీ వెంట తిరిగాను. కానీ అనుకున్నవన్నీ జరగవని తెలుసుకున్నాను. వస్తాను. సెమినార్ టైం అయింది.." కవర్ అందిస్తూ చెప్పింది. భరద్వాజ కదల్లేదు. వాటిని అదుకునే ప్రయత్నమూ చేయలేదు. ప్లెయిన్ గా చూస్తుండిపోయాడు.

అది గమనించి దాన్ని టేబుల్ మీదుంచుతూ చెప్పింది, "నన్ను అవాయిడ్ చేయలేక మీరు చాలా ఇబ్బంది పడుతున్నట్టున్నారు భర..", తమాయించుకుని, "సారీ.. జే.కే.సర్.. పనుందని చెప్పి, వాకింగ్ మానేసి, బిజీ స్కెడ్యూల్ వంకలూ.. వద్దు సర్.. నావల్ల మీకా శ్రమెందుకని నేనే చెప్పాలని వచ్చాను. మీ టైం కి మీరు వాక్ కి వెళ్ళచ్చు. మీకెవరివల్లా.. ఏ డిస్టర్బెన్స్ ఉండ.. ఉండదులెండి..." ఆమె కంఠం వణికింది.

"అయామ్ వెరీ... సారీ మనోజ్ఞా, రియల్లీ సారీ.." మెల్లగా చెప్పాడు.

"సారీ ఫర్ వాట్ సర్... యూ నీడ్ నాట్ ఫీల్ సారీ ఫర్ ఎనీ థింగ్.. వెళ్తాను." అంటూ విసురుగా లేచి వెళ్ళబోయింది.

"ఒక్కనిమిషం అలా కూర్చో మనూ. నువ్వు చెప్పేది చెప్పేశావు కదా. నేను చెప్పేది కూడా విని వెళ్ళిపో. ఆ తర్వాత నేను నిన్ను ఆపను." గంభీరంగా అన్నాడు.

ఆమె కళ్ళలో కొద్దిపాటి విస్మయం. అతని కంఠంలో వున్న కమాండ్ కి లోబడి, అప్రయత్నంగా కూర్చుండిపోయింది. కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా, భారంగా గడిచాయి. చెప్పమన్నట్టు చూసింది.

"నీకు తెలుసు మనూ, థింగ్స్ ఆర్ నాట్ గోయింగ్ స్ట్రెయిట్ బిట్వీన్ అజ్. నువ్వు.. నువ్వు.. యూ ఆర్ క్వైట్ యంగ్ టు థింక్ ఆన్ దోజ్ లైన్స్. కానీ నా ఏజ్ కి అది కరెక్ట్ కాదు. నేను ఆలోచించి తీరాలి. నాకోసం కాకున్నా నీకోసమైనా. అండ్ సెకండ్ థింగ్ నువ్వు నాకు డిస్టర్బెన్స్ కాదు. ఈరోజే కాదు, ఇప్పుడూ, ఎప్పుడూ, అసలు ఎప్పటికీ కాదు. అండ్ నిన్ను అవాయిడ్ చెయ్యడం అంటే... " ఆగాడు. అతనిలో చిన్నతడబాటు,

"....అంటే అది నాకూ అంత ఈజీ ఏమీ కాదు. ఇప్పుడున్న సిట్యుయేషన్ లో అసలు నేనిలా చెప్పకూడదు. కానీ నీ దగ్గర దాచలేను. ఒకవేళ నిన్ను అవాయిడ్ చేయాలని నిజంగా అనుకుంటే జస్ట్ నిమిషం పట్టదు నాకు. ఆ విషయం నీకూ తెలుసు. ఇక్కడ ఫ్లైటెక్కితే క్షణంలో అక్కడుంటాను. తిరిగి చూడకుండా వెళ్ళిపోవచ్చు. ఒక్కసారి అసెంబ్లీ సెషన్స్ స్టార్ట్ అయ్యాయంటే మనిషినో, మిషిన్నో కూడా గుర్తుండదు. కానీ, నాకలా వద్దు మనూ.. ఐ వాంట్ యూ టూ బీ హాపీ ఈవెన్ వెన్ వియ్ పార్ట్... కానీ అది అబ్రప్ట్ గా జరిగితే బాధగా వుంటుంది. నువ్వలా బిట్టర్ గా వెళ్ళిపోవడం నాకిష్టంలేదు. అందుకే స్లోగా అలవాటు చేద్దామని కొన్ని మీటింగ్స్ అవాయిడ్ చేశాను అంతే.. ప్లీజ్ ట్రై అండ్ అండర్ స్టాండ్. ప్లీజ్... ఇది మనిద్దరికీ మంచిది.."

కొద్ది క్షణాల నిశ్శబ్దం తరవాత, "ఐ లవ్ యూ భరద్వాజా..." అంది మెల్లగా. చివ్వున తలెత్తాడు. కళ్ళుదించుకుని అరిచేతులవంక చూసుకుంటూ నెమ్మదిగా చెప్తోంది., "...మీరిన్ని చెప్పక్కర్లేదు. మిమ్మల్ని ప్రేమించాను. మీ మనసు నాకు తెలుసు. నేను మీ నుంచీ ఏమీ కోరట్లేదు. జస్ట్ నా ఫీలింగ్ చెప్తున్నాను. నావల్ల మీకే ఇబ్బందీ కలుగదు. నా మంచి కోసం అంటూ మీరు నన్ను దూరమూ పెట్టనక్కరలేదు. మీకంటే చిన్నదాన్నే, కాదనను. కానీ చిన్నపిల్లనైతే కాను. అయామ్ సెన్సిబుల్ ఇనఫ్ టు టేక్ మై డెసిషన్స్.."

"మనోజ్ఞా.." అంటూ ఏదో చెప్పబోతున్న అతన్ని వారిస్తూ, "ఇందాకా మీరన్నది.. అదే నేను మీకు డిస్ట్రబెన్స్ కాదన్నమాట.. నిజమైతే.. కనీసం ఇక్కడినుండి వెళ్ళేవరకైనా.. ఈ కొద్ది కాలాన్నీ... కలిసి పంచుకుందాం.. అదీ మీకిష్టమైతేనే.. మీకు సరే అయితే లంచ్ టైంలో కలుద్దాం.. ఎదురుచూస్తుంటాను.. ఉంటానూ.." లేచి వడి, వడిగా గేట్ వైపు అడుగులేసింది.

"మనూ.." అన్న పిలుపుకి గేట్ దాటబోతున్నదల్లా ఆశ్చర్యంగా వెనక్కి తిరిగింది. వేగంగా ఆమెని చేరుకున్నాడు.

"నువ్వు ... నానుంచి ఏదో కోరుతున్నావని నేను భయపడట్లేదు మనూ.. నీతో అలా.. ఇట్స్ నాట్ కరెక్ట్ ఆన్ మై పార్ట్ అని నాకనిపించింది. కానీ.. నిన్ను ఇలా దూరం చేస్కోవడం నాకూ ఏం బాగాలేదు.. అంటే.." ఇంకెలా చెప్పాలో తెలీక ఆగిపోయాడు. సందిగ్ధంగా చూసింది.

"అంటే మీరనేది....?"

"వెల్ అంటే ఏమిటో నాకూ తెలీదు. ఐ కాంట్ లూజ్ యూ ఐదర్. కేన్ వుయ్ బీ.. నో.. వాటై మీన్ ఈజ్ లెట్స్ ట్రై టు బీ లైక్.. లైక్.. గుడ్.. ఫ్రెండ్స్.. ఓ.కే..?" అంటూ తన స్వెట్టర్, గిఫ్ట్ కవర్ ఆమె చేతిలో పెట్టాడు. ఆమె ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. తలూపింది. కళ్ళనిండుగా నీళ్ళొచ్చేశాయి సంతోషంతో.

"వెయిట్.. కార్ కీస్ తెప్పించనీ.. సెమినార్ కి డ్రాప్ చేస్తాను.. "తడబాటుగా చెప్పాడు.

హాస్పిటల్ కి చేరేవరకూ ఏమీ మాట్లాడుకోలేకపోయారు. ఇద్దరి మనసుల్లో చెరో విధమైన ఉద్విగ్నత.

"థ్యాంక్స్ ఎలాట్ భరద్వాజా.. ఫర్ ఎవ్రీ థింగ్.. " కారు దిగి చెప్పింది.

"ఏం.. జే.కే.సర్ అనవా.. ఇప్పుడు..?. "నవ్వుతూ అడిగాడు.

"ఊహు.. ఇక ఎప్పుడూ అనను. వీలైతే మీ ఆఫీస్ కి.. అహా కాదు... అసెంబ్లీకి వచ్చి మరీ అందరి ముందూ భరద్వాజా అని పిలుస్తాను.. " అని నవ్వుతూ వెళ్ళిపోయింది.

ఆమె రూపం కనుమరుగయ్యే వరకూ అలా చూస్తూవుండిపోయాడు. తన వల్ల కాదు. కావట్లేదు. ఆమె కళ్ళలో అంత డిసప్పాయింట్మెంట్ చూడడం... తన తరం కాదు.. కానీ పాపం తనకోసం ఎంతగా కాంప్రమైజ్ అయింది. ప్రేమించవద్దూ, ఫ్రెండ్ గా మెలగమంటే పాపం మనసులో ఎంతగా బాధ పడిందో గానీ, కేవలం కొద్దిరోజులైనా తనకి

దగ్గరగా వుండడంకోసం సరే అంది. గాడ్ ఎలా దూరం అవగలడామెకి..? ఇప్పుడే ఇలా వుంటే మరో నాలుగురోజులయ్యాకా అసలు విడిచి వెళ్ళగలడా.? అది సాధ్యమయ్యేపనేనా.. ఇదేనా ప్రేమంటే.. ఇదంతా ప్రేమేనా...?

"**ఫ్యూ మినిట్స్,** కొద్దిగా వర్క్ చేసుకునీ.. " సంజాయిషీగా చెప్పబోయాడు. నవ్వుతూ వారించిందతన్ని, "ఏం పర్లేదు. కొద్దిగా ఏం పాపం కావల్సినంత వర్క్ చేసుకున్నాకే మాట్లాడండి. నేనేదో కాజువల్ గా వచ్చాను. నాట్ టూ డిస్టర్బ్ యూ అటాల్.. "

"అదేం లేదులే. ఈనాలుగు పేజీలు చదివేస్తే.. పెద్ద బాధ్యత పోతుంది. కూర్చో.. తరువాత హాయిగా టీ తాగుదాం. " చెప్పాడు.

తలూపి పక్కనే ఉన్న మ్యాగ్జైన్ చేతిలోకి తీసుకుంది. అనీజీ గా ఫైల్లో పేజీలు తిప్పాడు. పుస్తకం అంచులమీదుగా మనోజ్ఞ తనని చూడడం తెలుస్తోంది.

ఆమె చూపులే స్పర్శగా మారి తనని తాకుతున్న భావన. ఏదో తెలీని ఇబ్బంది. ఇక చదవడం అయ్యే పని కాదని ఫైల్ క్లోజ్ చేసి తలెత్తాడు. సీరియస్ గా బుక్ చదువుతున్నట్టు నటిస్తున్న మనోజ్ఞని చూడగానే నవ్వొచ్చిందతనికి.

"చాలా కష్టపడి చదువుతున్నట్టున్నావ్? చదివిందిక చాల్లే.." అన్నాడు కాస్త వ్యంగ్యంగా.

అమాయకంగా ముఖం పెట్టి, "ఏం, మీ పనైపోయిందా..?"అంది అంతే పదునుగా.

ఉలిక్కిపడి చూశాడు. అంటే తన పనయ్యిందా అనా లేక తన పనైందనా.. గాడ్ ఎంతైనా ఈ పిల్ల అసాధ్యురాలు అనుకున్నాడు. జవాబు చెప్పకుండా ఇంటర్కామ్ లో టీ ఆర్డర్ చేస్తున్న భరద్వాజ వైపు నవ్వుతూ చూసింది.

"ఇంతకీ మీ పొలిటీషియన్స్ అందరూ వైట్ ఎందుకు వేస్తారు?"అడిగింది.

"కనీసం బట్టలవరకైనా మేం చాలా ప్లెయిన్.. ఐ మీన్ నిర్మలమైనవాళ్ళం అని చూపించుకోవాలి కదా..!" నవ్వాడు.

"అబ్బా.. సీరియస్.. చెప్పండీ.. వాళ్ళ సంగతెందుకు గానీ, పోనీ మీరెందుకలా ఎప్పుడూ వైట్, క్రీం కలర్స్ తప్ప వేరేది వెయ్యరో చెప్పండి? "

"వెల్ పాలిటిక్స్ లోకి వచ్చిన కొత్త లో ఇలాంటి ప్రశ్నలే నాన్నని అడిగేవాడిని. నాన్న చెప్పారు, 'తెలుపు మనలోని స్వచ్ఛత రా! మనలో నిజాయితీ లేనప్పుడు మన వంటి మీద బట్టలు సైతం మనని ప్రశ్నిస్తాయి నీకీ తెలుపు ధరించే హక్కుందా అని. ఆ క్షణం నీకు నువ్వు సమాధానం చెప్పుకోగలిగితే నువ్వీ లోకాన్నే గెలవగలవు. ఎన్నికలో లెక్క కాదు ' అని. అది విన్నాకా నిజంగా సమాధానం చెప్పుకోగలనో లేదో చూద్దామనీ మొత్తం వైట్ కి కన్వర్ట్ అయిపోయాను.."

"మరి చెప్పుకోగలిగారా..?"కుతూహలంగా అడిగింది.

నవ్వాడు చిన్నగా, "అసలంత ఆలోచించే టైం కూడా దొరకనంతగా కూరుకుపోయాను. ఎప్పుడు వీటికి అలవాటు పడిపోయానో కూడా తెలీదు. సో.. అలాగే కంటిన్యూ అయిపోయాను."

"అయితే.. కలర్ ఫుల్ బట్టలే కట్టరా.."

"అలా అనేం లేదు. ఇలా అలవాటైపోయింది. ఎప్పుడో ఫంక్షన్స్ కీ అలా.. అంతే ఈ మధ్య అది కూడా లేదు. పూర్తిగా ఇలాగే. ఇక చాలా మిస్ ఈ ఇన్ఫర్మేషన్.. ఇంతకీ ఎందుకటా ఈ ఇంక్వైరీ.. "

"ఇది చూడండి.." సెల్ అందించింది.

డార్క్ బ్రౌన్ ఫాన్సీ షేర్వానీ లో నవ్వుతున్న తన ఫొటో.

"ఓహ్.. ఇదెక్కడిది నీకు.. రిలేటివ్స్ మారేజ్ అప్పటి ఫొటో అది ఆల్మోస్ట్ 5 ఇయర్స్ బాక్ అనుకుంటా. వేర్ డిడ్ యూ గెట్ ఇట్ ఫ్రమ్.. ?"ఆశ్చర్యంగా అడిగాడు.

గర్వంగా చూసింది, "మనసుంటే మార్గముంటుంది భరద్వాజా..."

"నెట్ లోంచి డౌన్ లోడ్.. ఛాన్సే లేదు. ఎలా.. ప్రభాత్-సువర్ణ తెలుసా నీకు..?"అడిగాడు.

"వాళ్ళెవరు?"

"గాడ్.. వాళ్ళ పెళ్ళి లోదే ఈ ఫొటో. చెప్పెక్కడిది? "

"ఊ.. చాలా సింపుల్ స్వామీ.. అంత ఆలోచించక్కర్లేదు. కాస్త గెస్ చేయండి.. చూద్దాం.."

"ప్చ్.. చెప్పెయ్.."

"పాణి గారు.." నవ్వేసింది.

"మై గుడ్ నెస్ పాణే. నాకు చెప్పకుండా గోరు కూడా కదపడు. అలాంటిది, నా ఫొటో, అదీ నన్నడకుండా ఇచ్చాడంటే.. గుడ్ వర్క్.. బానే ఇంప్రెస్ చేస్తున్నావ్ జనాల్ని.. అసాధ్యురాలివే.." నవ్వుతూ అన్నాడు.

"ఏం లాభం. అవ్వాల్సిన వాళ్ళు కానప్పుడు..."అల్లరి గా నిట్టూరుస్తూ అంది.

భరద్వాజ ముఖంలో నవ్వు మాయమైంది.

"మనోజ్ఞా.. "మందలింపుగా ఏదో అనబోయి సర్వెంట్ టీ తీసుకుని రావడంతో ఆపేశాడు.

"నేను ప్రిపేర్ చేస్తాను, సుగర్ ఎంత? "

"హాఫ్ స్పూన్.. " ఒకింత కోపంగా చెప్పాడు.

"అంతేనా... చాలా.." ఆశ్చర్యంగా అడిగింది.

"ఏజ్ కూడా చూస్కోవాలి కదా. ఇప్పట్నుంచీ కంట్రోల్ లో వుంటేనే బెటర్. తర్వాత సడెన్ గా మానాలంటే కష్టం.. " అన్నాడు ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ.

ఫక్కున నవ్వేసింది మనోజ్ఞ. ఉక్రోషం ముంచుకొచ్చిందతనికి.

"ఎందుకా నవ్వు? నేనేమన్నాతప్పన్నానా. మీ డాక్టర్లూ ఇదే గా చెప్తారు.."

"అవును మహాశయా.. అదే చెప్తాం. కానీ ఇప్పట్నుంచే అన్నీ వదిలేసి సన్యాసం తీసుకోమని చెప్పం.." నవ్వాపుకుంది.

"నేను కూడా కంట్రోల్ చేస్తున్నాను కానీ వదిలెయ్యలేదు.."

"అర్థమౌతోందిలెండి.."

అయోమయంగా చూశాడా మాటకి, "ఏం అర్థమౌతోంది..?"

"మీరు 'కంట్రోల్ 'చేసుకుంటున్నారనీ.."అర్థవంతంగా చూసింది.

"యూ ఆర్ జస్ట్ ఇంపాసిబుల్.." తలాడిస్తూ నిస్పృహగా చెప్పాడు. ఏజ్ గుర్తుచేసి ఆమెని దూరంపెట్టడం అసాధ్యమేమో అని మొదటిసారి అనిపించిందతనికి.

దేవుడి ముందైనా కనీసం ఒక్క క్షణమన్నా ప్రశాంతంగా గడపగలిగితే అంతే చాలు. తన ఆలోచనల తాకిడికి తానే కొట్టుకుపోతున్నాడు.

"గోత్రం..?"పూజారి ప్రశ్నకి తెప్పరిల్లి చెప్పాడు.

"పేరు..?"అంటూ ఇద్దరినీ కనుక్కొని లోపలకు వెళ్ళి అర్చన మొదలు పెట్టాడాయన.

"......గోత్రస్య..., జయకృష్ణభరద్వాజ నామ ధేయస్య.. ధర్మపత్నీ.. మనోజ్ఞా నామ్యాం.. సహకుటుంబానాం..." మనోజ్ఞ ముఖం ఒక్కసారిగా వెలిగిపోయింది. అన్యమస్కంగా వింటున్న భరద్వాజ చప్పున తలెత్తాడు, "...అయ్యా మేమూ.." అంటూ కంగారుగా చెప్పబోయాడు. ఆయన తలతిప్పికూడా చూడలేదతని పిలుపుకి. ఇబ్బందిగా మనోజ్ఞ వంక చూశాడు. పెదాలు బిగించి నవ్వాపుకుంటోంది. చప్పున కళ్ళు మూసుకుని దేవుడికి నమస్కారం పెట్టసాగాడు.

"బాబూ.. హారతి.." అంటూ పూజారి రాగానే భరద్వాజ రియాక్టయ్యేలోపు బ్యాగ్ లోంచి చేతికందినన్ని నోట్లు తీసి ఆయన చేతిలో పెట్టి చప్పున వంగి నమస్కరించింది.

"శీఘ్రమే.. మీకిద్దరికీ.. ఏడాది తిరిగేలోపు పండంటి కొడుకు పుడతాడు.. నా మాట తప్పదమ్మా.. తప్పక ఫలిస్తుంది.. చూస్తుండండి.." అన్నాడాయన పరమానందంగా.

"ఓహ్ గాడ్.." కంగారుగా చెప్పబోయిన భరద్వాజ ఆ మాటలకి ఆగిపోయాడు. అతని పెదాలు అప్రయత్నంగా సన్నటి నవ్వుతో విచ్చుకున్నాయి. అంతలో తమాయించుకుని ముఖంలోకి గాంభీర్యాన్ని తెచ్చుకున్నాడు.

"ప్రసాదం.." నవ్వుతూ చేతిలో పెట్టింది. మౌనంగా అందుకుని మెట్ల వైపు నడిచాడు.

కొబ్బరి పగలగొడుతూ ఆలోచిస్తున్నాడు. అలా ఎలా కనిపించారు తాము జంటలాగా. తనకంటే ఎంత చిన్నదీ.. ధర్మపత్ని.. పండంటి కొడుకు.. ఒక్క క్షణం ఏదో తియ్యని భావన మనసంతా పరుచుకోగా తలతిప్పి మనోజ్ఞని చూశాడు. నిండైన పట్టుచీర, చేతులకి గాజులు, కళ్ళకి కాటుక.. అచ్చమైన తెలుగింటి అమ్మాయిలా చూడముచ్చటగా వుంది. చుడీదార్ లో, ట్రాక్ సూట్లో కనిపించే ఆ మనోజ్ఞేనా ఈమె అని అనిపించేంత ప్రత్యేకంగా.. ఎంతో నిండుగా..... సడెన్ గా ఏదో స్ట్రైక్ అయింది. చీర.. ఎస్.. చీర లో పెద్దరికాన్ని సంతరించుకుని అలా ఉంది గానీ అదే చుడీదార్ లో వస్తే.. తండ్రీ కూతుళ్ళమనుకునేవారా...' ఆ ఊహరాగానే ఒక్కసారిగా మనసు మొత్తం చేదుగా, వాసిలేటింగ్ గా తయారయ్యింది. మదిలో వున్న ఉత్సాహం మొత్తం ఆవిరైపోయింది.

"ఏమాలోచిస్తున్నారు భరద్వాజా..?" అడిగింది మనోజ్ఞ మెట్ల మీద కూర్చుంటూ.

కొబ్బరి ముక్క ఆమె చేతిలో వుంచి తల అడ్డంగాతిప్పాడు ఏమీ లేదన్నట్టు.

అతని వైపు చూసి చిరునవ్వుతో అంది, "అంతగా కూడా ఆలోచించకండి భరద్వాజా.. ఇట్స్ జస్ట్ ఏన్ ఇన్సిడెంట్.."

తలూపాడు, "నేనూ అదే చెప్పాలనుకుంటున్నాను మనూ. ఇట్స్ జస్ట్ ఏన్ ఇన్సిడెంట్, చిన్న కన్ఫ్యూజన్ మాత్రమే. అంతే. ఎక్కువ ఆలోచించకు నువ్వుకూడా.." అన్నాడు సూటిగా.

ఆమె ముఖం పాలిపోయింది. నవ్వు మాయమైంది. నిశ్శబ్దంగా కళ్ళు దించుకుంది.

తనమీద తనకే అసహ్యం వేసింది. 'మరీ అంత పదును మాట్లాడి ఒక్కసారిగా ఆమె మనసు గాయపరచాలా. తనని తాను నిగ్రహించుకుంటే సరిపోతుందిగా. ఆమెనంతగా బాధ పెడితే తన మనసుకీ కాదూ మానని గాయం.. '

"మనూ.." బాధగా పిల్చాడు.ఆమె కళ్ళెత్తలేదు. స్తబ్దంగా అలాగే వుండిపోయింది.

"అయాం సారీ.." మెల్లగా అన్నాడు. తలూపింది.

"క్షమించవూ.." అడిగాడు. అతని గొంతులోని ఆర్తికి కదిలిపోయింది.

"ఛ.. అదేం మాట భరద్వాజా..మీకూ నాకూ మధ్య క్షమాపణలేంటి.. పదండి వెళ్దాం.. ఆకలేస్తోంది.. ముందేమన్నా తిందాం.." తేరుకుని తొందర చేసింది.

ఆమె మనో నిబ్బరానికి ఆశ్చర్యపోతూ కదిలాడు. 'ఎంత నిబ్బరం, ఓపికా ఈ అమ్మాయికి. తనలో పోయిందా సంయమనం. ఎప్పుడూ లేనిది తొందరపడి మాటతూలుతున్నాడీమధ్య. అదీ మనోజ్ఞనే ఎక్కువగా హర్ట్ చేస్తున్నాడు. తనని ప్రేమించినంతమాత్రాన తనకామెని మాటతూలే హక్కయితే రాలేదు కదా. కాస్తంత సెల్ఫ్ కంట్రోల్ పాటించు జే.కే. 'తనని తాను మరో సారి మందలించుకున్నాడు.

ప్రతిరోజూ మెలకువ కాగానే నా కళ్ళముందు మెదిలే అందమైన ఊహాచిత్రం మనోజ్ఞ. మళ్ళీ ఓ కొత్త రోజు పుట్టింది ఆమెని నాతో కలపడానికి అనుకోగానే నాలో ఏదో కొత్త ఉత్సాహం పొంగుకొస్తుంది. ప్రతీసారీ ఆమెని కలిసే ముందు నాకు నేను ఎన్నో విధాలుగా నచ్చజెప్పుకుంటాను. తనతో చనువుగా మెలగొద్దనీ, తనని తాకొద్దనీ.. ఇంకా ఎన్నో.. ఎన్నెన్నో.. మరెన్నోసార్లు నా వయసుని గుర్తు తెచ్చుకుంటాను.

కానీ, మనోజ్ఞ కనిపించడంతోటే మొత్తం మారిపోతుంది. .. నా మనసు మాట వినదు...

బుద్ధి, చదువు, ఆలోచన, జ్ఞానం, విచక్షణ–సర్వం తానైపోతుంది. ఏదో మాగ్నటిక్ పవర్ తన నుంచి నావరకూ ప్రవహిస్తున్న భావన. నాకు తెలియని కొత్త పరిమళమేదో చుట్టుముట్టిన అనుభూతి.

ఇవన్నీ చెప్తే తను నవ్వుకుంటుందేమో. ఊహు.. ఐనా ఎందుకు చెప్తాను. ఒక్కసారి చెప్పేస్తే ఆశ కలుగదూ.. తనూ నన్నంతగా ఇష్టపడాలనే కోరిక మొదలౌతుంది. నేనంత ఇస్తే తను నాకింత తక్కువ చేసిందన్న కంపారిజన్.. మెల్లగా తననుంచి ఏదో కావాలన్న ఎక్స్పెక్టేషన్, స్వార్థం,.. నో.. వీటన్నింటితో పవిత్రమైన నా ప్రేమ ప్రవాహాన్నెలా కలుషితం చేస్తాను. అందుకే..చెప్పను..

అసలు ప్రేమించడం కంటే, ప్రేమించానన్న ఆలోచనే ఎంతో మధురం. ఈ కన్ఫ్యూజ్డ్ స్టేట్ ఇంకా బాగుంది.

అసలు ప్రేమించడం అంటే ప్రేమని ఇవ్వడమే అన్నారెవరో. ఎంత మధురమైన మాట. ప్రేమంటే ఇవ్వడమే అయితే నన్ను నేను తప్ప నీకేమివ్వగలను.

నేనెంత స్వార్థపరుడిని, నీమీద నాకున్న ప్రేమ సైతం నా సొంతం మాత్రమే అన్నట్టు, నీ నుంచే దాచడం స్వార్థం కాక మరేమిటి?

ఈ అద్భుతమైన భావమేనా ప్రేమ. మొత్తం ప్రపంచాన్నే కదిలించగలిగే ప్రేమ నన్ను స్పృశించదనుకున్న నేనెంత వెర్రివాడినో కదూ..

ఊహూ.. దాచలేను నేస్తమా... ఆ విశాలమైన కళ్ళలోకి చూస్తూ, స్వచ్ఛంగా మెరిసే ఆ కన్నీటికి నేనేం జవాబివ్వను. ఓ మై ఏంజిల్.. నీ కళ్ళలో... నేనెవర్ని? ఎంతో ఆశగా నీవందించే ప్రేమామృతాన్ని వద్దనుకుంటున్న మూర్ఖుడినే కదూ!

"హొటల్ చాలా బాగుంది సంజయ్.. నాకు తెలీదు ఇక్కడ ఇంత మంచి రెస్టారెంట్ వుందని..", చెప్పాడు చుట్టూ చూస్తూ భరద్వాజ.

"థాంక్యూ సర్. ఇలాంటి ఒక ప్లేస్ వుందని మాకూ మొన్ననే తెలిసింది. కాకపోతే బాగా దూరం.. చుట్టూ లోన్లీ గా ఉంది.." చెప్పాడు సంజయ్.

"ఔను.. ఇలాంటి చోట లంచ్ బెటర్ డిన్నర్స్ కంటే మీరూ ఆడపిల్లల్తో కలిసి వస్తారు కదా. ఎనీవేస్.. మంచి ప్లేస్, గుడ్ ఛాయిస్... ఇంతకీ.... ఇంకా ఎన్నాళ్ళున్నాయి మీ సెమినార్స్..? "అడిగాడు.

"థ్యాంక్యూ... ఇంకా వన్ మంత్ వుంది సర్.. ఇక్కడ మేం మొత్తం టూ మంత్స్ వున్నట్టౌతుంది.. కానీ అస్సలు బోర్ కొట్టట్లేదు. గ్రేట్ ప్లేస్... ఎన్నో హిల్ స్టేషన్స్ వుండగా మీరిక్కడే కాటేజ్ ఎందుకు కట్టించుకున్నారో తెలుస్తోంది సర్. ఇంత అందమైన లొకేషన్ ఎక్కడా చూడలేదు. బిజీ యట్ పీస్ ఫుల్.. హాపెనింగ్ యట్ కామ్.." చెప్పాడు సుధీర్.

"అవును.. సో ఐతే మీ హనీమూన్ కి నువ్వూ, నవ్యా ఇక్కడికే వస్తారన్నమాట..?" నవ్వుతూ అడిగాడు. మొహమాటంగా చూశాడు సుధీర్.

"సర్, నెక్స్ట్ ఎలక్షన్ లో మీ పార్టీ రాదంటున్నారందరూ.., డిప్యూటీ సీ.ఎం గారికి ఎవరితోనూ పడట్లేదనీ, పార్టీ చీలిపోతుందనీ.. అలా జరిగితే మీరా డిప్యూటీ ఐ మీన్.. పురుషోత్తమ్ గారితో వెళ్ళిపోతారా..?"కుతూహలంగా అడిగాడు రఘు.

"మరీ పదవి కోసం పదిసార్లు పార్టీలు మార్చే గోడమీది పిల్లిలా కనిపిస్తున్నానేంటయ్యా.." నవ్వుతూ అడిగాడు భరద్వాజ.

సిగ్గుపడ్డాడు రఘు, "సారీ సర్.. క్యూరియాసిటీ ఆపుకోలేక అడిగేశాను.."

"ఏం పర్లేదు.. ఐనా ఇక్కడ కూడా రాజకీయాలెందుకు, మీ విశేషాలు చెప్పండి.. వింటాను.."

"మా దగ్గరేముంటాయి సర్ చెప్పడానికి, మీరు సెలిబ్రిటీస్, మీ దగ్గరే కదా అన్ని విశేషాలుండేది... " అన్నాడు ఆనంద్. అతని మాటల్లో శ్లేష ధ్వనించింది. స్నాక్స్ సర్వ్ చేస్తున్న సంజయ్ ఉలిక్కిపడి చూశాడా వాయిస్ లో పదునుకి.

అదేమీ పట్టించుకోకుండా, "మీ యంగ్స్టర్సే అలా అంటే ఎలా ఆనంద్..?", క్యాజువల్ గా అన్నాడు భరద్వాజ.

"దాటేస్తున్నారు చెప్పకుండా.." ఆనంద్ రెట్టించాడు.

"సరే అడుగు ఏం విశేషం చెప్పమంటావో..." నవ్వుతూ అడిగాడు ఫోర్క్ తో మంచురియా తీసుకుంటూ.

"పోనీ.." అంటూ ఆగి భరద్వాజ మొహంలోకి సూటిగా చూస్తూ అన్నాడు. "మాళవిక గారి గురించి చెప్పండి.. మీకు సంబంధించిన విశేషమేట కదా ఆవిడ...!!"

ఫోర్క్ నోట్లో పెట్టుకోబోతున్న భరద్వాజ అప్రయత్నంగా కళ్ళెత్తి చూశాడు. ఆనంద్ మొహంలో ఒకలాంటి సాటిస్ఫాక్షన్ కనిపించింది. అది తనని ఇరుకున పెట్టడంవల్ల వచ్చినదని అర్థమైంది. అతని రోషానికి గల కారణమూ అర్థమవ్వగా, "వేరే వాళ్ళ విషయాలెందుకులే ఆనంద్.." అన్నాడు గంభీరంగా.

"అదేంటి సర్... ఆవిడ.. అదే ధర్మారావుగారి వైఫ్, అదే మాళవిక గారు, మీకు బాగా క్లోజ్ అట.... ఐ మీన్ పొలిటికల్ సర్కిల్స్ లో చెప్పుకుంటున్నారు.. అలాంటప్పుడు వేరేవాళ్ళు ఎలా అవుతారు. చెప్పండి సర్.."

అందరి ముఖాల్లో టెన్షన్, సంజయ్ చప్పున ఆనంద్ భుజం మీద చెయ్యివేశాడు, ఇంక ఆపమని వారిస్తున్నట్టుగా. ఆనంద్ లెక్క పెట్టలేదది. భరద్వాజ వంక చూశాడు చెప్పమన్నట్టు.

కుర్చీలో నెమ్మదిగా వెనక్కి వాలి సూటిగా చూశాడు భరద్వాజ., మనోజ్ఞ వింటోదని తెలుసు. విననీ. తనేమిటో పూర్తిగా తెలవనీ, ఆలోచనలని పక్కకి నెడుతూ అడిగాడు, "ఏం తెలుసుకోవాలి ఆనంద్.. ఏం చెప్పమంటావ్. షీ వాజ్ మై ఫ్లింగ్ సమ్ టైమ్ బ్యాక్ అన్నవిషయం ఎవరూ చెప్పలేదా ఆ పొలిటికల్ సర్కిల్ లో..?"

"వేరొకరి భార్య.. మీ ఫ్లింగ్.. గ్రేట్.. చాలా గొప్ప మోరల్స్ వున్న లేడీ సర్... మీ మాళవిక గారు.." వెటకారంగా అన్నాడు.

"ఈ ప్రశ్న రోజుకో అమ్మాయితో గడిపే ధర్మారావ్ ని ఎవ్వరూ అడగరనుకుంటాను..." కూల్ గా అన్నాడు భరద్వాజ.

"ఓహ్.. కరక్టే.. మరి ద గ్రేట్ జే.కే.బీ. గారి మోరల్స్ మాటేంటి సర్..? వేరే వ్యక్తి భార్య–మీ ఫ్లింగ్.. చాలా క్లీన్ ఇమేజ్ వున్నట్టు మాట్లాడుకుంటారు కదా జనం మీగురించి...." ఆనంద్ కళ్ళలో పూర్తి స్థాయి ద్వేషం.

అందరి ముఖాలూ భయంతో వాడిపోయాయి. మనోజ్ఞ ముఖంలో మాత్రం ఏ భావమూ లేదు తలెత్తకుండా ప్లేట్ లో ఐటమ్స్ ఫోర్క్ తో సెపరేట్ చేస్తోంది కామ్ గా. సుధీర్ కోపంగా చూశాడు, "రేయ్.. ఇక చాలు... నోర్మూయ్యింక... సారీ సర్.." కంగారుగా చెప్పాడు.

"ఏరా.. తప్పేం అడిగాను. హైలీ క్లీన్ ఇమేజ్ వున్న పొలిటీషియన్ అని మీడియా వాళ్ళు తెగ ప్రొజెక్ట్ చేస్తుంటారుగా.. ఏం సర్.. చెప్పండి?" రోషంగా అన్నాడు ఆనంద్.

"వెల్... తప్పేంలేదు ఆనంద్. కానీ, జనానికీ, మీడియా వాళ్ళకి ఎప్పుడూ నా పర్సనల్ లైఫ్ కి సంబంధించి నేనే ఇమేజూ ప్రొజెక్ట్ చేయలేదు. చేయాలనుకోను కూడా. సో వాళ్ళ ప్రొజెక్షన్ కి అయామ్ నాట్ రెస్పాన్సిబుల్. అండ్ కమింగ్ టూ మై మోరల్ పార్ట్... రాజకీయాల్లో సెక్స్ కూడా ఓ భాగమే అయిపోయింది. ఒక్కోచోట అదే చాలా పెద్ద ఆయుధమైతే, మరో చోట చాలా చిన్నపదం. ఇక్కడ జీవితంలో ఒక స్టేజ్ తర్వాత ఎథికల్ వాల్యూస్ కి, మోరల్స్ కి డెఫినిషన్ పూర్తిగా మారిపోతుంది ఆనంద్. కనీసం నేనా పరిమితులు దాటలేదన్న ఆత్మ సంతృప్తి నాకుంది. అది చాలు నాకు. ఈ విషయంలో ఐ డోన్ట్ ఓవ్ ఎనీ ఎక్స్‌ప్లనేషన్ టూ ఎనీ వన్. ఇది ఎక్స్‌ప్లనేషనూ కాదు, నన్ను నేను సమర్థించుకోవడానికి అంతకన్నా కాదు. నువ్వు తెలుసుకోవాలనుకున్నావని చెప్తున్నాను. మాళవికతో నా పరిచయానికి మూలం ధర్మారావు ప్రోద్బలమే. మా గురించి అతనికి క్లియర్ గా తెలుసు. సో అది అతని వెనుక జరిగిన మోసమూ కాదు, నేను దగా చేసే భార్యా నాకు లేదు. ఇట్ వాజ్ ఏ క్లియర్ కట్ ఓపెన్ ఎఫైర్... అండ్ గాట్ ఓవర్ లాంగ్ టైం బ్యాక్. ఇప్పుడు మాట్లాడ్డం

ప్యూర్లీ అనవసరం. చేసిన పని నీతిబాహ్యమైనదే, కానీ అందులో విక్టిమ్స్ అంటూ ఎవరూ లేరు.. ఆ తేడా నీకు ఇప్పుడు తెలీదు. చిన్నవాడివి. లోకాన్ని చూశాకా నీకే అర్థమౌతుంది.." ప్రశాంతంగా చెప్పాడు భరద్వాజ.

"మరి అదే తప్పు మీ పట్ల జరిగితే... మీ భార్యే చేస్తే.."

అందరూ ఆ సంభాషణ ఎటు వెళ్తోందో తెలీక బిత్తరపోయి చూస్తున్నారు. మనోజ్ఞ కనీసం కళ్ళెత్తి కూడా చూడట్లేదు. స్తబ్దంగా ఉంది.

ఒక్కసారి గాఢం గా ఊపిరి తీసుకుని,ఆగి చెప్పాడు., "....పార్టనర్ గా నేను ఫెయిలైనట్టు. సో నా ఓటమి కి వేరొకరిని ఎలా నిందిస్తాను. పరోక్షంలో నా స్థానం వేరొకరికిచ్చేంతగా పాడైన రిలేషన్ కి ఇక విలువేముంటుంది.. దాని కోసం ప్రాకులాడి ఏం ప్రయోజనం?"

"ఓ.. అంటే వదిలేస్తారా. మీరు చేస్తే రాజకీయంలో భాగం, అదే మీ పార్టనర్ చేస్తే వ్యభిచారమా.." హేళనగా అన్నాడు.

"వదిలేస్తాను అనడంలేదు ఆనంద్. భార్య ఒక ట్రంప్ కార్డ్ ఐతే, సొంతం అనే ఫీలింగ్ లేకపోతే వేరు. రిలేషన్ అనేది ఒక బాండింగ్ అని నమ్మితే వేరు అని చెప్తున్నాను.." ఓపిగ్గా చెప్పాడు భరద్వాజ.

"ఐతే .. మీరు.. రిలేషన్ ని బాండింగ్ అనుకుంటారా.. ఒకవేళ మీకు పెళ్ళై వుంటే మీ భార్యని.." అంటూ ఇంకేదో అనబోతున్న ఆనంద్ ని మధ్యలో కట్ చేస్తూ అన్నాడు భరద్వాజ, "లేని విషయాలు గురించెందుకు ఆనంద్.."

"సరే... లేని విషయాలొద్దు.మరి అంతంత గొప్ప ఫిలాసఫీలున్న మీరు పెళ్ళెందుకు చేసుకోలేదు..? లేక చాలా తొందర్లో ఎవర్నైనా చేసుకోబోతున్నారా..? "సూటిగా అడిగాడు.

అభావంగా చూశాడు భరద్వాజ.

"ప్రతి జీవికీ గుర్తింపు కావాలి. ప్రతీ రిలేషన్ కీ నరిషింగ్, రెసిప్రోకేషన్ కావాలి. అది పెంపుడు జంతువైనా, మొక్కైనా, స్నేహితులైనా, భార్యైనా, పిల్లలైనా, ఎవరైనా గుర్తింపూ, ప్రేమాదరణలూ ఇవ్వలేకపోతే, ఆ రిలేషన్ని నరిష్ చేయలేకపోతే వాటి జోలికి పోయే అర్హత మనకి లేనట్టే. అవన్నీ ఇచ్చే ఏజ్ గానీ, టైమ్ గానీ నా దగ్గర లేవు. గాట్ ఇట్.. నీ ప్రశ్నలకి జవాబు దొరికిందిగా.. సో నౌ ప్లీజ్ ఎక్స్క్యూజ్మీ.." అంటూ తాపీగా లేచి వాష్ రూమ్ కేసి వెళ్ళిపోయాడు.

రెండు క్షణాల పాటు ఎవ్వరూ మాట్లాడలేదు. ముందుగా తేరుకున్నది సంజయ్.

"పిచ్చేవన్నాఎక్కిందేంట్రా నీకు, నీకెందుకాయన పర్సనల్ విషయాలు., ఆయన్ని మనం డిన్నర్ కి గెస్ట్ లా పిల్చాం, అంతేగానీ అవమానించడానికి కాదు." అరిచాడు కోపంగా.

"ఏం తప్పేమైంది. నాకేం తప్పు కనిపించిలేదు నేనడిగినదాంట్లో, అండ్ నా మాటలకి సమాధానం చెప్పిన ఆయనా బానే వున్నాడు. మధ్య మీకేమొచ్చిందీ..." విసురుగా అన్నాడు.

"బాధ..." హఠాత్తుగా అంది మనోజ్ఞ. ఉలిక్కిపడి అందరూ ఆమె వైపు చూశారు. ప్లేట్ మీంచి చూపు మరల్చకుండానే చెప్పిందామె, "బాధ ఆయన తో నీ వాదం గురించీ కాదు, మాళవిక టాపిక్ గురించి అంతకన్నా కాదురా. ఆయన నాకెంత ఇంపార్టెంటో తెలిసీ, నువ్వలా మాట్లాడావు చూడూ.." అంటూ తలెత్తింది. ఆమె కళ్ళనిండుగా నీళ్ళు.

ఆనంద్ మొహం ఒక్కసారిగా పాలిపోయింది., "అయాం... అయాం సో సారీ మనూ..అస్సలాలోచించలేదు నువ్వింతలా ఫీలౌతావని.. అయాం రియల్లీ..."

అతన్ని వారిస్తూ రెండు చేతులూ జోడించి లేచింది మనోజ్ఞ, "వద్దురా. చాలు. నాకే సారీలూ వద్దు. నేను వెళ్తాను.నా మాట మీద ఏ మాత్రం గౌరవం వున్నా, పిలిచినందుకు ఆయనకి కనీసం భోజనం ఐనా ఏ మాటలూ అనకుండా పెట్టి పంపండి చాలు... ప్లీజ్.." అనేసి విసురుగా బయటకి వెళ్ళిపోయింది.

నిశ్శబ్దంగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. అంతలో భరద్వాజ తిరిగి వచ్చాడక్కడికి., "ఏమైందంతా నిలబడ్డారేం...?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అదేం లేదు సర్.. కూర్చోండి.. ప్లీజ్.. "చప్పున తేరుకుని చెప్పింది నవ్య. అందరూ తలలూపారు ఏమీ లేదన్నట్టు. కూర్చోబోతూ చూశాడు భరద్వాజ, మనోజ్ఞ కుర్చీ ఖాళీగా వున్నదని... అడగబోయి తమాయించుకున్నాడు. అన్యమస్కంగా ప్లేట్స్ దగ్గరకి జరుపుకున్నారంతా.

"సర్.." ఇబ్బందిగా పిల్చాడు ఆనంద్. ఏమిటన్నట్టు చూశాడు భరద్వాజ. అతని ముఖం మామూలుగా వుంది. పాలిటిక్స్ లో వున్నందువల్ల కోపాన్ని కప్పిపుచ్చుకుంటున్నాడో, లేక నిజంగానే కూల్ గా వున్నాడో అర్థంకాలేదతనికి.

అయోమయంగా చూసాడు ఆనంద్, "ఆక్ట్యువల్లీ అయాం వెరీ... " అంటూ ఏదో చెప్పబోతుండగా వినిపించిందా కేక.. "హెల్ప్..........."లీలగా. ఒక్కక్షణం మొహాలు చూసుకున్నారు. తాము విన్నదేంటో వాళ్ళకి బోధపడే లోపు గాలిని చీల్చుకుంటూ మరో అరుపు....

ఒక్కవుదుట్న లేచాడు భరద్వాజ, "మనోజ్ఞా.." అంటూ రివ్వున బయటకి పరుగుతీశాడు. ఒక్క నిమిషం అర్థంకాకుండా చూసి చప్పున విషయం స్ఫురించి అందరూ అతని వెనకే పరిగెట్టారు.

బయటికొస్తూనే చూశాడతను, కార్ల మధ్య కొందరు వలయంలా నిలబడగా వారి మధ్యలో నేలకొరిగి ఒకడి చేతుల్లో పెనుగులాడుతూ నిస్సహాయంగా కేకలువేస్తోందామె.

అది చూస్తూనే భరద్వాజ కళ్ళల్లో నిప్పులు చిమ్మాయి. విసురుగా వాళ్ళని తోసేస్తూ వెళ్ళి మనోజ్ఞని పట్టుకున్నవాడ్ని సాచిపెట్టి కొట్టాడు. ఊహించని ఆ దెబ్బకి వాడు ఎగిరిపడ్డాడు. వెళ్ళి చప్పున మనోజ్ఞ లేవనెత్తాడు. ఏడుస్తూ భరద్వాజని

కరుచుకుపోయిందామె, "వాళ్ళూ.. వాళ్ళూ... "అంది వెక్కుతూ. తేరుకున్న ఆ వ్యక్తులు విసురుగా భరద్వాజ వైపు వచ్చారు. షాకై చూస్తున్న సంజయ్, ఆనంద్ స్పృహలోకి వచ్చి వేగంగా భరద్వాజకి రెస్క్యూకి వచ్చారు.

అంతలో మెరుపుల్లా ఎక్కడ్నిచో ప్రత్యక్షమయ్యారు భరద్వాజ సెక్యూరిటీ గార్డులు. నిమిషాల్లో అక్కడి సీన్ మారిపోయింది. వాళ్ళందరినీ వాయగొట్టి తీసుకొచ్చి భరద్వాజ ముందు నిలబెట్టారు. మనోజ్ఞని నవ్య చేతుల్లోకినెట్టి విసురుగా వాళ్ళవైపు నడిచాడతను. భరద్వాజని అంత రౌద్రంగా ఎప్పుడూ చూడలేదెవ్వరూ. అతని ముఖం కోపంతో జేవురించింది. మనోజ్ఞని అటాక్ చేసినవాడి కాలర్ పట్టుకున్నాడు ఆవేశంగా, "ఆడపిల్లలమీద అఘాయిత్యాల్చేస్తార్రా.. స్కౌండ్రల్.. హౌ డేర్ యూ టచ్ మై గర్ల్...?"అంటూ పిడికిలి బిగించి లాగికొట్టాడు. అప్పటికే తన్నులు తినున్న వాడికి ఆ దెబ్బకి పళ్ళన్నీ కదిలాయేమో, గట్టిగా అరుస్తూ కుప్పకూలాడు. విసురుగా వాడ్ని పైకి లేపబోయిన భరద్వాజని వారిస్తూ ముందుకొచ్చాడొక సెక్యూరిటీ ఆఫీసర్. "సర్.. ప్లీజ్ కంట్రోల్ చేసుకోండి... మన వాళ్ళు చూసుకుంటారు వాళ్ళ సంగతి.. ప్లీజ్.. మీరు వెళ్ళండి.." అన్నాడు.

వాళ్ళవైపోసారి చూసి వెనక్కితిరిగాడు భరద్వాజ. పూర్తిగా బెదిరిపోయి నవ్య చేతుల్లో ఒదిగి ఇంకా వెక్కుతున్న మనోజ్ఞని చూసి అతని గుండె ద్రవించిపోయింది.

సెక్యూరిటీ ఆఫీసర్ వంక చూసి, "తోలు వలిచేయండి విశ్వనాథ్. మీరేంచేస్తారో నాకు తెలీదు. జీవితంలో ఇంకోసారి ఆడదీమకేసి చూడాలన్నా వణకాలి.." తీవ్రంగా చెప్పి ఆగి, "...జాగ్రత్త అమ్మాయి పేరు ఏమాత్రం బయటికి రాకూడదు.." అంటూ ఆర్డర్ వేసి మనోజ్ఞ వైపుకి కదిలాడు.

చిరిగిన బట్టలు, చెదిరిన జుట్టూ, ఏడుస్తూ దయనీయంగా వున్న మనోజ్ఞని చూసి అతని కళ్ళలో నీళ్ళుతిరిగాయి. జాలిగా ఆమె తల మీద చెయ్యి వేశాడు., "మనోజ్ఞా.." నెమ్మదిగా పిలిచాడు. కళ్ళెత్తి దీనంగా చూసిందామె. అంత దారుణమైన హఠాత్ సంఘటన నుంచి తేరుకోలేక ఇంకా సన్నగా వణుకుతోందామె, "ఏం భయంలేదు. మేమంతా వున్నాంగా.." ఓదార్పుగా చెప్పబోయాడు. అంతలో నవ్య నుండి విడివడి భరద్వాజని పట్టుకుని ఏడవసాగింది బావురుమంటూ. ఒక్కసారి తటపటాయించి వెంటనే ఆమెని పొదివిపట్టుకున్నాడు.

"ఇలా చూడు.. ఇప్పుడేమైందనీ..ఇట్స్ ఓ.కే. ఏడవకు. ప్లీజ్.. ఏమీ కాలేదు. పద ముందు లోపలికెళదాం.. మీరంతా ఏంటలా.. పదండందరూ.." అంటూ చిరిగిన ఆమె డ్రస్ ని దుపట్టాతో కప్పుతూ ఆమెని హోటల్ లోపలికి నడిపించాడు. అందరూ యాంత్రికంగా వాళ్ళని అనుసరించారు.

కూర్చున్నాకా చాలాసేపు అంతా స్థాణువులై వుండిపోయారు. తృటిలో ఎంత ప్రమాదం తప్పిందో తలుచుకుంటుంటే వాళ్ళకందరికీ దుఃఖం ముంచుకొచ్చింది.

పరిస్థితి గమనించి భరద్వాజే భోజనం ఆర్డర్ చేశాడు. మనోజ్ఞని అలాగే పొదివి పట్టుకుని కూర్చున్నాడు ఫుడ్ వచ్చేవరకూ.

నిస్తేజంగా చూసారంతా భోజనం వైపు.

"చూడండి. ఇంక తినాలి మరి. మనోజ్ఞా.. నువ్వు వెళ్ళి ఫ్రెష్ అయి రా.. ఏం కాలేదు. ఒక యాక్సిడెంట్ అంతే.. ఐనా మరీ ఇంత భయస్తులైతే ఎలా మీరంతా.." అంటూ నవ్వడానికి ప్రయత్నించాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

"నాకు.. ఆకలేస్తోంది మరి... డిన్నర్ కి పిలిచి భోజనం పెట్టరా..?" అడిగాడు. మనోజ్ఞ మెల్లగా తలెత్తి చూసింది. అందరూ ఆమెనే చూస్తున్నారు. నెమ్మదిగా అతడి నుండి దూరంగా జరిగి పైకి లేచింది. భరద్వాజ కళ్ళు మెరిశాయి, "గుడ్, వెళ్ళి ఫ్రెష్ అయి రా.." అంటూ నవ్య వంక చూశాడు. అతని భావం అర్థమైన నవ్య లేచి మనోజ్ఞతో పాటు లోపలికి నడిచింది.

కాసేపటి తర్వాత అతి కష్టంమీద తిన్నామనిపించారంతా. డిన్నర్ పూర్తయ్యాకా కార్ల దగ్గర కి నడిచారు భయంగా భయంగా చుట్టూ చూస్తూ.

"నా గార్డ్స్ మీతో వస్తారు. రాత్రికి అక్కడే వుంటారు. ఏదైనా అవసరమైతే వెంటనే ఫోన్ చేయండి.." చెప్పాడు భరద్వాజ.

తలలూపారు.

అతను కారెక్కబోతుంటే పిలిచింది మనోజ్ఞ, "భరద్వాజ గారూ.. ఒక్క మాట.."

తడబడే అడుగులతో అతన్ని చేరుకుంది.

"చెప్పు మనోజ్ఞా, ఏమన్నా కావాలా.. " లాలనగా అడిగాడు.

"థ్యాంక్యూ.. థాంక్యూ సో మచ్.." మాటలు పేర్చుకుంటూ చెప్పింది.

చిన్నగా నవ్వాడు, "నాక్కాదు, గార్డ్స్ కి చెప్పు. ముందొచ్చింది నేనైనా, యాక్చ్యువల్ గా సిట్యూయేషన్ కంట్రోల్ చేసింది వాళ్ళే.."

"కాపాడినందుకే కాదు.."

విచిత్రంగా చూశాడు" మరి దేనికి..?"

తలెత్తి అతని కళ్ళలోకి చూసింది, "మీ ఆవేశం చూశాను. నాకోసం.. నాకేమన్నా ఐతే మీకెంత కోపం వస్తుందో, మీరెంత విలవిల్లాడతారో..." ఆగింది.

"అదీ.." తడబడి అంతలోనే సర్దుకున్నాడు., "ఆ పరిస్థితి లో ఏ ఆడపిల్ల వున్నా అలాగా రియాక్టయ్యేవాడ్ని. ఎవరైనా అంతే అవుతారు కదా. ఐనా కళ్ళముందు అన్యాయం జరుగుతుంటే చూస్తూ.."

"గుడ్నైట్ భరద్వాజా.." అతని మాటల్ని తుంచేస్తూ చెప్పింది. బాధగా చూసాడు. ఆ కండిషన్లో కూడా నిజం ఒప్పుకోలేని తన అసహాయతకి గిల్టీగా తల వంచుకుని కారెక్కాడు.

కారు కదలబోతుంటే అంది, "వన్ మినిట్.." కారాగింది. తలెత్తి ఆమె వైపు చూశాడు. విండో మీద చేతులాన్చి ముందుకు వంగింది, "ఏ ఆడపిల్లవున్నా... మై గర్ల్ అనే అనేవారా భరద్వాజా..?" ఆమె ముఖంలో మళ్ళీ నవ్వు విచ్చుకుంది. భరద్వాజ ముఖం ఎర్రబడింది. నవ్వాపుకుంటూ తన కారుకేసి పరిగెట్టింది. విషయం అర్థంకాక అయోమయంగా చూస్తున్న నవ్యని గట్టిగా కౌగలించుకుని బుగ్గమీద ముద్దు పెట్టుకుంది. నవ్వుతూ భరద్వాజ వైపు చూసి చెయ్యూపింది. అందర్లోనూ ఆ ముద్దు తననే పెట్టుకున్నంతగా సిగ్గుపడ్డాడతను. చప్పున సర్దుకుని కూర్చుని, "పద.."అంటూ డ్రైవర్ కి సైగ చేశాడు.

'మనోజ్ఞా, నిజంగా ఇట్స్ వెరీ టఫ్ టూ హాండిల్ యూ డియర్... ' అనుకున్నాడు సీట్లో వెనక్కి వాలుతూ.

"నవ్యా..." పడుకునే పిల్చింది మనోజ్ఞ.

"ఊ.."

"మీ అందరికీ నామీద చాలా కోపంగా వుంది కదూ.."

మోచేతిమీద కాస్త పైకి లేచి నిద్ర పోతున్న రేఖ వైపోసారి దృష్టి సారించి, మళ్ళీ మనోజ్ఞని చూసింది నవ్య, "ఉండేది. కానీ ఇప్పుడు లేదులే మనూ.. నాకైతే.."

చప్పున లేచి కూర్చుంది మనోజ్ఞ "ఎందుకు లేదూ.. ?"అంటూ.

ఆమె ఆత్రం చూసి చిన్నగా నవ్వింది నవ్య, "లేదన్నాకదా పడుకో, ఐనా తెలుసుకుని ఏంచేస్తావేం? "

"ఊహు.. పడుకోను. ప్లీజ్ చెప్పవూ.." బతిమాలింది ఆశగా.

"మొండిదానివి నీతో గెలవగలనా. ఊ.. ఎలా చెప్పనూ.. ముందాయన మీద డౌట్ వచ్చింది కావాలని నిన్ను తన వెంట తిప్పుకుంటున్నారేమో అని, తర్వాత ఆయన్ని చూస్తే నిన్ను ఫ్రెండ్లీగా ట్రీట్ చేస్తున్నట్టున్నారనిపించి, దీనికేమన్నా పిచ్చా, ఆయన వయసేంటి–ఈ పిల్ల వయసేంటి అని కోపంవచ్చింది... తర్వాత ఐ మీన్ ఈరోజు.. నీకు ఆయనమీద ఎంత అభిమానముందో మాకెలాగూ తెలుసు, కానీ ఫస్ట్ టైం.. ఆయన్లో నీమీద ఎంత ఇష్టముందో కనిపించింది. అదెందుకాయన దాస్తున్నారో అర్థం అవుతూనే ఆయనంటే గౌరవం పెరిగింది, నీమీద కోపమూ పోయింది. జే.కే.లాంటి వ్యక్తి ఒక మామూలు అమ్మాయిని ఇష్టపడుతున్నాడంటే చెప్పాలంటే ఆశ్చర్యం వేసింది. కానీ, నిజంగా నువ్వనుకున్నట్టు ఆయన్ని గెలుచుకోగలిగితే యూ విల్ బీ వెరీ లక్కీ మనూ... "

"ఓహ్.. థ్యాంక్స్.. థ్యాంక్యూ సో మచ్ నవ్యా.." అంటూ గట్టిగా కౌగలించుకుంది.

"ఆ.. ఆ.. స్పీడ్ కాస్త తగ్గించండి మ్యాడమ్..నేను నవ్యని. జే.కే.ని కాదు.." వెక్కిరించింది నవ్వుతూ.

కోపంగా చూడబోయి పకాల్న నవ్వేసింది మనోజ్ఞ.

వాచ్ చూసుకుంది దిగులుగా. రెండవుతోంది. ఈపాటికి నిద్రపోయి వుంటాడా! పిచ్చిదనుకోడు కదా ! అతని కళ్ళు గుర్తొచ్చాయి. వెలుగు నిండిన కళ్ళు, ప్రశాంతమైన ముఖం, ఎవరో శిల్పి పనిగట్టుకుని చెక్కినట్టుండే సూటైన ముక్కు, నవ్వే పెదాలు, అల్లిబిల్లిగా పరుచుకుని ఆ విశాలమైన నుదుటిని మేఘంలా కమ్ముకునే వత్తైన జుట్టూ, తనని గువ్వలా దగ్గరికి పొదువుకున్న విశాలమైన ఛాతీ, తన చుట్టూ రక్షణలా చుట్టుకున్న బలమైన చేతులు, ఎత్తైన ఆ నిండు విగ్రహం.. ఆమె ముఖం లో మెరుపొచ్చిందతని తలపులతో. చప్పున సెల్ తీసుకుని డయల్ చేసింది.

రెండు రింగ్స్ కే పిక్ చేశాడు, "ఇంకా నిద్రపోలేదా..?" అంటూ.

"పట్టట్లేదు. మరి..మీకు.." మెల్లగా అడిగింది.

జవాబుగా చిన్నగా నవ్వాడు.

"మాట్లాడొచ్చా.?"

"ఎప్పుడైనా వద్దన్నానా.. ?"మంద్రంగా పలికిందతని స్వరం.

"........"

"మనోజ్ఞా.. ఏమైంది.. ఎందుకు నిద్రపోలేదూ? భయంగా వుందా..?"ఆత్మీయంగా అడిగాడు.

"ఊహు.."

"మరి.."

"ఎవరో గుర్తొస్తున్నారు.."

"...."

"ఎవరని అడగరా భరద్వాజా..? "

"వద్దు మనూ.. ప్లీజ్.."

"సరే వదిలేయండి. ఇంతకీ మీరెందుకు నిద్రపోలేదో? "తుంటరిగా అడిగింది

"అదీ.. కాస్త వర్క్ వుంది.."

"అబద్ధం... ఆడపిల్లలు పుడతారు.."నవ్వింది.

"ఛాన్స్ లేదు..." అతని గొంతు సన్నగా వణికింది.

"ఔనా.. మరి మీ చేతిలో రేఖలు అలాగే చెప్పాయి మరి.." చెప్పింది.

"నాచేతిలో రేఖలు తమరెప్పుడు చూశారు మేడమ్..?" వెక్కిరింతగా అన్నాడు.

"ఏదో కొంచెం.."

"నేన్నిన్ను అస్సలు నమ్మను. ఏదో కహానీలు.. చెప్తావు.అంతా ట్రాష్.."

"ఏంకాదు. పోనీ..మీ చేతిలో స్టార్ వుంది. అది చూపిస్తే నమ్ముతారా..? "

"నా చేతిలో స్టారా.. లేనే లేదు.." చేతుల వంక చూసుకుంటూ అన్నాడు.

"వుందన్నానా.. సరే.. పోనీ వుంటే నాకు ఏమిస్తారు..?"

"సరే ఇస్తాను చెప్పు... ఏం కావాలి..? "

"ఏమడిగినా ఇచ్చేస్తారా.. ఏం అడిగినా..?" అల్లరిగా వత్తి పలుకుతూ అడిగింది.

ఉలిక్కిపడ్డాడు, "చూద్దాం.. నావల్లైతే.."

"మీ వల్ల అవుతుంది.. నాకా కాన్ఫిడెన్స్ వుంది.. యూ కేన్ డూ ఇట్.." మరింత ఆటగా అంది.

ఆమె హింట్ అర్థమైన భరద్వాజ పెదాలు విచ్చుకున్నాయి., "ఆహా.. ఎలా తెలుసో..? " తనూ అల్లరిగా అన్నాడు.

"చెప్పనా..? "

"చెప్పమనేగా.. "

"ప్చ్...." ఫోన్ లో ముద్దు పెట్టినట్టు తియ్యని చిన్న శబ్దం. భరద్వాజ ఉలిక్కిపడ్డాడు. సంభాషణ వెళ్తున్న ట్రాక్ గమనించి సర్దుకుంటూ, "టైం చూశావా.. లేవలేమిలా ఐతే. వాక్ కి రావా..?" అన్నాడు.

"మీరో పెద్ద మొద్దావతారం భరద్వాజా.." చిరుకోపంగా అందామె.

"ఇక పడుకో మనూ.." నెమ్మదిగా చెప్పాడు.

"గుడ్నైట్ మీ దగ్గర నాదొకటుంది. రేపు తెస్తారా..? "

"నీదా.. ఏంటది..?"ఇంకేమంటుందోనని ఒకింత భయంగానే అడిగాడు.

"మీ గుండెనడగండి చూపిస్తుంది..."

"మనోజ్ఞా..."

"గుడ్ నైట్..." ఫోన్ డిస్కనెక్ట్ అయింది. సెల్ పక్కన పడేసి ఆలోచించసాగాడు.

ఏముంది తన దగ్గర... ఏమంటోంది.. మనసా..?

గుండెనడగాలా..? అప్రయత్నంగా ఛాతీ నిమురుకున్నాడు. ఏదో తగిలింది. తీసి చూశాడు. చిన్న బిందీ..

నవ్వుకున్నాడు. ఎంత కన్ఫూజ్ చేసిందీ..

పచ్చని పచ్చిక మీద తెల్లగా మెరుస్తోంది వెన్నల. ఆ వెన్నెలతో పోటీ పడి మరింత మెరుస్తోందామె తెల్లని మేను. మెత్తటి పచ్చికనే పరుపుగా చేసుకుని నక్షత్రాలను లెక్కిస్తోందామె.

ఆమె పక్కనే నెమ్మదిగా వాలి, "ఇంత అందమైన రాత్రి చేసే పనా అది..?" నవ్వుతూ అడిగాడు.

అతన్ని చూసి చిరునవ్వు నవ్వింది, వెన్నెలే వెలవెలబోయేంత తెల్లగా, రాతిరే సిగ్గుపడేంత చల్లగా..

నెమ్మదిగా ఆ సన్నటి నడుము మీద తన వేలికొసలతో మీటుతూ, ఆమె మీదుగా వంగి మెడవంపులో గాఢంగా చుంబించాడు. మరింత చొరవ చేయబోతున్న అతడిని వారిస్తూ, "ఏమిటంత తొందర...?" అందామె.

"అడిగావుగా.. మరి ఆపుతావేం...?" మత్తుగా అంటూ ఆమె భుజాలు పట్టుకుని పైకి ఒరగబోతూ ఆమె కళ్ళలోకి చూశాడు. "ఇదేనా మీ నుంచి నేనడిగింది...? " అనే ప్రశ్న ఆ మౌనంలో ఉదయించి, నల్లని ఆ కళ్ళలో విశాలమై, అనంతమైన భావన. ఆమె అలాగే చూస్తోంది నిశ్చలంగా.... నిశ్శబ్దంగా..........

దిగ్గున లేచి కూర్చున్నాడు భరద్వాజ. చుట్టూ చూశాడు. తన మంచం మీదే వున్నాడు. కలేనా.. ఏంటది.. తాను కలగన్నాడా!! నిజంగా జరిగినట్టేవుంది...

ఏమిటిది.. తను మనోజ్ఞని ప్రేమిస్తున్నాడా.. లేక వాంఛిస్తున్నాడా..?

అంతర్లీనంగా తాను కోరుకుంటున్నది అదేనా...!!

ఛ.. లేదు.. కాదు.. కాదు... అదే ఐతే ఆమెకోసం తన గుండె ఎందుకంతగా తపిస్తుంది, ఆ కన్నీళ్ళకు తన మనసెందుకు తడుస్తుంది.

మరైతే ఆ కల...!?

ప్రేమ కి పరాకాష్ఠ కామమా.. లేక కామానికి ప్రేమే అంతర్వాహినా...?? '

ఆలోచనల తీవ్రత తట్టుకోలేక కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

చిన్న బీప్ శబ్దం. సెల్ తీసి చూశాడు, "రెడీ అయ్యారా జే.కే సాబ్...?" స్క్రీన్ మీద మనోజ్ఞ పంపిన మెసేజ్ మెరుస్తోంది.

"స్టార్ అన్నావ్.." అనీజీగా కదుల్తూ అన్నాడు. అప్పటికి వాళ్ళాబెంచ్ మీద సెటిలై పదినిమిషాలైంది. వచ్చినప్పటి నుండీ అతని చేతిని పరిశీలిస్తూనే వుంది మనోజ్ఞ అల్లరిగా ఒక్కో చేతి గీతనీ తన వేలి కొసలతో రాస్తూ.

"మరీ అంత తొందరైతే ఎలా సర్..? "నవ్వుతూ అంది.

ఏమిటంత తొందర..?కలలో మాట గుర్తొచ్చింది. తలవిదిల్చాడు.

అంతలో ఆమె పెన్ తీసి అతని చేతిలో స్టార్ మార్క్ వేసి, "ఇదిగో స్టార్.." చెప్పింది.

"ఛీటింగ్.. ఆల్రెడీ స్టార్ వుందన్నావ్.." ఉక్రోషంగా చెయ్యి వెనక్కిలాక్కుంటూ అన్నాడు.

"ఆల్రెడీ వుందనలేదు. వుంది చూపిస్తానన్నాను. ఇప్పుడుందిగా.. కావాలంటే చూసుకోండి.." నవ్వుతూ అంది.

"నేనొప్పుకోను.. నో వే.." చెప్పాడు.

"సర్లెండి, మీకు మాట తప్పాలనుంటే నేనేం చేస్తాను.." బుంగమూతి పెట్టుకుంది. ఆమె అలకచూసి కరిగిపోయాడు.

"సర్లే, యూ వన్ ఒప్పుకున్నా గానీ.. ఇంతకీ మాటేంటి..? "

"ఏమడిగినా ఇచ్చేస్తానన్నారు.. మాటిచ్చి మర్చిపోయారా.... సర్.." అల్లరిగా అంది.

రాత్రి కల కళ్ళ ముందు మెదిలింది.

చిన్నగా నవ్వాడు. "ఏంటి కొత్తగా మళ్ళీ సర్ పిలుపు.. పేరు పెట్టే పిలువ్.."

"ఓ.కే . అది వదిలేయండిగానీ.. మాట మాటేంటి భరద్వాజా.." రెట్టించింది.

"సరే చెప్పు, ఏం కావాలి..?"

"అడగనా..? "

"నాతో అయ్యేవే అడుగు.." రాత్రి సంభాషణ గుర్తొస్తుంటే ఇబ్బందిగా చూస్తూ అన్నాడు.

"మరీ... అంత డైరెక్ట్ గా అడగమంటే.. ఎలా.. ఎంతైనా ఆడపిల్లను కదా.. సిగ్గువెయ్యదా..?" నవ్వు బిగపట్టుకుంటూ అంది. భరద్వాజ ముఖం ఎర్రబడింది. కామ్ గా ముఖం తిప్పుకున్నాడు.

"అడగనా.. లేక మీకు అర్థమైందా.. సర్లెండి.. అడిగేస్తా.. మరీ..."

"ఇనఫ్ మనోజ్ఞా.. " కోపం ధ్వనించిందీసారి భరద్వాజ గొంతులో, "ఏం మాట్లాడుతున్నావో అర్థమౌతోందా నీకు, అల్లరికి కూడా ఓ లిమిట్ వుంటుంది.. అసలు నువ్వూ.."

"నేనేమన్నాను.. పిక్చర్ కి తీస్కెళ్తారా అనాలనుకున్నాను. తప్పా..?"అంది అమాయకంగా ముఖంపెట్టి.

ఆశ్చర్యంగా చూశాడు, "పిక్చరా..?"

"ఔనూ.. ఇంతకీ మీరేమనుకున్నారూ..?"ముఖం ఎంత అమాయకంగా పెట్టినా చిలిపి నవ్వు దాగడంలేదు.

"నేనా.. చెప్తానుండు.. " అంటూ చప్పున ఆమె చెవి మెలిపెట్టాడు నవ్వుతూ.

"ఆ... ఆడపిల్ల సినిమాకెళ్దాం రమ్మంటే చెవులు మెలేస్తారా..? మీరేం మగాళ్ళు.. అబ్బా.... " గట్టిగా అరిచింది. చప్పున వదిలేసి చుట్టూ చూశాడు కంగారుగా.

చెవి రుద్దుకుంటూ, "ఇంత చలిలో, ఇంత తెల్లవారుఝామున ఏంచేసినా ఎవ్వరూ పట్టించుకోర్లెండి. ఇంతకీ తీస్కెళ్తారా.. ?"అడిగింది.

"..సినిమాకా.. నేనా.. ?" ఇబ్బందిగా చూస్తూ అన్నాడు.

"ఏదో సంతూర్ సోప్ యాడ్ లో నేనా.. కాలేజా.. అన్నట్టు ఆ ఎక్స్ప్రెషన్ ఏంటి సర్.. తీసికెళ్తారా లేదా..?" రెట్టించింది.

"తీసుకెళ్ళాలంటే... వెల్ .. అంటే ఎవరైనా చూస్తే...?" సందేహంగా అన్నాడు.

"అయితే రావడం ఓ.కే. కదా.. అది చాలు. మీ సమస్య ఎవరైనా చూస్తారనే కదా. అసలీ పైజమా, కుర్తా తీసేయండి..."

"అప్పుడు ఎవరో ఏం ఖర్మ, అందరూ నన్నే చూస్తారు.. " నవ్వుతూ అన్నాడు.

"ఛ.. మీరూ.. నేను చెప్పేది వినండి. జీన్స్, టీ షర్ట్ వేశారనుకోండి, అప్పుడు ఎవ్వరూ గుర్తుపట్టరు. ఏమంటారు?" ఉత్సాహంగా అడిగింది.

ఆమెకేసి చూసి నవ్వాడు.

"మనోజ్ఞా.."

"ఒక్కనిమిషం. మీ డైలాగ్ నేను చెప్తాను. జీన్స్–టీ షర్ట్ వేసేందుకు నా ఏజ్ ఎంతనుకుంటున్నావు మనోజ్ఞా, అయామ్ 46, యూ నో..?"భరద్వాజను ఇమిటేట్ చేస్తూ చెప్పింది.

గట్టిగా నవ్వేశాడు. "యూ ఆర్ జస్ట్ ఇంపాజిబుల్. సరే నేను నేనుగానే వస్తాన్లే. మూవీ డిసైడ్ చేసి ఫోన్ చెయ్యి. టికెట్స్ తెప్పిస్తాను.. " అంటూ లేచాడు.

"థాంక్స్..." ఆనందంగా చెప్పింది.

కాటేజ్ దగ్గరకొస్తుంటే నెమ్మదిగా అంది, "నిన్న ఆనంద్ అన్న మాటలకి వీ ఆర్ వెరీ సారీ భరద్వాజా. అవేం మనసులో పెట్టుకోరుగా!"

"హేయ్.. అదేంలేదు. ఏదో అనుకోకుండా టాపిక్ ఆక్వర్డ్ అయింది. ఐనా అంత ఓపెన్ గా డార్క్ సైడ్ ఆఫ్ లైఫ్ గురించీ, ఇల్లిసిట్ రిలేషన్స్ గురించీ, ఆడపిల్లలముందు మాట్లాడినందుకు ఏదోలా అనిపించింది. మీరేం ఫీలయ్యారో అని చిన్న థాట్ అంతే.."

"వాళ్ళంతా ఆనంద్ నే తప్పుపట్టారు లెండి.."

"మరి నువ్వు.. ?"తటపటాయిస్తూ అడిగాడు.

"అది గతం.. నేనేం ఫీల్ అవను.."

"ప్రస్తుతం ఐతే..?" అప్రయత్నంగా అడిగాడు.

"నేనుండగా మరో లేడీ మీకు ఇంట్రస్ట్ కలిగిస్తే అది నా ఫెయిల్యూర్.." స్థిరంగా చెప్పింది అతని మాటల్ని అతనికే గుర్తుచేస్తున్నట్టుగా.

"బై మనోజ్ఞా.." వెనుదిరుగుతూ అన్నాడు.

"సమాధానం వినే ధైర్యం లేనప్పుడు ప్రశ్నలెందుకు అడుగుతారు భరద్వాజా..? ", చిరునవ్వుతో అడిగింది.

తలతిప్పి ఆమెని చూసి నిర్లిప్తంగా ఓ పొడి నవ్వు నవ్వి వెళ్ళిపోయాడు.

'ఏంతకాలం అలా నానుంచి దూరంగా పరిగెడతారు భరద్వాజా.. ఏదో ఒకరోజు నాకోసం తప్పక ఆగుతారు.. నాకు తెలుసు.. ఐ నో అండ్ ఐ విల్ వెయిట్ ఫర్ దట్ డే..' అతను వెళ్తున్న వైపే చూస్తూఅనుకుంది

"**పాణీ..** " పేపర్ చూస్తూ పిలిచాడు భరద్వాజ.

"చెప్పండి సర్.. " అంటూ వచ్చాడు పాణి. ఇబ్బందిగా కదిలాడు భరద్వాజ. కార్లో లంచ్ లూ, లాన్ లో టీ పార్టీస్, సెక్యూరిటీలేని వాక్స్, డ్రైవర్ లేని రైడ్స్.. ఇప్పుడు మూవీ టికెట్స్. ఎలా అడుగుతావ్ జే.కే!?. మరీ టీనేజ్ కుర్రాడికంటే అధ్వాన్నం గా తయారయ్యింది నీ పరిస్థితి..

"ఏమన్నా కావాలా సర్..? "

వీలైనంత గాంభీర్యాన్ని గొంతులోకి అరువు తెచ్చుకుంటూ, "నార్నియానో, ఏదో సినిమా వుందంట సంగమ్ లో, టికెట్స్ తెప్పించు మధ్యాహ్నం షోకి.." చెప్పాడు.

"ఓ.కే. సర్. "

మధ్యాహ్నం మనోజ్ఞ కలవడానికి బయల్దేరుతూ, షూ వేసుకుంటుంటే వచ్చాడు పాణి, "సర్ టికెట్స్.. " అంటూ ఒక కట్ట అందించాడు. అయోమయంగా చూశాడు భరద్వాజ.

"పైవి రెండూ మీకు సర్. మిగతావి మీ సేఫ్టీ కోసం. ఎలాగూ గార్డ్స్ ని తీసుకెళ్ళరు కదా..!! "

గొంతులో పచ్చివెలక్కాయ పడటం అంటే ఇదే కాబోలు. తానో స్టేట్ కి హోమ్ మినిస్టర్, ఐనా ఏమాత్రం సెన్స్ ఆఫ్ రెస్పాన్సిబిలిటీ లేకుండా.. ఇదే మరెవరైనా సెలిబ్రిటీస్ చేస్తే తానైతే ఎంత తిట్టుకునేవాడు.. మోస్ట్ ఇర్రెస్పాన్సిబుల్ అదీ, ఇదీ.. అనీ..

"వెల్... ఫాలో అవమను పాణీ.. దే కేన్ స్టే అవుట్ సైడ్ ద థియేటర్ కదా.." అంటూ టికెట్స్ జేబులో వేసుకున్నాడు.

"ఓ.కే. సర్.. హావ్ ఏ నైస్ టైం.."

"థ్యాంక్స్.. " గొణిగినట్టు చెప్పి బయటపడ్డాడు.

నీలి రంగు చుడీదార్, చెవులకి పెద్ద జూకాలు, కళ్ళకి కాటుకా, లైట్ మేకప్, మేచింగ్ గాజులు, వెలిగే ముఖంతో వచ్చిన మనోజ్ఞ ని చూసి మతిపోయిందతనికి.

'గాడ్... షీ ఈజ్ గార్జియస్.. స్టన్నింగ్..'అనుకున్నాడు మనసులో.

కారులో ఉన్నంతసేపూ ఆమె ఏం మాట్లాడిందో కూడా అర్థంకాలేదు. తలకదిపినప్పుడల్లా తమాషాగా ఊగుతున్న జూకాలనీ, అవి తగిలినంతలో కందిపోతున్న లేత చెక్కిళ్ళని చూస్తూ డ్రైవింగ్ ఎలా చేశాడో కూడా తెలియలేదు. మరీ హైస్కూల్ కుర్రాడిలా బిహేవ్ చేస్తున్నావ్ జే.కే. కమాన్ బీ ఎ మెచ్యూర్డ్ మ్యాన్..'తనని తనే మందలించుకున్నాడు కార్ పార్క్ చేస్తూ.

సీట్ నంబర్ చూస్కుని కూర్చోబోతుంటే అడిగింది, "ఏంటీ చేతులూపుకుంటూ వచ్చేశారు? "

అయోమయంగా చూశాడు, "అంటే.. ఏం చెయ్యాలి..? "

"పాప్ కార్న్ తేవాలి.." నవ్వు బిగపట్టుకుంటూ చెప్పింది. చుట్టూ చూశాడు. మీడియావాళ్ళెవరైనా చూస్తే పండగే ఓ నాలుగు రోజులు తెలుగు న్యూస్ ఛానెల్స్ అన్నింటికీ..'

"చాలా మేడమ్..?"సినీఫక్కీలో అడిగాడు పాప్ కార్న్ ప్యాకెట్ అందిస్తూ. నవ్వుతూ తలూపింది.

కూర్చోబోతూ చూశాడు. కపుల్ సీట్స్..!! పాణీ..'అనుకున్నాడు కోపంగా.

"కొంచెం తెలివుందీ, కపుల్ సీట్స్ తీశారు.." అల్లరిగా అంది అతని భావం అర్థమైనట్టు.

"పాణి పనిది.." ఇబ్బందిగా చెప్పాడు కూర్చుంటూ.

"నే చెప్పిందీ పాణి గారి గురించే. మీకంత లేదని తెలుసులెండి.." అంది నవ్వుతూ. అప్రయత్నంగా నవ్వేశాడు.

"కూల్ డ్రింక్ ఏదీ..? "అడిగింది.

నీరసంగా చూసి, "తెస్తాను, తెలియలేదు.." అంటూ లేవబోయాడు. చప్పున అతని చేయి పట్టుకుని ఆపుతూ డ్రింక్స్ అమ్మే అబ్బాయిని చూపించింది.

"రెండు ఇవ్వు.." అంటూ పర్స్ తీస్తూ చెప్పాడు.

"ఒకటి చాలు.." అని అతనికి చెప్తూ బాటిల్ భరద్వాజ కి అందించింది.

"ఇంతాచేసి, నా కోసమా..ఎందుకంత.. "నవ్వాడు.

"సాబ్..", డ్రింక్స్ అమ్మేకుర్రాడు అనుమానంగా చూస్తూ, "మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది సాబ్.." అన్నాడు. భరద్వాజ ఇబ్బందిగా మనోజ్ఞ వైపు చూశాడు 'అర్థమైందా 'అన్నట్టుగా.

కళ్ళతోటే క్షమాపణ చెప్పుకుని ఆ కుర్రాడి వైపు తిరిగింది, "అప్పుడే మర్చిపోయావా, ప్రతిసారి వచ్చినప్పుడూ నీదగ్గరే కూల్ డ్రింక్స్ కొంటాం కదా.. " అంది సిన్సియారిటీ ధ్వనించేలా.

"అవునమ్మా, రైటే.. గుర్తుపట్టలేకపోయాను..." అంటూ మళ్ళీ భరద్వాజవైపు చూశాడు. అంతలో లైట్స్ ఆరాయి షో బిగినింగ్ కి గుర్తుగా.

"థాంక్ గాడ్.." రిలీఫ్ గా అన్నాడు.

"నిజంగా సారీ భరద్వాజా, ఇంత మారుమూల ఇలా అవుతుందనుకోలేదు. అతను డ్రింక్స్ అమ్మేవాడు కాబట్టి సరిపోయింది. ఇంకెవరైనా అయ్యుంటే నావల్ల చాలా ఇబ్బంది పడే వారుకదూ. ఇంకెప్పుడూ ఇలా ట్రబుల్ చెయ్యను." మనస్ఫూర్తిగా చెప్పింది.

అతని మనసులోనూ అదే మెదిలింది. కానీ, తన గురించి కాదు, తనతో వున్నందుకు ఆమె పేరు ఏ రేంజ్ లో మారుమోగుతుందో తనకైతే తెలుసు. రెస్టారెంట్లూ, జాగింగ్ పార్కులూ వేరు, బయట ఇలాంటి చోట్ల వేరు. ఆ తేడా ఆమెకింకా పూర్తిగా తెలీదు.

"అదేం లేదులే మనూ.. వదిలెయ్.. నువ్వు హాయిగా మూవీ చూడు.." దాటేశాడు పైకి తన ఆలోచన చూపకుండా ఆ విషయాన్ని తేలిగ్గా తీసేస్తూ.

"మొత్తం మీరే తాగేస్తారా..నాకివ్వరా..? "కూల్ డ్రింక్ కోసం చెయ్యి చాపుతూ అడిగింది.

"అంటే నేనూ.. ఆల్రెడీ.." ఆగాడు.

"ఛా...మరేం పర్లేదులెండి. కిస్ చేస్తే లేని ఎంగిలి కూల్ డ్రింక్ కి వచ్చిందా..?"అంది అల్లరిగా.

అదిరిపడి బాటిల్ అందించాడు. "ఆ విషయం మర్చిపో మనూ.. ఆ రోజు ఉత్త ఇడియట్ లా..." అంటూ ఇంకేదో చెప్పేలోపే అతని నోటికి చెయ్యడ్డుపెట్టి స్క్రీన్ వైపు చూపించింది.

కాసేపటికి అతని చేయి పట్టుకుని, భుజంమీద తలవాల్చి నిద్రపోయింది. ఏంచేయాలో అర్థంకాలేదు భరద్వాజకి. చుట్టూ చూశాడు. ఎక్కువమంది లేరు థియేటర్లో. అదీ తమ చుట్టూ వున్న సీట్లెలాగూ తమవే. ఎవ్వరూ లేరు దగ్గర్లో. 'పోన్లే హాయిగా నిద్రపోనీ,'అనుకున్నాడు గతరాత్రి ఆమెకి కొద్దిలో తప్పిన ప్రమాదాన్ని తలుచుకుంటూ.

ఆమె ముఖం ప్రశాంతంగా ఉంది. మూవీలైట్స్ ఆమె మోము మీద పడి తమాషాగా మెరుస్తున్నాయి. ఎప్పుడూ మనోజ్ఞని నిశితంగా చూడాలంటే ఏదో భయం. మొదటిసారి కన్నార్పకుండా ఆమెనే తదేకంగా చూస్తుండిపోయాడు.

సినిమా అవ్వొస్తోందనగా మెల్లగా పిలిచాడు, "మనూ.."

"ఊ.." పలికిందామె కళ్ళువిప్పుతూ.

"నువ్వు నిద్రపోనేలేదా.." తెల్లబోతూ అడిగాడు.

"ఊహు.." తల అడ్డంగా తిప్పింది. ఏదో అడగబోయి లైట్స్ వెలగడంతో ఆగిపోయాడు.

కారు రోడ్డెక్కగానే ప్రశ్నించాడు, "నిద్రపోయినట్టెదుకు నటించావ్? సినిమా, సినిమా అన్నావ్ ఒక్క క్షణమైనా చూశావా.. ?"కోపంగా అన్నాడు.

"మీరు చూశారా.? "ఠక్కున అడిగింది.

ఊహించని ఆ తిరుగు ప్రశ్నకి తడబడ్డాడు. అంతలో సర్దుకుంటూ, "అఫ్కోర్స్, చూశాను. అయినా అదేం ప్రశ్న.. థియేటర్ లో కూర్చుని ఏం చేస్తారెవరైనా..?"

"హీరోయిన్ రోల్ పేరేంటి? "

"వ్వాట్.. వాటీజ్ దిస్ నాన్సెన్స్ మనూ.. చేసిందంతా నువ్వు చేసి మధ్యలో నాకీ క్విజ్ ప్రోగ్రామ్ ఏంటి చిన్నపిల్లల్లా.. స్టాప్ ఇట్..", కటువుగా అన్నాడు.

"బెటర్ యూ స్టాప్ ఇట్ భరద్వాజా.. ఎన్నాళ్ళిలా దాచుకుంటూ తిరుగుతారు మీలో ఇష్టాన్ని..? " బాధగా అడిగింది.

"ఏమిటీ డిస్కషన్ మనోజ్ఞా.. నేను అడిగినది ఏమిటి, నువ్వు మాట్లాడేదేంటి.. టాపిక్ నువ్వెక్కడికో తీసుకెళ్తున్నావ్..." భరద్వాజ కంఠం వణికింది.

"సరే మీ టాపిక్కే మాట్లాడదాం.. మూవీ అనడిగాను, మరి చూడలేదేం అనేగా మీ ప్రశ్న.."

"అవును.."

"నాకు మీ భుజంమీద తలవాల్చి, కాసేపు మీకు దగ్గరగా రిలాక్స్వ్వాలనుందంటే మీరొప్పుకుంటారా..?"సూటిగా అడిగింది.

సడెన్ బ్రేక్ తో కీచుమంటూ కారాగింది. షాకింగ్ గా చూశాడు, "మనూ.. !!!"

"ఒప్పుకోరు.. నాకు తెలుసు భరద్వాజా. స్టాప్ బీటింగ్ అరౌండ్ ది బుష్.. మీరూ నన్ను చూస్తూ గడిపెయ్యలేదూ..? గంటన్నర పాటు ఆ దగ్గరతనం మనం ఎక్సపీరియన్స్ చేయలేదూ...? మరి.. మరెందుకీ దాగుడుమూతలు? ఎందుకీ హిపోక్రసీ..?"

"ఈ దగ్గరతనం, ఇష్టం, ఇంటిమసీ.. వీటన్నింటికీ పెళ్ళే పరమార్థమా మనూ.. కాన్ట్ ఇట్ బీ ఎనీ డిఫరెంట్.. ?" దిగులుగా అడిగాడు.

"డిఫరెంట్.. మై ఫుట్.. దెన్ వై డోన్ట్ యూ బెడ్ విత్ మీ డామిట్.. టేక్ మీ దేర్, హావ్ సెక్స్.., గెట్ రిడ్, గెట్ అవుట్.. అండ్ లీవ్..." కోపంతో గట్టిగా అరిచింది.

ఆమె వాక్యం పూర్తవుతూనే భరద్వాజ మొహం రోషంతో కందిపోయింది. లాగిపెట్టి కొట్టాడామెని. అతని ఆవేశం మొత్తం ప్రతిబింబించిందా దెబ్బలో. అంత గట్టిగా తగిలిన దెబ్బకి మనోజ్ఞ కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. చెంప పట్టుకుని అతనికేసి రోషంగా చూసింది.

"పిచ్చా.. పిచ్చేమన్నా ఎక్కిందా నీకు... ?" ఆవేశంగా అరిచాడు.

"ఎస్.. మీ పిచ్చే.. కాన్ట్ యూ సీ దట్..?" ఆమె కళ్ళు కన్నీటి నెలవులయ్యాయి. భరద్వాజ నిశ్చేష్టుడై చూశాడు. అప్రయత్నంగా చెయ్యి సాచాడు. ఏడుస్తూ అతని గుండెల్లో ఒదిగిపోయింది.

నిశ్శబ్దంగా ఆమెని దగ్గరకి తీసుకునే కారు స్టార్ట్ చేశాడు. కాటేజ్ దగ్గర్లో వుండగా కారాపి అన్నాడు, శక్తి కూడగట్టుకుంటూ,

"నేనో రెండు, మూడురోజుల్లో వెళ్ళిపోవాలి మనూ, ఇంకో పది రోజులకి మీరూ వెళ్ళిపోతారు.. కొద్ది రోజులు కష్టంగానే వుంటుంది. తర్వాత.. తర్వాత మెల్లగా అలవాటైపోతుంది. తర్వాత.. ఇవన్నీ.... " ఆగిపోయాడు. మనోజ్ఞ అతని మాటలకి వెక్కివెక్కి ఏడవసాగింది.

"....ఇవన్నీ జీవితంలో కొన్ని.. గుర్తుల్లా, జ్ఞాపకాల్లా మిగిలి..." అతి కష్టంమీద పూర్తిచేయబోయాడు. ఇక అతని వల్ల కాలేదు. కళ్ళలో గిర్రున నీళ్ళుతిరిగాయి. గభాల్న ఆమెని హత్తుకున్నాడు. "ఇంత బాధగా వుంటుందని నాకు తెలియదు మనూ.. నిజంగా తెలియదు.. తెలిస్తే అప్పుడే వెళ్ళిపోయేవాడ్ని.. ఐ వుడున్ట్ హావ్ హర్ట్ యూ దిస్ మచ్.. అయాం సో..." ఇంకేదో చెప్పబోతూ తనని తాను నిగ్రహించుకున్నాడు. మెల్లగా ఆమె నుండి విడివడి సీట్లో వెనక్కి వాలి నిస్త్రాణగా కళ్ళు మూసుకున్నాడు. నెమ్మదిగా భరద్వాజని చూసిందామె. మూసిన రెప్పల వెనుక అంతర్మథనం అర్థమై ఆమె మనసంతా అతని పట్ల జాలితో నిండిపోయింది. తన పరిధి చాలా చిన్నది, తనకి అతని తోడు చాలు. కానీ అతని ఆలోచన సుదూరమైనది. ఆ ఆలోచన గమ్యం కూడా తానే, తన జీవితం కోసమే అతడంతగా వ్యథ చెందుతున్నది.

"కాఫీ..." మెల్లగా అంది. కళ్ళువిప్పి ఆమెనిచూశాడు.

"తలనొప్పి. ఏడిచినందుకేమో.. అందుకే.. కాఫీ.." మాటలు తడుముకుంటూ అంది. తన బాధ గ్రహించి టాపిక్ మారుస్తున్న ఆమెని చూసి ఆనందించాలో, బాధపడాలో అర్థం కాలేదతనికి.

ఇక తనూ ధైర్యం చేసుకుని వెళ్ళిపోవాలి... ముందీ క్లోజ్ నెస్ తగ్గించుకోవాలి.. దృఢంగా అనుకుని ఆమె వైపు చూశాడు.

"పర్ణశాలకెళ్దాం. ఓ.కే.నా..? " అడిగాడు.

తలూపింది. మెల్లగా కారు పర్ణశాలకేసి పోనిచ్చాడు.

ఎలా చెప్తాడు. వెళ్ళిపోతానని ఎలా చెప్పగలడు. వయసు, హోదా, అన్నీ మరిచిపోయి పిచ్చివాడిలా ఆమె చుట్టూ తిరుగుతున్నాడు. రోజు మొత్తం ఆమె తోటే వున్నా ఇంకా కొంతసేపు వుండాలనిపించే ఈ ఉబలాటాన్ని ఎవరికి చెప్పుకుంటాడు. తన నవ్వు, ఆ కళ్ళలో సంతోషం చూడ్డానికి ఏదైనా చేయాలనుంది. నువ్వంటే నాకు ప్రాణం అని ప్రపంచం మొత్తం వినిపించేలా అరిచి చెప్పాలనుంది. తన గుండెల్లో పొంగుకొస్తున్న ఈ బాధ తీర్చేవారెవరు.. ఎలా చెప్పను మనూ.. నీకెలా చెప్పను... వెళ్ళిపోయి నిజంగానే ఆమెకి మంచి చేస్తున్నాడా లేక ఏదో గొప్ప పని చేస్తున్న భ్రమలో ఆమెకి జీవితకాలపు గాయాన్నిస్తున్నాడా!'

సెల్ రింగయిన సౌండ్ కి మెలుకువొచ్చిందతనికి. కళ్ళు తెరవకుండానే ఫోన్ ఆన్ చేసి, "జే.కే. హియర్.. " అన్నాడు మత్తుగా.

"భరద్వాజా..", మనోజ్ఞ గొంతులో కంగారు వినగానే కళ్ళువిప్పి వాచ్ కేసి చూశాడు.. 2.10. దిగ్గున లేచి కూర్చుంటూ, "ఏమైంది మనోజ్ఞా,ఎనీ ప్రాబ్లెం.. ?"

అతనడిగిన ప్రశ్నకు జవాబియ్యకుండా హడావిడిగా అడిగింది, "మీ బ్లడ్. గ్రూప్ ఏబీ నెగెటివ్ అనీ ఓసారన్నట్టు గుర్తు.... అదేనా..?"

"అఫ్కోర్స్ అదే.. టైమ్ టూ టైమ్ మారడానికి అదేమన్నా.. "ఆగిపోయాడు, సిట్యుయేషన్ సీరియస్ నెస్ స్ఫురించి అలర్ట్ అవుతూ, "...ఏమైంది.. ?"అడిగాడు.

"చిన్నకుర్రాడికివ్వాల్సిన బ్లడ్, ట్రాన్స్పోర్ట్ లో డేమేజ్ అయింది.. రేర్ గ్రూప్ కదా.. బ్లడ్ బ్యాంక్ లో ఎక్కడా..." హడావిడిగా అంటున్న ఆమె మాటల్ని కట్ చేస్తూ "నేనొస్తున్నాను.." క్లుప్తంగా చెప్పి ఫోన్ పెట్టేశాడు.

పావుగంట తర్వాత హస్పిటల్ లో వున్నాడు. అప్పటికే అన్నీ రెడీగా వున్నాయి.

దాదాపు ఇంకో అరగంట తర్వాత డాక్టర్స్ కాబిన్ లో కూర్చున్నారు వాళ్ళు.

"జ్యూస్.. " అడిగింది.

"ఏం వద్దు... అయాం ఓ.కే. " చెప్పాడు చిరునవ్వుతో.

"మీరొక్కరే వచ్చారే వెనక మందీ-మార్బలం ఏవీ..? "అడిగింది.

"సెక్యూరిటీయా.. బయటున్నారు.. హాస్పిటల్ లో ఎందుకనీ.. "

"ఆహా.. వాళ్ళు కాదు.. మీడియా... మీ గ్యాంగ్.. "

"వాళ్ళెందుకూ..? "

"ది గ్రేట్ జే.కే. గారు అర్ధరాత్రి ఓ పిల్లవాడి ప్రాణం కోసం తన రక్తం ధార పోసిన అపూర్వదృశ్యం.. టింగ్.. టాంగ్.. చూస్తూ వుండండి.. బ్రేక్ తర్వాత... అదే.. టీవీ, ప్రెస్.. వాళ్ళంతా..? "

"స్టాప్.. స్టాప్ .. మేం రక్తం ఇవ్వడం కూడా తప్పేనా.. మరీ మోసేస్తున్నావ్... " నవ్వాడు.

"తప్పని కాదు సర్. ఏ మంచి పని చేసినా కవరేజ్ లేకుండా చేయరు గా మీ పొలిటీషియన్స్.... "

"కరక్టే అనుకో.. మరి చేసేవే కొన్ని మంచిపనులు.. కవరేజ్ లేకపోతే జనం ఎలా నమ్ముతారు. మా తిప్పలు మావి తల్లీ.. "నవ్వుతూ చెప్పాడు.

"బానే సమర్ధించుకుంటున్నారే. మరిప్పుడెందుకు తెచ్చుకోలేదో వాళ్ళని, మంచి పేరు ఎక్కువైపోయిందనా?" అల్లరిగా అడిగింది.

"అబ్బా.. ఆపెయ్ మనూ.. ఇంక మొయ్యకు.. ప్లీజ్.."దణ్ణం పెట్టినట్టు అభినయించి నవ్వేశాడు.

అంతలో ఫోన్ మోగింది. "ఆ దొరికింది.. ఎక్కించాం.. ఎవరా.. వచ్చి చూడు నువ్వే.." అంటూ సెల్ ఆఫ్ చేసింది.

"ఎవరూ..? ", కళ్ళెగరేసాడు.

"ఆనంద్.. బ్లడ్ ఎవరిచ్చారనీ.. " చెప్పింది.

వాళ్ళు మాటల్లో వుండగా డోర్ చప్పుడైంది. చేతిలో జ్యూస్ గ్లాస్ తో నవ్వుతూ లోపలికొచ్చిన ఆనంద్ ఆశ్చర్యంగా చూశాడు.

"ఓహ్.. మీరా.. ఐ మీన్.. జ్యూస్ తీస్కోండి.."

"నాకిది జ్యూస్ తాగే టైమ్ కాదులే ఆనంద్.. " అర్ధవంతంగా నవ్వాడు భరద్వాజ.

"మరేం తీసుకుంటారో చెప్పండి.. పోనీ అదే తీసుకొస్తాను.. "గట్టిగా నవ్వేశాడు ఆనంద్.

"ఆహా.. ఆశ.. మీరడిగారని మా నందూ ముచ్చటపడి తెచ్చినా, పాపం ఆయనగారు తెచ్చారని మీరు సరదా పడి పుచ్చుకున్నా అవేమీ ఇక్కడ కుదరవు సర్. పాపం హాస్పిటల్ వాళ్ళు ఫీలౌతారు.. " వెక్కిరింతగా చెప్పింది.

భరద్వాజ, ఆనంద్ మొహమొహాలు చూస్కుని నవ్వుకున్నారు. అతనికీ, తనకీ మధ్య కనిపించకుండా నడుస్తున్న టెన్షన్ ఒక్కసారిగా తగ్గినట్టనిపించింది భరద్వాజకి.

అతని ముందు ఎప్పుడూ ఏదో అనీజీగా అన్పిస్తుంది. తనకంటే చిన్నవాడితో పోటీపడి మరీ మనోజ్ఞని కాజేస్తున్న ఫీలింగ్ వచ్చి మరింత గిల్టీ గా అనిపిస్తుంటుంది.

"ఏమన్నా తాగారా.. సర్ ఐ మీన్.. జ్యూస్..కూల్ డ్రింక్ .. ఏమన్నా ఇచ్చావా మనూ? "అడిగాడు కన్సర్న్డ్ గా.

"లేదురా.. ఎక్కడా.. వద్దంటే వద్దంటున్నారు.."

"అయాం ఆల్ రైట్.. ఏమీ వద్దు.. " రిపీట్ చేసాడు భరద్వాజ.

"నో.. నో.. తాగాలి సర్.. తప్పదు.. డాక్టర్ గా చెప్తున్నాను.. ప్లీజ్.. " గ్లాస్ అందిస్తూ అన్నాడు ఆనంద్.

"ఓకే. ఇఫ్ యూ ఇన్సిస్ట్.. " అంటూ గ్లాస్ ఖాళీ చేసి లేచాడు.

"వెళ్ళనా మరి.." అన్నాడు. తలలూపి అతన్ని అనుసరించారిద్దరూ వీడ్కోలు చెప్పడానికి. కారిడార్ దాటుతుంటే అడిగాడు ఆనంద్, "సర్.. చిన్న హెల్ప్.."

"చెప్పు.." ఆగాడు భరద్వాజ.

"మనూ నీ డ్యూటీ అయిపోయిందిగా..? "

"అవునూ.. కానీ.. " అంటూ ఏదో చెప్పబోయిన ఆమెని పట్టించుకోకుండా భరద్వాజవైపు తిరిగి, "కొంచెం మనూ ని కాటేజ్ దగ్గర డ్రాప్ చేస్తారా.. ఇఫ్ యూ డోన్ట్ మైన్డ్.. " అడిగాడు రిక్వెస్టింగ్ గా. నమ్మలేనట్టు చూశాదు భరద్వాజ. "ఓ.. ష్యూర్.. " అన్నాడు తేరుకుని. "కాకపోతే చిన్న డౌట్ మీరిక్కడ సెమినార్స్ కి కదా వచ్చిందీ, మరి ఈ డ్యూటీలేంటి? " సందిగ్ధంగా అడిగాడు.

"ఔననుకోండి. పాపం ఇక్కడి డ్యూటీ డాక్టర్లు మరీ నలిగిపోతున్నారు, అటు సెమినార్ ఏర్పాట్లూ, ఇటు హాస్పిటల్ డ్యూటీలూ, అందుకే ఓ టెన్ డేస్ మేం షేర్ చేసుకుంటామని ఆఫర్ చేశాం.. అందుకే ఇలా.. " నవ్వాడు ఆనంద్.

మెచ్చుకోలుగా చూసి ఆప్యాయంగా ఆనంద్ భుజం తట్టాడు భరద్వాజ, "చాలా తక్కువ మందిలో వుంటుందా పట్టింపు. వేరే వాళ్ళ కష్టానికి విలువిచ్చే వాళ్ళు తక్కువ. నో డౌట్ మీరంతా చాలా మంచి సొసైటీ కి ఫౌండేషన్ అవుతారు. గాడ్ బ్లెస్ యూ.. "

వాళ్ళిద్దరి ముఖాలు మెరిశాయా మెప్పుకి.

"వెళ్ళు.. పాపం ఆయన వెయిట్ చేస్తున్నారు.. ఇప్పటికే చాలా లేటయింది.." చెప్పాడు మనోజ్ఞకి.

"సరే. కానీ వాట్ అబౌట్ యూ.." అడిగింది.

"నా డ్యూటీ అయ్యేదే తెల్లారి 5.00కి. అప్పటిదాకా వుంటే నీకు నిద్రెలా. మళ్ళీ వాకింగ్ అంటూ బయల్దేరతావు కదా. ఇప్పుడు వెళ్తే కనీసం యూ కేన్ గెట్ వన్ అవర్ స్లీప్ అట్లీస్ట్. గో బడ్డీ.." మృదువుగా చెప్పాడు.

నవ్వి తలూపి, చప్పున ముందుకెళ్ళి అతన్ని చిన్నగా హగ్ చేసుకుంది, "ఓ యూ ఆర్ సచ్ ఏ స్వీట్ హార్ట్.. " అంటూ. కంగారుగా ఆమెని విడిపించుకుని భరద్వాజకేసి చూశాడు. జేబులో చేయిపెట్టుకుని అలాగే నిశ్చలంగా నిలబడి వున్నాడతను. అతని ముఖంలో ఏ మార్పూ లేదు.

ఆనంద్ కి వీడ్కోలు చెప్పి కారుకేసి నడిచారు, కారెక్కబోతుంటే పిలిచాడు ఆనంద్, "మనూ వన్ సెకెన్.. " అంటూ. అతని తో మాట్లాడొచ్చి నవ్వుకుంటూ కారెక్కిందామె.

"ఎనీ ప్రాబ్లెమ్ ? "అడిగాడు భరద్వాజ రోడ్ ని చూస్తూ.

"ఆహా.. ఏమీ లేదు.. ఏదో అడగడానికి... అంతే.. " చిన్నగా నవ్వింది.

"ఏమైంది మనూ, ఎందుకంత నవ్వూ..నా గురించేమైనా జోకా..." కుతూహలంగా అడిగాడు.

"ఊ.. మీ గురించే.. కానీ.. జోక్ ఏం కాదులెండి.. "

"అబ్బా.. సస్పెన్స్ వద్దు. ఇష్టమైతే చెప్పు.లేదంటే చెప్పనని చెప్పు. అంత గానీ అలా ముక్కలు ముక్కలు గా డైలీ సీరియల్ లా లాగకు.. " విసుగ్గా అన్నాడు.

"అబ్బ ఎంత కోపమో.. ఏదో ఫీలౌతారని చెప్పలేదు.సరే.. వినండి.. హగ్ చేస్కున్నా కదా, మీ ముందు, మళ్ళీ మీరేమన్నా అనుకుంటారా అనీ కంగారుపడ్డాడట. అదే అడిగాడు. "

ఉలిక్కిపడ్డాడు భరద్వాజ.

తను ఏమనుకున్నాడో నిజంగా ఊహించగలదా తను. అందరికీ బానే తెలిసిపోతోంది తమ మధ్య నడుస్తున్న కెమిస్ట్రీ. ఐనా తాము తిరిగే తిరుగుడుకి అంత చిన్న ప్లేస్ లో దాచినా దాగుతుందా.. '

"నువ్వేమన్నావ్.. ?"అప్రయత్నంగా అడిగాడు.

"ఫీలవకపోయినా హ్యాపీయే, ఫీల్ ఐతే మాత్రం ఇంకా ఎక్కువ హ్యాపీ అని చెప్పాను.. " అతని ముఖాన్ని చూస్తూ చెప్పింది.

కారు సడెన్ గా ఆగింది. బెరుగ్గా చూసింది. కళ్ళతో రోడ్ కేసి చూపించాడు. రోడ్ అండర్ రిపేర్–అన్న బోర్డ్ చూసి తన కంగారుకి తానే నవ్వుకుంది.

కార్ రివర్స్ చేస్తుంటే అడిగింది, "మీకు నిద్దరొస్తోందా..? "

"లేదు. తేలిపోయింది.ఎందుకు..?"

"ఏంలేదు. అర్ధరాత్రి లేపేశాను. సారీ.. "

"నో.. నో.. అది మన మినిమమ్ డ్యూటీ. సాటి మనిషికి సాయం చేయడం ముందు ఇవన్నీ చాలా చిన్నవిషయాలు. నువ్వలా అనుకోబట్టే కదా ఈ రోజు నేనింకా బతికున్నాను.. లేకపోతే అప్పుడే.. గోవిందా అనేసేవాడినేగా.."

"ఛ.. అలా అనకండి..." మందలింపుగా అంటున్న మనోజ్ఞని ఆప్యాయంగా చూశాడు.

"మీకు నిద్దర్రావట్లేదుగా. మరైతే వాకింగ్ కి వెడదామా.. " ఉత్సాహంగా అడిగింది. టైం చూసుకున్నాడు. నాలుగౌతోంది.

"పైన చూడండి.. వెన్నెలెంత బాగుందో.. ఇంత మంచి ఛాన్స్ .. మళ్ళీ మళ్ళీ రాదు. ప్లీజ్.. " ఆశగా అడిగింది. బయటికి చూశాడు. వెన్నెల్లో పచ్చటి చెట్లు మిలమిల్లాడుతున్నాయి. తలూపి, దిగి వెనక వస్తున్న సెక్యూరిటీ వాళ్ళకి సైగచేశాడు కారు తీసికెళ్ళిపొమ్మని.

"సారీ.. ఇబ్బంది పెడుతున్నానా..?" గిల్టీగా అంది.

"లేదు. ఈ వెన్నెల, మంచు,... ఇవన్నీ మనిషికి దేవుడిచ్చిన చిన్నచిన్న గిఫ్ట్స్. వాటినీ ఎంజాయ్ చేయాలిగా ఎప్పుడో అప్పుడు. లేదంటే దేవుడు గిఫ్ట్స్ ఇవ్వడం మానేస్తాడు,అలిగి..." అంటూ నవ్వుతున్న భరద్వాజని ఆశ్చర్యంగా చూసింది.

"చాలా అందంగా చెప్పారు. మీలో ఓ భావుకుడున్నాడని నాకు తెలీదే.. "

'నాలో భావుకుడే కాదు మనూ అంతకంటే గొప్ప ప్రేమికుడూ వున్నాడు. బాధేంటంటే నీకు కనపడలేదు,' విషాదంగా అనుకున్నాడు.

"భరద్వాజా.. "

"చెప్పు.. "

"ఏమాలోచిస్తారు మీరు.. అంత సీరియస్ గా ఎప్పుడూ.. ?"

"ఏం లేదులే. నువ్వు ఏమన్నా చెప్పు వింటాను.. "

"అక్కడ కూర్చుందాం.. "

"వాక్ అన్నావు.. "

"మీరు అలిసిపోయినట్టు కనిపిస్తున్నారు. నిద్రలేదు. పైగా బ్లడ్ కూడా.. "

పకాల్న నవ్వాడు."నాలుగు స్పూన్ల బ్లడ్ కే పడిపోను మనూ.. డోన్ట్ బీ సిల్లీ.. పైగా డాక్టర్ వి.. అలా అంటావు.. "

"సరే.. సరే.. అందుకోసం కాదు గానీ అక్కడ్నుంచి మూన్ లైట్ ఎంత బాగా కనిపిస్తోందో చూడండి... ప్లీజ్.. "

"సరే పద.."

పచ్చిక మొత్తం మంచుకి తడిసి తడిగా మెరుస్తోంది. అతను కూర్చోవడానికి తటపటాయించడం చూసి నవ్వి తన చున్నీ అక్కడ పరిచింది.

"ఏయ్ ఏంపనది.. " మందలించబోయాడు.

పరిచిన చున్నీ మీద ఓ పక్కగా కూర్చుంటూ చెప్పింది, "కూర్చుని క్లాస్ తీస్కోండి బాస్.. "

"నువ్వూ.. " అంటూ కూర్చున్నాడు.

మోకాళ్ళ చుట్టూ చేతులు పెనవేసి చలికి ముడుచుకుని కూర్చున్న ఆమెని చూసి నవ్వాడు, "ఎందుకీ అవస్థ.. హాయిగా రూమ్ కి వెళ్ళి పడుకోక.. "

"ఊహు..నాకిలా బాగుంది..మీకు..? "అడిగింది.

నవ్వాడతను విశాలంగా. నవ్వుతూనే వెల్లకిల్లా వాలాడాపచ్చికమీద తల వెనుకగా చేతులు పెట్టుకుని.

"నీ వయసెంత మనూ.. "

"24.. ఎందుకూ... " అనుమానంగా అడిగింది.

"నీకంటే తక్కువ ఏజ్ లో దాదాపు 18-20 ఇయర్స్ ఏజ్ లో వుండగా స్టూడెంట్ లీడర్ గా పాలిటిక్స్ లోకి వచ్చాను. నాన్న, అటూ, ఇటూ తాతయ్యలిద్దరూ.. అలా అందరివల్లా చిన్నప్పటినుంచీ అదే లైఫ్ అనుకో, ఐనా నేనుగా వచ్చి దాదాపు 25-26 ఏళ్ళయింది...."

" అవునా.. " ఆశ్చర్యంగా అంది.

"ఎస్.. చాలా సినిమాల్లో విలన్ అంటుంటాడు చూడూ హీరోతో, నా పొలిటికల్ కెరీర్ అంత లేదు నీ వయసు అని, అది మన విషయంలో నిజం..." అన్నాడు నిర్వేదంగా.

అతని మాటల లోతు అర్ధంచేసుకోవడానికి ప్రయత్నిస్తూ మౌనంగా వుండిపోయింది.

"వదిలెయ్. నేను మాట్లాడేది అది కాదు. ఇన్నేళ్ళలో ఎన్నోసార్లు, ఎన్నో చోట్ల తిరిగాను. ఎన్నెన్నో వెన్నెల రాత్రులని, ఫైల్స్ చదువుతూ, పని చేస్తూ గడిపేశాను. అంటే నో రిగ్రెట్స్ అనుకో.. కానీ ఇప్పుడు నిన్ను చూస్తే అనిపిస్తోంది.. " ఆగాడు.

"ఏమని? "ఆత్రం ఆపుకోలేక అడిగేసింది. ఆమె ఆత్రుత అర్ధమై చిన్నగా నవ్వి చెప్పాడు.

"పూర్తిగా మెకానికల్ గా మారిపోయిన నన్ను మళ్ళీ లైఫ్ లోకి తేవడానికే ఆ దేవుడు నిన్ను పంపించాడేమో, సృష్టిలో అనుభవించాల్సిన అందాలెన్నో వున్నాయని నీ ద్వారా నాకు చెబుతున్నాడేమో.. లేకపోతే.. లేకపోతే.. వాక్ అంటే ఫిట్నెస్ గురించి తప్ప ప్రకృతి ఊసే మర్చిపోయినవాణ్ణి, జీవితాన్ని హృదయంతో పరికించాలన్న మనసే పోయినవాణ్ణి ఓ దారికి తెస్తున్నావు. జీవం పోస్తున్నావు. బతకడం కాదు-జీవించడం నేర్పిస్తున్నావు మనూ నువ్వు. జీవితంలో నేను చాలా అఛీవ్ చేసి వుండచ్చు. కానీ ఈ చిన్ని, చిన్ని ఆనందాలని నాకు దగ్గర చేసింది మాత్రం నువ్వే.. ఆ రోజు నువ్వు నన్ను రక్షించి పునర్జన్మే ఇచ్చావనుకున్నాను. కానీ జీవించడం అంటే ప్రతి క్షణాన్నీ ఆనందించడం అని నేర్పి మరో జన్మనిచ్చావు.... అసలు.. నీ పరిచయమే ఓ వరం నాకు.. అసలు... నేనూ...." ఉద్వేగంగా చెప్తూ పూర్తి చేయలేక ఆగాడు.

"భరద్వాజా.. ", విస్మయంగా, కాస్త భయంగా అతన్ని చూస్తూ అంది.

**తేరుకుని నవ్వాడు,** "భయపడ్డావా..? సారీ కాస్త ఎమోషన్ లెవెల్ ఎక్కువైంది కదా.. మరీ డ్రమెటిక్ గా మాట్లాడేశాను కదా పునర్జన్మ అదీ.. ఇదీ అని.. " అడిగాడు.

విప్పారిన నేత్రాలతో అతని వంక చూసింది.

"లేదు భరద్వాజా.. పాతికేళ్ళొస్తున్నా ఇంకా చైల్డిష్ బిహేవ్ చేస్తున్నానని మీరు అనుకుంటున్నారేమోనని చిన్న భయం ఉండేదిన్నాళ్ళూ.. చాలా గొప్ప స్థానం ఇచ్చారు. మీకు నేనంటే ఇష్టమని తెలుసు కానీ, అస్సలు ఊహించలేదు..

ఇంత మంచి ఒపీనియన్ వుంది మీకు నామీద అని.. " సడెన్ గా ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. చప్పున లేచాడు. "ఏయ్.. ఈ కన్నీళ్ళేంటి..? ..అయామ్ సారీ.. ఏదేదో వాగి నీ మూడ్ పాడుచేశానా..? "బాధగా అడిగాడు.

"ఊహు.." మోకాళ్ళ మధ్య తలవాల్చుకుంది. మెల్లగా ఆమె తల నిమురుతూ "ఏమైంది మనూ.. ఎందుకేడుస్తున్నావు. నాతో చెప్పవూ.. నేను.. నేను పరాయివాడినా..?" లాలనగా అడిగాడు. తల అడ్డంగా తిప్పింది. "మరైతే చెప్పు.. "

"ఏ మూలో ఒక చిన్న భయం.. " వణికిందామె గొంతు.

"దేనికీ..?"విస్మయంగా అడిగాడు.

"ఎంతకాదనుకున్నా, అంత పెద్ద పొజిషన్ లో వున్నారు. అలా.. వెంట వెంట తిరుగుతూంటే.. మనసులో ఏమన్నా చీప్ గా అనుకుంటున్నారేమో నాగురించీ అనీ ఎక్కడో.."

"మనూ.." ఆ ఊహే భరించలేనట్టు విలవిల్లాడాడు, "నీ గురించి కల్లోనైనా అలా అనుకుంటానా.. అదీ నేను..." బాధగా చూశాడు.

"లేదు భరద్వాజా. నాకు తెలుసు. ఐనా ఓ పిచ్చి భయం. అంతే.. కానీ చాలా.. చాలా బాగా అనిపించింది మీరీరోజు నాకు అంత విలువ ఇచ్చి.. నేను... నేను.. " దుఃఖంతో మాటలు రాక కన్నీళ్ళతో అతని కేసి చూసింది.

ఆర్తిగా దగ్గరకు తీసుకుని గుండెకు హత్తుకున్నాడు. ఆ స్పర్శలో కోరిక లేదు., మరే భావమూ లేదు. కేవలం ఇద్దరు మానసికంగా దగ్గరైన వ్యక్తులు పొందే స్వాంతన మాత్రమే వుంది. నెమ్మదిగా తేరుకుని అతడి నుంచి దూరం జరుగుతూ, "అదీ నేనూ.." అంటూ తడబడింది.

లాలనగా ఆమె తల నిమిరాడు, "ఏమీ చెప్పొద్దు..పద వెళ్దాం..." అన్నాడు. తలూపి లేచింది.

దారంతా ఏమీ మాట్లాడుకోలేదిద్దరూ. ఒక మంచి అనుభూతిని, మనసుకి దగ్గరైన వ్యక్తి సాంగత్యాన్ని, నిశ్శబ్దం కంటే బాగా ఎవరు పంచుకోగలరు. వినే మనసుండాలే గానీ వేల మాటలు కూర్చలేని భావాలని కూడా చెబుతుందది. ఆ మౌనం లోనే తాము మరింత దగ్గరైనట్టనిపించింది.

కాటేజ్ మలుపు తిరుగుతుంటే ఆగాడు భరద్వాజ, "థ్యాంక్స్ ఫర్ ఎవ్రీథింగ్ మనూ.." తడికళ్ళతో చెప్పాడు. నవ్విందామె చాలాసేపటి తర్వాత, వెన్నలంత తెల్లగా, మంచుపూల వానలా చల్లగా.. మెల్లగా.. మనోహరంగా. "నాకెందుకు థ్యాంక్స్ భరద్వాజా.. ప్రేమకున్న మహిమది.. మీరు పైకి ఒప్పుకున్నా, ఒప్పుకోలేకున్నా మన మనసుల్ని ఆనందమయం చేస్తున్న ఆ అద్భుతమైన ఫీలింగ్ అదే.. ది మ్యాజిక్ ఆఫ్ లవ్.. బై.. "

"మనోజ్ఞా.."

"ష్......... ఏమీ చెప్పొద్దు... " పెదాలమీద వేలుంచుకుని అంది.

ఆగిపోయాడు.

"కుచ్ నా కహో... కుచ్ భీ నా.. కహో... " సన్నగా హమ్ చేస్తూ తన కాటేజ్ వైపు నడిచింది. అక్కడే నిలబడ్డాడు. ఆమె పాట లీలగా వినిపిస్తోంది.

'క్యా కెహనా హై.. క్యా సున్ నా హై.. ముజ్ కో పతా హై.. తుమ్ కో పతా హై... ఔర్ ఇస్ పల్ మే కోయీ నహీ హై... బస్ ఏక్ మై హూ...

సమయ్ కా యే పల్ థమ్ సా గయా హై...

ఏమీ చెప్పకు.. అస్సలేమీ చెప్పకు.. చెప్పేదేముందీ..ఈ క్షణం నువ్వు.. నేను. మన మధ్య ఈ క్షణం .. నిలిచిపోయింది.. '

"హలో.. మిస్టర్ జే.కే..." హస్కీగా వినిపించిన వాయిస్ కి చప్పున తలతిప్పిచూశాడు. జయంతి... ది బ్యూటీ విత్ బ్రెయిన్స్... రేర్ కాంబినేషన్... ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో దుమారం రేపుతోందామె అందం. నిశ్శబ్దంగా పార్టీ అట్మాస్మియర్ గమనిస్తున్న జే.కే. ఆమెని పరిశీలనగా చూసాడు.

"బోర్ అవుతున్నాను. మీతో టేబుల్ షేర్ చేసుకోవచ్చా... "తియ్యగా అడిగింది.

విసుగుని అణుచుకుంటూ నవ్వాడు. "ఓ ష్యూర్. దానికేం...కూర్చోండి ప్లీజ్.." డ్రింక్ గొంతులోకి వంపుకున్నాడు. మత్తైన నవ్వుతో అతని పక్కకి ఛైర్ లాక్కుంది. కొద్దిసేపటికి కేజువల్ గా కాస్త రిలాక్స్డ్ గా జరిగింది. ఆ జరగడంలో ఆమె పాదం అతని కాలిని తాకింది. ఆమె వెనక్కి తీసుకునే ప్రయత్నం ఏమీ చేయలేదు. అప్రయత్నంగా తన కాలు వెనక్కి తీసుకుంటూ ఆమె వైపు చూశాడు. ఆమె కళ్ళలో సన్నటి నవ్వుతో కూడిన ఒకలాంటి ఇన్విటేషన్.... ఇలాంటి పార్టీలలో అలాంటి గెస్చర్స్ చాలా సాధారణంగా జరిగిపోతాయి. రాక ఒకరితో ఐతే, రాత్రి మరొకరితో.. సర్వసామాన్యం. అటువంటి ఇన్విటేషన్స్ అతనికి కొత్త కాదు.

కొన్ని యాక్సెప్ట్ చేసిన రోజులూ వున్నాయి. కానీ చాలావరకూ అవుట్ రైట్ పట్టించుకోని సందర్భాలే వున్నాయి. ఈ వన్ నైట్ స్టాండ్స్ మీద అతనికి పెద్దగా ఒపీనియన్ లేదు. కేవలం అప్పుడప్పుడు తనని తాను రిలాక్స్ చేసుకోవడానికీ, ఆ విషయంలో తన ఫిట్నెస్ పరీక్షించుకోవడానికి తప్ప ఇలాంటి వ్యవహారాలపట్ల అతని ఇంట్రస్ట్ తక్కువే. మనసులేని ఈ విషయాల్లో పడి వాల్యూబుల్ టైం వేస్ట్ చేయడం అతడి లీస్ట్ ప్రిఫరెన్స్. కానీ ఇప్పుడతని ఆలోచన వేరుగా ఉంది.

హఠాత్తుగా ఫ్లాషైందతని మెదడులో. వేరే స్త్రీ సాంగత్యం, అదీ, జయంతిలాంటి అందమైన స్త్రీ తో అనుభవం మనోజ్ఞ పట్ల తనకున్న అట్రాక్షన్ తీవ్రత ని తగ్గిస్తుందేమో. ఆ ఊహ రాగానే భరద్వాజ మనసు తేలికైంది. అయ్యుండచ్చు. మాళవిక తర్వాత నిజంగానే తను లాస్ట్ మూడేళ్ళనుండీ చాలా బిజీగా ఉంటున్నాడు. ఏ(ఈ)విధమైన ఎంటర్టైన్మెంట్ కీ

స్పేస్ లేకుండా. బహుశా మనూ నుండి తాను దూరం కాలేకపోవడానికి ఇదీ ఒక రీజన్ ఏమో. ఇక మనోజ్ఞ.. తాను వేరే స్త్రీతో రాత్రి గడిపానని తెలిసినా ప్రేమిస్తుందా.. ఏ అమ్మాయికైనా అది సాధ్యమా..!

అతని పెదాలమీద పల్చటి నవ్వు వెలిసింది.

"సో.. చెప్పండి.. మీరెక్కడి నుండి వచ్చారూ?"ఆమెతో సంభాషణ ఆరంభించాడు.

"బెంగుళూర్ నుండీ, అక్కడ నా రెస్టారెంట్ కి మీరోసారి వచ్చారు కూడా... అఫ్కోర్స్ మీ పార్టీ మీటింగ్ కే అనుకోండి.." ఆగి "...మాళవిక నాకు బాగా తెలుసు.." అంది నర్మగర్భంగా.

నవ్వాడతను.

"సో.. ఏమిటిప్పుడు మీ ప్రోగ్రామ్..? " తియ్యగా అడిగిందామె.

"ప్రస్తుతానికేమీ లేదు. రావు గారు వదిలేస్తే వెళ్ళిపోవడమే.." నవ్వాడు.

"నాకూ వెళ్ళాలనే వుంది... వెళ్దామా...?" డ్రింక్ గ్లాస్ పక్కన పెడుతూ అదోలా నవ్వింది. ఆ నవ్వుకే చాలామంది నాశనం అయిపోయుంటారు. అంత రెచ్చగొట్టేలా ఉందది.

తలెత్తి చూశాడు. "అప్పుడేనా..?" అని అమాయకంగా అడిగే మనోజ్ఞ మొహం గుర్తొచ్చింది. ఆమె ఆలోచనలని పక్కకి నెట్టేస్తూ వెంటనే లేచాడు. "దెన్ లెట్స్ గో.." అంటూ.

జయంతితో పాటూ బయటకి నడిచిన భరద్వాజని చాలా కళ్ళు అసూయగా చూశాయి.

"చాలా బాగుంది మీ గెస్ట్ హౌస్..." చెప్పిందామె.

"పర్ణశాల.. ఐ కాల్ ఇట్ దట్ వే... యూ ఆర్ మై గెస్ట్ టుడే. ఇది మా గెస్ట్ రూం..." ఆహ్వానించాడు. మనోజ్ఞనైతే తీసికెళ్ళాడు గానీ తన ప్రైవేట్ ఛాంబర్ వరకూ వచ్చిన ఆడవాళ్ళెవరూ లేరిప్పటివరకూ.

"వాడ్డూయూ లైక్ టూ హేవ్..?" బార్ కాబినెట్ వైపు నడుస్తూ అడిగాడు. మత్తుగా నవ్వి అతనికి దగ్గరగా వచ్చి హత్తుకుంటూ "యూ..." అంది. ఇబ్బందిగా ఆమెని విడిపించుకున్నాడు. ఆమె నవ్వుతూ వెళ్ళి బెడ్ మీద వాలింది.

పెగ్ ఫిక్స్ చేసి తీసుకెళ్ళి ఆమెకో గ్లాస్ అందించాడు. దాన్ని పక్కనపెడుతూ అతన్ని తన మీదకు లాక్కుంది, అతనూ అభ్యంతరపెట్టలేదు. ఆమెతో పాటు బెడ్ మీద వాలాడు.

"డోన్ట్ వేస్ట్ టైం జే.కే...! మీరు అస్సలు వేస్ట్ చేయరని విన్నాను.." అంటూ అతనికి తన పెదవులందించబోయింది. అప్రయత్నంగా ముఖం తిప్పుకున్నాడు. ఒక్కసారి ఆశ్చర్యంగా చూసి అదేమీ పట్టించుకోకుండా ఇంకాస్త చొరవ తీసుకుని ముందుకెళ్ళింది. ఆమెని విడిపించుకుని ఒక్కవుదుట్న మంచం దిగాడు "...అయాం.. సారీ.. ఐ మీన్... ఐ.. డోన్ట్ వాన్ట్... ఐ... జస్ట్... కా... కాన్ట్...." విసురుగా వెళ్ళి సోఫాలో కూలబడ్డాడు. దెబ్బతిన్నట్టు చూసిందామె. రెండు నిమిషాలు అతన్ని పరిశీలనగా చూసి, నెమ్మదిగా బట్టలు సరి చేసుకుంది. లేచి డ్రింక్ గ్లాసులు చేతిలోకి తీసుకుని వచ్చి అతనికో

గ్లాసందించింది. మౌనంగా తీసుకున్నాడు. అతని ముందున్న సోఫాలో కూర్చుంటూ అడిగింది, "ఆమె ఎవరో తెలుసుకోవచ్చా జే.కే.సర్..?". అతనేం మాట్లాడలేదు. నిశ్శబ్దంగా గ్లాస్ ఖాళీ చేశాడు.

"ఆమె.. ఇక్కడికి ఎప్పుడైనా వచ్చిందా? "కుతూహలంగా అడిగింది.

తలూపాడు. "అంటే ఈ రూమ్ లో ఆమెతో గడిపిన...." సందిగ్ధంగా ఏదో అడగబోయింది.

"నో.. నెవర్... అలాంటిదేమీలేదు మా మధ్య.. తను.. ఐ మీన్.. ఇక్కడకి... ఈ రూమ్ కి రాలేదు. షీ హాజ్ బీన్ టూ మై ప్రైవేట్ ఛాంబర్. దట్ టూ కేవలం కలవడానికి మాత్రమే... అంతే.. షీ..ఈజ్..నాట్.."ఆగిపోయాడు.

చిన్నగా నవ్విందామె. "నేనలా అనుకోవట్లేదు కూడా.. షీ మస్ట్ బీ వెరీ స్పెషల్... కదూ..?"

అతని కళ్ళలో నైరాశ్యం పోయి చిన్న మెరుపు కనిపించిందామాటకి. అది జయంతి దృష్టిని దాటిపోలేదు.

"మరి మీ గుండె తలుపులు తట్టి మీ ప్రైవేట్ ఛాంబర్ లోకి ప్రవేశించిన స్త్రీని మీ జీవితం లోకి ఆహ్వానించడానికి ఏమిటాలస్యం మిస్టర్ జే.కే.?"ప్రశ్నించింది.

అతను మౌనంగా తన గ్లాస్ వంక చూస్తున్నాడు.

"చాలామంది మగాళ్ళని చూశాను జే.కే. ... కానీ, మీలాంటి వాళ్ళు తక్కువ. చాలా చాలా రేర్.. " మునివేళ్ళతో ముంగురులని చెవుల వెనుకకి సుతారంగా నెడుతూ చెప్పింది.

"అంత గొప్పవాడ్నేమీ కాదు. మాళవిక తెలుసంటున్నారు.. ఆమె ఏమీ చెప్పలేదా..?"లేచి మరో పెగ్ డ్రింక్ ఫిక్స్ చేస్తూ అడిగాడు.

"మాళవిక ద్వారా నాకు తెలిసిన జే.కే., ఇక్కడున్న జే.కే. ఒకరే అని నాకనిపించడంలేదు. ఏమయ్యింది సర్. ఆమె మ్యారీడా.. పిల్లలున్నారా.. అందుకే మీరు ఒకటవలేకపోయారా..? "కాస్త కుతూహలం వినిపించిందామె గొంతులో.

జవాబు చెప్పకుండా గ్లాసందించాడామెకి.

"హోప్ అయాం నాట్ ఇంట్రూడింగ్ ఇన్ టూ యువర్ పర్సనల్ ఇష్యూస్. జస్ట్ క్యూరియసిటీ కొద్దీ అడుగుతున్నాను. జే.కే.లాంటి వారినే కదిలించిన లేడీ గురించి తెలుసుకోవాలనివుండడం సహజం కదా. అఫ్కోర్స్ నాలాంటి వాళ్ళకి పర్సనల్ విషయాలెవరూ చెప్పరనుకోండి.." తేలిగ్గా నవ్వుతూ అంది.

చప్పున ఆమె వైపు చూసి, "పెళ్ళైతే కాలేదు.." క్లుప్తంగా చెప్పాడు.

"ఓహ్... అయాంసారీ.. అంటే ఆమె వేరెవర్నైనా...?" జాలిగా అంది.

"ఛ.. అదేం లేదు. నేనంటే ప్రాణం పెడుతుంది.. " ఉలిక్కిపడి చెప్పాడు.

అయోమయంగా చూసి, "మరింకేం ప్రాబ్లెమ్. ఇంట్లో వాళ్ళా.. జే.కే.సర్ తలుచుకుంటే అదో పెద్ద అడ్డంకే కాదు కదా.." అంది.

విసుగ్గా చూశాడు, "మరీ పిచ్చిగా మాట్లాడకండి జయంతీ, ఐ థాట్ మీరు కొంచెం మెచ్యూర్డ్ గా ఆలోచిస్తారని.. "

"అసలు విషయం తెలిస్తే కదా మెచ్యూర్డ్ గానో, వేరేగానో ఆలోచించడానికి.. "చురుగ్గా అందామె.

"తను చిన్నపిల్ల. ..ఐ మీన్.. చిన్నది.. అదీ.. నాకంటే ఇరవై రెండేళ్ళు..." చెప్పాడు.

తెల్లబోయి చూసిందామె. "వ్వాట్.." అంది అప్రయత్నంగా., ఒక్కక్షణం తర్వాత పగలబడి నవ్వసాగింది. "ఏమన్నారూ.. చిన్నపిల్లా...", చేతిలో గ్లాస్ తొణికిపోతుంటే దాన్ని పక్కకి పెట్టి మరీ పడీ, పడీ నవ్వసాగింది.

భరద్వాజ ముఖంలో రంగులు మారాయి. విసురుగా లేచాడు. ఆమె చెంప పగలగొట్టాలన్న కోపాన్ని దిగమింగుతూ, "ఇక మీరు వెళ్ళచ్చు.. మీ నవ్వడం పూర్తైతే.." కటువుగా చెప్పాడు.

"సారీ జే.కే..." అతి కష్టం మీద నవ్వాపుకుంటూ చెప్పింది. "...చాలా చిన్న విషయం అది అని అనిపించింది. ఎంతమంది సినిమావాళ్ళూ, పొలిటీషియన్స్, బిజినెస్ పీపుల్ ఎందరు చేసుకోవట్లేదలా. ఐనా ఆమె 22 ఏళ్ళు చిన్నదంటే ఓ ఇరవై ఏళ్ళుండదూ.. సో.. మీకంటే చిన్నదేమో గానీ, మరీ చిన్నపిల్లైతే కాదుగా, అదో పెద్ద రీజన్ లా మీరు చెప్పేసరికి నవ్వాపుకోలేకపోయాను.. అయాం.. సారీ.."

"రీజన్ అనేది ఓ దృక్పథం మాత్రమే జయంతీ. ఎవరి వెర్షన్ వాళ్ళది. వేర్వేరు కులాల్లో పుట్టి, పెళ్ళి చేసుకోలేక, దగ్గర కాలేక ప్రాణాలు తీసుకున్నవాళ్ళెందరో. వాళ్ళని చూసి మనం నవ్వుకోవచ్చు. కానీ వాళ్ళ కారణాలు వాళ్ళకుంటాయిగా.." రోషంగా అన్నాడు.

జాలిగా చూసింది. "ఈరోజుల్లో అన్నీ కలుషితం అయిపోతున్నాయి మిస్టర్ జే.కే. ఈ మెటీరియలిస్టిక్ ప్రపంచంలో, రవ్వంత ఆప్యాయత, అణువంత ప్రేమ కూడా అపురూపమైపోతున్నాయి. వాటికోసం అలమటించే వారెందరో. అనవసరమైన అనుమానాలతో మీ మనసుని కష్టపెట్టుకోకండి. ఆమెనీ బాధించకండి. స్వచ్ఛమైన ప్రేమ ఓ వరం..." నెమ్మదిగా చెప్పింది.

"తెలుసు జయంతీ. దానితో పాటూ నాకు నా బాధ్యతలూ తెలుసు. అనుకోగానే అన్నీ మరిచిపోయి ఆమె ప్రేమ కోసం వెళ్ళిపోవడానికి నేనేమీ సినిమాల్లో హీరోనీ కాదు, కాలేజ్ కుర్రాణ్ణి అంతకంటే కాదు.." అన్నాడు.

"అన్ని తెలిసిన వారు మరి నాతో ఎందుకు గడపలేకపోయారు..?"సూటిగా అడిగింది.

".....అది వేరు.. ఇది... ఇది వేరూ.. అసలూ..." ఆగిపోయాడు.

చిన్నగా నవ్వి తన బ్యాగ్ తీసుకుని లేచి నిలబడింది. "ఏదీ వేరు కాదు జే.కే గారూ... అర్థంలేని సిద్ధాంతాలతో ఆత్మవంచన చేసుకోకండి.. ఉంటాను..."

నిశ్శబ్దంగా ఆమెననుసరించాడు. కార్ డోర్ వేస్తూ చెప్పాడు, "థ్యాంక్స్ ఫర్ ద టాక్. అండ్ సారీ టూ డిసప్పాయింట్ యూ.."

తేలిగ్గా నవ్వేసింది, "ఆ అమ్మాయిని కలిస్తే తప్పక చెప్తాను తానెంత లక్కీయో.. మిస్టర్ జే.కే...."

"థ్యాంక్స్.." కారు కదిలింది.

"వెళ్దామా.. చాలా చలి చంపుతోందీరోజు. వెంటనే వేడిగా ఏదైనా పడాలి." తొందరపెట్టింది.

"ఇంకొద్దిసేపు కూర్చుందాం మనోజ్ఞా..." అలసటగా అన్నాడు. ఆశ్చర్యంగా చూసింది. సాధారణంగా తనలసిపోతుంది గానీ అతనెప్పుడూ ఆగడంత తొందరగా.

"భరద్వాజా.. ఏమైందీ.. అలా వున్నారూ.. ?"

"ఎలా వున్నానూ.." అన్యమస్కంగా అడిగాడతను.

"డల్ గా, ఖోయా.. ఖోయా టైప్ లో... రాత్రి పార్టీలో లేటయిందా..?"అడిగింది.

"ఊహు.. త్వరగానే వచ్చేశామే.." సాలోచనగా అన్నాడు. రాత్రి మొత్తం మనోజ్ఞే తన ఆలోచనలని ఆక్రమించుకుని నిద్దరోనీయలేదని ఎలా చెప్తాడు.

"ఔనా.. మరి నాకు ఫోనెందుకు చెయ్యలేదు.. త్వరగా వస్తే చేస్తానన్నారుగా..?" దబాయింపుగా అడిగింది. చనువుతో ఆమె తీసుకునే అధికారమూ అందమే.

"వచ్చాను గానీ. ఐ వాజ్ విత్.. విత్.. జయంతీ.. "ఆగాడు. ఆమె వైపోసారి చూసి "...హోల్ నైట్..." అన్నాడు నెమ్మదిగా.

"ఔనా.. అందుకే అంత అలిసిపోయినట్టున్నారు. మరి రెస్ట్ తీసుకోవల్సింది. ఎందుకొచ్చారు వాక్ కి?" కాజువల్ గా అడిగింది.

అయోమయంగా చూశాడు. తన ఆర్కిటెక్ట్ లేడీ అంటేనే ఫీలైన అమ్మాయి ఇప్పుడు కనీసం జయంతి ఎవరని కూడా అడగదా. తను రాత్రంతా ఆమెతో ఉన్నానన్నా పట్టించుకోదా.. లేక తను అబద్ధం చెప్తున్నాడనుకుంటోందా..!!

"సరిగ్గా విన్నావా.. అసలు అర్థమైందా వాట్ ఐ సెడ్.. " అంటూ అతను చెప్పేలోపే అంది.

"నేనేమన్నా నర్సరీ కిడ్ నా అర్థం కాకపోవడానికి.. " మామూలుగా అంది.

"మరి ఏం అడగవా.. ఆరోజు నిరుపమ గురించి అంత ఫీలైపోయావు. ఇప్పుడు మరి రాత్రంతా కలిసి ఎందుకున్నామనీ, ఏం చేశామనీ.. ఏమీ అడగవా.. లేకపోతే నేనేమన్నా కోస్తున్నాననుకున్నావా.." తన విస్మయాన్ని దాచుకోలేక అడిగేశాడు.

"ఓహ్.... అదా... "తేలిగ్గా నవ్వేసింది. "అప్పుడు మీరు కొత్త కదా. మీ మనసులో ఎవరో వున్నారేమో అని భయపడ్డాను.. అయినా మీరెందుకు కోస్తారు.. అలా ఏం అనుకోవట్లేదు."

"అంటే ఇప్పుడు నేను వేరే వాళ్ళతో నైటంతావున్నా ఓ.కే.నా.. ?"అప్రయత్నంగా అడిగాడు.

"ఉంటే ఏమైంది.. ధారళంగా ఉండండి. ఒక్క నైట్ కాకపోతే పది నైట్స్.."తేలిగ్గా అంది.

విపరీతమైన కోపం వచ్చింది భరద్వాజకు. తాను అలాంటి వాడినని హర్టయి అభిప్రాయం మార్చుకుంటుందని చెప్పాడు. కానీ ఈ పిల్ల కనీసం పట్టించుకోనుకూడా పట్టించుకోవట్లేదు.

"రాత్రి గడపడం అంటే ఏంటో తెలుసా నీకసలు.. జయంతి..? ఎలానో.. ఎవరో.. ఏమిటో తెలుసా...?" రెచ్చగొడుతున్నట్టు గా అన్నాడు.

"నాకెందుకు.." నిర్లక్ష్యంగా అంది.

"అంటే నేను వేరే స్త్రీతో గడిపినా పరవాలేనంత బ్రాడ్ మైండా నీది... అసలు రియాక్టే కావడంలేదు.." కాస్తంత వెటకారంగా అడిగాడు. తాను ఆశించిన రియాక్షన్ ఆమెలో కనపడకపోవడం అతనికో షాక్ లా వుంది.

"సరే.. రియాక్టవుతాను... గడిపారు.. ఏం చేశారు గడిపి..? "సూటిగా అడిగింది.

తడబడ్డాడు. వెంటనే సర్దుకుని, "అంత డైరెక్ట్ గా అడిగితే ఎలా.. అంత రాత్రి అందరూ ఏం చేస్తారో మేమూ అదే చేశాం.. ఏం.. ?"ఆమెనే చూస్తూ అన్నాడు ఒక్కోమాటా వత్తి పలుకుతూ.

"ఐ సీ..." అంటూ తలపరికించి, తటాల్న అతని చేతిని అందుకుని తన తలమీదుంచుకుని "ఇప్పుడు చెప్పండి..." అంది తాపీగా.

ఊహించని పరిణామానికి అదిరిపడి చెయ్యివెనక్కి లాక్కున్నాడు. "ఏంటిది మనూ.. ?"

చిన్నగా నవ్వింది, "ఆగిపోయారేం.. మీ నైట్ స్టోరీ చెప్పరా...?"

"షటప్.. ఏం పనది?"మొహం తిప్పుకున్నాడు కోపంగా.

"సరే సారీ.. ఈ ఒక్కటి చెప్పండి.. కనీసం కిస్ ఐనా చేశారా?.. అదీ లేదా..? "నవ్వుతూనే అడిగింది.

స్టన్నింగ్గా చూశాడు. అప్రయత్నంగా తల అడ్డంగా తిప్పాడు.

"కానీ... నీకెలా..?" అస్పష్టంగా గొణిగాడు.

"తెలుస్తుంది భరద్వాజా... అదంతే... వెళ్దామా.." లేచింది. మౌనంగా అనుసరించాడు. తానామెతో ఏమాత్రం ఇన్వాల్వ్ కాలేదని మనోజ్ఞ నమ్మడం చాలా గొప్ప తృప్తినిచ్చిందతనికి. మనసంతా ఒకవిధమైన ప్రశాంతతతో నిండిపోయింది. కాసేపు తనతో తాను ఒంటరిగా గడపాలనిపించింది.

"వెళ్తాను మనూ.. తర్వాత.. ఐ... ఐవాంట్ టూ బీ ఎలోన్ ఫర్ సమ్ టైమ్.. కాఫీ నువ్వు తాగెయ్.. సారీ.." కాఫీ షాప్ కేసి దారితీస్తున్న మనోజ్ఞకి చెప్పాడు. అతని వైపు చూసి అర్థం చేసుకున్నట్టుగా తలూపింది.

మెల్లగా అక్కడ్నుంచి కదిలాడు. నాలుగడుగులువేశాకా వినిపించిందామె గొంతు.

"భరద్వాజా..? " అంటూ. ఆగి వెనక్కి చూశాడు.

"థ్యాంక్స్... "మనస్ఫూర్తిగా చెప్పింది దూరం నుంచే. తలూపాడు. ఎందుకని అడగలేదతను. అతని మనసుకి తెలిసిందదెప్పుడో.

ఈ ప్రపంచం లో మనం ఎవరో తెలిసినవాళ్ళు చాలామందేవుంటారు.. కానీ మనమేమిటో తెలిసినవాళ్ళు కనీసం ఒకరైనా వుండడం మాత్రం చాలా గొప్ప అదృష్టం..

"మన్మధుడే బ్రహ్మను పూని సృష్టించాడేమో గానీ... యాభైకేజీల బంగారాన్నీ, ఐదున్నర అడుగుల మందారాన్నీ..."

రేడియోలో పాట గాలిలో తేలుతూ మంద్రంగా వినిపిస్తోంది.

మౌనంగా ఫైలేదో చూస్తున్న భరద్వాజ పెదాల మీద సన్నటి నవ్వు మెరిసి మాయమైంది.

"హలో సర్... ఎక్కడున్నారు మీరు.. ?"అతని కళ్ళముందు చెయ్యూపుతూ అడిగింది మనోజ్ఞ.

"ఎక్కడాలేను మిస్. ఏంటి చెప్పు..?" అంతే హుషారుగా అన్నాడు.

"ఊహు.. మీరేదో ఆలోచించారు. అది నాకు తెలిసిపోయింది. అదేంటో మీరిప్పుడు నాకు చెబుతున్నారు.." ఆమె కళ్ళలో అల్లరి దాగట్లేదు.

"ఆహా.. తెలిసిపోయిందన్నావుగా.. మరింకేం.. ఇక చెప్పడం దేనికి? ఐనా నేనేం ఆలోచించానో నీకెలా తెలుస్తుందో.. ?"వెక్కిరింతగా అడిగాడు.

కుర్చీలోంచి కొంచెం ముందుకు వంగి సీరియస్ నెస్ నటిస్తూ చెప్పింది, "యూ నో నాకో స్పెషల్ సెన్సింగ్ పవర్ వుంది తెలుసా. మీరేమన్నా అనుకుంటే అది నాకు వెంటనే ఒక వేవ్ లాగా వ్యాపించీ... "

"వ్వాట్.. వ్యాపించా.. అదేమన్నా డిసీజా.. ?"నవ్వాపుకుంటూ అడిగాడు.

చిన్నగా తలకొట్టుకుని బాధ నటిస్తూ అంది, " ఈ డాక్టర్ బుద్ధెక్కడికి పోతుంది చెప్పండి. అదే వ్యా.. ఐ మీన్ టూ సే ట్రావెల్ చేసీ.. తెలుగులో కాస్త వీక్.. "

"ప్రయాణించి తల్లీ, కాస్త కాదు కిలోల లెక్కన వీక్ అంటారు. నా దగ్గర ట్యూషన్ చెప్పించుకోరాదూ..? "

"ఓ.కే. ఓ.కే. మీరు నన్నూ డీవియేట్ చేసేస్తున్నారు.. ఇలా ఐతే నే చెప్పను పొండి.." కోపం నటిస్తూ అంది.

"సరే. సరే. అస్సలు డీవియేట్ చేయను. చెప్పు వింటాను." ఫైల్ పక్కన పెట్టి బుద్ధిమంతుడిలా చేతులు కట్టుకుంటూ అన్నాడు.

"ఓకే. దెన్.. దట్స్ లైక్ ఏ గుడ్ బోయ్.." అంటూ లేచొచ్చి అతని పక్కనున్న కుర్చీలో కూర్చుంది. చూపుడువేలు అతని నుదుటి పై ఆనించి, "ఇక్కడ మీరేమన్నా అనుకోగానే మీ కళ్ళలో చిన్న కదలిక వస్తుంది.." అంటూ వేళ్ళకొసలతో

అతని కళ్ళని మూసింది. దాంతో భరద్వాజ అప్రయత్నంగా నిటారయ్యాడు. నెమ్మదిగా వేళ్ళతో అతని ముక్కుకొసని పట్టుకుని, "ఇక్కడ శ్వాస స్పీడ్ అప్ అయిపోతుంది.." అంటూ ఆమె వేళ్ళు మెల్లగా అతని పెదవుల మీదకి జారాయి. ఏదో అనబోయాడు. పెదవులు కదిలాయి గానీ, మాట బయటికి రాలేదు. గుండె వేగంగా కొట్టుకోవడం తెలుస్తోంది. అదేమీ పట్టనట్టు ఆమె కొనసాగించింది, "మీ లిప్స్ లైట్ గా వణుకుతాయి.. అండ్.." అతని కంఠం మీద మునివేళ్ళతో మీటినట్టుగా స్పృశిస్తూ, "ఇక్కడ మాటలాగిపోతాయి.."ఆమె వేలి కొసలు నెమ్మదిగా అతని ఛాతీ మీద ఆగాయి. మెల్లగా మొత్తం అరచేతిని అతని ఎదకానించి వణికే గొంతుతో అంది, "ఇక్కడ్నుంచీ మీ మనసు నా మనసుకి వేవ్స్ పంపిస్తుంది,సరిగ్గా ఇప్పట్లానే, నేను చెప్పనా ఇప్పుడు మీరు ఏం అనుకుంటున్నారో..?" పల్చటి కుర్తా మీదనుంచీ ఆమె స్పర్శ మతి చెదరగొడుతుంటే తనని తాను నిగ్రహించుకుంటూ, "చెప్పు.." అన్నాడు అతి కష్టం మీద. మెల్లగా కళ్ళెత్తి అతని కళ్ళలోకి సూటిగా చూసింది. అందుకోవడానికి చేయి కూడా సాచక్కర్లేనంత దగ్గరగా వుందామె మొహం. ఆమె కళ్ళలో ఇష్టం స్పష్టంగా తెలుస్తోంది. "చెప్పమంటారా భరద్వాజా..", ఆమె స్వరంలో లీలగా తెలుస్తున్న మార్పు. ఆమెవంక ఒకసారి తదేకంగా చూశాడు. ఆమె లో ఇష్టాన్ని మించినదేదో కనిపిస్తోంది మోహమో, మాయో.....

చప్పున కళ్ళు తిప్పుకున్నాడు. ఆమె చేతిని తన మీదనుండి తీసేస్తూ, "ఏంటిది మనోజ్ఞా.. చిన్నపిల్లలాగా.." మందలింపుగా అంటూ లేవబోయాడు. చటుక్కున అతని చేతిని పట్టుకుని ఆపుతూ, "...ఊహు.. చిన్నపిల్లల్లా కాదు భరద్వాజా.... మీకూ తెలుస్తుంది. కావాలంటే మీరూ వినండి నా మనసేం కోరుకుంటోందో.." అంటూ అతను రియక్టయ్యేలోపు తటాల్న అతని చేతిని తన గుండెకానించుకుంది. ఆమె చర్యకీ, ఆ మెత్తటి స్పర్శకీ ఒక్కసారి వివశుడై వెంటనే తమాయించుకున్నాడు., అంతలోనే షాక్ తగిలినట్టు చెయ్యి వెనక్కి లాక్కుని విసురుగా లేచాడు.

"మనోజ్ఞా.. వాటీజ్ దిస్..?" కోపంగా అరుస్తూ ఆమె వైపు చూశాడు. అలాగే కూర్చుని తన విశాలమైన కళ్ళని మరింత విప్పార్చుకుని తననే చూస్తున్న ఆమెని ఏమనాలో అర్థంకాక ఆగిపోయాడు.

"ఏమైంది భరద్వాజా..?"అల్లరిగా అడిగింది అతని ఇబ్బంది గ్రహించి.

ఇక ఏమంటాడు? ఏమడుగుతాడు? ఏమీ అనలేక ఆమెకేసి చూసి, "ఏంటిదంతా మనోజ్ఞా... అలా..?" తడబడ్డాడు.

"సెన్సింగ్ పవర్ భరద్వాజా.." కొంటెగా అంది.

"నో మనూ..", తప్పదామెని ఆపడం. ఇలాగే శృతిమించితే ఏదో ఓరోజు మనసు వశం తప్పడం ఖాయం. "చూడూ.. ఇదంతా ఏం వద్దని.. ఏం వద్దనుకున్నాం కదా.. వద్దు మనోజ్ఞా నేను చెప్పేది.. జస్ట్.. ఫ్రెండ్స్ లా వుందామని... అనుకున్నాం కదా.. మరి ఇప్పుడు.." చప్పున లేచి ఇంకేదో అనబోతున్న అతని నోటికి తన చేయి అడ్డు పెట్టింది.

"వద్దనే నేనూ అనుకున్నాను భరద్వాజా.. మీరు అడిగినట్టే చాలా మామూలుగా ఈ కొద్ది రోజులు గడిపి, ఫ్రెండ్లీగా విడిపోదామనుకున్నా.. కానీ.. కానీ... నేను మీమాట వినాలనుకున్నా, నా మనసు నా మాట వినడంలేదు. నేనేం చెయ్యను?

మీ కళ్ళు చెప్తున్నాయి నాకు – నేనంటే మీకు చాలా ఇష్టమని. మీ ప్రతీ గెస్చర్ లో తెలుస్తోంది నాకు.. మీరొప్పుకోరు. కానీ.. ఐ వాంట్ టు బీ లవ్డ్ బై యూ భరద్.. ఐ వాంట్ టు.. ఐ.. ఐ వాంట్ టూ మేక్ లవ్ టూ యూ... వాన్టూ బీ విత్ యూ.. ఇంకా... మీకు.. మీకు చాలా దగ్గరగా ఉండాలనిపిస్తోంది. మిమ్మల్ని తాకాలనీ, మీతో..." ఆగిపోయింది. ఆమె కళ్ళలోంచి నీళ్ళు జలజలా రాలాయి.

"..ఇది.. ఇది.. లస్ట్ కాదు, ఇన్ఫాట్యుయేషన్ అంతకన్నాకాదు. మీకు తెలుసు భరద్వాజా.. మీకు తెలుసు.. ఎందుకంటే నా మనసు చెప్తోంది. మీరూ ఇదే బాధననుభవిస్తున్నారు. ఐ నో దట్... ఐ నో ఇట్.." అంటూ ఏడుస్తూ లేచి ఒక్కపరుగున అక్కడినుండి వెళ్ళిపోయింది.

ఒంట్లో శక్తి మొత్తం ఎవరో వూదేసినట్టు అలాగే నిస్తేజంగా కుర్చీలో కూలబడ్డాడు. చేతుల్తో మొహాన్ని వత్తుకున్నాడు.

షీ న్యూ ఇట్.. తను దాచాలనుకున్నాడు. నటించాలనుకున్నాడు. ఈ బాధని తనే మోయలేకున్నాడు. పాపమా పిల్ల వయసెంతనీ ఇదంతా తట్టుకోవడానికి... '

'...నీ కన్నీళ్ళకి నేనేం జవాబివ్వను.. ఓ మై ఏంజిల్.. నీ దృష్టిలో నేనో మూర్ఖుణ్ణా... ఎంతో ఇష్టంగా నువ్వందించే ప్రేమామృతభాండాన్ని కాదనుకుంటున్న పిచ్చివాడినా.. నా ప్రాణం నువ్వని పైకి ఒప్పుకోలేని అహంభావినా.. నీ ప్రేమని పట్టించుకోని స్వార్థపరుణ్ణా.. ఎవరిని... నేనెవరిని...*???*

అవును.. నాది స్వార్థమే.. నేనెంతగానో ప్రేమించే నీ జీవితం బాగుండాలన్న స్వార్థం..

నా ప్రేమ ని నీ ముందు ఆవిష్కరిస్తే నువ్వు మైమరిచిపోతావు. అందర్నీ కాదని నా కోసం వచ్చేస్తావు.. నీకు నేనెంత కావాలో నాకు తెలుసు మనూ.....

కానీ అంతగా ప్రేమించే నీకు నేనేమివ్వగలను.. నీకో అందమైన జీవితాన్నివ్వలేను. ఒక చక్కటి యువకుడి నీడలో ప్రశాంతంగా మొదలవ్వాల్సిన నీ జీవితప్రయాణాన్ని రాక్షసుడిలా కబళించలేను. నిన్ను వదులుకోనూలేను. కాదు.. జీవితాంతం నీకే కష్టమూ రాకూడదు. అది నావల్ల అసలే కాకూడదు.

పిచ్చిపిల్లా.. నేను దొరకలేదనే ఈ బాధ కొన్నాళ్ళే.. కానీ నువ్వు కోరింది జరిగితే కొద్దిరోజుల సంతోషం తర్వాత జీవితమంతా చీకటే. మరి నేను ప్రేమించే నీకు.. నాకు పునర్జన్మనిచ్చిన నీకు నేనెలా అంత బాధనివ్వను మనోజ్ఞా..ఎలా...*?*

**కానీ.. కానీ**... మనూ నీ పైన క్షణక్షణం పెరిగిపోతున్నా ఈ ప్రేమని నే మోసేదెలా..*?'*

"సర్.." పాణి గొంతు వినిపించి నెమ్మదిగా తలెత్తాడు. పాణి కళ్ళల్లో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. బహుశా మనోజ్ఞ ఏడుస్తూ వెళ్ళడం చూసుంటాడు.

"ఎనీ.. ప్రాబ్లం సర్..?" సందిగ్ధంగా అడిగాడు పాణి. తల అడ్డంగా తిప్పాడు భరద్వాజ. ఓసారి అతన్ని పరికించి చూసి వెళ్ళబోయాడు.

"నాకన్నా చిన్న అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే.." భరద్వాజ కంఠం వణికింది. పాణి షాకింగా వెనక్కి తిరిగాడు, "సర్.." అంటూ.

పాణికేసి చూడట్లేదు భరద్వాజ, నిర్లిప్తంగా తన అరచేతులవంక చూసుకుంటూ మళ్ళీ అడిగాడు, "నాకంటే 22 ఏళ్ళు చిన్నఅమ్మాయిని చేసుకుంటే ఏ.. ఏమౌవుతుంది పాణీ..?"

నమ్మలేనట్టు చూశాడతను సంభ్రమంగా. "ఏమీ కాదు సర్.. ఏమీ కాదు. మనం అనుకుంటాం గానీ, మనసులు కలిసిన పెళ్ళిళ్ళే చాలా గొప్పవి. వయసుదేముంది సర్.. అసలు అదో పెద్ద అడ్డంకే కాదు. ఐనా.. అలా ఎంతోమంది చేసుకున్నారు.. " అంటూ కొన్ని ప్రేమకథలు చెప్పాడు. మౌనంగా అన్నీ విన్నాడు భరద్వాజ.

"కానీ.. లోకం తెలియని అమ్మాయిని మాయమాటలతో ట్రాప్ చేసి, పెళ్ళి చేసుకున్నాడు జే.కే., కామంతో కళ్ళు మూసుకుపోయి.. అని అందరూ..." ఆగిపోయాడు భరద్వాజ. అతని కళ్ళలో అంతులేని వ్యథ.

"ఛ.. అవేం మాటలు సర్.... ట్రాప్ చేసి అవసరం తీర్చుకుని వదిలేస్తే తప్పుగానీ, పెళ్ళి చేసుకుంటే ఏం తప్పు? ఐనా ఎవరు సర్ ఆ అందరు..? నాలుగు రోజులు మాట్లాడుకుని మరో హాట్ టాపిక్ రాగానే మర్చిపోయే వాళ్ళకోసం ప్రేమనీ, ప్రేమించే అమ్మాయినీ జీవితాంతం వదులుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. కామంతో కళ్ళు మూసుకుపోవడం ఏంటి సర్..? అసలు ప్రేమకి పరాకాష్ఠ కామమేనని మన శాస్త్రాలే ఘోషిస్తున్నాయి. ప్రేమ లేని కామం తుచ్ఛమైనది గానీ, ప్రేమ నిండిన హృదయానికి కామం కూడా ఒక ఎక్స్ ప్రెషన్ లాంటిది.. ఐనా మనసులో ప్రేమని పూర్తిగా వ్యక్తీకరించే భాష ఈ ప్రపంచంలోనే లేదు. లోతైన భావాలని మాటలకంటే స్పర్శే బాగా చెప్పగలదు. దాన్ని మించిన ఎక్స్ ప్రెషన్ లేదు. అనవసరమైన అపోహలతో ప్రేమించిన అమ్మాయిని వదులుకోకండి. ఇది మీ అసిస్టెంట్ గా కాదు. స్నేహితుడిగా చెప్తున్నాను.

ఐనా.. ప్రేమకీ-వయసుకీ సంబంధం లేదని మన పురాణాలేంటి-చరిత్రేంటి, అసలు ఈ ప్రపంచం మొత్తం ఒప్పుకునే ఓ ప్రేమ జంటే నిరూపిస్తోంది. అసలు ఈ సృష్టి లో ప్రేమన్నా, కామమన్నా వారిద్దరి పేర్లూ చెప్పకుండా ఉండలేరు. వారి చరిత్ర ప్రేమమయం. వయసు తారతమ్యాలు వారిమధ్య రాలేకపోయాయి. వారి కథే ఓ రసరమ్య ప్రేమ కావ్యం... " ఉద్వేగంగా చెప్పాడు పాణి.

"ఎ...ఎవరు వాళ్ళు.. ?" భరద్వాజ గొంతులో విస్మయం.

చిన్నగా నవ్వాడు పాణి, "రాధాకృష్ణులు..."

"గుడ్ ఈవెనింగ్.. "మనోజ్ఞ పలకరింపుతో ఒక్క వుదుట్న లేచాడు కుర్చీలోంచి.

నీలి రంగు చీరలో సంధ్యా దేవతలా వుందామె.. పెదాలమీద అదే అల్లరినవ్వు. రిలీఫ్ గా చూశాడు.

"ఓహ్.. మనోజ్ఞా.. రియల్లీ.. యూ డోన్ట్ నో.. హౌ హాపీ అయామ్.. యూ.. మేడ్ మై డే.. ఐ మీన్ ఇట్.." తన ఉద్వేగాన్ని దాచుకోలేకపోయాడు.

చిన్నగా నవ్వి, "డే కాదండీ బాబూ.. ఈవెనింగ్.. ఏ స్కూల్ ఏంటి సర్ తమరూ..?"అంది వెక్కిరింతగా. హాయిగా నవ్వేశాడు. జీవితంలో అంత రిలీఫ్ ఎప్పుడూ పొందలేదతను.

నుదుటి మీద అల్లిబిల్లిగా పడ్డ క్రాఫ్ సద్దుకుంటూ అడిగాడు, "చెప్పు టీ, కాఫీ, జ్యూస్.. ఏం తీసుకుంటావు..?"

"ఏం అడిగినా ఇస్తారా..? "

చురుక్కున తగిలినట్టు బాధగా చూశాడు. నవ్వేసింది తేలిగ్గా. "మరీ అలా చూడకండి. ఏదో తమాషాకి అన్నాను బాబూ.. మీరలా మాటిమాటికీ అలా ఆర్ట్ మూవీ హీరోలా మొహం పెట్టకండి. చూడలేకపోతున్నాను."

ఆప్యాయంగా చూశాడు. మనసులో బాధని దాచి నవ్వుని పంచడం చాలా గొప్ప ఆర్ట్. దానికి చాలా శక్తి కావాలి. అది ఈ అమ్మాయికి లేదు. కానీ ప్రయత్నిస్తోంది.. అదీ కేవలం తనకోసం..

ఆలోచనలని పక్కకి నెట్టేసి ముఖంలోకి నవ్వు తెచ్చుకుంటూ అడిగాడు, "సరే.. అయితే చెప్పు ఏం కావాలి నీకు?"

"...మీ ఛెఫ్ పెట్టే భయంకరమైన టీ నుంచి విముక్తి.." సీరియస్ గా చెప్పింది.

".. అంటే.." అయోమయంగా చూశాడు.

"అంటే.. బయటికెళ్దామా సర్.. అనీ... మీరొట్టి మొద్దబ్బాయ్ బాబూ... " విసుక్కుంది తియ్యగా.

"ఓహ్.. సారీ.. అర్థం కాలేదు.. ఆ బిరుదు పర్ఫెక్టేలే నాకు.. కూర్చో.. ఒక్క ఫైవ్ మినిట్స్.. ఛేంజ్ చేసుకుని వచ్చేస్తాను.." నవ్వుతూ చెప్పాడు.

"నన్ను రమ్మంటారా హెల్ప్ కీ.. ?"అల్లరిగా అడిగింది.

"వ్వాట్..?"అదిరిపడి చూశాడు.

"డ్రస్ సెలక్షన్ కి భరద్వాజా.. మీరేం అనుకున్నారూ.. ?" అమాయకంగా మొహంపెట్టి అడిగింది.

చిన్నగా ఆమె తలపై మొట్టి నవ్వుకుంటూ లోపలికి నడిచాడు.

"చిన్నప్పుడు మీరు సైకిల్ బాగా తొక్కేవారా..?"అడిగిందామె సీరియస్ గా, డ్రైవ్ చేస్తున్న అతన్నే చూస్తూ.

"ఆ.. అవునూ.. ఎందుకలా అడిగావ్..? "ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏంలేదూ.. అదే స్పీడ్ కనిస్తుంటేనూ.." నవ్వుని బిగబట్టుకుంటూ చెప్పింది. భరద్వాజ మొహం రోషంతో ఎర్రబడింది. ఒక్కసారిగా యాక్సిలరేటర్ అదిమాడు.

సడెన్ గా పెరిగిన స్పీడ్ కి కంగారుపడుతూ, "ఏయ్ భరద్వాజా.. ఊరికే అన్నాను. స్లో.. స్లో.." అంది భయంగా. అదేం పట్టించుకోకుండా ఇంకా స్పీడ్ పెంచసాగాడు. బెదురుగా అతని భుజం పట్టుకుంటూ అరిచింది, "సారీ.. ఆపండి ప్లీజ్.. భయమేస్తోంది.."

కారు మరింత వేగం పుంజుకుంది. ఆమె భయంగా చూస్తోంది. వెళ్ళాల్సిన ప్లేస్ ఎప్పుడో దాటేశారు. చుట్టూ చీకట్లు పరుచుకుంటున్నాయి. రోడ్ మీద మనిషి జాడ లేదు. సడెన్ గా ఏదో అడ్డొచ్చినట్టైంది. "భరద్..న్నో.." గట్టిగా అరుస్తూ అతని భుజం వెనుక మొహం దాచుకుంది. కీచుమన్న శబ్దంతో కారాగింది. మనోజ్ఞ తలెత్తలేదు. సన్నగా వణుకుతోంది. "ఏయ్.. మనూ.. ఏంకాలేదు.. భయపడ్డావా.." మృదువుగా ఆమె తలని తడుతూ పిలిచాడు. "ఊహు.." బెరుగ్గా పలికిందామె తలెత్తకుండానే.

మెల్లగా స్టీరింగ్ వదిలి ఆమెని మరింత దగ్గరగా లాక్కున్నాడు. మెత్తటి శాటిన్ చీరలో ఆమె దేహం ర్యాప్ చేసిన పూల చెండులా వుంది. మెల్లగా ఆమెని చుట్టుకున్న చేతుల్ని పైకి జరిపి ఆమె మెడవెనుక సుతారంగా వేలికొసలతో రాసాడు., "ఇక్కడ మెరుస్తున్న నీ స్వెట్ చెప్తోంది నువ్వు భయపడ్డావని.. " అన్నాడు ఆమె చెవిలో . ఆశ్చర్యంగా తలెత్తింది. ఆమె ముఖంమీద చెదిరిన ముంగురులని సవరిస్తూ అన్నాడు, "ఇవిగో ఈ కురులూ చెప్తున్నాయి.. నువ్వు బెదిరిపోయావని..." అంటూ నవ్వాడు. అప్రయత్నంగా దూరం జరగబోయింది. నవ్వుతూ దగ్గరకి లాక్కున్నాడు. ఆమె కళ్ళలో విస్మయం. ఇంకా సన్నగా అదురుతోన్న పెదవులమీద వేలితో సున్నితంగా రాశాడు. మనోజ్ఞ బుగ్గలు ఎర్రనయ్యాయి. "భరద్.. అంటే.. నేనేనా..?" అతని కళ్ళలో అల్లరి నవ్వు చూసి సిగ్గుగా తలూపింది. "ఏదీ.. ఇంకోసారి పిలువూ.." ఆమె ముఖాన్ని మునివేళ్ళతో పైకెత్తుతూ అడిగాడు. "అదీ.. అనుకోకుండా.." ఆమె కంఠం వణికింది. "తెలుసు.. ఒక్కసారి పిలువ్.." ఆమె కంఠం మీదవేలితో రాస్తూ, "ప్లీజ్.. మనూ ఒక్కసారి.." తమకంగా పలికిందతని గొంతు. "ఊహు.." ఎప్పుడూ అల్లరి చేసే మనోజ్ఞ అతని చొరవకి సిగ్గుతో ముడుచుకుపోయింది. అది చూస్తున్న అతని మనసతని వశం తప్పిపోతోంది. "పోనీ నీ మనసులో మాట నన్నే వినమంటావా..?" అల్లరిగా వేళ్ళని కంఠం కిందకి జారుస్తూ అడిగాడు. అదిరిపడి అతని చేతిని పట్టుకుని ఆపి అతన్ని నెట్టేసింది.

"ఏయ్.. ఏం చేస్తున్నారు మీరు. వెళ్ళిపోదాం పదండి.." బిడియంతో ఆమె ముఖం కందిపోయింది.

ఎర్రని ఆ ముఖాన్ని చూస్తూ నవ్వాడు, "మరి పొద్దున్న.. ఇదేగా అడిగావ్..?"

"ఏదో ఎమోషన్ లో అనేశాను. నా ఉద్దేశ్యం ఇది కాదు. వెళ్ళిపోదాం భరద్వాజా.." బెరుకుగా అంది.

ఆమె నడుంచుట్టూ తన చేతిని బిగిస్తూ చెప్పాడు, "ఊహు.. కుదరదు.. ఇంతవరకూ వచ్చాకా.. నా వల్ల కాదు.."

"భరద్వాజా ప్లీజ్ వదలండి.. లేకపోతే అరుస్తాను.."బెదిరింపుగా అంది.

చిన్నగా నవ్వి, "ఆలోపే నిన్నూ..."అంటూ ఆమె పైకి వంగాడు.

"ఏయ్... భరద్వాజా.. వద్దు.. భరద్.. వద్దు..ప్లీజ్.. "బెదురుతో కీచుమందామె గొంతు.

చటుక్కున ఆమెని వదిలి దూరం జరిగాడు. ఆశ్చర్యంగా చూసింది.

"సో.. అంత భయపెడితేగానీ రాదన్నమాట.."

"ఏంటీ..?" అయోమయంగా చూసింది.

"భరద్.. అనే పిలుపు.. " నవ్వాడు.

నమ్మలేనట్టు చూసింది, "అంటే.. మీరూ.. మీరు..!!"ఆగిపోయింది ఏమడగాలో తెలీక.

"సో ఎలా కనబడ్డాను మిస్? ఎవ్వరూ లేని చోటకి తెచ్చిఅఘాయిత్యాలు చేసే రౌడీ మినిస్టర్ లాగానా..?"నవ్వుతూ ప్రశ్నించాడు. తల అడ్డంగా ఊపింది. ఆమెకి షాక్ తో మాటలు రావట్లేదింకా.

"సారీ మనోజ్ఞా.. పొద్దున్న విన్నాను.. భరద్ అని.. ఆ పిలుపు ఎంతో బాగా అనిపించింది. ఇందాకా మళ్ళీ భయంలో పిల్చావుకదా. ఇంకొంచెం భయపెడదాం అనీ, కాస్త ఓవర్ చేశాను. సారీ.." అంటూ కార్ రివర్స్ చేశాడు.

కాఫీ షాప్ చేరాకా కారుదిగబోతుంటే చెప్పాడు గిల్టీగా, "అయాం సారీ మనూ, నీకో విషయం చెప్పాలి. ఇట్స్ నాట్ ఎంటైర్లీ భయపెట్టడానికే కాదు. యక్చ్యువల్లీ భయపెడదామని స్టార్ట్ చేశాను కాకపోతే, ఒక్క మోమెంట్ కి.. అంటే... ఐ.. ఐ వాంటెడ్ టూ ఫీల్ యువర్ టెండర్ టచ్.. సారీ.. మళ్ళీ మరీ అలా అడ్వాంటేజ్ తీసుకోవడం బాలేదనిపించి ఆగాను కానీ.. యూ ఆర్ వెరీ టెంప్టిగ్. ఐ మీన్........ ఛ.. మరీ మేనర్స్ లేని వెధవ లా బిహేవ్ చేశాను. సారీ.. అలా భయపెట్టి దగ్గరవడం చాలా తప్పే కానీ.. నా వల్ల కాలేదు రెసిస్ట్ చేసుకోవడం... ఐ మీన్.. సారీ అలాంటి వర్డ్స్ యూజ్ చేసినందుకు. ఐ మీన్... నాకేం మట్లాడాలో కూడా తెలీదు.. రియల్లీ.. "

చటుక్కున కదిలిందామె. ఏమౌతోందో అర్థమయ్యేలోపు అతని ముఖాన్ని దగ్గరకి తీసుకుని గాఢంగా అతని పెదవుల మీద ముద్దు పెట్టుకుంది. అతనా షాక్ లోంచి తేరుకునే లోపే కారుదిగి కాఫీ షాప్ లోకి వెళ్ళిపోయింది.

ఆ మధురమైన అనుభూతి నుంచి తేరుకోవడానికి కొద్దిసేపు పట్టింది భరద్వాజకి. అప్రయత్నంగా వ్యూ మిర్రర్ లో తన ముఖం చూసుకున్నాడు. ఆమె పెదవుల తడితో తన పెదాలు బ్రైట్ గా మెరుస్తున్నాయి. ముఖంలో ఎప్పుడూ లేనంత ఆనందపు కాంతి. 'ఔట్ జే.కే. క్లీన్ బౌల్డ్ నువ్వు..'అనుకుని సన్నగా నవ్వుకున్నాడు తనలో తానే. తాపీగా దిగి కాఫీ షాప్ లో అడుగుపెట్టాడు. ఏమీ ఎరగనట్టు సీరియస్ గా మెనూ చూస్తోంది మనోజ్ఞ. తన రాక గమనించి ఎర్రబడ్డ ఆమె ముఖం ముందు అక్కడి లైట్ల వెలుగులు వెలవెలబోయాయి.

"హాట్ ఆర్ కోల్డ్ సర్.. " బేరర్ సడెన్ గా అడిగేసరికి ఉలిక్కిపడ్డారిద్దరూ. ముఖాలు చూసుకుని పెద్దగా నవ్వేశారు. వాళ్ళెందుకలా నవ్వుతున్నారో అర్ధంకాక బేరర్ తెల్లబోయాడు.

అతనికి ఆర్డరిచ్చి, పంపేసి మనోజ్ఞ వంక చూశాడు. కళ్ళు దించుకుంది. "మనోజ్ఞా.."మృదువుగా పిల్చాడు.

"చెప్పండి.." బిడియంగా లోవాయిస్ తో అంది.

ముందుకి వంగాడు, "యూ ఆర్ ద మోస్ట్ బ్యూటిఫుల్ వన్ ఐ హావ్ ఎవర్ సీన్.. " అన్నాడు మెల్లగా.

"థ్యాంక్స్. థ్యాంక్యూ సో మచ్... " చెప్పింది మనస్ఫూర్తిగా.

"సర్.. "ల్యాప్ టాప్ లో ఏదో ఇన్ఫర్మేషన్ చదువుతున్న భరద్వాజ విసుగ్గా తలెత్తాడు.

"ఏంటి శరత్ సాయంత్రం వరకూ డిస్టర్బ్ చేయొద్దన్నానా.. "

"సారీ సర్.. మీ కోసం ఆనంద్ గారొచ్చారు. అప్పాయింట్మెంట్ లేదూ.. ఐనా ఓసారి అర్జెంట్ గా కలవాలనీ.."

"ఎవరూ.. ఆనందా.. పంపించు.." వెంటనే చెప్పాడు.

"డిస్టర్బ్ చేశానా.." సోఫాలో కూర్చుంటూ అడిగాడు ఆనంద్.

"నో.. నో.. చాలా రోజుల్నించీ యామ్ ఎవే కదా.. ఏదో జస్ట్ కాస్త వర్క్ వుంటే చూస్తున్నాను. రొటీన్ వర్కే. చెప్పు ఏం తీసుకుంటావ్.. కాఫీ, జ్యూస్..?"అంటూ కాజువల్ గా అడుగుతున్న భరద్వాజ వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"ఏమీ వద్దు సర్..."

"భలే వాడివే.. ఫస్ట్ టైమ్ వచ్చావ్. లేదంటే ఇంకేమన్నా తీసుకుంటావా.. స్పెషల్ గా స్కాచ్.. వైన్..." నవ్వాడు.

"అయ్యో.. వద్దు సర్.. కాఫీ చెప్పండి చాలు.." ఇబ్బందిగా అన్నాడు. ఇంటర్కామ్ లో కాఫీ ఆర్డర్ చేసి ఆనంద్ వైపు తిరిగాడు. తలొంచుకుని అనీజీగా, చాలా బెరుకుగా కనిపిస్తున్నాడతను. ఒక్కసారి పరీక్షగా అతన్ని చూసి, "..సో.. చెప్పు ఇంకేంటి సంగతులు... ఆరోజు రాత్రి బ్లడ్ ఇవ్వడానికి వచ్చినప్పుడు సరిగ్గా మాట్లాడటం కుదరలేదు. సో ఎలా జరుగుతున్నాయి మీ సెషన్స్? ఈ రోజు సెమినార్ కి వెళ్ళలేదా..? ఏమైంది ఆనంద్.. ఏమాలోచిస్తున్నావ్..? ఎనీ ప్రాబ్లమ్..?"అడిగాడు.

"మీకు నామీద కోపంలేదా.. లేక పైకి చూపించట్లేదా అన్నది నాకు నిజంగా అర్ధం కావట్లేదు సర్.." మెల్లగా అన్నాడు.

"నీ మీద కోపమా.. దేనికీ..?"తెల్లబోతూ అడిగాడు.

ఈసారి ఆశ్చర్యపోవడం ఆనంద్ వంతైంది.

"అదేంటి సర్ అలా అంటారు. అంతమందిలో అవమానించాను. మీకు కోపం రాలేదూ..?"

"ఓహ్.. అదింకా గుర్తుపెట్టుకున్నావా నువ్వు? ఏదో మాటల్లో కాస్త వేడెక్కువైంది. మనం మనుషులం, ఋషులమేమీ కాదు కదా. అనుకోకుండా జరుగుతుంటాయి అలాంటివి. లీవ్ ఇట్..."

"నేను.. నేను అనుకోకుండా అనలేదు సర్.. కావాలనే అన్నాను.. మిమ్మల్ని డీగ్రేడ్ చేయడానికే అన్నాను. ఇప్పుడు కూడా కోపం లేదా.."తలొంచుకుని అడిగాడు.

సూటిగా చూశాడు, "ఊహించాను.. కానీ కారణం అర్థం చేసుకోగలను. ఐనా నువ్వన్నవి నిజాలే కదా.. వదిలేయ్ ఆనంద్.."

"నన్ను... క్షమించగలరా.. అయాం సారీ... నలుగుర్లో అవమానించి, ఇలా విడిగా వచ్చి చెప్తున్నాననుకోకుండా .. నన్ను.. క్షమిం.."

"హేయ్ ఆనంద్.. తప్పు.. మరీ అలా మాట్లాడకు. ఇట్ వాజ్ జస్ట్ ఏన్ ఆక్వర్డ్ మోమెంట్. నా మనసులో ఏమీ లేదు. నిజం. ఐనా నువ్వు నవ్వుతూ సెటైర్స్ వేస్తుంటేనే బాగుంటావు. ఇలా క్షమించడాలు అవీ, ప్చ్.. సూటవట్లేదు.. నీకు.." చిరునవ్వుతో అతన్ని చూస్తూ చెప్పాడు.

రిలీఫ్ గా చూశాడతను, "థ్యాంక్స్.. మనూ చెప్పింది హండ్రెడ్ పర్సంట్ నిజం మీరు.. యూ ఆర్ రియల్లీ గ్రేట్.."

"అంతొద్దు.. నేనూ కోపాలూ, తాపాలు... చిరాకులూ, పరాకులూ, వగైరాలన్నీ వున్న మనిషినే .. నాకే లేని పోని గ్రేట్ నెస్ లూ అంటగట్టకండి. ఐనా ఆ ఆ పిచ్చిపిల్ల అలానే చెప్తుంది.. వాటికేంగానీ కాఫీ తాగు ముందు.." నవ్వుతూ అన్నాడు.

"తనకి.. మీరంటే.. మీరంటే.. ఐ మీన్.. చాలా ఇష్టం సర్.." తటపటాయిస్తూ అన్నాడు.

గంభీరంగా తలూపాడు భరద్వాజ, "తెలుసు.."

కొద్ది క్షణాల ఇబ్బందికరమైన నిశ్శబ్దం తర్వాత అన్నాడు ఆనంద్.

"నెక్స్ట్ గురువారం.. నా బర్త్ డే సర్..."

"ఆహా.. గుడ్.."

"మీరు రావాలి. తప్పకుండా.. చిన్నపార్టీ వుంది ..."

"వెల్.. ఇక్కడుంటే వస్తాను ఆనంద్. ఏ రోజు హఠాత్తుగా వెళ్ళిపోవలసి వస్తుందో తెలీదు.."

"ఓహ్.. ఐ విష్ మీరుంటే బాగుండునని.. ఎప్పుడు సర్ మోస్ట్లీ..?"అడిగాడు.

"తెలీదు ఆనంద్. చూడాలి.." నవ్వాడు పేలవంగా. 'ఏరోజు నేను తెగించి వెళ్ళగలిగితే ఆరోజు వెళ్ళిపోతాను..' అనుకున్నాడు మనసులో భారంగా.

"ఉంటాను సర్.." లేచి వెళ్ళబోయి మళ్ళీ అన్నాడు, "మనూకి తెలుసా సర్.. అదే... మీరు వెళ్తున్నారని.. ?"

"లేదు.. చెప్పాలి.."

"ఆ తర్వాత సరిగ్గా వారానికి మనూ బర్త్ డే... మీరు తన బర్త్ డేకి ఉండరంటే చాలా బాధపడుతుంది సర్.."

తల పరికించి అన్నాడు, "వెల్.. చెప్పానుగా ఇంకా నాకే తెలీదు నా ప్రోగ్రామ్.. ఇక్కడుంటే మాత్రం తప్పకుండా ఇద్దరి బర్త్ డేలకీ అటెండ్ అవుతాను. ఇట్స్ ఫర్ ష్యూర్.. ఓ.కే.నా.."

"ఓ.కే. సర్. మీరుంటే.. షీ విల్ బీ ద హాపియెస్ట్.. ఆరోజు వాళ్ళ డాడ్ కూడా వస్తారు. మిమ్మల్ని పరిచయం చేయాలని ఆశ పడుతోందని నా ఫీలింగ్" మనస్ఫూర్తిగా చెప్పాడు.

"ఎప్పుడానంద్ తన బర్త్ డే..?"అభావంగా చూస్తూ అడిగాడు.

"నెక్ట్స్ కాక ఆపై గురువారం, సిక్స్త్ రోజున సర్. నాకంటే సరిగ్గా వారం చిన్నది"

"..అండ్ నాకంటే ఇరవైరెండేళ్ళు.. " సూటిగా చెప్పాడు భరద్వాజ.

ఉలిక్కిపడి చూశాడు ఆనంద్. భరద్వాజ భావం అర్థమైంది.

ఒక్క క్షణం మౌనం తర్వాత అన్నాడు, "తను.. తనుండలేదు సర్..."

సీరియస్ గా చూశాడు భరద్వాజ. వీళ్ళంతా మనూకెందుకు సపోర్ట్ చేస్తున్నారు. వచ్చి తనకే చెప్పేంత ధైర్యం వీళ్ళకెలా వచ్చింది. ఇంకెంతమంది తో మాట్లాడవలసి రాబోతోంది తనకి. ఇట్స్ వెరీ ఆక్వర్డ్...

"ఉంటాను సర్.. సారీ.. ఎక్కువ మాట్లాడినందుకు. కానీ ఐ ఫీల్.. ఆలోచిస్తే మాత్రం మనూ కంటే మీరెక్కువ బాధపడతారనిపిస్తోంది.. వస్తానూ.." అంటూ భరద్వాజకి రియాక్టయ్యే అవకాశం ఇవ్వకుండా గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

స్తబ్దంగా ఉండిపోయాడు భరద్వాజ.

'నెమ్మది, నెమ్మదిగా అందరికీ తెలుస్తోంది తన పరిస్థితి. మనూ ముందే అనుకున్నాడు. ఎవరి ముందూ దాగట్లేదు..'

రేడియోలోంచి మేఘసందేశం పాట వినిపిస్తోంది.

"విన్నవించు నా చెలికీ విన్నవేదనా.. నా మరణయాతన.. "

తన యాతన మనూకేమో గానీ స్టాఫ్ కీ, సెక్యూరిటీ కీ ఐతే బాగానే అర్థమైనట్టువుంది. రోజూ తను బయల్దేరగానే తనతోపాటు స్టార్టయ్యే వాళ్ళకి వద్దని చెప్పీ, చెప్పీ కొద్ది రోజుల్నించీ అడగడం మానేశారు. మనూ వస్తే లాన్ బైటే కాపలా. లోపలికి రారు. తిరిగి చూడరు. మొదట్లో తనకీ సిగ్గేసేది 'ముసలోడికి దసరా పండగ 'అని తన వెనక నవ్వుకుంటున్నారేమో అని చాలా ఇబ్బందిగా అనిపించేది. కానీ మనోజ్ఞ వస్తూనే అందర్నీ పేరు పేరునా పలకరిస్తుంది. నవ్వుతూ మాట్లాడుతుంది. వాళ్ళూ చాలా హ్యాపీ గా రియాక్టవుతారు. ఆమెలో గర్వం, పొగరు అనే భావాలే పెట్టలేదేమో ఆ దేవుడు.

రెండురోజుల క్రితం తను గురుమూర్తి గారితో ఆన్లైన్ మీటింగ్ లో వుండిపోయి కాస్త లేటుగా బయటికి వచ్చేసరికి చక్కగా వాళ్ళతో చేరి టీ తాగుతూ కిచెన్ లో కూర్చుని హెల్త్ టిప్స్ చెప్తోంది. అంత పెద్ద సర్జన్ కూతుర్ననీ, హైక్లాస్ రిచ్ సర్కిల్నించి వచ్చాననన్న అహంకారమూ, హోమ్ మినిస్టర్ గర్ల్ ఫ్రెండ్ నన్న పొగరూ... ఏమీ లేవు. ఏంటీ.. ఏమనుకున్నాడూ.. గర్ల్ ఫ్రెండా.. మై గాడ్ మనూ గాలి బానే తగిలినట్టుంది తలవిదిల్చాడు.

"నందూ ఇక్కడికొచ్చాడా... ఫైన్.. ఏమన్నాడు..? "

"ఆ రోజు రూడ్ గా మాట్లాడినందుకు క్షమాపణ చెప్పాడు..." అంటూ ఆగాడు. ఆ తర్వాత తామిద్దరి మధ్యా జరిగిన సంభాషణ తలుచుకున్నాడు. ఎలా చెప్తాడదంతా..!

"అనుకున్నాను. ఆ రోజు తర్వాత చాలాసార్లు నాతో జే.కే. గారికి నా తరఫున సారీ చెప్పు అని చాలా ఫీలౌతూ మరీ మరీ చెప్పాడు.. " అంటూ లేచి గులాబీ మొక్కవైపు నడిచింది.

"ఔనా మరి నువ్వేమన్నావ్..?"అప్రయత్నంగా అడిగాడు.

పూసిన గులాబీల్లో ఒకదాన్ని తుంచుతూ అతన్ని చూసి చిన్నగా నవ్వింది., "అక్కర్లేదు హీ విల్ అండర్ స్టాండ్, ఆయన అర్థం చేసుకుంటారని.. చెప్పాను"

నమ్మలేనట్టు చూశాడతను.

"ఎలా మనూ.. అలా ఎలా చెప్పగలవు? ఐనా అంతగా ఎందుకు నమ్ముతావు నన్ను? నేనేంటో, అసలు నేనెవరినో, ఎలాంటి వాడినో నీకేమన్నా తెలుసా..? మన పరిచయం అయ్యి హార్డ్లీ ఒక నెలయ్యుంటుందా..? అంత తక్కువ పరిచయంతో అంత నమ్మకం పెంచుకోవడం.. అది ఎవరి మీదైనా కూడా.. ఇట్స్ నాట్ గుడ్. అసలేం తెలుసు నీకు నా గురించి?"విచిత్రంగా చూస్తూ ప్రశ్నించాడు.

"మీ గురించి నాకు తెలియదా భరద్వాజా.. చాలా బాగా తెలుసు. కారణాలడిగితే నేను చెప్పలేను. పోనీ మీరు చెప్పండి. మీరెందర్నో చూసి వుంటారు. కానీ, నన్నే ఎందుకంత దగ్గరగా రానివ్వగలిగారు? మనసులో మాటల్ని సైతం షేర్ చేసుకునేంతగా ఇంత తక్కువ సమయం లో మన పరిచయం ఎలా పెరిగిపోయింది? కారణం మీకు తెలుసా..? "

తల అడ్డంగా తిప్పాడతను. చేతిలోని పువ్వుని క్షణకాలం చూసి తన హెయిర్ పిన్ లో అమర్చుకుంటూ చెప్పింది, "మనిషిని మనిషి నమ్మడానికీ, ఇష్టం పుట్టడానికీ గొప్ప గొప్ప అద్భుతాలే జరగక్కర్లేదు భరద్వాజా.. ఒక చిన్న పరిచయం గాఢమైన బంధం కావడానికి ఓ చిన్న సంఘటన చాలదూ..! క్షణం ముందు వరకూ ఈ గులాబీతో నాకే పరిచయమూ లేదు. కానీ కలిసిన ఈ క్షణం నుండీ ఇది నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది. ఈ సంతోషం నాకు ముఖ్యం.. దాన్ని నేను ప్రేమిస్తాను.."

"కానీ.. అది తాత్కాలికమే మనూ.. అది నిలిచేది కొద్ది సమయం మాత్రమే... " అతని గొంతు వణికింది.

"ఈ లోకంలో మనకి అత్యంత ముఖ్యమైన ఘట్టాలన్నీ.. ప్రతీదీ కొద్దిసేపే భరద్వాజా.. పుట్టడం–పోవడం, గెలుపు–ఓటమీ, పెళ్ళీ–పిల్లలూ, ఆఖరికి పూర్తి ఎక్స్టసీ తో కూడిన సెక్స్ తో సహా ప్రతీదీ లిప్తపాటే. కానీ మనం మనసుల్లో శాశ్వతంగా నిలుపుకునేది ఆ అనుభూతి తాలూకు జ్ఞాపకాల ఫ్రాగ్రెన్స్ ని మాత్రమే.. కానీ దాని లెంగ్త్.. అది ఓ జీవితకాలం కదూ...?"ఉద్వేగం గా అడిగింది.

నిశ్శబ్దంగా వుండిపోయాడు భరద్వాజ. తాను గుండెపొరల్లో ఎక్కడో, చాలా సుస్థిరంగా నిర్మించుకున్న బలమైన అభిప్రాయాపు కోటల్ని పునాదుల్తో సహా కదిలిస్తున్న ఆమె మాటల లోతుని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ కామ్ గా వుండిపోయాడు.

అతని మౌనాన్ని వేరేలా అర్థం చేసుకుని మొహమాటపడిందామె.

"సర్లెండి. నాకస్సలు నోరాగదు. ఆలోచించకుండా ఏంతోస్తే అది అనేస్తాను. మరీ బోల్డ్ గా అనేసాను కదా. రియల్లీ సారీ.. " ఇబ్బందిగా కదులుతూ అడిగింది.

"ఛ... అదేం లేదు.. పద వెళ్దాం.. డిన్నర్ కి లేటవుతోంది.." లేచాడు.

"ఈరోజు పేపర్ చూశారా..? "

"ఏం ఏమైంది.. "

"లేదూ. యాంటీ పాలిటిక్స్ సొసైటీ అని ఒక గ్రూప్ క్రియేట్ చేసారెవరో, దాని మీద ఓ బ్లాగ్ కూడా వుంది., వాటి గురించి డీటైల్డ్ గా రాశారు... చాలా మంది ప్రముఖులు దాని గురించి ఫీలవుతూ కామెంట్ చేసారు కూడా..."

"ఓ అదా.. చదివాను.. సినిమాల్లో, పుస్తకాల్లో రాజకీయాల గురించి చాలా దారుణంగా రాస్తారని చాలామంది పెద్దలు ఫీలైపోతుంటారు కదా మనూ.. ?"అడిగాడు.

సాలోచనగా చూసింది, "అవును, మరీ నీచంగా ప్రొజెక్ట్ చేస్తారు.లైమ్ లైట్ లో వుండడం వల్లో, ఏమో గానీ, చిరాకనిపిస్తుంది అప్పుడప్పుడు, ఏ రంగం లో జరగని ఘోరాలు చెప్పండి.. అసలూ.. " ఆమె మాటల్ని మధ్యలో కట్ చేస్తూ చెప్పాడు, "వాస్తవానికి పరిస్థితులు అంతకంటే ఘోరంగా, దారుణంగా వుంటాయి మనోజ్ఞా." తెల్లబోయి చూసిందా మాటకి.

"అంటే.. డూ యూ రియల్లీ మీన్ ఇట్..? "విస్తుపోతూ అడిగింది.

"ఎస్. ఐ మీన్ ఇట్.. కొన్ని కోణాలు నువ్వూహించలేనంత ఘోరంగా, భరించలేనంత భయంకరంగా కూడా వుంటాయి మనూ. డబ్బూ, అధికారం, పదవి మనుషుల్లో చెప్పలేనంత మదాన్ని తలలో నింపుతాయి. అడిగేవాడెవ్వడనే పొగరుతో ఎన్నో జీవితాలు కాలరాసిన వాళ్ళెందరో..."

"మే బీ.. అలాంటి వాళ్లున్నందుకేనేమో కదా ఆ ట్రైబల్ గర్ల్ చామంతి రేప్ కేస్ లాంటివాటిల్లో నిందితులెవరో కూడా బయటకి రాలేదు.. "

"అలాంటి కథలెన్నో మనూ.. ఎందరో ఆడవాళ్ళు అన్యాయం జరిగిందంటూ ముందుకు కూడా రావట్లేదు. ఎన్నో దారుణాలు జరుగుతాయి. వాటి తో పోల్చుకుంటే, వెరీ సారీ టూ సే, రేప్ చాలా చిన్న విషయం.. ఎక్కడో నూటికో కోటికో ఏ కొద్దిమందో ఎదురీదాలని వస్తారు.. వాళ్ళని పోలీసులు, లాయర్లు, కోర్టులు విచారణ పేరుతో చీల్చి చండాడి నానా ఛండాలం చేసేస్తారు.."

"మరి.. మరి.. ఇంత హోదా.. పవర్ పెట్టుకుని మీరేం చేయలేరా..? "

"చేయనీయరు. పెద్ద ఎత్తున వత్తిళ్ళు వస్తాయి. తమని అన్ పాపులర్ చేయడానికి పన్నిన వ్యూహం అంటారు. అఫ్కోర్స్ కొన్ని అలాంటివీ జరుగుతాయనుకో. చాలా కష్టం మీద ఏమైనా చేద్దామని ట్రై చేస్తే, నిజం మాదాకా వచ్చేలోపు వందసార్లు ఫిల్టర్ అయిపోతుంది. మాకే అర్థం కాని సిట్యూయేషన్స్ కొన్ని వుంటాయి. మరి కొన్నిసార్లు నిజం తెలిసీ ఏమీ చేయలేని నిస్సహాయత మాకు అడ్డుగా..."

"టూమచ్ భరద్వాజా.. ఎవడి పదవిని వాడు కాపాడుకోవడానికి చెప్పే కుంటి సాకులే మీరూ చెప్పకండి.. అంత పెద్ద హోదా పెట్టుకుని.. ఎవరి కి చెప్తారు కహానీలు.. ట్రాష్ అది.." కోపంగా అనేసింది.

నవ్వాడతను, "అవును మనోజ్ఞా. నే చెప్పేదీ అదే. ట్రాషే అందంతా. కానీ అది ఈనాటిది కాదు. గోరుముద్దలు తింటూ నాన్న, తాతల హయాం నుంచీ తెలుసుకుంటూవస్తున్న మన ఘన చరిత్ర. దానంతటినీ ఏదో మార్చేసి, మొత్తం సిస్టమ్ నే ప్రక్షాళన చేసేద్దామనే ఉడుకు రక్తంతో, ఆవేశంగా, నీలానే మన కి ఓ హోదా, పదవీ వుంటే దాని సాయంతో అన్నీ చేసెయ్యొచ్చని–ఆలోచించి దిగానీ బురదలోకి. కానీ, దిగాకే తెలిసింది, ఇది బురద కాదు పెద్ద ఊబి అనీ, చేతికి అందిన ఆధారాన్ని పట్టుకుని పైకి లేవకపోతే నామరూపాల్లేకుండా తుడిచిపెట్టుకుపోతామనీ..."

"సమర్థించుకుంటున్నారా..? "బుల్లెట్ లా వచ్చిందామె ప్రశ్న.

"లేదు. తెలియజేస్తున్నాను. "

"ఛా.. మరి అంత బాధపడుకుంటూ అదే బురదలో వుండడం ఎందుకో..? "వ్యంగ్యంగా అంది.

"ప్రతివాడూ బురదని అసహ్యించుకునీ, బాధపడీ, భయపడీ, దూరంగా వుంటే మరి శుభ్రం చేసేదెవరు? "

"మరి శుభ్రం చేయడమంటే.. అలా అన్యాయాలు జరుగుతూవుంటే చూస్తూ వదిలేసి.. ఏమీ చేయనీయరు అని కథలు చెప్పడమా.. మరీ టీ.వీ. ల్లో వచ్చే లైవ్ షోస్ లో, ఇంటర్వ్యూల్లో చెప్పే కథల్లా వుంది.." విసురుగా అనేసింది.

"తప్పదు మనోజ్ఞా! వందమందికి న్యాయం చేసే ప్రయత్నంలో పది మంది ప్రయోజనాలు పట్టించుకోవడం కష్టం. లేదంటే ఎవరికీ ఏమీ చేయలేకుండానే మిగిలిపోవలసి వస్తుంది. ఐనా ఓవర్ నైట్ అద్భుతాలు జరగడానికి ఇది ఫిక్షన్ కాదు.. రియాలిటీ.. "

"అంటే పదిమందికి అన్యాయం జరిగినా పరవాలేదా..? "

"చెప్పానుగా. తప్పదని.. "

"అది న్యాయం ఎలా అవుతుంది, అసలా పది... "

"నేనేమీ ఏ దేశానికీ పీనల్ కోడ్ ని కాదు మనూ, పదిమంది నేరస్థులు తప్పించుకున్నా ఒక్క నిర్దోషికి శిక్షపడకూడదంటూ నీతులు చెప్పి, పదిమంది రాక్షసులని జనంమీదకి వదలడానికి. అలాంటి న్యాయం ఏం చేసుకోవడానికి, ఎందుకది.., ఆ పదిమందీ మరో వందమంది నిర్దోషులని హింస పెట్టడానికా? ఖచ్చితమైన శిక్షలుంటేనే ఎవరికైనా న్యాయం జరుగుతుంది. చట్టప్రకారం కాకపోతే, న్యాయప్రకారం.. నా చేతిలో వీలైన న్యాయం నేను చేసి తీరతాను. ఆ ప్రయత్నంలో పది మంది నష్టపోయినా, ఏమైపోయినా సరే.. బెనిఫిట్ ఆఫ్ డౌట్ ముసుగులో ఏ నీచుడినీ తప్పుకోనివ్వను.. అందుకే ఇది కేవలం జే.కే. పీనల్ కోడ్ అనుకో.... ద అల్టిమేట్ కోడ్ ఆఫ్ జస్టిస్... " తీవ్రంగా అన్నాడు.

"ఓహ్.. భరద్వాజా.. ప్లీజ్.. కామ్ డౌన్.. ఎందుకంత ఆవేశపడతారు. ఏదో ఓ డిబేట్ లా మాట్లాడాను. అంతేగానీ మీరింత ఫీలౌతారనుకోలేదు.. "

"లేదు మనూ.. ఇది ఆవేశం కాదు మనూ. బాధ... ఈ సిస్టమ్ మీదా, మా చేతకానితనం మీదా నాలో నాకే రగులుతున్న మంట. ఈ పొజిషన్లో వుండి కూడా మేం చేయాల్సివచ్చే కొన్ని కాంప్రమైజ్ లూ, దుర్మార్గాలూ తల్చుకుని కలిగిన ఉక్రోషం. వేరెవ్వరి దగ్గరా బయటపడలేనుగా. అందుకే నీ ముందిలా.." చెప్పాడు.

అతని గొంతులో తొణికిన విషాదానికి విస్మయం చెందుతూ అడిగింది, "అంతగా ఏమైంది భరద్వాజా..? ఎనీథింగ్ ట్రాజిక్.. నేను అడగవచ్చా.. అంటే ఇఫ్ ఇట్స్ నాట్ టూ పర్సనల్..?."

నీ దగ్గర నాకు పర్సనల్ ఏమిటి మనూ.. వేదనగా అనుకున్నాడు.

"ఏంలేదు మనూ.. ఒక దారుణం గుర్తొచ్చింది.. ఏమీ చేయలేరా అని అడిగావుకదూ.. వింటావా మేం ఏం చేయలేమో.."

"**అలా చెప్పడం వల్ల** మీకు ఏమన్నా రిలీఫ్ వుంటుందంటే చెప్పండి భరద్వాజా. తప్పకుండా వింటాను. కానీ కూల్ గా.. అలా ఆవేదనా, ఆవేశాల్తో కాదు.."

విరక్తిగా నవ్వాడు, "ఇదంతా పార్ట్ ఆఫ్ మా లైఫ్ మనూ... కాకపోతే ఒరిజినల్ ఎక్స్ ప్రెషన్స్ చూపించి చాలా కాలమైంది. చెప్తా విను.. ఇది ఏ అనామకురాలికో, గిరిజన తండాలోనో కులం, ధనం, బలం ఏమీ లేని మామూలు అమ్మాయికో జరిగిన అన్యాయంకాదు. ఓ పెద్ద ఇండస్ట్రియలిస్ట్ కూతురికి జరిగిన దారుణం. పాపమా పిల్ల పెళ్ళి చేసుకుని ఓ పెద్దింటి కోడలయ్యింది. మామగారు సెంట్రల్ మినిస్టర్. ఆయనకా మినిస్ట్రీ వచ్చినప్పుడాపిల్ల తండ్రి ఓ పెద్ద ప్యాలస్ నే గిఫ్ట్ గా ఇచ్చాడు. అలా వున్నప్పుడే ఓ రోజు ఆ అమ్మాయి మరిది తన స్నేహితులతో కలిసి,తాగిన మత్తులో ఇంటికి వచ్చి, భోజనం వడ్డించిన వదినని... అందరూ కలిసి.. చాలా ఘోరంగా గ్యాంగ్ రేప్ చేసి.. చివరికి పెట్రోల్ పోసి తగలబెట్టేసారు.. "

"మై గాడ్... దారుణం.. "

"అవును.. అంతకన్నా ఘోరం ఏంటంటే... చావుబతుకుల్లో వున్న ఆమె హస్పిటల్లో డెత్ స్టేట్మెంట్ ఇచ్చింది. అందరూ అరెస్టయ్యారు. ఆ అమ్మాయి తండ్రి మా నాన్నగారి దగ్గరకి వచ్చి సాయంకోరాడు, తన కూతురి చావుకి కారణమైన వాళ్ళు శిక్షింపబడేలా చూడమని అడిగాడు. అక్కడే ఆయన పెద్ద తప్పు చేసాడు. అవుటాఫ్ లా చూసుకుంటే ఎవ్వరూ మిగిలే వారు కాదేమో. డెత్ స్టేట్మెంట్ ఉందన్న నమ్మకంతో ఆయన చట్టాన్ని నమ్ముకున్నాడు. ఐనా దాంతో సరిపెట్టలేదు. ఏ వత్తిడికీ లొంగని మెజిస్ట్రేట్ ఆ కేస్ కి వచ్చేలా చూసుకున్నాడు. అప్పుడు దిగాడా మినిస్టర్ రంగంలోకి. డబ్బు ఏరులై పారింది. పైసా, పొజిషన్, ఫియర్, విమెన్, వైన్, ఎవర్ని, ఎక్కడ, ఎలా వంచచ్చో అలా వంచాడు. లొంగని వాళ్ళ లోటు-పాట్లు తెలుసుకుని బ్లాక్ మెయిల్ తో లొంగదీసాడు. మెజిస్ట్రేట్ మాత్రం లొంగకుండా, గట్టిగా వుండడంతో ధైర్యంగా కోర్టుకెళ్ళారు. ఎవ్వరూ వూహించని విధంగా డెత్ స్టేట్మెంట్ లో కొన్ని ఫ్రేజెస్ ట్రిక్ చేయబడ్డాయి. ఫలితం.. రేప్.. అక్రమసంబంధమైంది, హత్య... ఆత్మహత్యైంది.. జడ్జ్ నిస్సహాయుడయ్యాడు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద... వాళ్ళంతా విడుదలయ్యారు.

ఆ రాత్రి నాన్న పడిన బాధ నేనెప్పటికీ మర్చిపోలేను."ఏమీ చేయలేని చేతకాని పొజిషన్ రా మాది. చనిపోయిన ఆడపిల్ల చరిత్రకి మచ్చపూయడానికి తప్ప ఎందుకూ పనికిరాలేదీ పవర్, చట్టం.." అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నారాయన.

ఇదంతా చూసి మేం పొజిషన్ లో వుంటే ఇలా ఎన్నటికీ జరగనివ్వం అంటూ భీషణ, ఘోషణ ప్రతిజ్ఞలు చేసుకున్నాం. అప్పటికి కుర్రాళ్ళం కదా. ఏదో చేసెయ్యగలం అనుకున్నాం. కానీ, ఇదిగో దిగాకా అర్థమైంది,మొత్తం సిస్టమే ఎదురుతిరిగితే చేయగలిగేది ఏదీ లేదని.. చివరికి హుక్ ఆర్ క్రుక్ మెథడే బెస్ట్ అని ప్రాక్టికల్ గా తెలుసుకున్నాం. మంచో-

చెడో.. మాకు తోచిన న్యాయం.. చూద్దాం ఈ పద్ధతిలో ఏం చేయగలమో మా పరిధిలో మేము....." అంటూ నీళ్ళ బాటిల్ అందుకుని గటగటా ఖాళీ చేసాడు.

మనోజ్ఞ వైపు చూసి అలసటగా నవ్వాడు, "ఏంటీ.. భయం వేస్తోందా...?"

"ఊహు.. గర్వం గా వుంది.."

"వ్వాట్... డార్క్ సైడ్ ఆఫ్ మన సిస్టమ్ చూశా.. లేక మాలాంటి పనికిరాని లీడర్లని చూశా.. దేనికీ?" తెల్లబోతూ అడిగాడు.

"రెండూ కాదు.. అంత భయంకరమైన ఊబిలో వుండి కూడా స్వచ్ఛంగా వున్న మిమ్మల్ని చూసి.."

పకాల్న నవ్వాడు, "పొలిటిక్స్ ఈజ్ పాలీ ట్రిక్స్ అంటే సో మెనీ ట్రిక్స్ అనీ, మా అందరికీ రెండేసి కాదు పన్నెండేసి నాలుకలు కూడా వుంటాయనీ మర్చిపోకు మనూ.. మాలో ఎవరిని కదిపినా వాళ్ళ వెర్షన్ వాళ్ళు ఇంకా అద్భుతం గా, మనసు కరిగించేలా చెప్పగలరు. అవన్నీ నమ్మావంటే అయినట్టే..."

"నేను మీలో పొలిటీషియన్ ని నమ్మడంలేదు భరద్వాజా.. నమ్మడానికి మీ పొలిటికల్ ప్రపంచం గురించి అంతగా నాకు తెలీదు కూడా.. కానీ నేను నమ్ముతున్నది మీలో మనిషిని.. "జవాబిచ్చింది.

"సరే, నీకు తెలియాలని చెప్పాను. నువ్వు నమ్మాలని కాదు. అది నీ ఛాయిస్. ఎనీవేస్..." అంటూ ఏదో చెప్పబోయి ఆగిపోయాడు దూరంగా చూస్తూ.

అప్రయత్నంగా అతను చూస్తున్న వైపు చూసింది. దిలీప్.. ఎవరో అమ్మాయితో కూర్చుని తాగుతున్నాడు.... హాయిగా నవ్వుతూ.. చొరవగా ఆమెని దగ్గరకి లాక్కుని కిస్ చేస్తున్నాడు. మనసు చురుక్కుమనిపించగా బాధగా ముఖం తిప్పుకుంది. అప్పటివరకూ సాగిన తమ సంభాషణకి క్లైమాక్స్ లా అనిపించిందా దృశ్యం.

"అవును సర్.. చూశారా.. ఎంత ఈజీగా మర్చిపోయాడో శైలూని.. మీరు చెప్పింది అక్షరాలా నిజం భరద్వాజా.. ఆ లెవెల్లో మంచీ, చెడూ, మనసూ... ఏమీ వుండవు.. మోసమే వుంటుంది.. ప్రేమా, పెళ్ళీ,.. ఏదో ఒక రూపం మోసం చేయడానికి... వెళ్దాం పదండి", లేచింది ఇక అక్కడ వుండలేనట్టు.

కాటేజ్ ముందు కారాపాడు.

"ఇంకా అదే ఆలోచిస్తున్నారా..?" అడిగింది స్తబ్దంగా వున్న అతన్ని చూసి.

"మే బీ.. ఆర్.. మే నాట్ బీ... తెలీదు.. నిన్నొకటడుగుతాను దాచకుండా నిజం చెప్తావా...?"

"అఫ్కోర్స్, అడగండి చెప్తాను. ఐనా మీ దగ్గర ఎందుకు దాస్తాను..?"

"మరి నన్నెలా... ఎలా... నమ్ముతావు మనూ.. నేనూ అదే సెక్షన్ ఆఫ్ సొసైటీ కి చెందిన వాడ్ని.. నేను వాళ్ళ కంటే డిఫెరెంట్ అని ఏంటి గ్యారంటీ.. నేనెవరినో... ఎలాంటివాడినో నీకేం తెలుసు? సో నామీదేంటి నమ్మకం..?" ప్రశ్నించాడు.

"నమ్మకం అని మీరే అన్నారుగా.. నమ్మకం అంతే.."

"అదే అడుగుతున్నాను మనూ.. నేనెలా వాళ్ళకంటే మంచివాడిననుకుంటున్నావు..? నేనూ వాళ్ళలాంటివాడినేనేమో. రాదర్ ఇంకా కన్నింగ్ పర్సన్నేమో.. ఆ ప్రేమా, పెళ్ళీ, ఉద్యోగం, సహాయం, ఇవేమీ.. .. ఇలాంటి ఏ కమిట్మెంట్స్ మాటా లేకుండా కేవలం ఇన్ డైరెక్ట్ గా ఇష్టం చూపించి.. నిన్ను ల్యూర్ చేస్తున్నానేమో.. ఇలా.. ఇలా ఆలోచించాలని.. నీకు.... నీకెప్పుడూ.. అనిపించ లేదా?"ప్రశ్నించాడు.

తలెత్తి చూసిందామె. కోపంతోనో, రోషంతోనో గానీ ఆమె ముఖం ఎర్రబారింది. సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ చెప్పింది. "ల్యూర్ చేసి... చేసి ఏం చేస్తారు భరద్వాజా..? అట్ ద మాగ్జిమమ్.. 'అదేగా'.. అంతేనా.. ఐనా అలా భయపడుకుంటూ నా శీలాన్ని ఎన్నాళ్ళు కాపాడుకుంటాను..? రాదర్ అసలెందుకు కాపాడాలి? నా అర్థంలేని భయాలు, అపోహలతో మిమ్మల్ని ఇష్టపడుతున్నానని చెప్తున్న నా మనసు మాట వినకుండా, మీ లాంటి మంచి వ్యక్తికి దూరం అవడంవల్ల జరిగే నష్టం ముందు మిమ్మల్ని గుడ్డిగా నమ్మడం వల్ల జరిగే ఫిజికల్ రేప్ చాలా చిన్నది అని నా వుద్దేశ్యం. నచ్చిన వ్యక్తికి దగ్గరయ్యే అవకాశాన్ని అపోహల్తో వదులుకోలేను. ఒకవేళ నిజంగానే మీరు వేరే వుద్దేశ్యంతో వుండి వుంటే జరిగే పరిణామాలవల్ల రేపటిరోజున నా ఈ అభిప్రాయం మారితే మారచ్చు. కానీ, ఈ క్షణానికైతే నా మనసు చెప్పిందే నాకు వేదం. మీ మీద నాకున్న నమ్మకమే నా బలం. అంటే నేనేదో శీలానికున్న ఇంపార్టెన్స్ తక్కువ చేస్తున్నానని కాదూ.. నేనూ ఆడపిల్లనే.. అది నాగౌరవానికి, వాల్యూస్ కీ సంబంధించినదే.. కానీ.. ప్రేమించిన మనిషిని నమ్మడంలో అంత ఆచి–తూచి వ్యవహరిస్తే అది ప్రేమెలా అవుతుంది భరద్వాజా..? వ్యాపారం కాదూ..? అండ్ ఐ డోన్ట్ మీన్ అందరూ గుడ్డిగా తాము ఇష్టపడ్డవాళ్ళని విచక్షణలేకుండా ఫాలో ఐపోయి శీలం, ప్రాణం ఇచ్చేసి, వాళ్ళే గంగలో దూకమంటే అందులో దూకెయ్యమని కాదూ... కానీ.. నాకెందుకో మీ విషయంలో అలా ఆలోచించలేనంత నమ్మకం ఏర్పడిపోయింది. మే బీ... బహుశా.. లవ్ లో అందరికీ ఇలాగే అవుతుందేమో తెలీదు.. కానీ... ఐనా.. ఇది నా పర్సనల్ ఒపీనియన్ మాత్రమే.. రైటో.. రాంగో.. కరెక్టో కాదో..., లెట్ టైమ్ టేక్ ఇట్స్ కోర్స్ అండ్ డిసైడ్.. వై టూ హర్రీ...."

నిశ్చేష్టుడై చూస్తుండిపోయాడతను. ఆమె మాటల్లో క్లారిటీ, నిజాయితీ, అతన్ని భయపెట్టేంత బలంగా వున్నాయి. ఎవరైనా, ఎంతవారైనా, తమ జీవితం లో కనీసం ఒక్కసారైనా రావాలని కోరుకునే క్షణమది. తమని వేరొకరు ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నారనీ, అంతరాత్మకన్నా మిన్నగా నమ్ముతున్నారనీ తెలియడం.. ఒక అపురూపమైన

అనుభూతి... ఆ క్షణం ఏమీ ఆలోచించలేనంత, అనంతమైన తృప్తి కలిగిందతనికి. నిశ్శబ్దంగా స్టీరింగ్ వదిలి సీట్లో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడు. కొద్దిసేపటి వరకూ ఆ ప్రభావంనుంచి తేరుకోలేకపోయాడు.

జీవితంలో చూసిన ఎన్నో గెలుపులకన్నా గొప్ప గెలుపిది. ప్రేమించిన వ్యక్తి మనసు గెలుచుకోవడం. మనసుని తృప్తి పరచి, సేద తీర్చే మాటలవి. అందులోని లోతు భయపెట్టేలా వున్నా, వాటి వెనుక కనిపిస్తున్న ఆమె ప్రేమ తాలూకు పూర్తి రూపం హాయిగొల్పుతోంది.

"భరద్వాజా.."బెరుకుగా వినిపించిన పిలుపుకు నెమ్మదిగా కళ్ళు విప్పాడు. బెదురుగా అతన్నే చూస్తోందామె. "..ఎమోషన్లో మరీ ఎక్కువ మాట్లాడేసి మిమ్మల్ని కంగారు పెట్టానా...?"భయంగా అడిగింది.

నవ్వాడు "లేదు. అదేం లేదు మనోజ్ఞా.. నేను ఒప్పుకోలేనంత గొప్ప నిజాయితీ వుంది నీ మాటల్లో.. అందుకే.. దట్ మేడ్ మీ స్పెల్ బౌండ్.. అంతే.." అంటూ ఆమె ముఖం చూసి తడబడ్డాడు. "..సరేలే.. ఇంక వెళ్ళిరా... ఇప్పటికే చాలా ఆలస్యమైంది.. ఈరోజు మరీ.. టూ మచ్ ఆఫ్ హాట్ డిస్కషన్స్ అయిపోయాయి మనకి... గుడ్ నైట్..." అంటూ సాగనంపాడామెని.

'నా ప్రతీ ఆనందం నీతోనే వుందనీ, నా ధ్యాసా, శ్వాసా నువ్వే అవుతున్నావనీ.. ఎలా చెప్పను.. నా ప్రతీ సంతోషం నీలోనే దాగుందని దాచిపెట్టి వేరెవరిలోనో ఆనందం వెతుక్కోమని చెప్తున్నాను. నా అంత దురదృష్టవంతుడెవడూ వుండడు...'నిస్పృహగా అనుకున్నాడు. తన పరిస్థితికి తనకే జాలేసింది. జీవితంలో మొట్టమొదటిసారి ప్రేమించాడు. కానీ.. ఒప్పుకోలేడు. 'వాటే పిటీ..!'

'ఇన్ఫాట్యూయేషన్స్ కీ, అట్రాక్షన్స్ కీ లోబడే వయసూ, మనసూ కాదు. తొలి ప్రేమా ఏమో తెలీదు.... కానీ.. జీవితంలో మొదటిసారి మనసులోతుల్లోంచి పొంగుతున్న నిజమైన ప్రేమ. చెప్పుకోనూలేడు. తప్పుకోనూలేడు.'

'ఆమెకీ తెలుసు. ఎందుకు తెలియకుండావుంటుంది. తన ప్రతి చూపులో, మాటలో, కదలికలో, ...తనకే తెలుస్తోందే.. ఇక ఆడపిల్ల.. ఆమాత్రం తెలుసుకోలేదూ..! ఇదంతా ఆమెకీ తెలుసు. మనోజ్ఞ అందించే హింట్స్, ఇన్ డైరెక్ట్ గా మాట్లాడే మాటలూ, కావాలని చేసే అల్లరీ, మరింత అలజడి రేపుతున్నాయి తనలో. పోను పోను తనని తాను నిగ్రహించుకోవడం చాలా కష్టమని తెలుస్తోంది. అయినా ఎక్కడ కంట్రోల్ చేస్కుంటున్నాడు. ఎక్కడికక్కడ దొరికిపోతున్నాడు. తెలియకుండానే ఇన్వాల్వ్ అయిపోతున్నాడు. ఆమె మాగ్నెటిక్ పవర్ ముందు తన సెల్ఫ్ కంట్రోల్ మొత్తం వీగిపోతోంది. అసలు తనేనా.. మిన్ను విరిగిమీదపడ్డా చలించని జే.కే. ఇలా.. ఓ ఆడపిల్ల ముందు ఇలా....'

"హలో భరద్వాజా.. హల్లోవ్... సర్... " మనోజ్ఞ తనని తడుతుంటే స్పర్శకి ఆలోచన తెగింది.

"చెప్పు.. " తడబాటుగా అన్నాడు.

"మీకు కళ్ళుతెరిచి నిద్రపోయే అలవాటుందా..?"అనుమానంగా అడిగింది.

"అదేం లేదు. ఏదో ఆలోచిస్తూండిపోయాను.. అంతే.. " నవ్వాడు.

కళ్ళు విప్పార్చి చూసింది. ఆల్చిప్పల్లాంటి కళ్ళలో సన్నటి అల్లరి నవ్వు, ఏదో చిలిపి ఊహ మెదిలిందని చెప్పకనే చెప్తోంది.

"ఏంటీ నవ్వుతున్నావ్..? "అడిగాడు.

పెదాలు బిగించి తల అడ్డంగా తిప్పింది. కుతూహలంగా ముందుకి వంగాడు.

"ఏయ్.. ఏదో దాస్తున్నావ్.. చెప్పు.. "

"అలా మీరు ఎంత పిలిచినా, తట్టినా,పలకకపోతే.. నేనూ.. " నవ్వాపుకుంది.

"ఆ.. నువ్వూ.. భయపడ్డావా..? "

"ఊహు.. "

"అబ్బా.. చంపకు.. చెప్పు మనోజ్ఞా.. "

"అమ్మో చెప్పను పెద్ద క్లాస్ తీసుకుంటారు మళ్ళీ..నా వల్ల కాదు..." చెప్పింది సీరియస్ గా.

"అబ్బా.. బిల్డప్ ఎక్కువైంది. నా క్యూరియాసిటీ పెరిగిపోతోంది. చెప్పు. ఏమీ తీసుకోను.. " సిన్సియర్ గా చెప్పాడు.

"ఇంకాస్సేపు కదలకపోతే.. చిన్న షాకిచ్చి లేపితే.. అని అనిపించింది. అంతే మీ బ్యాడ్ లక్.. పలికేశారు.. "అల్లరిగా నవ్వింది.

"షాకేంటీ.. ఏమంటున్నావ్. సరిగ్గా చెప్పరాదా.. నాకర్థం కావట్లేదు.."అయోమయంగా చూస్తూ అన్నాడు.

ఆమె చెంపలు ఎర్రనయ్యాయి. "మీరూ.. కావాలని కదూ.. నిజంగా తెలీదూ.. చెప్పండి.. మీకు తెలీదూ.. "

ఆమెకేసి సూటిగా చూసాడు. మనోజ్ఞ కళ్ళు దించుకుంది. భరద్వాజ గుండె వేగం పెరిగింది. ఏం చేసేదీ.? ముద్దుపెట్టి లేపేదా..? లేక.., తదేకంగా చూస్తున్నాడు. అలా పెదాలు బిగించి నవ్వాపుకుంటుంటే ఎర్రని పెదాలు ఇంకా రేకులు విప్పని లేత గులాబీ మొగ్గలా.. మెరుస్తూ... తాను మొదటిసారి తాకిన మెత్తటి స్పర్శ, వెచ్చటి ముద్దూ.. మదిలో మెదిలి, ఆ ఊహకే వళ్ళు జలదరించిందతనికి.

ఏమైంది జే.కే.నీకు.. ఏం ఆలోచిస్తున్నావ్.. ఏం చేస్తున్నావ్..? ఆ పిల్ల చిన్న హింటివ్వడం పాపం నీ ఊహలు కోటలు దాటుతున్నాయి.. ఇక చాలు.. తనని తానే మందలించుకుంటూ ఆమె పై నుండి చూపు మరల్చుకున్నాడు.

"చాలా చల్లగా వుంది కదూ ఈ రోజు..?" అబ్రప్ట్ గా టాపిక్ మారుస్తూ అన్నాడు చూట్టూ చూస్తూ.

మాట దాటేసి, ఏదో ఒకటి మాట్లాడాలన్నట్టుగా అంటున్నఅతన్ని చిరునవ్వుతో చూసింది.

"చాలానా.. మరీనూ.. ఫ్రీజింగ్ గా వుంది కదా. ఇప్పుడే ఇలా వుంటే, పీక్ వింటర్ టైం లో ఎలా వుంటారో పాపం ఇక్కడి జనం..." తనూ మామూలైపోతూ అంది.

రిలీఫ్ గా చూశాడు. తన మనసులో ఇరకాటాన్ని కూడా అర్థంచేసుకునే బంగారుతల్లి.. ఈమెకి తానేం చేయగలడు..!

"పోనీ.. వెళ్తావా.. డ్రాప్ చేయనా.... బాగా చలేస్తోందా..? "ఆప్యాయంగా అడిగాడు.

"ఊహు.. వద్దు. ఇట్స్ ఓ.కే. అన్నట్టు మీకో ఫ్లాష్ న్యూస్.. "

ఏంటన్నట్టు కళ్ళెగరేశాడు.

"నేను రేపు, ఎల్లుండి ఆక్యూపైడ్ .. వాక్ కి కూడా రాలేను.." అతని ముఖ కవళికలు గమనిస్తూ చెప్పింది.

ఉలిక్కిపడ్డాడు. 'రెండు రోజులే..' చప్పున సర్దుకున్నాడు 'ఆమె తననే గమనిస్తుంటుందని ఊహించగలడు. అది తనకి ఏమాత్రం.., ఇట్ డజంట్ మేక్ ఎనీ డిఫెరెన్స్ అని, ఆమె అనుకోవాలి'. అందుకే వీలైనంత క్యాజువల్ గా ముఖం పెడుతూ, "ఆహా.. ఏంటీ.. సెమినార్ వర్కా...?" అని అడిగాడు.

ఆమె ముఖం వాడిపోయింది. పాపం ఆడపిల్ల కదూ.. కళ్ళలో డిసప్పాయింట్మెంట్ దాచుకోలేకపోయింది.

మౌనంగా టీపాయ్ మీద చేరిన మంచుబిందువుల్నివేలితో గీతలుగా గీస్తూ వుండిపోయింది. ఆమెని జాలిగా చూసి తన డల్ నెస్ ని దిగమింగుతూ అడిగాడు, "ఏం మాట్లాడవు.. ఫ్రెండ్స్ అంతా కలిసి ఎటైనా వెళ్తున్నారా..?"

తెప్పరిల్లిందామె, "లేదులెండి. కొంచెం డాక్యూమెంట్ వర్క్, నా వైపు నుండి పెండింగ్, చాలా రోజుల్నించీ, ప్రొఫెసర్ కూడా కాస్త కోపంగా వున్నారు. అందుకే చిన్న సైజు ఆన్ లైన్ రిసెర్చ్ లాంటిది చేసి ఒక డీటైల్డ్ నోట్స్ నెక్స్ట్ ప్రజెంటేషన్ సెషన్ కి ఇవ్వాలి.."

"ఓ.. గుడ్.. గుడ్.. చేస్కో మరి. అద్సరే ప్రొఫెసర్ కోపంగా వుండడం ఏంటీ.. నువ్వాయన ఫేవరిట్ వి కదా. ఆరోజు కూడా బెస్ట్ స్టూడెంట్ వి, బెస్ట్ డాక్టర్ వి, ఇండియాస్ ప్రైడ్.. అంటూ బోలెడు పొగిడారుకదా..!" సందేహంగా అడిగాడు.

తేలిగ్గా నవ్వేసింది., "అది అప్పటి మాట భరద్వాజా.."

"ఈ మధ్య నాతో అవుటింగ్స్ ఎక్కువై చదువు సాగట్లేదు కదా..?"గిల్టీగా ఫీలౌతూ అన్నాడు.

"ఛ.. అదేం లేదు.. ఇది వేరే రీజన్ లెండి.." తలతిప్పి ఆమె ని చూశాడు. ఏదో తెలీని అశాంతి. "విషయం చెప్పు మనూ.. " భరద్వాజ గొంతులో వినిపించిన కమాండ్ కి ఇబ్బందిగా కదులుతూ అంది, "మీరు ఫీలౌతారు మళ్ళీ.."

"డోన్ట్ బీట్ అరౌండ్ ది బుష్.. ఏంటీ.. ఏదన్నా ప్రాబ్లెమా.. జస్ట్ షూటిట్ మనూ.. షూటిట్ ఐ సే... " విసుగ్గా అన్నాడు.

"వెల్.. సీరియస్ గా ఏం లేదూ. హోమ్ మినిస్టర్ గారికి వలేస్తున్నానని ఆయన కోపం.. సింపుల్.." అంటూ నవ్వింది.

భరద్వాజ ముఖం రంగులు మారింది. విసురుగా తలెత్తాడు.

"హౌ డేర్ హీ సే దట్.... ఎవరా అన్నది..?? ఆ ప్రొఫెసరేనా..?" ఒక్కసారిగా అతని గొంతులో పలికిన తీవ్రతకి బెదిరిపోయిందామె.

"ప్లీజ్.. భరద్వాజా.. ఏమిటంత ఆవేశం. వదిలెయ్యండి. ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. ఏదో మీరడిగారని చెప్పాను గానీ, ఇంతలా రియాక్టౌతారని కాదు. ప్లీజ్ కూల్ డౌన్.." అనునయంగా అంది.

"రియాక్షన్.. మై ఫుట్... అసలు రియాక్షన్ అంటే ఏంటో ఇంకా చూడలేదు మనోజ్ఞా నువ్వు. నేను మాట్లాడాకా అప్పుడు చూద్దువుగానీ, నాదికాదు మీ ప్రొఫెసర్ గారిది, రి..యా..క్ష..న్.." అంతే తీవ్రంగా అన్నాడు.

"ప్లీజ్ , ఏమొద్దు. మీరలా అంటే ఇంకేం చెప్పను మీకు పొండి.."అంటూ అతని ముఖం చూసి ఆగిపోయింది.

అప్పటికే లేచినిలబడ్డాడతను. అతని ముఖం జేవురించింది కోపంతో. రక్తం సలసల మరిగిపోతోంది. ఎంత ధైర్యం... అనుకున్నాడు రోషంగా.

మనోజ్ఞ కూడా కంగారుగా లేచింది, "ఏంటిది భరద్వాజా.. దీన్ని పెద్దది చేయకండి. లెట్ మీ హాండిల్ దిస్. ఐనా మీరేమన్నా చేస్తే మనకే నష్టం, మనని పట్టించుకోని వాళ్ళు కూడా తిరిగి చూస్తారు.. ప్లీజ్.. కూర్చోండి.. నాకోసం.. మీకు దణ్ణం పెడతాను.. ప్లీజ్.."అంది వేడికోలుగా.

ఆమెకేసి చూసి నిస్సహాయంగా కుర్చీలో కూర్చున్నాడు.

"సరే... సరే.. ఏమీ చేతకానట్టు చేతులు ముడుచుకుని కూర్చుంటాను. నిన్నెవరేమన్నా సరే.. చాలా.. హ్యాపీనా..?" కోపంగా అరిచాడు.

ఆప్యాయంగా చూసింది, "ఎందుకంత ఇదవుతారు. ఐనా పాలిటిక్స్ లో వున్నారు, మీకిదంతా కామన్ కదా. ఇంతకంటే దారుణమైన అలిగేషన్స్ వుంటాయని, మీరేగా చెప్తారూ..." అనునయంగా అంది.

విసుగ్గా చూసాడు, "అది వేరు. ఇది వేరు మనోజ్ఞా.. డోన్ట్ బీ స్టుపిడ్.."

"మరి ఆనంద్ ఆరోజూ ఇదేగా అన్నాడు. మరి అప్పుడెందుకు అంత కామ్ గా వున్నారు. ఇప్పుడెందుకిలా..?" ఆమెకీ కోపం వచ్చింది అతని రాష్ నెస్ కి.

"కానీ ఇప్పుడు విషయం నువ్వు కాబట్టి..." తూటాలా షార్ప్ గా దూసుకొచ్చిందతని నోటినుంచి సమాధానం.

క్షణకాలం నమ్మలేనట్టు చూసింది. అతనంత ఓపెన్ గా అంటాడనుకోలేదు. ఆమె ముఖం వెలిగింది. "అయితే...?" అప్రయత్నంగా రెట్టించింది.

ఆ గ్యాప్ లో సద్దుకున్నాడు భరద్వాజ. ఆమె కళ్ళలో మెరుపు అతని దృష్టి ని దాటిపోలేదు.

"అంటే.. అది ఆనంద్.. అతనికి నీ గురించి వర్రీ అయే హక్కుంది.." తడబాటుని కప్పిపుచ్చుకుంటూ అన్నాడు.

సూటిగా అతని వైపు చూసింది. చప్పున చూపు మరల్చుకుని వెయిటర్ కి సైగ చేసాడు, "ఇంకేమన్నా కావాలా.. బిల్ చెప్పేయనా..?" తడబాటు గా అడిగాడు. సన్నగా నవ్వింది. ఇబ్బంది గా కదిలాడు. జీవితంలో ఫస్ట్ టైమ్ కాపీ కొడుతూ దొరికిపోయిన స్టూడెంట్ లా వుందతని పరిస్థితి. అసలు విషయం పక్కకి వెళ్ళిపోయి ఆమెని ఎవరేమన్నా తను సహించలేడనే పాయింట్ హైలైట్ అవ్వడం చాలా ఇరకాటంగా అనిపించింది.

"ఆనంద్ నీఫ్రెండ్. పైగా నిన్ను ఇష్టపడుతున్న వ్యక్తి. నువ్వు ఇంకెవరితోనైనా చనువు గా వుంటే అతనికి కోపం రావడం సహజం. కానీ, నిన్నడగడానికి ఆ ప్రొఫెసర్ కి మాత్రం ఏమీ హక్కులేదు... " సీరియస్ గా చెప్పాడు.

రిలాక్స్డ్ గా నవ్వింది., "సరే వదిలేయండి. ఏదో పాతకాలం మనిషి. పోనిద్దురూ.. ఇంకేంటి.. చెప్పండి..?

ఆమెకేసి చూసాడు. రెండురోజులు ఆమె కనిపించదనే దిగులు మళ్ళీ తిరిగొచ్చింది. అది దాచేస్తూ అన్నాడు, "సో ...ఈ టూ డేస్ కి ఇది లాస్ట్ మీట్ అన్నమాట... " అన్నాడు అప్పుడే వచ్చిన బిల్ వైపు చూస్తూ.

"ఎస్. రేపు.. డిన్నర్ కూడా డౌటే.. " అంది ఓర గా చూస్తూ.

నవ్వేశాడు, "చెప్పావుగా రెండురోజులూ బిజీ అని, హ్యాపీగా వర్క్ చేసుకో. నాకూ కాస్త పనులున్నాయి. కొన్ని మీటింగ్స్ కూడా వున్నాయి.. " సాలోచనగా అన్నాడు.

కోపంగా చూసింది"థ్యాంక్స్ ..నాకు తెలుసు.."

' నీకు తెలీదు మనూ.. నిన్నుచూడకుండా రెండురోజులంటే రెండు యుగాల్లా అనిపిస్తున్నాయని నీకు తెలీదు. నేనది పైకి చెప్పాలని నీ ఆశ. చెప్తే నీలో ఆశలు పెంచినట్టవుతుందని నా భయం. కానీ, ఇలా ప్రతి నిమిషం నీ నీడలా తిరగడం వల్లకూడా అదే జరుగుతోంది. తెలుస్తోంది నాకు. కానీ, ఐ కాన్ట్ హెల్ప్ ఇట్.. అంత కూడా అణుచుకోలేను నన్ను నేను... ' తల విదిల్చాడు.

"ఇది మీ అలవాటా.. ?" కుతూహలంగా అడిగింది.

"ఏదీ.. ?"అయోమయంగా అడిగాడు.

"హఠాత్తుగా ఏదో ఆలోచిస్తూ వుండిపోవడం.. సడన్ గా తల విదిల్చి మాటల్లో పడ్డం. చాలాసార్లు చూసాను.." చెప్పింది.

నవ్వాగలేదు భరద్వాజకి, "ఓహ్.. అదా.. అలానే అనుకో... "

'అలవాటు కాదు తల్లీ, అంతా నీ మాయ.. ' అని చెప్పాలనే కోరికని బలవంతంగా అణుచుకున్నాడు.

"సో.." ఎదురుగా వున్న కాటేజ్ వైపు దిగులుగా చూస్తూ అంది.

"సో లేదూ ఏమీ లేదూ.. ముందు వెళ్ళు. మననిలా చూస్తే మీ డాక్టర్స్ చూస్తే మళ్ళీ మీ ప్రొఫెసర్ కి ఏదో ఒకటి మోస్తారు." తొందరచేశాడామెని.

"మీకేం అనిపించట్లేదా..? "అడిగింది.

జవాబు చెప్పలేదతను. స్టీరింగ్ మీద వేళ్ళతో కొడుతూ మౌనంగా వుండిపోయాడు.ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి. అరచేతులతో ముఖాన్ని గట్టిగా వత్తుకుంది. జాలిగా ఆమె తల మీద చెయ్యి వెయ్యబోయి అప్రయత్నంగా ఆగి, వెనక్కి తీసుకున్నాడు.

"చూశారా.. చెప్పూ చెప్పూ.. ఫ్రాంక్ గా వుండూ అన్నారు.. ఇప్పుడేమో నన్ను ముట్టుకోవడానికి కూడా వెరుస్తున్నారు చూశారా.. అందుకే ఇంకేం చెప్పను మీకు.. "ఉక్రోషంగా అంది.

"ఏయ్.. అలా అనకు.. అదేం లేదు.." అంటూ ఆమె భుజం చుట్టూ చెయ్యి వేశాడు. అతని వల్లా కావట్లేదామెని వదిలి వెళ్ళడం.

నెమ్మదిగా తన భుజం మీదున్న అతని చేతిని చెంపకానించుకుంది. "ఇదే మరి నీతో వచ్చింది.." చెయ్యి వెనక్కి లాక్కుంటూ మృదువుగా మందలించాడు.

నవ్వి కారు డోర్ ఓపెన్ చేసింది.

"ఓ.కే. దెన్.. టేక్ కేర్.. బై భరద్వాజా.. నాకు మీలా మనసు దాచుకోవడం రాదు మరి. ఇకనైనా ఒప్పుకోండి సర్.."

సీరియస్ గా చూశాడు, "ఏం ఒప్పుకోవాలి మనూ.. ప్లీజ్.." అంటూ ఇంకేదో చెప్పేలోపు అతన్నాపుతూ, "వద్దు భరద్వాజా.. మీరేం చెప్తారో నాకు తెలుసు. అట్ ది సేమ్ టైమ్ మీ మనసులో ఏముందో కూడా తెలుసు. సో కనీసం ఎట్లీస్ట్ ఒక్క విషయమైనా ఒప్పుకునే ధైర్యం మీకొచ్చినప్పుడు కూర్చుని మాట్లాడుకుందాం.. ఓ.కే. ఎనీవేస్ థ్యాంక్స్. నన్నెవరైనా ఏమైనా అంటే మీరెంతలా రియాక్టౌతారో మరోసారి మీ కళ్ళలో చూశాను. ఇప్పటికి దాంతో అడ్జస్ట్ అయిపోతాన్లెండి... సీ యూ దెన్... గుడ్నైట్.. "

కారు దిగిపోయింది. వెళ్తున్న ఆమె రూపాన్ని కనుమరుగయ్యేంతవరకూ చూసి కారు స్టార్ట్ చేశాడు.

'ఎన్ని టెన్షన్స్ వున్నా.. మనోజ్ఞ ముఖం చూడగానే అన్నీ మర్చిపోతాడు. ఇంత మధురమైన బాధని అందరూ అనుభవిస్తారా..? తాను తిరిగి వెళ్ళాకా ఆమెని మర్చిపోయి ప్రశాంతంగా బతకగలడా..? అక్కడ సంగతి దేవుడెరుగు, అసలిప్పుడీ రెండు రోజులు మనూ ని చూడకుండా వుండగలడా..' ఎన్నో ప్రశ్నలు. వేటికీ తన దగ్గర సరైన జవాబే లేదు. ఎవ్వరేమడిగినా తిరుగులేని సమాధానాలిచ్చే జే.కే. దగ్గర తన మనసడిగే ఏ ప్రశ్నకీ జవాబు లేదు.

రాబోయే రెండురోజులనీ తల్చుకుంటేనే ఇంత బాధగా వుంది. మరి తర్వాతెలా వుంటాడు తను... కానీ వుండాలి. తప్పదు.. 'నిట్టూర్చాడు.

మంచం మీద వాలి సెల్ తీసి టాస్క్ షీట్ చూడబోతూ ఆగిపోయాడు. "మీకేం అనిపించట్లేదా..?" విప్పార్చిన కళ్ళతో మనోజ్ఞ వేసిన ప్రశ్న గుర్తొచ్చింది. పాపం.. ఎంత డీలా గా వెళ్ళిందీ... ఆమె కళ్ళు గుర్తొచ్చాయి. చక్రాల్లా విశాలంగా విప్పారి, చంచలంగా చేపపిల్లల్లా కదులాడుతూ... ఎన్ని భావాలని పలికిస్తాయవి..! డాన్స్ వచ్చిన వాళ్ళకే కళ్ళలో అంత అందం గా భావాలని పలికించడం వస్తుందంటారు.. అసలు నా ఏంజిల్ కన్నా చక్కగా అన్నిభావాలూ కళ్ళలో పలికించగలరా ఎంతటి డాన్సర్లైనా.. తన ఆలోచనలకి తనే నవ్వుకున్నాడు. సెల్ లో వున్న మనోజ్ఞ ఫొటో తీసి చూశాడు. ఆమె గమనించనప్పుడు తీశాడది. ఎంత అందంగా వుందీ.. ఎంత తియ్యగా మాట్లాడుతుంది.. గలగలా.. చల్లని... సెలయేరులా ... ఉరికే జలపాతంలా...

కళ్ళుమూసుకుని క్రాఫ్ లో కి వేళ్ళుజొరుపుకున్నాడు. "మీ హెయిర్ స్టైల్ బాగుంటుంది భరద్వాజా.. ఇట్ లుక్స్ గ్రేట్ ఆన్ యూ... మీకింకా గ్రే హెయిర్ రాలేదా లేక కలర్ అప్లై చేస్తారా..?"ఆమె ప్రశ్నల పరంపర గుర్తొచ్చింది. ఏమైనా మాట్లాడేస్తుంది. ఏం చెప్పడానికీ వెరవదు. మగవాడు వెరిస్తే స్త్రీ యే అతని రోల్ తీసుకుంటుందని ఎక్కడో చదివాడు. అదేమిటో ఇప్పుడు తెలుస్తోంది. తను చప్పున చొరవ చేసి ఏదైనా అంటే సిగ్గుతో ముడుచుకుపోతుంది.అదే తాను కామ్ గా వుంటే అస్సలు ఆగదు తుఫానే...

వాచ్ చూసుకున్నాడు. పదకొండు..

చాలాసేపు అన్యమస్కంగా గడిపాడు. డైరీ రాసాడు. పుస్తకం చదవడానికి ట్రై చేసాడు. కుక్ తీసుకొచ్చిన పాలు తిప్పిపంపేసాడు. పన్నెండు దాటుతుంటే వల్లకాలేదిక. సెల్ తీసి మనోజ్ఞకి డయల్ చేసాడు.

"మీరింకా నిద్రపోలేదా..?" ఫోన్ తీస్తూనే ఆశ్చర్యంగా అడిగింది.

"వర్క్ ఎంతవరకూ వచ్చిందీ..?" హీన స్వరంతో అడిగాడు. మొదటిసారి అమ్మాయిని డేట్ కి అడుగుతున్న పదిహేనేళ్ళ కుర్రాడిలా వుందతని పరిస్థితి.

జవాబు చెప్పలేదు మనోజ్ఞ. మౌనంగా వుంది. కాసేపు నిశ్శబ్దం ఇద్దరి మధ్యా..

"ఒప్పుకుంటున్నాను మనూ.." భరద్వాజ గొంతు వణికింది., "నిన్ను.. ఐ మీన్ నీ కంపెనీ ని చాలా మిస్ చేస్తాను రెండురోజులంటే.. నిజంగానే.." మెల్లగా చెప్పాడు.

"భరద్వాజా..!!" సంభ్రమంగా అంది.

"ఎస్ మనూ.. ఐ మీన్ ఇట్. నువ్వు.. యూ స్టార్టెడ్ మేకింగ్ ఏ లాట్ ఆఫ్ డిఫెరెన్స్ ఇన్ మై లైఫ్.. ఎలా చెప్పనూ.. నువ్వన్నది నిజమే.. మీకేం అనిపించట్లేదా.. అనడిగావ్ కదా.. అనిపిస్తోంది... అది చెప్పాలనే... అందుకే.." అంటూ ఆగాడు ఉద్వేగంలో మాటలు తడబడగా.

"ఓహ్.. భరద్వాజా.. థ్యాంక్యూ.. థ్యాంక్యూ సో మచ్... ఐ నో.. ఐ... యూ ఆర్ సచ్ ఏ స్వీట్ హార్ట్... యూ నెవర్ నో ఇలా చెప్పి మీరెంత పెద్ద గిఫ్ట్ ఇచ్చారో నాకు..."ఆనందంతో తేలిపోతూ చెప్పింది.

"ఓకే.. ఓకే.. ఇంక వర్క్ చేస్కో.. సారీ.. నిన్ను డిస్టర్బ్ చేసినందుకూ.. బాధ పెట్టినందుకూ.. ఏ పనిష్మెంట్ కైనా కూడా రెడీ..." నవ్వుతూ చెప్పాడు.

"ఓహ్... పనిష్మెంటేమీ వద్దులెండి.. "

"సరే.. పోనీ నేనే ట్రీట్ ఇస్తాను.. నీ వర్క్ సక్సెస్ ఫుల్ గా పూర్తవగానే... ఏం ఇవ్వనూ..?" ఒక్కసారి ఆలోచించి అన్నాడు, "సరే.. హిల్ సైడ్ టీ గార్డెన్స్ కి తీస్కెళ్తాను.. సరేనా.."

"వ్వావ్.. నిజంగా.. "చిన్నగా అరిచింది.

"ష్.. అర్థరాత్రిది.. నిజంగా.. అప్పుడు మీరు వెళ్తే వీ.ఐ.పీ. ఎంట్రీ అని లోపలికి వెళ్ళనీయలేదన్నావుగా. ఐ విల్ టేక్ యూ దేర్.." నవ్వుతూ చెప్పాడు.

"ప్చ్...." ఫోన్ నోటికానించి ముద్దుపెట్టుకున్న తీయని శబ్దం. ఉలిక్కిపడ్డాడు. తియ్యని కరెంటేదో వళ్ళంతా ప్రవహించిన ఫీలింగ్. ఏమనాలో తెలియలేదు. అర్థంకానట్టు నటిస్తూ త్వరత్వరగా చెప్పేసాడు, "...తొందరగా ఫినిష్ చేస్కో వర్క్ మరి... గుడ్ నైట్"

"సరే.. ఐ విల్ ఫర్ ష్యూర్.. మీరే చూస్తారుగా ఎంత ఫాస్ట్ గా చేస్తానో... యూ విల్ బీ సర్ప్రైజ్డ్.. గుడ్ నైట్ భరద్వాజా.." తియ్యగా నవ్వుతూ చెప్పింది.

భరద్వాజా... అన్న తియ్యని పిలుపు వినగానే... ఏదో మధురమైన భావన. చప్పున తేరుకుని కాల్ కట్ చేశాడు.

మళ్ళీ ఆమె ఫొటో చూశాడు. రాత్రి డిన్నర్ అయ్యేవరకూ కలిసే వున్నారు. అయినా ఎన్నో రోజులైపోయిన ఫీలింగ్. వెంటనే ఆమె ని చూడలనే తపన. 'విరహం 'అంటారు.. ఇదేనా..? కనీసం ఈ రెండురోజులన్నా అనుభవిస్తే తెలుస్తుందా తనకి.. లేక అంతలోనే తెలుస్తుందా..!

'విరహమో.. దాహమో.. విడలేని మోహమో... 'బాధగా అనుకున్నాడు.

అప్రయత్నంగా ఫోన్ పెదాలకానించుకున్నాడు. ఆమె పెట్టిన ముద్దు ఇంకా తన చూట్టూ గింగిర్లు కొడుతున్నట్టేవుంది. లేచి బాల్కనీ లోకి నడిచాడు.

వంట్లోంచి పొగలు చిమ్ముతున్నట్టు వేడి. బయట ఎముకలు కొరికే చల్లటి చలి. ఐనా హాయిగానే వుంది. మనోజ్ఞ ఫొటో కేసి మళ్ళీ మళ్ళీ చూస్తూనే వున్నాడు.

అమాయకంగా చూస్తోంది. భరద్వాజా.. అంటూ తియ్యగా తనని పిలుస్తున్నట్టే వుంది. తన పేరు అంత మధురంగా పలకొచ్చనీ, అంత బాగుంటుందనీ తనకే తెలీదు ఆమె పిలిచే వరకూ. తనని పిలవడం ఏమిటి.. ఫర్ దట్ మ్యాటర్ ఆ పంచదార పెదాలతో తనని తిట్టినా తియ్యగానే వుండదూ..!

అలా ఎంతసేపున్నాడో ఆమె ఫొటో చూస్తూ, తలుచుకుంటూ తెలియలేదు. తెల్లవారి నాలుగింటికి అలారం మోగే సరికి తేరుకుని.. చూసాడు. మై గాడ్.. ఇంతసేపు మనోజ్ఞ ఫొటో చూస్తూ గడిపేసాడా.. ఇలా జరుగుతుందని ఎవరైనా చెప్తే తను నమ్మేవాడుకాదేమో. కానీ ఇప్పుడు తెలుస్తోంది మనూ చెప్పిన మ్యాజిక్ ఆఫ్ లవ్ అంటే ఏమిటో.. తలవిదిల్చి వాచ్ చూసుకున్నాడు. ఆమె రాకుండా తానెందుకిప్పుడు వాకింగ్ కి ..! నెమ్మదిగా లోపలికొచ్చి, మంచం మీద వాలి ఆలోచించసాగాడు.

'ఇంతగా మునిగిపోతున్నాడామె ఆలోచనల్లో, తానిక వదిలి వెళ్ళగలడా ఆమెని... పోనీ ఒక్కసారి చెప్పేసి... ఒకరోజు పూర్తిగా ఆమెతో గడిపేసి.. ఇక తిరిగి చూడకుండా వెళ్ళిపోతే మంచిదా... వాళ్ళ సెమినార్స్ అయ్యేవరకూ ఐతే వుండలేడు... రామ్, క్యాబినెట్, జనం, మీడియా, ఏమనుకుంటారు. గోలెత్తిపోతుంది స్టేట్ మొత్తం. ఇన్నాళ్ళ పాటు ఏ స్టేట్ హోమ్ మినిస్టరన్నా బ్రేక్ తీసుకుంటాడా.. ఎంత హెల్త్ రీజన్ చెప్పినా ఈపాటికి తెలిసే వుంటుంది అందరికీ.. కనీసం ఇన్నర్ సర్కిల్స్ లో ఐనా.. తానిక్కడో అమ్మాయి వెంట పిచ్చివాడిలా తిరుగుతున్న సంగతి. పోనీ మనోజ్ఞనే అడిగితే.. అసలు వెళ్ళద్దంటుందా.. తానున్నా ఆమె ఎలా వుంటుందన్నాళ్ళు.. ఆమె కుటుంబం, దగ్గర వాళ్ళు... పోనీ.. అన్నీ వదిలేసి తనతో వచ్చేస్తానంటుందా.. లేక... ఛ.. ఏమాలోచిస్తున్నాడు తను.. ఇలా ఐతే కంట్రోల్ అయినట్టే.. బట్... ఐ లవ్ హర్ డామిట్.. షీ ఈజ్ సో బ్యూటిఫుల్.. జస్ట్ ఒక్కసారి తన మనసు ఆమె మాటలకి కన్విన్స్ అవగలిగితే ఆ బంగారు బొమ్మ తన సొంతం కాదూ.... ఏంజిల్.. షీ విల్ బీ... ఆల్ మైన్... గాడ్... షీ ఈజ్ సో.....'

**ఆలోచనలతో** అలసిన కళ్ళు బరువుగా మూతలు పడ్డాయి.

"భరద్వాజా.. లేవండి సర్... పదౌతుంటే..." ఎంత తియ్యటి పిలుపు నిద్రగా అనుకున్నాడు.

"హలోవ్... మిమ్మల్నే..." సుతారంగా ఎవరో తన భుజం మీద తడుతున్న ఫీలింగ్. మత్తుగా కళ్ళు విప్పాడు.

అందంగా మనోజ్ఞ రూపం కళ్ళ ముందు కదలాడింది... పెద్దకళ్ళు, ఊరించే ఎర్రని పెదాలు తియ్యగా భరద్వాజా అంటూ తన పేరు పిలుస్తూ.. తలరా స్నానం చేసివచ్చిందేమో అగరుపొగలాంటి జుట్టు ఆమె భుజాల వెనుక అందంగా కదులుతోంది. లేతపచ్చటి చీరలో, వనకన్యలాగా...

"మనూ..." చెయ్యి చాపి ఆమెని తన మీదకి లాక్కున్నాడు. ఒక్కసారిగా పూలచెండేదో తనని సుతిమెత్తగా వత్తుకున్న అనుభూతి. నల్లటి పెద్ద కళ్ళు ఆశ్చర్యంతో, భయంతో మరింత పెద్దవయ్యాయి. ఆ అందాన్ని ఆస్వాదిస్తూనే వెనువెంటనే "భరద్వా... "అంటున్న పెదవుల్ని తన పెదాల్తో మూసేసాడు. తియ్యటి కరంటేదో ఆమె నుంచి తనకి ప్రవహిస్తున్న భావన. తన మునిపంటి తాకిడికి పెదవిచిట్లి నాలుకకి తడిగా, ఉప్పగా తగిలిన రక్తం అది కలకాదంటూ తీయని వాస్తవానికి తెర తీసింది. అప్రయత్నంగా వదిలేసాడు. అతని పట్టులో బిగింపు తగ్గగానే చప్పున అతని గుండెలమీద చెయ్యివేసి నెడుతూ పైకి లేచింది మనోజ్ఞ.

"స్స.... "చిట్లిన పెదవికి వేలాన్చుకుంటూ దూరం జరిగింది. ఒక్కసారిగా దిగ్గున లేచాడు భరద్వాజ. ఆమె ముఖం కందిపోయింది. ఏం చేశాడో నెమ్మదిగా రియలైజేషన్ కి వచ్చింది. "ఓహ్ గాడ్..." వేళ్ళతో నుదుటిని రుద్దుకున్నాడు. ఏం చెప్పాలో తెలియలేదు. పొరపాటున చేసానని కూడా చెప్పలేడు. చెయ్యో, కాలో తగిలితే పొరపాటని సారీ చెప్పచ్చు. కానీ... ఎలా... ఏం చెప్తాడూ. రాత్రి తెల్లవార్లూ ఆమెనే మేలుకుని తల్చుకున్నాననీ, ఆమె తలపుల్తోనే తెల్లారాకా నిద్దరోయాడనీ ఎలా చెప్తాడు. కళ్ళు తెరవగానే ఆమెని చూసి కల కరిగిపోతుందేమో అన్నట్టు లాక్కున్నాడనీ... కానీ అలా ఎలా.. అర్థం కాలేదు. అంతగా ఎలా భ్రమ పడ్డాడు తను.. అసలు తనే నమ్మలేకపోతున్నాడు. అసలు ఎవరైనా నమ్ముతారా.. ఐనా తనేమన్నా అనుకున్నాడా కలగన్నాట్టే మనోజ్ఞ కళ్ళు తెరవకముందే తన ముందుంటుందనీ... అదీ తన ప్రైవేట్ ఛాంబర్లో... తన మంచం దగ్గర... అసలెలా.. ఏం చెప్పాలిప్పుడు తనూ.. సారీ అనాలా.. ఇంతకీ సారీ దేనికీ, ఆమె పర్మిషన్ లేకుండా ముద్దాడినందుకా... లేక... తీయని ముద్దు మధ్యలో గాయం చేసినందుకా.. అసలు అలా కలలా తనముందుకు వచ్చినందుకు థ్యాంక్స్ అంటే... చెప్పుచ్చుకుని కొడుతుందేమో.. ఉలిక్కిపడి ఆ ఊహకే భయంగా చూసాడు.

మాట్లాడబోయి ఆగిపోయాడు. చేసిన పనికి ఆక్వర్డ్ నెస్ తో మాటలు రావట్లేదు. ఆమె వైపు చూసాడు. కోపంతోనో, సిగ్గుతోనో గానీ ఎర్రబడ్డ ముఖంతో తలవంచుకుని మంచాన్నానుకుని నిలబడిపోయింది. కోపం వచ్చుంటుందా..! రాదా మరి ప్రేమిస్తున్నాననైనా చెప్పకుండా లాగి ముద్దుపెట్టుకుంటుంటే.. రాదూ మరి.. నీరసం ముంచుకొచ్చిందతనికి. రోగ్ లా తయరవుతున్నాడు తను రోజురోజుకీ. దూరంగా వుండమనీ, అదీ, ఇదీ అని నీతులు చెప్పి, తానేమో ఇలా.. ఈ విధంగా టెంప్ట్ చేయడం. ఛ.. సచ్ ఏన్ ఇడియట్..'కలే అనుకున్నాను మనూ.. నమ్మవూ..'అనుకుంటూ దిగులుగా చూసాడు. గొంతు దాటట్లేదేమాటా.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఇంటర్కామ్ గణగణా మోగింది. యాంత్రికంగా అందుకున్నాడు. "సర్.. మనోజ్ఞా మేడమ్.. అదీ.... మీరే రమ్మన్నారనీ చెప్తేనే లోపలికి పంపించాం సర్.." సెక్యూరిటీ గొంతులో భయం.

గొంతు పెగుల్చుకున్నాడు, "హా... ఆ.. ఎస్.. నేనే.. ర.. రమ్మన్నాను... దట్సాల్ రైట్.." అంటూ ఫోన్ క్రెడిల్ చేసి ఆమె వైపు చూశాడు.అలాగే తలవంచుకుని వుంది.

'చెత్త వెధవ.. చెత్త బిహేవియర్..' తనని తాను తిట్టుకున్నాడు. తప్పదు. తనే ఏదో ఒకటి చేయాలి. ఇప్పుడూ ఆ అమ్మాయినే రియాక్టవమనడం టూ మచ్ అనిపించుకుంటుంది. గాఢంగా ఊపిరి తీస్కుని చుట్టూ చూసాడు.

డోర్ దగ్గరున్న ఆమె చెప్పుల్లో ఒకదాన్ని తీసుకుని ఆమె ముందుకొచ్చాడు. మోకాళ్ళమీద ఆమె ముందు కూర్చుని చెప్పుని ఆమె ముందుకి సాచుతూ సిన్సియర్ గా చెప్పాడు, "కొట్టు.." అని.

అదిరిపడి పక్కకి జరిగింది, "ఏం.. ఏంటిది మీరు....?"వణికిందామె గొంతు.

"సారీ.. అనీ, అదీ, ఇదీ, ఏమీ చెప్పను.. సారీ అనేది చాలా చిన్నమాట.. తప్పుచేస్తే శిక్ష పడాలి కదా మనూ.. ఊ... కొట్టు.. ప్లీజ్.." కళ్ళతో కూడా అర్థిస్తూ చెప్పాడు.

విస్మయంగా చూసింది. తేరుకుని చప్పున అతని చేతిలో చెప్పుని తీసి పక్కకి పడేస్తూ, "ఛ.. ఛ.. లేవండి, ముందు.." అంది క్లుప్తంగా.

"అది కాదు మనూ.. నేనూ.. "

"అబ్బ.. భరద్వాజా.. నేనూ ఓ ఆడపిల్లని కదా. డోన్ట్ మేక్ మీ ఆక్వర్డ్.. ఇంకేం చెప్పను. ప్లీజ్.. నేనేమీ కొట్టను. అదీ చెప్పుతో.. హౌ కెన్ యూ సే సచ్ ఎ థింగ్ .. వదిలెయ్యండి.. అంతటితో సరిపెట్టారు మహానుభావా.. చాలు.. ఇక నన్ను ఇబ్బంది పెట్టకండి ప్లీజ్.. "అంటూ సిగ్గుగా పక్కకి తిరిగిపోయింది.

మాటల్లో చెప్పలేనంత రిలీఫ్.. ఆనందంగా చూసాడు. ఆమె కోపం తెచ్చుకోలేదు.. తనని అసహ్యించుకోనూ లేదు.. పైగా సిగ్గుపడుతోంది. భరద్వాజ పెదవులమీద సన్నటి నవ్వు మెరిసింది. మెల్లగా ఆమెనే చూస్తూ లేచాడు.

అప్పటిదాకా పడ్డ టెన్షన్ మొత్తం చేత్తో తీసేసినట్టుపోయింది. జరిగింది తల్చుకుంటే మనసంతా ఏదో హాయి నిండినట్టుగా వుంది.

"ఔనూ.. ఏంటిలా.. సడెన్ గా..?"తటపటాయిస్తూ అడిగాడు.

"మీరు... మీరూ.... టీ గార్డెన్ అన్నారనీ... "ఆగిపోయింది.

"కానీ.. వర్క్..?", సందేహంగా అడిగాడు తేరుకోవడానికి ప్రయత్నిస్తూ.

"రాత్రి కూర్చుని అవగొట్టేసాను..", నెమ్మదిగా తలదించుకునే చెప్పింది.

"రెండురోజుల వర్క్ ఒక్కరాత్రిలో.. మై గుడ్నెస్... అంటే రాత్రంతా నిద్రే పోలేదా.. ?", ఆశ్చర్యంగా అడిగాడు.

"ఊహూ..", తలూపింది. ఆప్యాయంగా ఆమె తలనిమరడానికి కదలబోయి తటాల్న ఆగాడు. 'చూపించిన కన్సర్న్ చాలు.. కంట్రోల్ యువర్ సెల్ఫ్... ఇక వళ్ళు కాస్త దగ్గరపెట్టుకో జే.కే.', మనసు ఈసారి కాస్త గట్టిగానే మందలించింది. గతుక్కుమని తనని తాను సంబాళించుకుంటూ అడిగాడు, "గ్రేట్.. తప్పకుండా తీసుకెళ్తానైతే..", అంటూ ఆగాడు

సందేహంగా. "మరి నువ్వు.. వస్తావా నాతో...?", భయంగా అడిగాడు. వద్దంటుందేమో.. మ్యానర్ లెస్ బ్రూట్ ', తనని తనే తిట్టుకున్నాడు విసుగ్గా.

"మీరు.. దార్లో.. కలలు కననని మాటిస్తే..." ఆ బుగ్గల్లో మందారాలు పూశాయి.

"ఓహ్...అయాం...సో సారీ...నేనూ... "ఏదో చెప్పబోయాడు.

"మీరు వెళ్ళి రెడీ అవండి. బాగోదు.. చాలాసేపట్నుంచీ రూమ్ లోనే వుంటే..." సిగ్గుగా చెప్పింది.

తలూపాడు. ఇంతకుముందు చాలాసార్లే వున్నారు చెస్ ఆడుతూ, టీ తాగుతూ, కబుర్లు చెప్పుకుంటూ.., కానీ ఇది ఖచ్చితంగా తన ఇందాకటి సెన్స్ లెస్ బిహేవియర్ వల్ల వచ్చిన మొహమాటమే.. కాబట్టి తనే తప్పించాలి. చూడాలి ఏమాత్రం చేయగలడో.

"సరే.. కాఫీ చెప్తాను. తాగుతూ వుండు. వచ్చేస్తాను..", వెళ్ళబోతూ ఆగాడు, "ముందు నువ్వెళ్ళి ఫేస్ వాష్ చేసుకుంటావా..?"తటపటాయిస్తూ అడిగాడు.

"వద్దు. అయాం ఓ.కే."చెప్పింది.

ఇబ్బందిగా చూశాడు. పెదవి చిట్లిన గాయం ఎర్రగా తన మొరటుతనానికి గుర్తులా ప్రామినెంట్ గా కనిపిస్తోంది. చెప్పేందుకు ధైర్యం సరిపోలేదతనికి.

"ఓ సారి ఇలారా.." పిలిచాడు డ్రస్సింగ్ ఏరియా లోకి వెళ్తూ. చిత్రంగా చూస్తూ అతని వెంట వచ్చింది. "ఓసారి అద్దం చూడు.. "చెప్పి గబగబా పక్కకి వచ్చేసాడు. అతని గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఇంక ఆపుకోలేక పార్టిషన్ లోంచి చూశాడు.

ఆమె అద్దం వైపు చూడట్లేదు. తలొంచుకుని అలాగే నిలబడివుంది. ఏడవదుకదా.. భయం వేసిందతనికి. ఆమె దగ్గరకి వెళ్ళబోయి ఆమె నెమ్మదిగా తలెత్తడం గమనించి ఆగాడు. మనోజ్ఞ తలెత్తి అద్దంలో తనని చూసుకుంటోంది. ఊపిరిబిగబట్టాడు. వేలి కొసలతో గాయన్ని తాకింది. మెల్లగా అటూ,ఇటూ చూసి, అద్దానికి పెదవులాన్చి సుతారంగా చప్పుడు కాకుండా ముద్దుపెట్టుకుంది.

గుండెల్లో ఏదో నొక్కిపట్టిన ఫీలింగ్, ఆనందమా, బాధా, భయమా.. ఏంటది. పూర్తిగా అర్థం కాలేదతనికి. తన ఆలోచన రూపే తెలియట్లేదు... నెమ్మదిగా తప్పుకున్నాడు. ఆమె ముఖం కడుక్కునిరాగానే మౌనంగా టవలందించాడు. అంత తీయని గెస్చర్ కి ఆమెని అమాంతం ఎత్తుకుని, గిరగిరా తిప్పాలన్నంత ఆనందంగావుంది., కొన్ని వందల, వేల కానుకలీయాలనిపిస్తోంది. కానీ, ఏమీ చేయకూడదు. కనీసం ఇకమీదైనా జాగ్రత్తగా వుండాలి అనుకున్నాడు భారంగా.

స్నానం పూర్తి చేసి తల తుడుచుకుంటూ డ్రస్సింగ్ ఏరియా లో అద్దం ముందుకు నడిచాడు. ఆమె పెదవుల తడి అద్దంమీద ఇంకా అస్పష్టంగా వున్నట్టే అనిపించగా, మెల్లగా వేళ్ళతో స్పృశించబోయాడు.

"కాఫీ..."

అదిరిపడి వెనక్కితిరిగాడు. చేతిలో కాఫీ కప్పుతో తననే చూస్తోంది మనోజ్ఞ అల్లరిగా. ఆమె కళ్ళలో మళ్ళీ తనదైన అల్లరి నవ్వు అందంగా.. రిలీఫ్ గా చూసాడు. అతని పెదాలు విచ్చుకున్నాయి. థ్యాంక్ గాడ్.. షీ ఈజ్ బ్యాక్ టూ హర్ నార్మల్ సెల్ఫ్.. అనుకుంటూ అదిరిపడ్డాడు. డ్రస్సింగ్ ఏరియాలో భుజానొకటి, నడుముకి మరోటి.. వట్టి టవల్స్ తో ఆమె ముందు నిలబడ్డాడన్న సంగతి గుర్తొచ్చి, "ఏంటి మనూ.. వెళ్ళు.. నన్ను డ్రస్ చేస్కోనీ", మొహమాటంగా అన్నాడు.

"నేనేమన్నా వద్దన్నానా. ముందు కాఫీ తాగండి. చల్లారిపోతోంది. తల కావలిస్తే నేను తుడుస్తాను." అతని భుజం మీదున్న టవల్ ని చొరవగా తీసుకుంటూ అంది.

అతనికి నవ్వొస్తోంది. తానేదో గోపికలా, ఆమె అల్లరి కృష్ణుడిలా.. పూర్తి రివర్స్ గేర్ లా తయారయింది పరిస్థితి.

"ఏయ్ కొడతాను నిన్ను. వెళ్ళు. ఎవరైనా చూస్తే బాగోదు. వెళ్ళు మనూ.. " నవ్వాపుకుంటూ అన్నాడు.

"సరే మీ ఇష్టం.. మీరైతే ఏమన్నా చేయచ్చు.. అదే నేను దగ్గరకొస్తే మాత్రం ఏదో ఆడపిల్లలా సిగ్గుపడిపోతారు." వెక్కిరింతగా అంటూ వెళ్ళబోయింది.

విసురుగా ఆమె చెయ్యిపట్టి ఆపాడు. అతని ముఖం రోషంతో ఎర్రబడింది. "ఏమన్నావ్..? "

"మెల్లగా కాఫీ ఒలికిపోతుంది, మీరూ..."

"పోనివ్వు... ఏంటీ ఏమన్నావ్.. ఆడపిల్లలాగానా.. ఏంటీ.. రెచ్చగొడుతున్నావా.. చెప్తానుండు నీ పని... ముందైతే రా.. తల తుడువ్.. తెగ ముచ్చటపడిపోతున్నావ్ గా.." అన్నాడు చిరుకోపంగా.

"మిమ్మల్ని రెచ్చగొట్టడం చాలా ఈజీ చూశారా... సరేగానీ, అలా కూర్చోండి మీ తల అందొద్దేంటి మరి నాకూ.." గారంగా అంది.

ఆమె అన్నవిధానానికి నవ్వబోయి కంట్రోల్ చేస్కుంటూ స్టూల్ లాక్కుని కూర్చున్నాడు. కప్పు పక్కన పెట్టి తల తుడవసాగింది. నెమ్మది గా ఆమె చేతుల కదలికకి సన్నగా కదులుతున్న నడుం మీద చేయి వేయాలనే కోరికని బలవంతంగా ఆపుకున్నాడు. అందంతో చంపడం అంటే ఇదే కాబోలు... అనుకున్నాడు. అంతలో టవల్ అతని కళ్ళని కప్పేసింది.

"ఏయ్.. ఏంటిది.. నాకేం కనపడట్లేదు.. " అంటూ టవల్ తీయబోయాడు.

"మీకేం కనపడక్కర్లేదు. చూసింది చాలు. కళ్ళు మూసుకుని తుడిపించుకోండి." చిరుకోపం నటిస్తూ చెప్పింది. అలా అడ్డంగా దొరికిపోయేసరికి గతుక్కుమన్నాడు. 'ఛ.. రోజు.. రోజుకీ పరమ బేవార్సుగా తయారవుతున్నాడు తను. జే.కే. కంట్రోల్.. '

"అంతేనా.. సరిపోయిందా..", తుడవడం పూర్తిచేసి, టవల్ తీసి అతని క్రాఫ్ ని మునివేళ్ళతో సరిచేస్తూ అడిగింది.

కళ్ళు తెరవకుండానే అడిగాడు, "ఊ.. ఇంకా డ్రెస్ కూడా వేసేస్తావా.. టిఫిన్ తినే టైమ్ కూడా కలిసొస్తుంది..".

"యూ.. మీరూ.. తక్కువవాళ్ళేమీ కాదు.. రౌడీ మినిస్టర్ అని మీడియాకి చెప్తానుండండి..."

కళ్ళుతెరిచి ఆమె వైపు చూసి అల్లరిగా నవ్వాడు, "ఔనా.. మరి ఈ రౌడీ తో నీకేం పనో... " కళ్ళెగరేసాడు.

అతని రెండు భుజాలమీదా చేతులువేసి ముందుకొంగి అతని కళ్ళల్లోకి చూస్తూ, "ఇక నా పనే ఈ రౌడీతో.. వెళ్దామా రౌడీ గారూ..."

"నువ్వు చేతులు తీయకపోతే మళ్ళీ రౌడీయిజం చూడాల్సొస్తుంది. ఈసారి వెళ్ళే గ్యారంటీ మాత్రం నేనివ్వలేను.." ఆమెనే చూస్తూ చెప్పాడు.

గభాల్న చేతులు తీసేసి సిగ్గుగా పరుగున అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

నవ్వుతూ లేచాడు.

టిఫిన్ సర్వ్ చేస్తున్న అతన్నే చూస్తూ అడిగింది, " యూ హావ్ ఏ గ్రేట్ బాడీ.. దాన్నలా లాల్చీ, పైజమాల్లో దాచేస్తారేం.. ?"

"ఏం చేయమంటావ్... సల్మాన్ ఖాన్ లా తిరగమంటావా.. వున్న మంత్రి పదవి కాస్తా పోతుంది.. పరువుతోపాటూ.."నవ్వాడు.

"ఛా.. నా ఉద్దేశ్యం అది కాదూ.." తడబడింది.

"మరీ నువ్వుకూడా ఇప్పుడంటే శారీస్ లో మెరుస్తున్నావ్ గానీ, ముందీ అందమంతా ప్యాంట్, షర్టుల్లో, చుడీదార్ లో కప్పెయ్యలేదూ.. మే బీ దట్స్ యాన్ ఓల్డ్ అవుట్ లుక్ ఏమో నాకు తెలీదూ.. బట్ యూ లుక్ అమేజింగ్లీ స్టన్నింగ్ ఇన్ శారీస్ మనోజ్ఞా..." భరద్వాజ గొంతులో మార్పు అతనికే స్పష్టంగా తెలిసింది.

మనోజ్ఞ కళ్ళు వాలిపోయాయి, "మీరు.. మీరిలా మాట్లాడితే నేను వెళ్ళిపోతాను..", సిగ్గుతో ఆమె ముఖం కందిపోయింది.

"ఎక్కడికి వెళ్తావ్ నన్నొదిలి...?" అంటూ తనని తాను మరిచిపోయి దగ్గరగా జరిగాడామెకి. అంతలో అతని సెల్ రింగయ్యింది. విసుగ్గా కట్ చేసాడు.

నవ్వేసిందతని ముఖంచూసి, "గార్డెన్స్..." అడిగింది అతను తనవైపు చూడగానే తమాయించుకుని.

తేరుకున్నాడతను. ఈ మూడ్ లో గార్డెన్సా.. అంత దూరం వంటరిగా తామిద్దరూ..., తను సరిగ్గా వుండగలడా.. వుంటాడా.. తనకంత కంట్రోల్ వుందా...

తలవిదిల్చాడు. టిఫిన్ తిన్నాననిపించి బాత్రూమ్ వైపు నడిచాడు. ముఖం మీద చల్లటి నీళ్ళతో ఫోర్స్ గా స్ప్లాష్ చేసుకున్నాడు. ఒక్కసారి కాదు, చాలా సార్లు అలా చేసి, అద్దంలో, కంట్రోల్ జే.కే. బిహేవ్ ప్రాపర్లీ.. అంటూ తనకి తాను ఓ పదిసార్లు చెప్పుకుని బయటికి నడిచాడు.

"బాగా ప్రిపేరై వచ్చినట్టున్నావు.." చిన్న సైజ్ బ్యాగ్ తో కారెక్కుతున్న మనోజ్ఞని చూసి చిన్నగా నవ్వుతూ అడిగాడు.

నవ్వేసింది. "మీకో విషయం చెప్పనా..?"

"...నే వద్దంటే ఆగుతావా..చెప్పు.."

"అఫ్కోర్స్ ఆగను.. ఐనా మీరొద్దనరు... నాకు తెలుసు.. యూ నో.. నేను ఒకటే శారీ తెచ్చుకున్నాను ఇక్కడికి వచ్చినప్పుడు.. మీరు మొదట చూసారే.. దట్ పింక్ వన్... మీకు గుర్తుండివుండదనుకోండి.."

"ఆహా.. ఐ.. సీ.. మరివన్నీ..." గేరు మారుస్తూ కాజువల్ గా అడిగాడు.

"ఆ రోజు మీరూ.. మీరు నన్నెలా చూసారో తెల్సా.. జన్మలో మర్చిపోలేను.. ఏంజిల్ అన్నారు కూడా మీకు గుర్తుందో లేదో.. అందుకే ఇవన్నీ..." అంటూ సిగ్గుగా ఆగిపోయింది.

ఆశ్చర్యం, ఆనందం కలగలిసిపోయాయతనిలో, "ఓహ్.. ఐ నెవర్ థాట్ దట్ ఇట్ కుడ్ బీ ద రీజన్ అనీ.... ఓహ్.. థ్యాంక్స్.. థ్యాంక్యూ సో మచ్ ఫర్ ఆనరింగ్ మై థాట్స్.... ఓహ్.. అవన్నీ తర్వాత తీసుకున్నావా.. గ్రేట్.. అందుకేనన్నమాట ప్రతీ సాయంత్రం మేడంగారు సంధ్యాదేవి లా దర్శనం ఇస్తున్నారూ రోజుకో శారీలో.... "నవ్వుతూ అడిగాడు.

తలూపింది. ఇంతకీ ఎలా చూసాడా రోజు. అడ్మైరింగానా, ప్యాషనేట్ గా... లేక... క్యూరియాసిటీ ఆపుకోలేక అడిగేసాడు.

"అంటే అన్నివిధాలా.. కాంట్ డిస్క్రైబ్.. కానీ.. అడ్మైరింగ్ గా, ప్యాషనేట్ గా, స్వీట్ గా.. ఏమో.. తెలీదు.. వెళ్ళిపోయేముందు ఒకసారేమో.." ఆగిపోయింది.

"ఆ ఒకసారి... చెప్పు.." రెట్టించాడు.

"ఇందాకట్లా.." సిగ్గుగా అంది.

"అంటే.." మరింత ఆత్రంగా రెట్టించాడు ఇంకా ఏదో వినాలనే తపనని అణుచుకోలేక.

"అంటే.. అంటే.. రౌడీలా.. "నవ్వేసింది.

"రాక్షసీ..."నవ్వాడు తనుకూడా.

"అవునూ... ఇందాకా బాత్రూమ్ లో అంతసేపేం చేసారూ..?" కొంటెగా అడిగింది.

ఆమె హింట్ అర్థమై అదిరిపడి చూసాడు. ఆమె చెవి మెలిపెడ్తూ, "చెప్తానుండు... నీకసలు ధైర్యం ఎక్కువైపోతోంది రోజురోజుకీ..." నవ్వాపుకుంటూ అన్నాడు.

"ఆ... చెప్తే వినడానికి చెవి వుండొద్దా.. ఆ.. నిజంగానే రౌడీ.... ఆ...."గట్టిగా అరిచింది.

దారిమొత్తం ఆమె అల్లరితో, భరద్వాజ నవ్వులతో సాగిపోయింది.

"మీ కాలు ఓ.కేనా.. అంత దూరం... పోనీ నేను డ్రైవ్ చేయనా కొంచెంసేపు..?"అడిగింది చిప్స్ అతనికందిస్తూ.

"ఐ కాన్ట్ సిట్ ఐడిల్.. దట్ లాంగ్.. బోరౌతాను. ఐనా చేతులు ఖాళీగా పెట్టుకుని అంతసేపు కూర్చోలేను." చెప్పాడు.

"మీ చేతులు ఖాళీ గా వుంచమని ఎవరు చెప్పారు..?"ఓరగా చూస్తూ అంది.

ఉలిక్కిపడి చూసాడు, "వ్వాట్..అంటే..?"

"అంటే.. చిప్స్ తినండి.. చేత్తో ప్యాకెట్ పట్టుకునీ..." చిలిపిగా నవ్వుతున్నాయామె కళ్ళు.

"మై గాడ్.. ఏదో నేను కొంచెం మంచివాడ్ని కాబట్టి బతికిపోతున్నావ్ మనూ.. నిజంగా నువ్వు రెచ్చగొట్టేదానికి ఇంకొకడైతేనా.. నీ పని ఈపాటికి ఔట్.. " ఉక్రోషంగా చెప్పాడు.

"ఆహా.. అంత మంచివారేం.. అయినా ఇంకెవడ్నో నేనెందుకు రెచ్చగొడతాను..? "నవ్వింది.

"మై గుడ్నెస్.. యూ ఆర్.. జస్ట్ ఇంపాసిబుల్... యూ నో దట్..."

"ఐ నో.. థ్యాంక్యూ.. "జవాబిచ్చింది తియ్యగా నవ్వుతూ.

సడన్ గా ఏదో గుర్తొచ్చినట్టు అంది, "షాక్ నేనిద్దాం అనుకుంటే అంతకు పదింతలు మీరే ఇచ్చేసారు.. "

"తప్పంతా నీదే.. హింటిచ్చావుగా.."నవ్వాడు.

"అమ్మో.. ఇంకాస్తలో.. కొంచెముంటేనా..." గుండెలమీదు చెయ్యివేస్కుని భయంగా తలుచుకుంటూ అంది.

"సారీ.. భయపడ్డావా..?", గిల్టీగా చూస్తూ అడిగాడు.

"చాలా.. చాలా.. తర్వాత ఓ.కే. అనుకోండి. అస్సలూహించలేదు.."

"ఏం ఆ రోజు పార్క్ లోనూ అలాగే తొందర పడ్డాను. ఈరోజు ఛాంబర్లో.. ఏధైర్యంతో నాతో ఇంత దూరం వస్తున్నావు మనూ.. నిజంగా రౌడీ మినిస్టర్నేమో అనిపించడంలేదా.... ఓ రోగ్ లా కనిపించడంలేదా.. అసహ్యం.."

"భరద్వాజా.. అలా అనొద్దు ప్లీజ్.."

"ప్లీజ్.. నన్ను చెప్పనివ్వు మనూ. అలా ఎందుకు చేస్తున్నానో తెలీదు. అసలంతగా ఎందుకు కంట్రోల్ తప్పుతున్నానో తెలియట్లేదు. చేసిన తప్పు జస్టిఫై చేసుకోవడానికి చెప్పట్లేదు, ఇదేమీ హాలీవుడ్ సినిమానో, నవలో కాదు.. నా.. పాషన్ అనుకో.. ఏమనుకో అర్థం అవడానికి. అయాం నాట్ లైక్ దిస్ మనూ.. నెవర్ లైక్ దిస్ బిఫోర్.. నా డిగ్నిటీ,

సెల్ఫ్ కంట్రోల్, సీరియస్ నెస్.. అన్నీ పోతున్నాయి... ఏదో కాలేజ్ కుర్రాళ్ళా.. ఈవెన్ ఇంకా ఛైల్డిష్ గా.. నో.. ఫూలిష్ గా, ఘోరంగా బిహేవ్ చేస్తున్నాను. ఎందుకో కంట్రోల్ తప్పిపోతున్నాను.. ఆగలేనంతగా... అది నిద్రో... మత్తో.. మాయో, యూ కాల్ ఇట్ మాగ్నటిజం.. లేక..... డామిట్.. ఎలా చెప్పనూ..వాట్ ఐ ఫీల్.." అరచేతిలో గుప్పిలి బిగించి స్టీరింగ్ మీద బలంగా కొట్టాడు. ఛ... కనీసం తన వర్షన్ చెప్పుకుందామంటే మాటలు కూడా సరిగ్గా దొరకట్లేదు.. విసుగ్గా, దిగులుగా రోడ్ వంక చూసాడు.

"నాకర్థమౌతోంది భరద్వాజా.." నెమ్మదిగా చెప్పింది. చివాల్న తలతిప్పిచూసి అప్రయత్నంగా కారాపాడు. అతని వైపు చూడకుండా తన చేతి గాజులు ముందుకీ వెనకకీ జరుపుతూ మెల్లగా చెప్తోంది, "ఎందుకంటే నాకూ అలానే వుంది. మీరు.. మీరు.. కాబట్టి.. బయటపడిపోతున్నారు... కానీ.. నేను ఆడపిల్లను. ఇప్పటికే మీతో అతి చనువుగా వుంటూ నా ఇష్టాన్ని అంత బాహాటంగా చూపిస్తున్నాను. ఇంక మనసులో వున్న ప్రతీదీ చెప్పాలంటే... ఎలా చెప్పను.. నాక్కూడా.. నాక్కూడా మిమ్మల్ని ముట్టుకోవాలనీ, తాకాలనీ, ఇంకా దగ్గరగా వుండాలనీ..." ఆమె గొంతు వణికింది. ఐనా అభావంగా చెప్పుకుపోతోంది., "కానీ, మీరేమో ఏజ్, స్టేజ్ అంటారు. ఏవేవో చెప్తారు. ఒకవైపు ముందుకు వెళ్ళకూడదన్న విచక్షణ, మరోవైపు మీ వైపు లాగేస్తున్న ఆకర్షణ.. నాలోనూ.. అదే.. సంఘర్షణ.. రైమింగ్ బాగుంది కదూ.. అంతర్మధనం.. అనొచ్చా.. నాకంత లాంగ్వేజ్ రాదనుకోండి. బట్ వాట్ ఎవర్ ఇట్ ఈజ్.. దీనికి సమాధానం మీరే ఇవ్వగలరు... భరద్వాజా.. కేవలం మీరు మాత్రమే.."

మౌనంగా కారుస్టార్ట్ చేసి డ్రైవ్ చేయసాగాడు. ఏవరో పదునైన కత్తితో గుండెని రెండుగా చీలుస్తున్న భావన. ప్రేమో,ఏమో అనుకునే స్థితి ఎప్పుడో దాటిపోయింది. హౌవ్ టూ డిసైడ్.. ఇటా.. అటా.. బాధ అనేది తానొక్కడే పడితే పరవాలేదు. తనతో పాటు ఆమెనీ బాధించే హక్కు తనకెక్కడిది..!!

ప్రేమించిన అమ్మాయి కోరి అందిస్తున్న ప్రేమామృతాన్ని కాదనుకుంటున్న నిర్భాగ్యుడు తను. ఇక ఆపాలి. ఇంకేమైనా జరిగేలోపే తనని తాను నిభాయించుకోవాలి. తప్పదు. మనోజ్ఞ హాజ్ టూ హౌవ్ ఏ గుడ్ లైఫ్.. సమాధానం కోరడం ఆమె హక్కైతే, జవాబివ్వడం తన బాధ్యతే... ఇవ్వాలి... ఇస్తాడు..'

"భరద్వాజా.." ఆమె పిలుపుకి తేరుకుని చూసాడు. ఆమె మామూలైపోయిందప్పటికే.

"కాస్త నవ్వచ్చు కదా.. అలా ఎవరిదో మౌర్నింగ్ కి వెళ్తున్నట్టు ఏడుపు ముఖం పెట్టకపోతే.."నవ్వుతూ అడిగింది.

**కారు** టర్నింగ్ తిరుగుతుంటే చెప్పాడు, "కాసేపు కళ్ళుమూసుకో మనూ.. నే చెప్పాకే తెరవాలి.." చెప్పాడు గార్డెన్స్ లోకి ఎంటరవుతూ.

కారాగింది. "వచ్చేసాం చూడిక.." అన్న అతని మాటకి కళ్ళు విప్పి ఎక్కడున్నామో చూడాలని ఆత్రంగా చూడబోయింది. "ముందు చెప్పులు తీసి కిందకి దిగి అప్పుడు చూడు... "చెప్పాడు భరద్వాజ.

నమ్మలేనట్టుగా కళ్ళార్పకుండా చుట్టూ చూసింది. కాలు మోపితే తివాచీ మాసిపోతుందేమో అన్నంత సున్నితం గా వున్న పచ్చిక మీద పదిలంగా కాలు మోపింది. ఆమె సున్నితమైన పాదం కింద మరింత సుతారంగా ఒత్తుకుంటూ మెత్తని స్వాగతం పలికిందా పచ్చిక.

చుట్టూ పచ్చని పచ్చిక తివాచీలా కనుచూపుమేరలో ఎక్కడా మరో రంగుకి తావివ్వకుండా పరుచుకునుంది. కూర్చోవడం కోసం ఏర్పాటు చేసిన చిన్న చిన్న హట్స్ దూరం నుండి బొమ్మరిళ్లులా కనిపిస్తున్నాయి. ఓ పక్కగా రంగురంగుల రాళ్ళ మధ్యలో ఏర్పాటుచేసిన జలధార చాలా నేచురల్ గా కురుస్తోంది. నీరెండతాకిన ప్రతిచోటా కిరణాలు కూడా పచ్చగా మెరుస్తున్నాయి.

గిర్రున వెనుదిరిగి , "ఓ.. మై గాడ్.. ఐ నెవర్ థాట్ సచ్ ఏ ప్లేస్ వుడ్ రియల్లీ ఎగ్జిస్ట్... ఓహ్ భరద్వాజా.. ఇట్స్ సో బ్యూటిఫుల్.. థ్యాంక్యూ సో మచ్... యూ బ్రాట్ మీ టూ ఎ హెవెన్.. ఎ గ్రీన్ హెవెన్.." అంటూ గట్టిగా అరిచేసింది.

కారునానుకుని పాత్ వే లోనే నిలబడి చిరునవ్వుతో చూస్తున్నాడామె ఎగ్జైట్మెంట్ ని. "రండి భరద్వాజా.. వాట్ ఆర్ యూ వెయిటింగ్ ఫర్...", వుత్సాహంగా అరుస్తూ పిలిచి చప్పున తాను గట్టి గట్టిగా అరుస్తున్నానని రియలైజ్ అయ్యి సిగ్గుపడి, కంగారుగా చూట్టూ చూసింది.

"ఎవ్వరూ వుండరు.. ఒక్కసారి ఎంటరయ్యాకా వీ ఆర్ ఆన్ అవర్ వోన్.." ఆమె భావం అర్థమై చెప్పాడు. "మీ గార్డ్స్ అయితే వుంటారు కదా....." సిగ్గుపడిందామె.

కార్ లోంచి బ్యాగ్ తీస్తూ చిన్నగా నవ్వాడు., "వాళ్ళకి తప్పదు పాపం.. కాన్ట్ హెల్ప్.. వాళ్ళు ఏమైనా చూడాల్సి రావచ్చు.. వినాల్సి రావచ్చు. ఐనా వాళ్ళకి మాత్రం ఏం ఎంటర్టైన్మెంట్ వుంటుందిక్కడా..."

"వ్వాట్.. ఎంత తేలిగ్గా చెప్తున్నారూ.. ఏమన్నా అంటే... మరి ఆ రోజు గ్రీన్ లాన్స్ లో...", ఎలా అడగాలో తెలియక ఆగిపోయింది.

ఆమె అడగాలనుకున్నది గ్రహించి నవ్వాడు, "హాకింగ్ కి తేవట్లేదులే.. డోన్ట్ వర్రీ... కాకపోతే ఎప్పుడైనా ఇలా కాస్త లాంగ్ డిస్టెన్స్ అవుటింగ్స్ కి ఐతే తప్పరు..అయినా వాళ్ళుంటే నీకే మంచిది కదా..." అన్నాడు అర్థవంతంగా.

"ఆహా.. సో ఐ విల్ బీ సేఫ్ ఫ్రంమ్ యూ.... అన్నమాట..."అల్లరిగా నవ్వింది.

"కాన్ట్ గివ్ ఎనీ గ్యారెంటీస్ మిస్... దే ఆర్ మై గార్డ్స్ ఆఫ్టర్ ఆల్.." ఓరగా చూస్తూ చెప్పాడు.

అతని కౌంటర్ కి అదిరిపడి, "అమ్మో.. చాలా పెద్ద ఐడియాసే వున్నాయీ. ఐతే ఇంతకీ సర్వం వాళ్ళ ముందరేనా.?" అంది తనూ తగ్గకుండా.

ఉలిక్కిపడి చూసి అంతలో పకాల్న నవ్వేసాదు., "ఆహా.. దివ్యంగా.. చెప్పానుగా మేం ఏం చేసినా, ఎన్ని చేసినా వాళ్ళకి చూడక తప్పదు. కాస్త డీసెంట్ఇనఫ్ వాళ్ళైతే కొంచెం పక్కకి తిరుగుతారనుకో, లేదూ నీలాంటి అల్లరి వాళ్ళైతే చెప్పలేం.."

"యూ... నేను మరీ అంత అల్లరి పిల్లనా... హౌ డేర్ యూ సే దట్... జస్ట్ షటప్.. ఓ.కే..." అనేసి చప్పున నాలుక్కరుచుకుని అతని వైపు చూసి, "సో సారీ.. అంటే ఐ డిన్ట్ మీన్ టూ సే..."

"ఛిల్ మనూ... చెప్పానుగా నువ్వెలా వుండలనుకున్నావో అలా వుండచ్చు నాతో అని... ఇన్ఫాక్ట్ నువ్వలా ఫ్రీగా వుంటేనే ఐ విల్ ఫీల్ గుడ్.. ఓకేనా.. పద.."చిరునవ్వుతో చెప్పాడు ముందుకు కదులుతూ.

"జే.కే సర్ ని అలా అన్నానని తెలిస్తే మీవాళ్ళు చీరేస్తారు నన్ను..." అని నవ్వుతూ అతన్ననుసరించింది.

"ఏం లేదు. ఇది తెలిస్తే.. దే విల్ నో.. హౌ ఇంపార్టెంట్ యూ ఆర్ టూ మీ ఆల్సో కదా.. సో నెత్తిన పెట్టుకుంటారు.." సాలోచనగా చెప్పాడు.

"ఆహా.. అలాగేం....మరి ఎప్పుడు చెప్తున్నారు నాగురించీ..." టీజింగ్ గా అంటూ త్వరగా కదిలి ముందుకు తూలబోయింది.

"ఏయ్ కేర్ఫుల్..."కంగారుగా ఆమెని పట్టుకున్నాడు.

తలెత్తి చూసి కొంటెగా నవ్వింది, "వేలేసి ముట్టుకోనన్నారు..?"అంటూ కళ్ళెగరేసింది.

చప్పున వదిలేసి దూరం జరగబోయాడు. నవ్వుతూ అతని చేయి చుట్టూ తన చేతిని పెనవేస్తూ, "యూ కాన్ట్ రన్ ఎవే ఫ్రంమ్ మీ మిస్టర్ మినిస్టర్.. యూ ఆర్ కాట్.."అంది అల్లరిగా.

"మనూ..యూ ఆర్ ...."

"... జస్ట్ ఇంపాసిబుల్.. ఐ నో...." సీరియస్ నెస్ నటిస్తూ కంప్లీట్ చేసింది. నవ్వేసాదు గట్టిగా.

తలతిప్పి చూసాడు. పచ్చిక మీద తన చీరకొంగు పరుచుకుని నిద్రపోతోందామె. రాత్రంతా నిద్రలేదేమో, తాను కార్ లోంచి కాఫీ, స్నాక్స్ తెచ్చేలోపే నిద్రలోకి జారుకుంది. చెట్టునానుకుని కూర్చున్నాడామెకి ఎదురుగా. లేతాకుపచ్చ చీరలో పచ్చని పచ్చిక మీద పరుచుకున్నఆమె రూపం ముగ్ధమనోహరంగా వుంది. అలా ఎంతసేపు గడిచిందో తెలీదు.. నిద్రమత్తులో కాళ్ళు చాపి అతనికి తగలడంతో చప్పున కళ్ళు తెరిచిందామె.

"ఓహ్ సారీ.. "అంటూ లేచింది సర్దుకుని కూర్చుంటూ.

అప్రయత్నంగా తలతిప్పకుని దూరంగా చూస్తున్న అతన్ని చూసి నవ్వుతూ, "నేను బానే వున్నాను. నేను సెట్ అయ్యేందుకు మీరు మరీ అంత సేపు...యూ నీడ్ నాట్ లుక్ అవే..." వెక్కిరింతగా అంది.

"నువ్వా... లేకపోతే ఆడపిల్ల నిద్ర లేచి సర్దుకుంటుంటే కళ్ళప్పజెప్పి చూడమంటావా..?"అన్నాడు చిరుకోపంగా.

"ఓ.కే.. ఓ.కే.. మీరు పక్కా జెంటిల్మేన్... ఒప్పేసుకుంటున్నా మహానుభావా.. "నవ్వేసింది.

"ఆహా... పోయి పోయి నువ్వే ఇవ్వాలి నాకా సర్టిఫికెట్.." అప్రయత్నంగా తను చేసిన ఘనకార్యాలు గుర్తొచ్చి నవ్వు వెలిసిందతని ముఖంలో.

అదేం పట్టించుకోకుండా, "అఫ్కోర్స్.. నేను కాక ఇంకెవరిస్తారు. మన వాదం ఎప్పుడూ వుండేదే గానీ నాబ్యాగ్ తెచ్చారా.. ఇలా ఇవ్వండి.." అంది.

"తెచ్చాను మేడమ్.. మీరు చెప్పాకా తేకుండా వుండడానికి ఎంత ధైర్యం నాకు.. ఇంతకీ ఏముందిందులో మేకప్ సామానా..?"నవ్వుతూ బ్యాగ్ అందించాడు.

"ఊహు.. మీకోసం పులావ్..."బాక్స్ తీసి అందించింది.

ఓపెన్ చేసి ఆశ్చర్యంగా తలెత్తాడు.

"హోమ్ మేడ్ లా వుంది.. నువ్వు చేసావా...?"

తలూపింది. "అవును. తిని చెప్పండి ఎలా వుందో.." అంది ఆత్రంగా.

తాను వండినది తనవాళ్ళు తిని మెచ్చుకోవాలనే స్త్రీ సహజమైన వుత్సుకత కనిపించిందామె ముఖంలో. అది గమనించి చిన్నగా నవ్వాడు.

"అమ్మో.. తినమంటావా... నేను కనీసం పాణికి కూడా చెప్పిరాలేదు, నాన్నకి ఫోనూ చెయ్యలేదు.. కనీసం క్యాబినెట్లో ఎవరికీ..."

"పొండి.. ఏం తినొద్దు..", కోపంగా బాక్స్ లాక్కోబోయింది. ఆమెని వారించి నవ్వుతూ స్పూన్ తో తీసుకుని తినసాగాడు.

ఏమీ అనకుండా తింటున్న అతనికేసి నిరుత్సాహంగా చూసింది.

"ఏంటీ...అలా చూస్తున్నావ్..నీకు పెట్టకుండా తినేస్తున్నాననా...? అంత బాగుంది మరి.." చెప్పాడు. ఆమె ముఖం చప్పున వెలిగింది. అంతలో అనుమానంగా చూస్తూ, "నిజమేనా...?"అడిగింది.

"నిజంగా.. నీ అంత బాగుంది. ఐనా నాకోసం తేవాలని నీకు అనిపించడమే గొప్ప విషయం.. ఆ థాట్ చాలు ఇక దీనికి టేస్ట్ ఆటోమేటిక్ గా వచ్చేస్తుంది.." చిరునవ్వుతో చెప్పాడు.

"ఓహ్.. థ్యాంక్స్.. పొగడ్డం మీదగ్గరే నేర్చుకోవాలెవరైనా.. ఐస్ చేసేస్తారు మనుషుల్ని పొగడ్తలతో.."

"ఆహా... మరి మంచి లక్షణమే కదా.. సో ఒక్క మంచిలక్షణమైనావుందన్నమాట నాకు.. గుడ్... మరైతే ఆ ఖుషీలో నువ్వూ తిను.." అంటూ స్పూన్ తో పులావ్ ఆమె నోటికందించాడు. నమ్మలేనట్టుచూస్తూ అప్రయత్నంగా నోరు తెరిచింది.

ఆమె కళ్ళలో సన్నటి కన్నీటి తెర. కంగారుగా చూసాడు, "ఏమైంది కారమా.. వాటర్ తాగు ముందు...." బాటిల్ అందిస్తూ చెప్పాడు.

"ఊహు..వద్దు..అదేంలేదు.. " చప్పున కళ్ళు తుడుచుకుంది.

"ఏమైంది.. "అని అడగబోతూ ఆగాడు. తనామెకి తినిపించడం స్ఫురించి, ఆ కన్నీళ్ళకి కారణం అర్థమై అతని గుండె ఆర్ద్రమైంది. నెమ్మదిగా ఆమె తలనిమిరాడు.

అంతలో తేరుకుని నవ్వుతూ అంది, "ఇదే పాత సినిమాల్లో ఐతే కారం కాదు విజయ్.. మమకారం.. అని డైలాగ్ వుండేది కదూ...?"

"విజయెవరూ......?"తెల్లబోతూ అడిగాడు.

"హీరో... సినిమాల్లో హీరోలకి భరద్వాజా.. విశ్వామిత్రా.. అని అంత భారీ పేర్లుంటాయేంటీ..!", అంది అల్లరిగా. నవ్వేసాడు తేలికపడ్డ మనసుతో.

"ఆహా.. సినిమా నాలెడ్జ్ బానే వుంది గానీ.. నేను హీరోని కాను మేడమ్.. " నవ్వుతూ చెప్పాడు.

"హీరో కంటే ఏం తక్కువటా...!" అంటూ, అతని చేతిలో స్పూన్ అందుకుని పులావ్ తీసింది.

"అంటే.."అయోమయంగా చూసాడు.

చనువుగా స్పూన్ తో పులావ్ అతని నోట్లో పెడుతూ చెప్పింది, "అంటే... ఇంత మంచి పర్సనాలిటీ, రంగూ, హైట్.., కర్లీ హెయిరూ.. స్పార్క్లింగ్ ఐస్.. రియల్ గా ఏ హీరోకుంటాయ్ చెప్పండీ... సగానికి పైగా ఆర్టిఫిషియలే వాళ్ళ గ్లామర్లో.. మొదటిసారి చూసినప్పుడే అనుకున్నా.. అందంగా, అచ్చు రియల్ హీరోలా వుంటారు మీరని....", అతడ్నే తదేకంగా చూస్తున్న ఆమె కళ్ళలో చిన్న మెరుపు.

ఇబ్బందిగా పక్కకి తిరిగి వాటర్ బాటిల్ తీసుకున్నాడు భరద్వాజ. తన గురించి చాలాసార్లు ఇలాంటి మాట విన్నాడు, చదివాడు గానీ, మనోజ్ఞ నోటి నుంచి వినడం కొత్తగా, కాస్తంత ఇబ్బందిగా వుందతనికి.

"భరద్వాజా మీకోటి చెప్పనా.?." బాక్స్ పక్కకి పెడుతూ అంది.

"ఏంటీ..?" ఆక్వర్డ్ నెస్ ని కవర్ చేసుకుంటూ అడిగాడు.

"మీరు కూడా సిగ్గుపడితే చాలా బాగుంటారు.." చిలిపిగా చూస్తూ చెప్పింది. భరద్వాజ ముఖం ఎర్రబడింది. "నేనా.. సిగ్గుపడడమా.. పిచ్చి పిచ్చి జోకులెయ్యకు.. ఐనా, ఈ రోజు నన్నింతలా తెగ మోసేస్తున్నావు... బాగుంటాననీ, హీరోననీ... ఏంటి సంగతి..?"చిన్నగా నవ్వుతూ అడిగాడు.

"అన్నీ నిజాలేగా... యూ ఆర్ మై హీరో..." తన్మయత్వంగా అంది.

"అందుకే మరి.. మళ్ళీ చిన్నపిల్లవంటే కోపగించుకుంటావు. హీరోనా...? అందముంటే చాలా.. బాగుంటే.. సరిపోతుందా ఇంకే క్వాలిటీ అవసరంలేదా..?"అడిగాడు కాస్త మందలింపుగా.

చిన్నగా నవ్వి చెట్టునానుకుంటూ చెప్పింది, "అందుకేగా వట్టి హీరో కాదు, రియల్ హీరో అన్నది.. హీరో విత్ ఆల్ క్వాలిటీస్ .. అందం ఆఖరు క్వాలిటీ. ఐసింగ్ ఆన్ ది కేక్ లా..."

మౌనంగా ఫ్లాస్కులోంచి కప్పుల్లోకి కాఫీ నింపాడు. పొగడ్తలు నచ్చని వాడెవ్వడు. అందులోనూ మెచ్చిన ఆడపిల్ల పొగుడుతుంటే గాల్లో తేలుతూ, ఆకాశాన్నంటేట్టువుంది మనసు. కానీ, విచక్షణ నిగ్రహించుకోమని చెప్పడంతో గాంభీర్యపు ముసుగేసుకున్నాడు మనసుకి బలవంతంగా.

అదేం పట్టనట్టు దూరంగా చూస్తూ అందామె, "ఒక్కోసారి చాలా ఆశ్చర్యం వేస్తుంది భరద్వాజా.. అంతా ఓ కలలా.. మీ పరిచయం..., మనమింత దగ్గరవడం..., నేననుకున్నవన్నీ ఇంత ఓపెన్ గా మీకు చెప్పగలగడం..., ఆల్ లైక్ ఎ వండర్ఫుల్ డ్రీమ్... అండ్ యూ ఆర్ మై డ్రీమ్... " ఆగిపోయింది అతను తననే సూటిగా చూడడం గమనించి.

కాఫీ కప్పు అందిస్తూ అన్నాడు కాస్త కటువుగా, "ఏం.. ఆపావేం చెప్పు... డ్రీమ్ బోయ్ అనాలంటే సిగ్గేస్తోందా..? నా వయసు చూసి.. "

ఆమె నొచ్చుకోలేదు. చిన్నగా నవ్వి కాఫీ కప్పందుకుంది. "ఐ వాంటెడ్ టూ సే యూ ఆర్ మై డ్రీమ్ కమ్ ట్రూ అని భరద్వాజా.., ఐనా డ్రీమ్ బోయ్ అని అనడానికే గానీ, ఏ అమ్మాయీ నిజంగా చాక్లెట్ బాయ్స్ ని ప్రిఫర్ చేయదు, కాస్త మ్యాన్లీ గా వుండేవాడ్నే ఇష్టపడుతుంది...ఫర్ ఆల్ ప్రాక్టికల్ పర్పసెస్..." అనేసి నాలుక్కరుచుకుంది.

కామ్ గా వింటున్న భరద్వాజ చివరి మాట పూర్తౌతూనే అదిరిపడిచూశాడు, "ఏమన్నావ్.." అంటూ తన సీరియస్ నెస్ మర్చిపోయి గట్టిగా నవ్వేశాడు.

"ఏంలేదేంలేదు.. సారీ.. సారీ.. ఓ మై గాడ్.. స్లిప్ ఆఫ్ ద టంగ్..." కంగారుగా చెప్పేసింది.

చిన్నగా తలకొట్టుకున్నాడు, "గాడ్.. మాటల తుఫాన్ వి నువ్వు.. దేవుడా.. ఏం చెయ్యాలీ పిల్లని.."

పకాల్న నవ్వేసింది, "ఆ విషయం నన్నడగండీ చెప్తాను. ఆ దేవుడేం చెప్పగలడు పాపం..."

"ఆహా.. చెప్పుమరి.." సీరియస్ నెస్ నటిస్తూ అన్నాడు.

సీరియస్ గా ముందుకు వంగి "చెప్పమంటారా..?" అంది.

సందిగ్ధంగా చూస్తూ తలూపాడు.

"సింపుల్.. మీరు.. మీరు నా.. హీరో... ఐ మీన్ కింగ్ ఆఫ్ మై డ్రీమ్స్ అనీ.. ఒప్పేసుకోండి..." అల్లరిగా అంది.

"షటప్... మనూ.. డోన్ట్ బీ టూ మచ్... నా ఏజ్ ఆలోచించి మాట్లాడూ.. బీ ప్రాక్టికల్ .. ఇంత చక్కటి ప్లేస్ లో ఈ టైం పాడుచేయకు అలా మాట్లాడి.., "బాధగా అన్నాడు.

చప్పున లేచొచ్చి అతని ముందుకూర్చుని, అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. భరద్వాజ కళ్ళలోకి సూటిగా చూస్తూ, "యూ ఆర్ మై డ్రీమ్ కమ్ ట్రూ భరద్వాజా.. ఐ మీన్ ఇట్, ఐ లవ్ ఎవ్రీ బిట్ ఆఫ్ ఆల్ యువర్ యాస్పెక్ట్స్.. ఇంక్లూడింగ్ యువర్ ఏజ్.. ఐ లవ్ యూ విత్ ఎవ్రీ ఇన్చ్ అండ్ బిట్ ఆఫ్ మై హార్ట్ అండ్ సోల్... అయాం ఆల్ యువర్స్ భరద్వాజా..! ఈ ఒక్క ప్లేస్, టైమ్ ఏంటి... అన్ని చోట్లా.. ఐ కెన్ మేక్ హోల్ ఆఫ్ యువర్ లైఫ్ ఎ బ్యూటిఫుల్ ప్లేస్ టూ లివ్ విత్.. నన్ను నమ్మండి భరద్వాజా... ప్లీజ్.. కాదనకండి..." ఉద్వేగంగా చెప్పింది.

నిశ్చేష్టుడై చూశాడు. నెమ్మదిగా ఆమె చేతులు విడిపించుకుని లేచి దూరంగా నడిచాడు. ఇవేమీ పట్టనట్టు కామ్ గా ప్రవహిస్తున్న జలధార వంక చూస్తూ కూర్చున్నాడు. ఆమె కళ్ళల్లో కనిపించిన ప్రేమనీ, ఆవేదననీ అర్థంచేసుకోలేని మూర్ఖుడు కాదు తను. కానీ...

బాధగా కళ్ళు మూసుకున్నాడు.

నీ ప్రేమని కాదనే బలం నాకూ లేదు మనూ.. ఎందుకంటే నేను నీకంటే ముందే ప్రేమించాను.. కానీ ఏ ఫీలింగ్ లేనట్టు నటిస్తున్నాను.. లేదు.. రాదర్.. నటించాలని ఓ పిచ్చి ప్రయత్నం చేస్తున్నాను. నువ్వంటే నాకున్నది ప్రేమే కాదు పిచ్చిమనూ... నువ్వంటే అయాం.. మ్యాడ్ అబౌట్ యూ... సంతోషం అంటే నీ సమక్షం.. బాధంటే నీ వియోగం... నిన్నుచూడకుండా క్షణమైనా వుండగలనా అనిపిస్తోంది. ఇంక నావల్ల కావట్లేదు. అన్ని సార్లు నిన్ను తిరస్కరించి బాధపెట్టేందుకు పాషాణాన్నైతే కాదుగా. నువ్వడిగే ప్రతి ప్రశ్నా..నీ ప్రతీ చూపూ.. వేయి బాణాలై నా మనసుని నిలువునా చీలుస్తున్నాయి. నేను అంతకూడా గొప్పవాడ్ని కాదు మనూ.. ఈ ప్రేమ వరదలో కొట్టుకుని పోకముందే నే వెళ్ళిపోవాలి.. దూరంగా.. నీ నుండి చాలా దూరంగా...

కానీ ఏ దూరం ఆమెని తననుంచి వేరు చేయగలదు.. ఎందుకంటే... ఎందుకంటే.. నిలుపలేనిదీ హృదయం.. ఆపలేనిదీ విరహం.. నా మది నదిలో స్నానమాడే వెన్నెల పుష్పం.. ఆమె జ్ఞాపకం...

..కానీ... నిన్నొదిలి ఇకనైనా వెళ్ళకపోతే నేనెంత స్వార్థపరుణ్ణౌతాను నేస్తం... ! కాసేపటి నా సంతోషం కోసం నిండైన నీ జీవితాన్ని బదులిమ్మని కోరడం అన్యాయం కదూ... వంచన కాదూ.. నిన్నింతగా ప్రేమించీ, నీకంత ద్రోహం నేనెలా చేయను... అయ్యో.. ఇప్పుడు నేనేమి చేసినా అది నీకు గాయమే కదా.. ఔనని నీతో వుంటే నీ జీవితానికి, కాదని నిన్ను వీడితే నీ మనసుకి..

నాకు నువ్వు ప్రాణమిస్తే నిన్ను మాత్రం నేను గాయపరిచి నిష్క్రమిస్తానంటున్నాను.. ఏనాటికైనా నన్ను క్షమించగలవా.. అసలు... నేనెందుకు వెళ్ళాలి.. వుండిపోతే.. ఏమైనా కానీ... అందరూ ఏమన్నా అనుకోనీ.. నేను నిన్ను వదిలి వెళ్ళను మనోజ్ఞా.. వెళ్ళలేను.. అసలు నేను కాకుండా నీ జీవితంలోకి వేరెవరో రావడం ఎలా చూడగలను....! ఊహు.. నెవర్.. అలా జరగనివ్వను.. యూ ఆర్ ఆల్ మైన్.. నేను నిన్ను చాలా..చాలా గాఢంగా.... '

తల విదిల్చాడు. ఏమాలోచిస్తున్నాడు తను.. ఎందుకింత వీక్ గా బిహేవ్ చేస్తున్నాడు. తల తిప్పి మనోజ్ఞ ని చూశాడు. మోకాళ్ళలోకి తల వాల్చుకుని కూర్చుంది. 'బాధపడుతోందో... రోదిస్తోందో.. ఒకవేళ నిజంగా తానౌనంటే రేపటిరోజు కొన్నేళ్ళ తరువాత ఆమె సరిగ్గా ఇలాగే... రోదిస్తూ.., న్నో... నెవర్.. ఇప్పుడెంత బాధపడుతుందో పడనీ..., శాశ్వతమైన ఆనందం కోసం తాత్కాలికమైన వేదన తప్పదు. చెప్పాలి. తానిక వెళ్ళాలి. ఇలా పదే, పదే ఆ అమాయకురాలిని ఇంకా గాయపరుస్తూ వుండే హక్కు తనకి లేదు.. ఖచ్చితంగా లేదు.. 'స్థిరంగా నిశ్చయించుకుని, లేచి ఆమె వైపు నడిచాడు.

"మనోజ్ఞా.."నెమ్మదిగా పిలిచాడు. ఆమె పలకలేదు.

"మనూ..." ఆమె తల నిమురుతూ లాలనగా పలకరించాడు. పాపమా సున్నితమైన మనసుని ఎన్నిసార్లు గాయపరిచాడు తను. ఆమె బదులివ్వలేదు.

"మనూ... నిద్రపోయావా.."మృదువుగా తడుతూ అన్నాడు.

నిస్తేజంగా పక్కకి వాలిపోయిందామె. తుళ్ళిపడి చూశాడు. ఆమె చేతిలోంచి చిన్న బాటిల్ జారిపడింది.. ఒకవేళ... ఏ అఘాయిత్యమన్నా... "మై గాడ్...మనూ....", అతను పెట్టిన కేకకి ఆ ప్రదేశం మార్మోగిపోయింది. చప్పున వంగి శ్వాస చూసాడు. తన ఊపిరైన ఆమె శ్వాసిచడం లేదు. "గాడ్... నో.. మనూ... యూ కాన్ట్ లీవ్ మీ.. లైక్ దిస్.. న్నో..న్నో..." అతని కళ్ళల్లోంచి నీళ్ళు జలజల రాలాయి. కన్నీళ్ళతో ఆమెని లేవదీసి తన గుండెకి హత్తుకున్నాడు. అంతలో చప్పున కర్తవ్యం స్ఫురించి ఆమెని రెండు చేతులమీదా లేవనెత్తి, కన్నీళ్ళ మధ్య రివ్వున కారు వైపు పరుగులాంటి నడకతో కదిలాడు. సరిగ్గా నాలుగడుగుల తర్వాత పద్దాయతని మెడలో దండలాగా ఆమె చేతులు, నమ్మలేనట్టు చూసాడు.

నెమ్మదిగా కళ్ళు తెరిచి చిన్నగా నవ్వింది, "భయపడ్డారా భరద్వాజా.. క్షణం తట్టుకోలేకపోయారు. మరి జీవితాంతం వుంటారా.. నేను లేకుండా.. వుండగలరా..?"అడిగింది సూటిగా.

పడిన ఉద్వేగం మొత్తం ఒక్కసారిగా చల్లారగా, అలసటతో అలాగే నిలబడ్డచోటే మోకాళ్ళ మీద కూలబడి ఆమెని కిందకి జార్చాడు. అతన్నుంచి దూరం జరిగి, గిల్టీగా చూస్తూ, "సారీ.. భయపెట్టాను.. "అంది మెల్లగా. సన్నగా రొప్పుతూ ఆమెవైపు చూసాడు.

"నన్ను కొట్టాలనిపిస్తోంది కదూ.. కోపంగా వుందా..?" అడిగిందామె.

"....."

"మాట్లాడండి భరద్వాజా.. "

అతను జవాబు చెప్పలేదు. ఆమె ముఖంలో నవ్వు మాయమై కంగారు ప్రత్యక్షమైంది.

"ఏదైనా మాట్లాడండి, ప్లీజ్.. భరద్వాజా.. సారీ.. మీరలా వుంటే నాకు భయమేస్తోంది.. "బతిమాలింది.

"అయామ్ వెరీ సారీ.. భరద్వాజా.. ఏమనుకుంటున్నారు. ఏదో ఒకటి చెప్పండి. ఏదో కాస్త జర్కిద్దాం, భయపెడదాం, అనుకున్నాను, ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి బెదిరిద్దామనికాదు నిజం.. నన్ను నమ్మరూ.." ఆమె కళ్ళ నీళ్ళపర్యంతమైంది.

జేబులోంచి కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకున్నాడు.

"వెరీ సారీ.. మాట్లాడండి.. పోనీ..సినిమాల్లోలా.. కొట్టేయండి.. అప్పుడోసారి కొట్టారుగా నన్ను.. పర్లేదు.. మీక్కోపం పోతుంది.. కొట్టండి.. కానీ.. మాట్లాడండి.."

"....."

కర్చీఫ్ జేబులో పెట్టుకుని, లేచి తాము కూర్చున్న చెట్టుదగ్గరకు నడిచాడు. కంగారుగా లేచి అతన్ననుసరించింది. మౌనంగా సామాన్లు సర్దుతున్న అతనివైపు అయోమయంగా చూసింది.

"...అంటే..మనం వెళ్ళిపోతున్నామా..? సారీ.. భరద్వాజా.. ప్లీజ్.. సరే మీ ఇష్టం.. వెళ్ళిపోదాం.. కానీ ఒక్కమాట మాట్లాడరూ..", ఆమె కళ్ళలోంచి కన్నీళ్ళు జలజలా జారాయి. అదేమీ పట్టనట్టు బ్యాగ్ తీసుకుని లేవబోయాడు, చప్పున అతని చేతిని పట్టుకుని ఆపుతూ, "ఇంక ఎప్పటికీ మాట్లాడరా..", దీనంగా అడిగింది.

నిశ్చలంగా ఆమెవైపు చూసి ఆమె చేతిని తన తలపై వుంచుకున్నాడు, "జీవితంలో ఏం జరిగినా, ఏమైనా సరే.. స్యూసైడ్ థాట్ నీ మనసులోకి చేరనివ్వనని మాటివ్వు. అప్పుడు మాట్లాడతాను. లేదంటే ఇదే మన ఆఖరు.." చప్పున రెండో చేతితో అతని నోరు మూసింది. "..వద్దు. డోన్ట్ సే దట్. ఐ ప్రామిస్.. ఐనా ఏదో ఏడిపిద్దామని అలా చేసానేకానీ అయాం నాట్ దట్ వీక్ భరద్వాజా.. ట్రస్ట్ మీ.. మీరు నన్ను పెళ్ళి చేసుకోనన్నా, వదిలి వెళ్ళిపోయినా, చచ్చేంత ఏడుస్తానే గానీ చావను. అయాం నాట్ లైక్ దట్.. నేను ఎమోషనల్ పర్సన్ నే కానీ శైలూ అంత వీక్ కాదు, నన్ను నమ్మండి.." నిజాయితీగా చెప్పింది.

ఆమె చేతుల్ని తన గుండెలకానించుకున్నాడు. "తెలుసు.. కానీ.. ఒక్క క్షణం ప్రాణం పోయినంత పనైంది మనూ.. నువ్వంత వీక్ కాదేమో నాకు తెలీదు గానీ, నేను మాత్రం అంత స్ట్రాంగ్ కూడా కాదు. నిజంగా నీకేమన్నా జరిగుంటే ఐ వుడ్ హావ్ డైడ్..."

"భరద్వాజా...", తటాల్న కన్నీటితో అతన్ని చేరుకుని ఏడ్చేసింది.

"ఐ మీన్ ఇట్ మనూ.. ఐ రియల్లీ మీన్ ఇట్.. నా గుండె చూశావా.. ఇప్పటివరకూ ఇంకా ఎంత స్పీడ్ గా కొట్టుకుంటోందో.."

"అయాం సో సారీ.." సన్నగా వెక్కుతోందామె.

నెమ్మది గా ఆమె తలనిమిరి, నుదుటి మీద ముద్దాడాడు., "ఇట్స్ ఓ.కే. ఏడవకు.. పద.. అక్కడ టీ గార్డెన్స్ చూడవా.. వచ్చిందే అవి చూడ్డం కోసం కదా.. ఇలా కూర్చుండిపోతే ఎలా చెప్పు.. ", లాలనగా అన్నాడు.

కళ్ళు తుడుచుకుంటూ తలెత్తి అతని వైపు చూసింది.

ఆమెకి దూరంగా జరిగి, మామూలవడానికి ప్రయత్నిస్తూ అడిగాడు, "ఏంటలా చూస్తున్నావ్..? "

"మీరూ.. ఏడుస్తున్నప్పుడుకూడా బాగుంటారని గుర్తొచ్చి.." నవ్వింది.

ప్రతిగా నవ్వుతూ, "ఓ.. అది తెలుసుకోవడానికేనా అంత భయపెట్టావు తల్లీ.. అడిగితే ఓ అరగంటేడ్చి వుండేవాడ్ని కదా..!!"

"మరీ చెప్పకండి. ఐనా నాకు అవార్డివ్వాలి. ద రాక్ హార్డ్ హోమ్ మినిస్టర్ తో కన్నీళ్ళు పెట్టించినందుకు...".

తలూపాడు, "నిజంగానే నా కంట్లోనూ నీళ్ళున్నాయని నిన్ను కలిసాకే తెలిసింది మనోజ్ఞా నాకు.." గంభీరంగా అన్నాడు.

గిల్టీగా చూసింది, "అయాం సారీ.."

"నో.. నో.. సారీ దేనికి..? నేనూ ఇంకా స్పందించగలనని నీవల్లే తెలిసింది నాకు. ఐ షుడ్ సే థ్యాంక్స్ టూ యూ ఇన్ ఫాక్ట్."

"ఓహ్.. అయామ్ ఆనర్డ్ టూ నో దట్ భరద్వాజా..థ్యాంక్స్ ఎ లాట్ ఫర్ సేయింగ్ సో..."

"ఇంక మనమీ యూ స్క్రాచ్ మైన్ అండ్ ఐవిల్ స్క్రాచ్ యువర్స్ ప్రోగ్రామ్ ఆపేసి వెళ్దామా.. "నవ్వుతూ అడిగాడు.

రిలీఫ్ గా చూసి లేచింది.

"అవునూ.. నువ్వసలు వర్క్ చేసావా..? పులావ్ వండావూ, పొద్దున్నే వచ్చేసావు. నిజంగా చేసావా.. లేక నేను టీ గార్డెన్ అన్నానని పనైందని కోసావా.. " వెక్కిరింతగా అడిగాడు.

"వచ్చి చూడండంత డౌటైతే.. అనుమానపు బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు... ఐనా పోలీసవ్వాల్సింది మినిస్టరైపోయారు.. "

"అందుకే గుర్తుపట్టి వందలాది పోలీసులతో వేగమని హోమ్ వింగ్ లో పడేసాడు రామ్ నన్ను.. "

"అవునూ..రామ్..రామ్ అంటుంటారెవర్నీ... ?"

"ఓ గాడ్.. అదికూడా తెలీదా.. మన సీ.ఎమ్.కోదండరామిరెడ్డి.. మీ జీ.కే. ఇంత పూరా మేడమ్..?"

"ఓహ్.. కదూ.. తట్టనేలేదు నాకు. సీ.ఎమ్. గారిని పేరు పెట్టిపిలుచుకునేంత దగ్గరైవుండచ్చని తెలీదు., పార్టీ లోనే ఇంకెవరో అనుకున్నాను. ఐనా జీ.కే. పూరైతేనేం నా దగ్గర జే.కే వుండగా...", సినీ ఫక్కీలో అని నవ్వేసింది.

"ఏయ్.. "చెయ్యెత్తాడు నవ్వుతూ.

"ఓ.కే. మరి. చాలా మంచి ప్లేస్ కి తీస్కెళ్ళారు భరద్వాజా.. థ్యాంక్యూ. సో.. సీయూ.. దెన్ మళ్ళీ డ్రైవింగ్ వద్దు. డ్రాప్ చేస్తాననకండి.."

"అదేంటి..?"

"అంటే ఇక నే వెళ్ళనా మరి?... అనీ.. "

"అప్పుడేనా.." అప్రయత్నంగా అనేసాడు.

ఆశ్చర్యంగా చూసింది,"అహ్హా... అది నా డైలాగ్ కదా.. ఏంటీ కొంచెం కొంచెంగా జే.కే. గారు దార్లోకొస్తున్నట్టున్నారే.. నాట్ బ్యాడ్.."

కోపంగా చూడబోయి, "నువ్వూ..." అంటూ సడెన్ గా నవ్వసాగాడు.

"ఏయ్.. ఎందుకంతలా నవ్వుతున్నారు..."

"ఏం లేదూ.. ఏదో అనిపించీ.."నవ్వాపుకున్నాడు.

"చెప్పండీ ప్లీజ్.. ఏదోవుంది.. చెప్పరూ.."

"ఏంలేదూ.. ఇంత రాక్షసివి.. నువ్వుగానీ.. నా కాలేజ్ రోజుల్లో కలిసుండాల్సింది ఓచూపు చూసేవాడ్ని కదా అనిపించింది సడెన్ గా, అందుకే నవ్వొచ్చింది...".

"ఓహో.. వావ్.. ది గ్రేట్ జే.కే. గారికి అలా అనిపించిందంటే ఓ మై గాడ్.. అయాం ప్రౌడ్ ఆఫ్ మై సెల్ఫ్... ఆన్ క్లౌడ్ నైన్.. హావ్ టూ సెలిబ్రేట్ దిస్.. హుర్రే...", చిన్నగా అరిచింది.

"ష్.. అంతలేదు.. మరీ ఓవర్ చేయకు.."నవ్వుతూ వారించబోయాడు.

"నో వే.. ఇది నా సెలిబ్రేషన్.. కాదనే రైట్ లేదు మీకు. సో ఏం చేయనూ.. ఓకే... మీకో మంచి కాఫీ చేస్తాను ఇంత మంచి మాటన్నందుకు..", హుషారుగా లేచింది.

"నువ్వా.. ఎందుకు.. స్వామి కి చెప్తే తెస్తాడుగా.. ?"

"ఆ స్వామి పెట్టేదీ, నేను పెట్టేదీ ఒకటేనా...?"చిరుకోపంగా అడిగింది.

"కాదనుకో, కానీ.." ఇబ్బందిగా చూసాడు.

"ఓ.కే. బాస్.. మీ బాధ అర్థమైంది. ఐనా మీ ఒక్కరికే పెడితే కదా భయపడాలి. మీ స్వామితో సహా అందరికీ ఇస్తాను. ఓ.కే.నా మరీ.. "అంటూనే అతని అంగీకారంకోసం చూడకుండా లోపలికి నడిచింది.

ఒక పదినిమిషాలాగి ఆమె లోపలేంచేస్తోందోనన్న క్యూరియాసిటీ ఆపుకోలేక, లోపలికి నడిచాడు.

"**టైంకి వచ్చారు** భరద్వాజా.. కాఫీ తీసుకోండి.. పాణిగారూ మీరు కూడా.."నవ్వుతూ ట్రేలో వున్న పొగలుచిమ్మే కాఫీ అందించింది.

"ఆ తర్వాతేమైందీ.. ఇంతకీ మీ మనవడు మైదాడబ్బా మొత్తం బావిలో వంపేసాడా.. ?" అడిగింది తనూ ఓ కప్పుతీసుకుని పక్కనున్న సోఫాలో కూర్చుంటూ ముత్తుస్వామి వైపుచూసి.

భరద్వాజకేసి బెరుగ్గా చూసి, "ఆ.. అదీ.. ఔనమ్మా.." గొణిగాడు ముత్తుస్వామి.

"విన్నారా భరద్వాజా.. ఏమైందో..." అంటూ చెప్పబోయింది.

"నేను తర్వాత వింటాలే.. నువ్వు కానీయ్.." తన్నుకొస్తున్న నవ్వుని దగ్గుగా మార్చుకుంటూ బయటికి నడిచాడు. అప్పటికే బలవంతంగా నవ్వాపుకుంటున్న పాణి కూడా త్వరత్వరగా భరద్వాజననుసరించాడు.

"ఇంతకీ.. బావిలో నీళ్ళేమయ్యాయి మరీ.." అడుగుతున్న మనోజ్ఞ గొంతు లీలగా వినిపిస్తుంటే పూలకుండీల పక్కన గట్టుమీద సెటిలయ్యాడు.

"సర్..." షాకింగ్ గా చూస్తూ పాణి పిలిచాకా స్ట్రైక్ అయ్యిందతనికి తాను ఎక్కడ కూర్చున్నాడో. తెల్లబోయి చూస్తున్న పాణి ముఖం చూసి, "ఏం చేస్తాం పాణీ.. సావాసదోషం..", అంటూ ఒక్కసారిగా పైకే నవ్వేసాడు. అది చూసిన పాణి కూడా పకాల్న నవ్వుతూ శృతికలిపాడతనితో.

అంతలో "మీరిక్కడున్నారా..?" అంటూ మనోజ్ఞ రావడం గమనించి ఆపారిద్దరూ.

"సారూ దుర్గ గుడి ప్రసాదం.." వెనకే వచ్చిన స్వామి అందించాడు భరద్వాజకి.

"ఇంతకీ కాఫీ ఎలావుందో చెప్పలేదు అంకుల్ మీరు.." చిరునవ్వుతో అడిగింది ముత్తుస్వామిని.

ప్రసాదం తీసుకుని కళ్ళకద్దుకున్నాడు భరద్వాజ, 'ఈ అమాయకురాలి ముఖంలో కల్మషం లేని ఈ నవ్వు అలాగే వుండనివ్వు తల్లీ... 'మనసులో ప్రార్థించి నోట్లో పెట్టుకున్నాడు.

సమాధానం చెప్పమన్నట్టు చూసింది ముత్తుస్వామి వైపు, "అమృతంలా పెట్టావమ్మా.. కాబోయేవాడు నిజంగా అదృష్టవంతుడు..." చెప్పి నోరు జారానని గ్రహించి కంగారుగా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

"కదా.." నవ్వేసింది భరద్వాజవైపు చూసి.

గంభీరంగా చూసాడు భరద్వాజ. పాణి సిట్యూయేషన్ గ్రహించి కామ్ గా తప్పుకున్నాడు.

భరద్వాజ ఏమీ మాట్లాడకుండా లేచి లాన్ లోకి నడిచాడు.

"ఏమైంది తప్పేమన్నానూ... అంత సీరియస్ అయ్యారు.. మీరు అదృష్టవంతులే కదా..!" తియ్యగా నవ్వుతూ అంది గార్డెన్ ఛైర్లో కూర్చుంటూ.

గుండెల నిండా ఊపిరి తీసుకున్నాడు. ఆమెని నిలువరించే ధైర్యం తనకివ్వమని మనసులోనే భగవంతుడిని ప్రార్థించాడు.

"డాక్టర్ మనోహర్ గారు వయసు, అందం, చదువు, ఆస్తీ, అన్నీ వున్న ఓ కుర్రాణ్ణి తన అల్లుడిగా ఎక్స్పెక్ట్ చేస్తారు మనోజ్ఞా.. తన కూతురి కంటే ఓ పాతికేళ్ళు పెద్దవాణ్ని, దాదాపు తన ఏజ్ వాడ్ని కాదు.." కోపంగా అన్నాడు.

"అందరు తండ్రులకీ అలాంటి అల్లుడే కావాలి. కానీ కుదరదు కదా. నెమ్మదిగా కాంప్రమైజ్ అవుతారు.. " తాపీగా చెప్పింది.

"నేను తెలుసుకున్నాను మనూ.. హీ వాంట్స్ యూ టూ మ్యారీ.. ఆనంద్.."

"బట్ ఐ డోన్ట్. అందర్లాగే ఆయనా కన్ఫ్యూజ్ అయ్యుంటారు.. నేను ఎక్స్ ప్లైన్ చేస్తాను మేం స్నేహితులం మాత్రమే అని, ఆయనర్థం చేసుకుంటారు. నేనిష్టపడ్డ వ్యక్తిని చూసి ఆయన గర్వపడే రోజొస్తుంది మిస్టర్ ఛార్మింగ్.. " అల్లరిగా నవ్వుతూ అంది.

"ఇప్పుడున్న ఛార్మ్ ఇంకో అయిదేళ్ళకుండదు మనూ.. చాలా తొందర్లో పోతుంది. మై హెయిర్ విల్ గో ఆఫ్, స్కిన్ లూజెన్స్.. ఇంకొన్నేళ్ళలోనే కంప్లీట్ గా పూర్తిగా ముసలివాడినైపోతాను.. నీ ఏజ్ వాళ్లంతా సెకండ్ హనీమూన్ కి వెళ్తుంటే ముసలి మొగుడ్నేసుకుని హాస్పిటళ్ళ చుట్టూ చక్కర్లు కొట్టాల్సొస్తుంది నీకు. అది కథల్లో, సినిమాల్లోలా వుండదు. బీ.పీ., డయాబిటిస్, హార్ట్, లంగ్స్, కిడ్నీస్, లివర్.. ఏది అఫెక్టవుతుందో తెలీదు. యూ వోన్ట్ హావ్ ఏ లైఫ్..." ఉద్వేగంగా చెప్పాడు.

"నేనో డాక్టర్ని భరద్వాజా. మీ ఏజింగ్ ఎప్పుడు స్టార్టవుతుందో, ఎలా వుండచ్చో చెప్పి నన్ను భయపెట్టక్కర్లేదు. ఐ కేన్ ఇమాజిన్.. కానీ ఏజ్ వల్ల వీగిపోయే ప్రేమ, ప్రేమే కాదు. మన పాత తరాల్లో అలా ఎందరు లేరు. ఇప్పుడూ ఎందరు లేరు. మా పేరంట్స్ కి మధ్య గ్యాప్ పదేళ్ళు. మన మధ్య మరో పన్నెండేళ్లు. అంతేకదా.. ఇట్స్ ఓ.కే. ఐ విల్ లెర్న్ టూ లివ్ విత్ ఇట్ అండ్ యూ విల్ టూ. ఐ కేన్ బెట్ ఆన్ దట్. జస్ట్ థింక్ ఓవర్ భరద్వాజా.. లేనిపోని భయాలతో మన లైఫ్ వేస్ట్ చేయకండి. లెటజ్ మేకిట్ ఏ బ్యూటిఫుల్ ప్లేస్ టూ లివ్ ఇన్.. ఐ ప్రామిస్... వీ వోన్ట్ రిగ్రెట్ ఇట్... " చెప్పింది ఆర్తిగా చూస్తూ.

"ఐ నో.. ఐ వోన్ట్ రిగ్రెట్ ఇట్.. బట్ ఐ నీదర్ వాంట్ యూ ఆల్సో టూ రిగ్రెట్ ఫర్ ఎనీ థింగ్ ఇన్ లైఫ్.. " సూటిగా అన్నాడు.

"నేనేమీ చిన్నపిల్లని కాను."

"కావు కాబట్టే అర్థం చేసుకుంటావని చెప్తున్నాను. ఇప్పుడు... ఇష్టం పుట్టిన తొలి రోజుల్లో ఎవరికైనా ప్రేమో అద్భుతమే, అన్నీ.. అన్నీ అందంగానే వుంటాయి. కానీ కాలం గడిచేకొద్దీ ఆ సాంద్రత, తీవ్రత తగ్గిపోతుంది మనోజ్ఞా.. వెగటుపుడుతుంది. ఆవేశంలో తప్పుచేసామనే భావన తినేస్తుంది. రాంగ్ పర్సన్ ని ఛూజ్ చేసుకున్నామనిపిస్తుంది. ఐరనీ

ఆఫ్ ది సినేరియో ఏంటంటే.. అవతలి వ్యక్తికీ సరిగ్గా అదే అనిపిస్తుంది. అప్పుడు ఒప్పుకోనూలేరు. తప్పుకోనూలేరు. బాధగా, బాధ్యతగా, భారంగా జీవితం వెళ్ళదీసేస్తారు. అలా ఎందర్నో చూసాను. అలాంటి నూటికి తొంభై మందిలో నేనో పార్ట్ కానూలేను. నిన్నో విక్టిమ్ నీ చేయలేను." స్థిరంగా చెప్పాడు.

"మిమ్మల్నేమీ అడగట్లేదు భరద్వాజా నేను.."

"డోన్ట్ బీ సిల్లీ... అడగనంతమాత్రాన నువ్వెలాంటి ఆలోచనలు చేస్తున్నావో నాకు కనిపింనంత స్టుపిడ్ ని ఐతే కాదు. ఐనా నీలో అలాంటి ఆలోచనలు రావడానికి చాలావరకూ నేనే కారణం, చాలా వరకూ. ఒకవిధంగా చూస్తే హండ్రెడ్ పర్సంట్. నా తప్పుంది. అందుకే చెప్తున్నాను.. ఇందంతా వదిలెయ్.. యూ ఆర్ క్వైట్ యంగ్.. జీవితం లో ముందుకెళ్ళాకా యూ విల్ ఫైండ్ యువర్ మిస్టర్ రైట్." నెమ్మదిగా చెప్పాడు.

చిన్నగా నవ్విందామె., "ఓ అందమైన నైట్ ఇన్ షైనింగ్ ఆర్మర్ వచ్చి నన్ను ఎగరేసుకుపోతాడనే కలలుకనే టీనేజ్ గర్ల్ స్టేజ్ లో నేను లేను భరద్వాజా. మీరు నన్నేమీ కన్విన్స్ చేయక్కరలేదు. నా మాటల వల్ల మీకిబ్బంది కలుగుతోందంటే మార్చుకోగలను, కానీ మనసులో ఆలోచనలవల్ల కలుగుతోందంటే.. అయాం సారీ.. మార్చుకోలేను. అది కేవలం నా మనసులో భావనే తప్ప, మీకలాంటి ఫీలింగే లేకుంటే, నేనసలు ఏమీ మాట్లాడకుండానే వెళ్ళిపోయేదాన్ని. అనవసరమైన భయాలతో ప్రేమించిన వ్యక్తికి దూరం అవడానికి మీరు పడుతున్న బాధ నాకు తెలుసు. అది సరైనది కాదని మీరు తెలుసుకోవాలనే మీతో అంత ఓపెన్ గా వుంటున్నాను. ఈ ప్రేమ క్షణికం కాదని మీరు తెలుసుకోవాలనే ఇవన్నీ మాట్లాడుతున్నాను..

అయినా వాదనలతో, కన్నీళ్ళతో, గెలిచి మీ జీవితంలో సంపాదించుకునే స్థానం నాకొద్దు. ఇదేమీ మీ ఎలక్షన్ సీట్ కాదు, నన్ను చేసుకోండని క్యాంపైన్ చేసి గెలుచుకోవడానికి. మీకు మీరుగా రియలైజ్ అయ్యి నన్ను ఆహ్వానించిన రోజే మీ లైఫ్ లోకి అడుగుపెడతాను. ఆరోజు తొందర్లోనే వుందన్న నమ్మకం నాది. నేను నమ్మిన దానికోసం ఎదురుచూసే ఓర్పు నాకుంది. మీకోసం మనోజ్ఞ ఎదురుచూస్తోందన్న ఒక్కమాట మీరు గుర్తుంచుకోండి, నాకదే చాలు. అంతకుమించిన ఎక్స్పెక్టేషన్స్ ఏమీ లేవు నాకు మీనుంచి.. ఐ మీన్ ఇట్.." చెప్పింది స్థిరంగా.

కళ్ళుమూసుకుని అలాగే చాలాసేపుండిపోయాడు. ఆమె మాటల్లో తిరుగులేని స్థైర్యానికీ, క్లారిటీకీ అతని మనసు కదిలిపోయింది. తన ప్రతి ప్రశ్నకీ ఆమె దగ్గర జవాబుంది. తానోడిపోతున్నాడు. తెలుస్తోంది. కానీ, ఈ ఓటమీ మధురంగానే వుంది. వాదించి-గెలవాలని లేదు. ఓడిపోయి ఆమెని గెలుచుకోవాలనే కోరిక నెమ్మదిగా తన మనసుని ఆక్రమించుకుంటోంది. కథ గా చెప్తే ఇదంతా ఎవరూ నమ్మరేమో.. ఓ పాతికేళ్ళ పిల్ల ఓ ఏజ్డ్ మినిస్టర్ కి వలేసిందనో, లేక ఓ అమాయకమైన పిల్లని జే.కే. ట్రాప్ చేసాడనో కథలు కథలుగా చెప్పుకుంటారు.. హూ కేర్స్... చెప్పుకోనీ.. మనసున్నవాళ్ళకి తప్పక అర్థమౌతుంది, తాము పడే వేదన. కానీ.. ముందీ మనసుకేం చెప్తాడు. నిజంగా అంత డెసిషన్

తీసుకోగలడా తను.. మనోజ్ఞ జీవితం ఇది.. ఆమె కోరుకుంటున్నదే కావచ్చు కానీ, ....' తలవిదిల్చాడు. మనసుతో పోరాడీ.. పోరాడలేక, ఆలోచించీ..ఆలోచించలేక, పూర్తిగా అలిసిపోయాడు.

"నేను.. వెళ్తాను.." బెరుగ్గా అందామె.

"పద... నేనూ వస్తాను..." లేచాడు.

"వెళ్ళనా భరద్వాజా...?"మెల్లగా అడిగింది. కారు కాటేజ్ కి కాస్త దూరంలో ఆగుంది. అప్పటికి పది నిమిషాలైంది వాళ్ళక్కడికొచ్చి. కారునానుకుని అలాగే నిలబడ్డాడతను. అతను ఏదో చెప్పాలనుకుంటున్నాడని అతనిలో అనీజీనెస్ చూస్తే అర్థం అవుతూనే వుంది.

"భరద్వాజా.." పిలిచింది సందిగ్ధంగా. అతనేం ఆలోచిస్తున్నాడో తెలియక భయంవేస్తోందామెకి.

తలతిప్పి ఆమెవైపు చూశాడు. ఒక్క క్షణం తటపటాయిచి, "నాక్కొంచెం టైం కావాలి మనోజ్ఞా.." అన్నాడు ఏ ఉపోద్ఘాతమూ లేకుండా.

అతనేం అంటున్నాడో అర్థమైన మనోజ్ఞ మొహం చప్పున వెలిగింది. నమ్మలేనట్టు చూసింది ఒక్క క్షణం తర్వాత, మెరిసే కళ్ళతో ఉద్వేగంగా చెప్పింది, "తప్పకుండా.. నేను.. వెయిట్ చేస్తాను భరద్వాజా.. ఎన్నాళ్ళైనా.. ఎన్నేళ్ళైనా.. ఇది... ఇది నాకు.. నిజంగా అనుకోని గిఫ్ట్.. థ్యాంక్స్. థ్యాంక్స్ ఎలాట్.. "

"బై మనూ.." కార్ డోర్ తీస్తూ చెప్పాడు.

"బై.. " అంటూ అటూ ఇటూ చూసి "బై.. భరద్.. ఐ.. లవ్ యూ.. "అంటూ ఓ చిన్న ఫ్లయింగ్ కిస్ విసిరేసి అక్కడనుండీ వెనక్కితిరిగిచూడకుండా కాటేజ్ వైపు పరుగుతీసింది.

ఆమె రూపం కనుమరుగయ్యే వరకూ నిశ్చలంగా చూస్తుండిపోయాడు.

"వావ్.. గుడ్ ఫీల్డింగ్... గ్రేట్.. వండర్ ఫుల్ క్యాచ్ కదూ...." వుత్సాహంగా చూస్తోందామె. చిరునవ్వుతో ఆమె ని గమనిస్తున్నాడు. రోజు మొత్తం ఆమెతో అలా క్లోజ్డ్ ఛాంబర్ లో అదీ తన ప్లేస్ లో గడపడం ఓ చిత్రమైన అనుభూతి. తాను ఆలోచిస్తానని చెప్పాకా ఆమె ముఖం మరింత వింత కాంతితో వెలగడం గుర్తించి అతనికి ఆశ్చర్యంగా వుంది. మనసులో సంతోషం ముఖం మీద మెరవడం అంటే ఏంటో తెలుస్తోందతనికి. ఈ అనుభూతి శాశ్వతమైతే అన్నఆలోచన మనసంతా మాధుర్యాన్ని నింపుతోంది.

"ఏంటలా చూస్తున్నారు. " కళ్ళెగరేసింది.

"ఏంలేదూ.. ఏమన్నా తింటావా.. ఎనీ స్నాక్స్..?" మృదువుగా అడిగాడు.

"ఏంలేదా.. నిజమా.. సరే.. నమ్మమంటే నమ్మేస్తాను.. ఐనా మీరలా తినేసేలా చూస్తూ నన్ను తింటావా అనడుగుతారేం..?" అల్లరిగా నవ్వింది.

"ఊహు... మరీ.. అనుమానిస్తున్నావ్.. నేనలా చూడలేదు మిస్..."

"...మీకు తెలీదేమో బాస్ .. నాకు ఫేస్ రీడింగ్ కూడా తెల్సు... " కళ్ళు చక్రాల్లా తిప్పుతూ అంది.

"ఓ.. పామిస్ట్రీ.. సెన్సింగ్ పవర్.. అలాగేనా..." నవ్వాడు.

సిగ్గుపడిందామె, "నిజానికి నాకేమీ తెలీదు..."

"తెలుసు.. నేనంత డంబ్ కాదు.." సోఫాలోంచి లేచొచ్చి ఆమె పక్కన దివాన్ మీద కూర్చుంటూ చెప్పాడు. బిడియంగా చూసి కళ్ళు దించుకుంది.

చిన్నగా నవ్వి ఆమె చేతినందుకుంటూ అడిగాడు, "పోనీ.. నేను చెప్పనా నీ చేతి రేఖల్లో ఏముందో.. "

ఆశ్చర్యంగా చూసింది, చేతిలో వేలితో సున్నితంగా రాస్తూ అన్నాడు, "ఇదిగో ఈ గీత చెప్తోంది, నువ్వో మంచి అమ్మాయివనీ.. " కొద్దిగా దగ్గరకి జరుగుతూ అన్నాడు, "ఈ రేఖ చెప్తోంది యూ లుక్ లైక్ ఏన్ ఏంజిల్ అనీ..." ఆమె బుగ్గలు ఎర్రబడ్డాయి. అప్రయత్నంగా మరికాస్త వెనక్కి జరిగింది. "ఇదిగో ఈ గీత చెప్తోంది నీకు జే.కే. అంటే చాలా ఇష్టమనీ.. " ఇంకాస్త ముందుకు జరిగి నవ్వాడు. "ఇంక జరక్కు అక్కడ గోడేవుంది.. ఈ గీత చెప్తోందీ... ఏమని అడగవేం..!" నవ్వుతూ అడిగాడు.

"ఏమనీ...?"ఆమె గొంతు సన్నగా వణికింది.

"ఇప్పుడూ.. భరద్వాజకి.. ఈ ఏంజిల్ ఓ తియ్యని స్మాక్ ఇవ్వబోతోందీ అనీ.." నవ్వాడు.

సిగ్గుగా నవ్వేసి, తల అడ్డంగా తిప్పింది.

"ఇవ్వవా.. నా పామిస్ట్రీ రాంగవడానికి వీల్లేదే... మే బీ ద అదర్ వే రౌండ్ యేమో.. "అంటూ ముందుకి వంగాడు. చప్పున అతన్నాపింది భుజాలు పట్టుకుంటూ.

"ఏయ్.. మీరూ.. క్రికెట్ చూడ్డానికి వస్తే అల్లరిపెడుతున్నారనీ..."

"మీడియాకి చెప్తావా.. వెరీ గుడ్, చెప్పెయ్ నాకో పెద్ద పని తప్పిపోతుంది." నవ్వాడు.

"నేను వెళ్తాను.." లేవబోతున్న దగ్గరకి లాక్కున్నాడు. నడుంచుట్టూ చేతిని బిగించి నెమ్మదిగా ఆమె పెదవులందుకోబోయాడు. గణగణమంటూ మోగిందతని సెల్. తటాల్న అతన్ని వెనక్కి నెట్టేసి వెక్కిరించింది.

"ఐనా ఇంకా రాత్రి వరకూ ఇక్కడేగా తమరు.. చూస్కుంటాలే.. వదలనూ."అంటూ ఫోన్ ఆన్సర్ చేసాడు.

"జే.కే. హియర్.." అంటున్న అతని ముఖంలో నవ్వు మాయమైంది. సెల్ తీసుకుని విసురుగా బాల్కనీలోకి వెళ్ళిపోయాడు.

దిగులుగా చూసింతను వెళ్ళిన వైపు. అలవాటుచేసుకోవాలి. ఒక పొలిటీషియన్, అందులోనూ ఓ మినిస్టర్ తో జీవితం. ఇలాగే వుంటుంది.. నవ్వుకుందంతలోనే. అప్పుడే దిగులు,అప్పుడే ఆనందం, ప్రేమలో పడ్డవారి మొదటి లక్షణాలు అని ఎక్కడో చదివిన మాట గుర్తొచ్చింది.

దాదాపు అరగంటైంది.

గంటైంది..

విసుగ్గా వాచ్ చూసుకుందామె.

లేచి బాల్కనీ వైపు నడిచింది. మాటలేమీ వినిపించడంలేదు. తటపటాయిస్తూ తలుపుతోసింది.

బాల్కనీ గోడ మీద చేతులానించి నిర్వేదంగా బయటకి చూస్తున్నాడతను. ఆమె వచ్చిన అలికిడి కూడా పట్టనంతగా ఏదో ఆలోచిస్తున్నాడతను.

తెల్లబోయి అతని దగ్గరగా వెళ్ళింది. "భరద్వాజా..." తెప్పరిల్లి చూసాడు.

"ఏమైంది? ఏంటలా వున్నారు. లోపలికి రాలేదేం..?" అడిగింది.

"ఏంలేదు.. బానే.. బానే వున్నాను. వెళ్ళు.. నువ్వెళ్ళి మ్యాచ్ చూడు.." నెమ్మదిగా చెప్పాడు.

"మీరూ.. రండి.." బెరుగ్గా పిలిచింది. మౌనంగా కదిలి లోపలికి నడిచాడు.

అలసటగా టీవీ ముందున్న తివాచీ మీద కూలబడ్డాడు. టీవీ ఆఫ్ చేసి అతని పక్కన కూర్చుందామె. కళ్ళుమూసుకుని జుట్టులోకి వేళ్ళు జొరుపుకున్నాడు. ఆశ్చర్యంగా చూసిందతనివైపు. ఎప్పుడూ చూడలేదతన్నలా. నిస్తేజంగా, దిగులుగా.. బాధగా.. ఆఖరుకి ప్రాణం మీదకొచ్చినప్పుడు నిబ్బరంగానే వున్న భరద్వాజే తెలుసామెకి. తానెప్పుడూ చూడని కోణం ఇది.

"భరద్వాజా... ఏమైనా ప్రాబ్లమా.. వర్క్ టెన్షనా.. పర్సనలా.. నాతో చెప్పరూ.. లేదంటే నావల్లా..?"

"ఛ అదేం లేదు..."

"మీరు.. ఎప్పుడూ నవ్వుతుంటేనే బాగుంటారు తెల్సా.. నవ్వరూ.. ప్లీజ్.." ఆప్యాయంగా అడిగింది. కళ్ళు విప్పి ఆమె వైపు చూసాడు.

అతని ముఖంలో అదే నైరాశ్యం. వేదనా.. బాధగా వెనక్కి వాలి సోఫానానుకుని కళ్ళు మూసుకున్నాడు. పెదవులు అదిమిపట్టిన దుఃఖాన్ని నిలపలేక అదురుతున్నాయి. చాలా కష్టం మీద వేదనని నిగ్రహించుకుంటున్నట్టు తెలుస్తోంది. అసలు భరద్వాజని ఇలా ఎప్పుడూ చూడలేదు. ఓదార్పుగా అతని భుజంమీద చేయివేసింది. అతను కదల్లేదు. బెదురుగా చూసింది.

"ఎవరికైనా ఏమైనా అయిందా? ఏంటిది మీరు నాకు భయంవేస్తోంది. ఏమైంది భరద్వాజా..? ఎనీ థింగ్ సీరియస్..?"అంటూ ప్రశ్నించింది.

అప్పటికే అతని వేదన చూసి ఆమె కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. తటపటాయిస్తూ అతని తలపై చేయి వేసింది.

"సీరియస్సే మనూ.. ఐ .. ఐ కాన్ట్ హేండిల్ దిస్ ఎలోన్ ఎనీ మోర్.."అంటూ ఇంక నిగ్రహించుకోలేనట్టు అరచేతుల్లో ముఖం దాచుకున్నాడు. నిశ్చేష్టురాలైందామె. నెమ్మదిగా అతని తలనిమురుతూ వుండిపోయింది.

కొద్ది నిమిషాలకి సర్దుకున్నాడతను.

"భయపడ్డావా..?"నవ్వడానికి విఫలప్రయత్నం చేసాడు. రెప్పార్పకుండా ఒక్క క్షణం ఆమెని చూసాడు. "నీ ఒళ్ళో తల పెట్టుకుని పడుకోవచ్చా..?"అడిగాడు. షాకింగ్ గా చూస్తూ నెమ్మదిగా తలూపి అప్రయత్నంగా చెయ్యి సాచింది.

మెల్లగా జరిగి వడిలో పడుకుని, ఆమె చేతిని తన గుండెలకాన్చుకున్నాడు. ఆశ్చర్యంగా చూస్తూ, రెండో చేత్తో అతని నుదుటి మీద పడుతున్న క్రాఫ్ ని సున్నితం గా వెనక్కినెట్టింది.

చిన్నగా నవ్వాడు. "ఈ క్రాఫ్ బదులు నాకు బట్టతల వుండివుంటే...?" నవ్వుతుంటే అతని కళ్ళల్లో ఇంకా నిలిచివున్న నీటి తెర సన్నగా మెరిసింది.

"హెయిర్ వీవింగ్ చేయించేదాన్ని.. లేదా మంచి విగ్గు కొనిచ్చేదాన్ని.." చిన్నగా అతని తల పై కొట్టి చెప్పింది.

"... నన్నేమీ అడగవా..?"

"ఊహు.. మీ ఇష్టం. మీకు చెప్పాలనిపిస్తే చెప్పండి. అయినా ఓదార్పు అనేది చల్లగా సేద తీర్చేదే గానీ, తరచి తరచి ఇంక్వైరీలు పెట్టేది కాదని నా నమ్మకం..." లాలనగా అతని నుదుటిని రాస్తూ చెప్పింది.

"ఒక్కోసారి చిన్నపిల్లలా వుంటావు. మరోసారి నాకంటే మెచ్యూర్డ్ గా కనిపిస్తావెందుకు మనూ..?" ఆమెనే కళ్ళార్పకుండా చూస్తూ అడిగాడు.

"మనకిష్టమైన వాళ్ళలో ఎప్పుడైనా మనకలాగే మంచి యాంగిల్సే కనిపిస్తాయి. కూరిమి గల దినములలో అని చిన్నప్పటి పద్యం గుర్తుందా!? చూసారా కొన్ని తెలుగు పద్యాలు నాకూ గుర్తున్నాయి.." నవ్వుతూ అంది.

"నువ్వు దొరకడం నా అదృష్టం మనూ.. "ఆర్తిగా చెప్పాడు.

"అలా మీరనుకోవడం మీ గొప్పతనం. లేదంటే ఏ స్పెషాలిటీ లేదు నాలో. చాలా మామూలు అమ్మాయిని. మీరేమో ఆల్ రౌండర్.."

"చాలామంది ప్రొఫెసర్లూ, డాక్టర్లూ, మినిస్టర్లూ, బిజినెస్ పీపుల్.., బడాబాబులు, బాబాల దగ్గర్నుంచి మోస్ట్ ఆఫ్ ది మెన్.. చాలామంది మగవాళ్ళు అమ్మాయిలని బుట్టలోవేయడానికి వాడే పాత టెక్నిక్ ఇది. చాలా కష్టాల్లో వున్నట్టు

ముఖంపెట్టి ఒళ్ళో తలపెట్టుకుని పడుకోవడం. వర్కౌట్ ఐతే సరే.. కాదంటే మరో ట్రిక్, లేదంటే మరొకరు. ఇక్కడ ఒడి అనేది ముఖ్యం... ఎవరిది అనేదక్కర్లేదు.. తెలుసా నీకు.. ?"అడిగాడు.

"తెలుసు.." క్లుప్తంగా చెప్పింది.

"మరెందుకు  నీ ఒడిలో పడుకుంటానంటే సరే అన్నావ్.. ?"ఆమె గాజులు సవరిస్తూ అడిగాడు.

"మీకంత సీన్ లేదనీ.. "నవ్వేసింది అతని ముఖంలోకి చూస్తూ.

దూరంగా కనిపిస్తున్న చెట్లవైపు చూస్తూ "నీతో కొంచెం మాట్లాడాలి మనూ " అన్నాడు గంభీరంగా.

"చెప్పండి "

"నాకెవరి తోడైనా కావాలి. చాలా పెద్ద బరువిది. "భరద్వాజ గొంతు వణికింది.

అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. ఆ స్పర్శ నేనున్నానని చెప్పకనే చెప్తోంది..

"ఏదైనా అడుగు మనూ.. నా గుండె మోయలేని ఈ భారాన్ని ఈ రోజు నీతో పంచుకోవాలనిపిస్తోంది.." దిగులుగా అన్నాడు.

"మీ వర్రీ దేనిగురించో నాకు తెలియటం లేదు భరద్వాజా.. ఏమని అడగను.. సరే.. ఆ ఫోన్ కాల్ ఎవరిది .. మిమ్మల్నింతగా డిస్టర్బ్ చేసిన ఆ పర్సన్ ఎవరూ...?"

"అతను.. నా.. ఏమౌతాడని చెప్పను మనూ.. అతను నా .. నా అన్నలాంటి వాడనచ్చేమో.."అతని గొంతు వణికింది.

"యూ మీన్ కేశవన్నలా...మీ కజిన్.."

తల అడ్డంగా తిప్పాడు. "కాదు.. హీ ఈజ్ మై ... మై బ్రదర్.. సమాజం ఒప్పుకోని, అన్న అని పలకడానికి నా నాలుక కూడా అంగీకరించని ఓ బంధం..."

"ఓహ్.. అయామ్ సారీ.. ఈజ్ హీ డిస్టర్బింగ్ యూ.. మీ నాన్నగారికి తెలుసా ఈ విషయం?"

"అతను ఎవరనుకుంటున్నావ్.. ?"

"అర్థమైంది భరద్వాజా.. చెప్పారుగా ఐ కెన్ అండర్ స్టాండ్.. మీ ఫాదర్ .. ఇంకో వైఫ్.. ఆర్ మే బీ చిన్నప్పుడు చేసిన తప్పుకి రిజల్ట్.. అదేగా మీరు చెప్పేది."

"చిన్నప్పుడు చేసిన తప్పే... కానీ నాన్నది కాదు.."

కన్ఫ్యూజింగ్ గా చూసింది. "అంటే.." ఇంకేదో అడగబోయిన ఆమెకేదో స్ఫురించింది. ఒక్కసారిగా వళ్ళు జలదరించగా అతని వైపు చూసింది. నిర్వేదంగా ఆమె వైపు చూసి తలతిప్పుకున్నాడు.

"యూ గాట్ ఇట్ రైట్ మనూ... అతను.. అతను అమ్మ కొడుకు..మా అమ్మ కొడుకు..."

తుళ్ళిపడి చూసింది. తన రియాక్షన్ తో ప్రమేయం లేకుండా అతను నిర్వికారంగా ఎటో దూరంగా చూస్తున్నాడు.

తల్లంటే ఓ నమ్మకం.. ఓ గౌరవం.. ఓ నిజాయితీ.. తమ తల్లి గురించిన ఏ చెడూ విని తట్టుకోలేరే పిల్లలూ. తమ తల్లిని మించిన పవిత్రురాలు వుండదనే గుడ్డినమ్మకం ప్రతి బిడ్డకీ. దైవాన్నిమించిన స్థానం. బంధాన్ని మించిన బంధం.. అలాంటిది ఆమె గురించి చెడుగా తెలిస్తే.. ఆ పిల్లల గుండె ఎంత మండుతుందో ఊహించలేరెవ్వరూ.. ప్రపంచమే తిరగబడినట్టౌతుందా ఒక్క వార్తకీ.. అలాంటిది.. భరద్వాజ... అతను అనుభవిస్తున్న ఆవేదన స్థాయి అర్థమై నెమ్మదిగా అతని చేతిని బెదురుగా స్పృశించింది.

"అమ్మని తప్పు పట్టను మనూ.. తప్పు పట్టలేను.. తను చేసిన పాపమల్లా ప్రేమించిన వ్యక్తిని నమ్మడం ... అంతే.." భరద్వాజ కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

అంతలో తమాయించుకున్నాడు, "తను తమ ఇంట్లో పనిచేసే ఒక డ్రైవర్ కొడుకుని ఇష్టపడింది.. అంత ఆస్తీ, పరపతీ, పేరూ వున్న వేరే తండ్రులెవరైనా సహించరేమోకానీ తాతయ్య చాలా ఆదర్శభావాలున్న వ్యక్తి. అతనితోనే అమ్మ పెళ్ళి జరిపించాలని నిశ్చయించారు. అంతలో తెలిసిందట ఆ కుర్రవాడు అతను సినిమాల్లో ఛాన్సుల కోసం తిరిగేవాడట.. చాలా మంది అమ్మాయిలని ప్రేమించాననడం.. అవసరం తీర్చుకుని వదిలేయడం అతని గుణమనీ.. అమ్మని వదలకపోవడానికి కారణం ఆమె వెనకున్న ఆస్తనీ... దాంతో తాతయ్య ఆ పెళ్ళి వద్దనేశారు.. ఆవేశంతో అతన్ని తన్ని తరిమేసారు.

కానీ అప్పటికే జరగాల్సిన డ్యామేజ్ జరిగిపోయిది. అప్పటికే అమ్మ ప్రెగ్నెంటని తెలిసింది. భయపడ్డ తను అతన్ని పెళ్ళిచేసుకోమని కోరింది. తాతయ్య చేసిన అవమానానికి రగిలిపోయిన అతను ఆవిడ్ని కాదని మద్రాస్ వెళ్ళిపోయాడు. ఆ దుర్మార్గుడి వంచనకీ, అవమానానికి ఏం చేయాలో తెలియని పరిస్థితిలో తను స్యూసైడ్ చేసుకోబోయింది. కానీ గాడ్స్ విల్ ఈజ్ డిఫ్రెంట్. కష్టం మీద తను బతికింది. అంతలో మరో షాక్.. అనుకోని ఓ యాక్సిడెంట్ లో మామయ్య చనిపోయాడు, భార్యా, కొడుకులతో సహా. ఆ పరిస్థితుల్లో వేరే ఎవ్వరైనా కృంగిపోతారేమో గానీ తాతయ్య మాత్రం తట్టుకుని నిబ్బరంగా నిలబడ్డారు. మిగిలిన ఒక్క కూతుర్ని దక్కించుకోవడానికి, తన ఆరోగ్యం బాగోలేదనీ, గుండాపరేషన్ కోసం సిటీకి వెళ్తున్నట్టుగా పల్లెలో క్రియేట్ చేసి దూరంగా వెళ్ళిపోయారు.. అక్కడే అమ్మకి అతను.. అతను పుట్టాడు...

తాతయ్య కార్ డ్రైవర్ చాలా స్వామి భక్తి పరాయణుడు. అనుక్షణం తాతయ్య నీడలా వుండేవాడు. కొడుకు చేసిన పాపాన్ని తాను తీసుకుపోతాననీ, జీవితంలో కంటపడకుండా పెంచి ప్రాయశ్చిత్తం చేసుకుంటాననీ ప్రాధేయపడ్డాడట. ఆ పిల్లవాడు ఎదురుగా వుంటే తన కూతురి లైఫ్ ఎటూ పాడౌతుందనే భయంతో తాతయ్య ఒప్పుకున్నారు. చనిపోయిన

పిల్లవాడు పుట్టాడని అమ్మకి చెప్పి కొన్నేళ్ళతర్వాత నాన్నతో పెళ్ళి చేసారు. నాన్న, తాతయ్య నిరంతరం రాజకీయమే శ్వాసగా, ధ్యాసగా వున్న వ్యక్తులు. సో వాళ్ళు మామా అల్లుళ్ళకన్నా చాలా దగ్గర స్నేహితుల్లావుండేవారు.

తాతయ్య ఆనారోగ్యం కారణంగా తిరిగి సొంతూరికి వెళ్ళిపోయారు. ఒకరోజు తాతయ్యకి సీరియస్ గా వుందనేసరికి నేను వెళ్ళాను. తాతయ్య అక్కడ నాకీ విషయాలన్నీ చెప్పారు. వాళ్ళకి ఇన్నేళ్ళూ డబ్బుపంపిచేవారని, కానీ అప్పుడప్పుడే అతను ఆస్తిలో వాటాకోసం వేధిస్తున్నాడనీ, తాను ఆల్రెడీ అది నాన్న పేరుమీద రాసేయడంవల్ల తిరిగి అడిగే పరిస్థితిలేదు కాబట్టి ఎలాగో మేనేజ్ చేస్తున్నాననీ చెప్తూ ఇక అతను జీవించివుండగా అమ్మ ప్రశాంతంగా వుండడం కల్ల కాబట్టి నన్నే నిర్ణయంతీసుకోమని చెప్పారు. తాతయ్య చనిపోయాకా కొన్నేళ్లు వాళ్ళు కామ్ గా వున్నారు. నెమ్మదిగా ఎలాగో వారికి డబ్బు చేరుతున్నది నానుంచి అని తెలుసుకున్నారు. వేధించడం మొదలుపెట్టారు. చాలా ఏళ్ళే మేనేజ్ చేసాను. కానీ గత కొద్ది నెలలనుండి అతని టార్చర్ చాలా ఎక్కువగా వుంది.

**"ఎలా హేండిల్** చేయాలో తెలీక చాలా భయంగా, బాధగా వుంటోంది. పాణికీ, మురళి కీ కూడా చెప్పుకోలేని విషయాలివి. ఫర్ దట్ మ్యాటర్ పాణి, అతను చిన్నప్పుడు ఒకే చోట వుండేవారు. పాణి వాళ్ల నాన్న ఆ తర్వాత మాదగ్గర వర్క్ స్టార్ట్ చేసారు. అందుకే పాణికి తెలిసిపోతుందేమో నా ఫోన్స్ వల్ల అన్న భయం కూడా వేస్తుంది. తాతయ్య తరవాత ఈవిషయం ఎవ్వరికీ చెప్పుకోలేక, నాలో నేను దాచుకోలేక నరకం చూస్తున్నాను.

ఇంక మొయ్యలేక ఈరోజు ఇలా..."

ఆగాడతను. తన గతం.. బాధ.. వ్యధ.. అంతా తీరేలా.. అన్నీ చెప్పాడు. ఆగుతూ.. ఆలోచిస్తూ.... తన జీవితం మొత్తాన్ని ఆమె ముందు పరిచాడు. చెప్పడం పూర్తి చేసి చాలాసేపు నిశ్శబ్దంగా అలాగే వుండిపోయాడు. నెమ్మదిగా అతని చేతిని తన చేతిలోకి తీసుకుని అలాగే కూర్చుండిపోయింది చాలాసేపటివరకు.

"చాలా స్ట్రాంగ్ మీరు.. చిన్న చిన్న కష్టాలకే కదిలిపోయి కంటతడి పెడతామే.. అలాంటిది.. మీరు.. మీ సహనం, ఓపిక.., ఈ ప్రశాంతత.. ఇవన్నీ నిజంగా చాలా గొప్ప గుణాలు భరద్వాజా.." ఒక్కోమాటే పేర్చుకుంటూ చెప్పింది.

నిర్లిప్తంగా చూశాడతను., "ఏంతకాలం మనూ, ఏ మనిషికైనా ఎంతకాలం వుంటుదా సహనం, ఓపిక... తాతయ్య అదృష్టవంతుడు, ఈ నరకం చూడకుండా వెళ్లిపోయారు. ఆయన కోరిక ప్రకారం అమ్మా, నాన్నలకి ఈ విషయం తెలియకుండా జీవితాంతం వుంచగలిగితే చాలు.. ఆయనకిచ్చిన మాట నిలబెట్టుకున్నట్టే..." నిట్టూర్చాడు.

తలూపింది, "నిజంగానే చాలా బాధాకరమైన విషయం భరద్వాజా... కన్నకొడుకే... కన్నతల్లి పరువు గురించి ఆలోచించకుండా... " ఆగిపోయింది "నిజంగా ఏం మాట్లాడాలో కూడా తెలియట్లేదు. "

" అతన్ని తప్పుపట్టడానికి కూడా లేదు మనూ, ఆ డ్రైవర్ చివరివరకూ నిజాన్ని దాచాడు. కానీ అతను చివరిదశలో వుండగా అతని కొడుకు తిరిగివచ్చాడు అండ్ తర్వాత తన పెంపకంలో ఇతని మనసూ స్పాయిల్ చేసాడు. అలా పెరిగిన వ్యక్తి కి తల్లంటే ఏం గౌరవం వుంటుది చెప్పూ. కేవలం ఆ ఆలోచనే నన్ను అతని గురించి చెడుగా ఆలోచించకుండా కాపాడుతోంది. పైగా ఎంతకాదనుకున్నా, అనుకోవడానికి ఎంత చేదుగా వున్నా రక్తసంబంధం కాదూ.. "

"మీరు ... మీరు యాక్సెప్ట్ చెయ్యగలరా భరద్వాజా.. ? "షాకింగ్ గా చూస్తూ అడిగింది.

"అఫ్కోర్స్ చేసేవాడినే మనూ... తాతయ్య నాకావిషయం చెప్పినప్పట్నుంచీ ఆలోచించాను, ఒకవేళ అతను నాకు తారసపడితే తప్పకుండా పాజిటివ్ గానే రియాక్ట్ కావాలి. తాతయ్య పాతకాలం మనిషి వగైరా, వగైరాలన్నీ అనుకున్నాను. కానీ అతను నన్ను మొదటిసారి కలిసినప్పటి అప్రోచ్ నాలోని అన్ని ఆలోచనలనీ చంపేసింది."

"ఐ కేన్ ఇమాజిన్... చాలా చెడ్డగా మాట్లాడివుంటాడు కదూ..." జాలిగా చూస్తూ అంది.

తల అడ్డంగా తిప్పుతూ చెప్పాడు, "నో యూ జస్ట్ కాన్ట్ ఇమాజిన్ మనూ, అతనేం మాట్లాడినా నేను తట్టుకునేవాడినే..." ఆగాడు. "...కానీ....కానీ... వాడు నాతల్లి ఫొటోలు తీసుకుని వచ్చాడు నాతో డీల్ మాట్లాడడానికి. ఆ రోగ్..." వణికిందతని గొంతు. నిర్ఘాతపోయిచూస్తుండిపోయింది.. "కానీ... ఆరోజుల్లో ఫొటోలా మిమ్మల్ని ట్రిక్ చేసాడేమో భరద్వాజా..." బెరుకుగా అంది. అసలా విషయంలో నోరు తెరవాలన్నా వణుకుపుట్టిందామెకి.

"అతని తండ్రి సినిమాల్లో కెమెరామ్యాన్ మనూ... ఆరోజుల్లోనే..." క్లుప్తంగా చెప్పాడు తన చేతులవైపు చూసుకుంటూ. "వేరే ఎవ్వరైనా ఆరోజే, అసలప్పుడే నా చేతుల్లో అయిపోయేవాళ్ళు, కేవలం తాతయ్య మాట, అమ్మ కొడుకన్న బాధ ఆపాయి నన్ను" అతని కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. చప్పున అతన్ని హత్తుకుంది. "చాలు భరద్వాజా.. చాలు... మీ బాధ అర్థమైంది. ఇంకేమీ చెప్పద్దు. అవన్నీ తలుచుకోవద్దు కూడా. "

" అమ్మ తప్పేమీ లేదు మనూ.. ప్రేమించింది.. అంతే.. అంతే.. అమ్మ తప్పేమీ..." గట్టిగా కళ్ళు మూసుకున్నాడు అతని చేయి ఆమె భుజం చుట్టూ బిగుసుకుంది.

"కామ్ డౌన్ భరద్వాజా, కామ్ డౌన్.. ప్లీజ్.." నెమ్మది గా అతని తల నిమురుతూ వుండిపోయిందలా.

ప్రపంచంలో అన్నింటికన్నా పెద్ద ఓదార్పు ప్రేమే.. మనసుని తాకిన అన్ని గాయాలకీ మందూ ప్రేమే.

సెల్ లో ఏవో వివరాలు సీరియస్ గా నోట్ చేస్తున్న భరద్వాజ వైపు చిరునవ్వుతో చూసింది.

"ఏం సర్.. ఇవాళ వర్క్ మూడే కానీ, వాకింగ్ మూడ్ లేనట్టుంది మీకు.. "

"సారీ ఆర్ యూ గెట్టింగ్ బోర్డ్. నాకొక టూ మినిట్స్ ఇవ్వు. "

"నో.. నో క్యారీ ఆన్.. స్టేట్ కి మీరెంత ముఖ్యమైన వ్యక్తో నాకు తెలుసు. ఐ కాన్ట్ బీ ఇర్రెస్పాన్సిబుల్. ఐ విల్ లెర్న్ టూ సీ యూ వర్కింగ్ ... తర్వాత వుపయోగపడుతుంది నాకు. " చిలిపిగా నవ్వింది.

"వెల్... ఇన్ దట్ కేస్.. అయాం ద వన్ హూ ఈజ్ బీయింగ్ వెరీ మచ్ ఇర్రెస్పాన్సిబుల్. ఇది గవర్నమెంట్ పని కాదు. సొంత పని..."

"ఓ.." ఏమనాలో తెలీక నవ్వి వూరుకుంది.

ఒక పది నిమిషాల తర్వాత సెల్ లో తన పని ముగించి మనోజ్ఞ వైపు చూసాడు, "ఈ ఫోటో చూడు.."

"చాలా పాత కాలంనాటి గుడిలా వుంది.ఏంటి స్పెషాలిటీ.. ?"

"మామూలు స్పెషాలిటీ కాదు మనూ. నేను చెప్పబోయేది నీ వరకే వుంచుకో. ఇట్స్ హైలీ కాన్ఫిడెన్షియల్... "

"అయ్యో.. నాకేం చెప్పక్కర్లేదు భరద్వాజా.. ఏదో వూరికే అడిగాను. "

"నువ్వడిగావని కాదు మనోజ్ఞా, ఇక ఎప్పటికైనా నీకు తెలియాల్సినవీ వివరాలు.."

ఆశ్చర్యంగా, సంతోషంతో మెరిసే కళ్ళతో , "ఐతే చెప్పండి వింటాను", అంది బుద్ధిగా చేతులు కట్టుకుని అతని వైపు చూస్తూ. చిన్నగా నవ్వాడా గెస్చర్ కి.

"ఇది మా వూరి, వేణుగోపాలస్వామి గుడి. కొన్నివేల ఏళ్ళ క్రితంది. మా పూర్వీకులు ఇన్హెరిట్ చేసుకున్నారు ఈ గుడి ధర్మ కర్తృత్వం."

"అంటే... పూజారీ వాళ్ళూనా.?"

"నీ తెలుగు నాలెడ్జ్ కి దణ్ణం. గాడ్ సేవ్ మీ.. మా తాతలీ గుడికి ధర్మకర్తలు తల్లీ.. అంటే లెగసీ.. కమ్ కేర్ టేకర్స్ అనుకో అర్థమైందా?"

"ఓ.కే. ఓ.కే.. ఐతే..."

"మా పూర్వీకుల హయాంవచ్చేసరికి వాళ్ళ నిర్లక్ష్యం వల్ల గుడి పాడుబడే స్థితికి వచ్చింది. బాగుచేయాల్సిన పరిస్థితి. దాంతో బాధ్యత నీదంటే నీదని కొట్టుకుని, చివరికి గుళ్ళోనే పొడుచుకుని కోర్టులకెక్కారు. గవర్నమెంటువారు అంతకంటే బద్ధకంగా ఓ ఇంక్వైరీ పడేసి, గుడి సీల్ చేసేసారు. చాలా రోజులు పోరాడుకుని, చివరికి ఆ పూర్వీకులు పోయారు. కేసు తేలినా, తాతలు హేతువాదులు దాంతో. సో గుడి సమస్య తరువాత, ఊరి సమస్యలు ముందు అనుకున్నారు. గుడి బాగు మూలన పడింది. తాతలకి వారసులు ఆడపిల్లలే, పెద్దమ్మ. అంటే కేశవన్న వాళ్ళ అమ్మ., ఇక మా అమ్మ ఎందుకంటే మావయ్య పోయాడు కదా. దాంతో మాకు వచ్చిందా రెండో వాటా. మా నాన్న రాజకీయాల్లో బిజీ. కేశవన్న వాళ్ళ నాన్న మినిస్టరే కానీ పక్కా బిజినెస్ మైండెడ్. ఇలాంటివన్నీ ఇంట్రెస్ట్ లేదాయనకి. తరవాత మా టైమ్ అంటే నేను.. కేశవన్నా... ఇద్దరు తాతలకీ కలిపి మేమే వారసులం. ఊరి వాళ్ళ రిక్వెస్ట్ లతో గుడి రిపేర్ చేసే బాధ్యత మేము తీసుకున్నాము. సరిగ్గా

రిపేరు మొదలు పెట్టాకా కొన్ని తాళ పత్రాల టైప్ లో బయటపడ్డాయి. అది చూసి కుతూహలంతో అందులో వున్న వివరాలనిబట్టీ తవ్వించాము. అక్కడ మాకో నిధి దొరికింది.." ఆగాడు.

"అనంత పద్మనాభస్వామి టెంపుల్ లాగానా.. ట్రెజర్సా..?" ఉద్విగ్నంగా అడిగింది.

తలూపాడు., "ఊహించలేనంత వెల్తది మనూ.. దాదాపుగా ఓ రాష్ట్రానికి నాలుగు సార్ల బడ్జట్ కేటాయింపుల కంటే ఎక్కువే వుంటుంది అక్కడి సంపద. హోల్ లాట్ ఆఫ్ వెల్త్. కలలో కూడా చూడని మాన్యమది.ఆనాటి కాయిన్సైతే ఏమయ్యేదో గానీ లక్కీగా చాలా వరకూ బంగారం, రత్నాలు, వెండి, వజ్రాలు గానే వుంది.."

"గాడ్.. నిజమా.. కథలు చెప్తున్నారా... ప్రామిస్..?"

నవ్వాడు "నిజమే. ఒట్టు..."

"మరైతే టీ.వీ.ల్లో, పేపర్లలో, ఎక్కడా.." అంటూ ఆగింది "వెయిట్.. ఐ గాట్ ఇట్. అంటే.. మీరు బయటపెట్టలేదు అంతే కదా. అందేంటి భరద్వాజా.. ఎందుకలా..?"

"చూస్తూ చూస్తూ అంత డబ్బు ఎవడొదులుకుంటాడు మనూ.." ఆమె ముఖం చూస్తూ అడిగాడు.

చిన్నగా నవ్వింది, "పట్టికెళ్ళి మీ కాన్స్టిట్యుయన్సీలో జనం చెవుల్లో పెట్టండి కాలీఫ్లవర్స్.. బాగుంటాయి. రీజన్ లేకుండా మీరేదీ చెయ్యరు. ఇంతకీ కారణం ఏంటి?"

తృప్తిగా చూసాడామె వైపు. తన నమ్మకం ఎప్పుడూ తప్పలేదామె విషయంలో. తనని అర్ధంచేసుకోవడంలో పూర్తి నిజాయితీ వుందామెలో.

"గుడి బాగు కోసం, కరువుకాటకాల్లో ప్రజల సంరక్షణ కోసం ఏనాడో పూర్వీకులు ఏర్పాటు చేసిన ఖజానా అది. దాన్నిప్పుడు, వారసులమంటూ కబ్జా చేయనూలేము, అలాగని ప్రభుత్వానికి అప్పజెప్పామా న్యాయమూ జరగదు. "

"అదేంటి భరద్వాజా.. మీరుండగా..."

"నీకిదివరకే చెప్పాను కదా మనోజ్ఞా, డబ్బు-పదవి ముందు ఏవీ పనికి రావు. అందుకే నేనూ, కేశవా ఓ నిర్ణయానికొచ్చాం. ఆ డబ్బు తో మామయ్య ఆశ పడ్డ గ్రామోన్నతి సాధించవచ్చు. ప్రతి పల్లెనీ సెల్ఫ్ సఫీషియంట్ చేయాలి. ఎవరి మీదా ఆధారపడకుండా పల్లెనుండి వచ్చే రెవెన్యూ పల్లెకే చెందేలా వుండాలి. అలాంటి ప్రాజెక్టులు రావాలి. అంతేకానీ డెవలప్ మెంట్ మొత్తం సిటీలో చేసేసి పల్లెలు మన పట్టుకొమ్మలంటూ ఉపాన్యాసాలివ్వడం వేస్ట్. అగ్రికల్చర్ కి పూర్తి సపోర్ట్ ఇవ్వాలి. ఇంకా చాలా వున్నాయి. మొత్తం మొదటి విడత లాటరీ లో నూట పన్నెండు వెనకబడిన గ్రామాలు వచ్చాయి అదీ మన రాష్ట్రంలోనే.

"యూ మీన్ 112 విలేజెస్... మై గుడ్ నెస్.. అంత డబ్బుందా?" అమాయకంగా అడిగింది.

"నాలుగు రాష్ట్రాలకి సరిపడ వుంది. అందులో పదోవంతు కేశవ జాగ్రత్త గా కన్వర్ట్ చేసాడు. యూనో మేమూహించినదానికంటే పది రెట్లు ఎక్కువ వచ్చింది. సైలెంట్ గా కొన్నివూళ్ళలో పని మొదలుపెట్టాం. ఇదంతా చాపకిందనీరులా జరగాలి, ఏమాత్రం బైటకి వచ్చినా మొత్తం డబ్బు దొంగలపాలైపోతుంది. అలా జరక్కూడదు. చాలా నమ్మకమైన పది మందిని పూర్తిగా వెరిఫై చేసి కూడగట్టుకున్నాం. ఇక ముందుకు సాగాలి.."

"స్ప్లెండిడ్ భరద్వాజా.. నిజం గా నమ్మలేకపోతున్నాను, మన స్టేట్ కి కూడా కాస్త మంచి జరగబోతోందంటే. కానీ మీరు ఛూజ్ చేసుకున్నాళ్ళు నమ్మకస్థులని గ్యారెంటీ ఎలా?"

"నమ్మాలి మనూ.. దేవుడిచ్చిది మాకు చాలావుంది. మాకే ఖజానాలూ వద్దు. సో మేమిద్దరం రెడీ. కానీ అందరూ మాలా ఆలోచించరుకదా. జాగ్రత్తగా చూసి ఇంచుమించు అలాంటి వాళ్ళనే ఎన్నుకున్నాము. పైన తీసుకున్నముగ్గురికీ నాలుగుతరాలకి సరిపడా ఆస్తులు సమకూర్చాం. సో దట్ ప్రజల డబ్బుకోసం కక్కుర్తి పడకుండా. "

"ఇంత పెద్ద పని సైలెంట్ గా ఎలా చేస్తారు భరద్వాజా? డబ్బెక్కడిదన్న ప్రశ్న అడుగడుగునా వస్తుంది కదా.. "

"అదే మెయిన్ టాస్క్.. కేశవన్న చాలా ధనవంతుడు. ముందుగా అతని తరఫున ఛారిటీలా కొన్ని గ్రామాలని దత్తత తీసుకుని డెవలప్ చేసినట్టు., తరవాత వేరే కొందరి నుంచి పేరు వస్తుంది కాణీ ఖర్చులేకుండా అంటే ముందుకొచ్చేవాళ్ళు చాలామందే వుంటారు. సో వాళ్ళకి మొత్తం స్టోరీ తెలియనక్కరలేదు. మా పదిమందికి తెలుసు.. అది చాలు. అసలంటూ మొదలైందిగా, చూద్దాం.. పోనుపోను ఎలా చేయగలమో..."

"గ్రేట్ జాబ్.. వింటేనే థ్రిల్లింగ్ గా వుంది. హెడ్ ఆఫ్ ఆపరేషన్ మీరేగా?"

"కాదు కేశవే హెడ్. నాన్న కొంతవరకూ గైడ్ చేస్తారు, జతిన్ ముఖ్య సలహాదారు. పాణి వర్క్ సూపర్ విజన్. నేను జస్ట్ సెక్యూరిటీని ...అంతే..."

"ఆహా చెప్పకండి. మొత్తం పిక్చర్ డైరెక్టర్ అని తెలుస్తూనే వుంది. అవునూ.. అంతా మీ వాళ్ళే వున్నారా? "

"ఐదుగురం మేము.. ఇంకా ఒక కంసాలి, మేస్త్రి, ఇంజనీర్, ప్లస్ పాయల్ భాభీ... "

"..మరి స్నిగ్ధగారు, మురళి గారూ."

"ఫ్యామిలీ ఫంక్షన్ కి పిలుస్తున్నాననుకున్నావా? మా అమ్మకి కూడా తెలియదిదంతా.. "

"సారీ... "

"నెవర్ మైండ్.. కాస్త కన్విక్షన్ వున్నవాళ్ళనే తీసుకున్నాం. అంటే వేరేవాళ్ళకి లేదని కించపరచట్లేదూ.. నా వుద్దేశ్యం అది కాదుకూడా. ఎక్కడా నోరుజారి లీక్ చేసే తత్వం వుండకూడదు. దాంతోపాటు అక్కడుండి చేసే ఓపిక.. దానిమీద ఆలోచించే కోరిక.. అమలుపరిచే నేర్పు.. అదో యజ్ఞం. సో పూర్తయ్యేలోపు వెనుదిరగకూడదు.."

"కేశవ గారే ఎందుకు హెడ్.. మీరెందుకు?" ఆమె పూర్తి చేసే లోపే చెప్పాడు.

"మూడు కారణాలున్నాయి. మొదటిది. తను అక్కడేవుండి అంతా పర్యవేక్షిస్తాడు. రెండవది, కేశవ పిల్లలుగలవాడు. ఈ యజ్ఞం ఆగకూడదంటే దీనికి వారసత్వం ముఖ్యం. ఎవరో బయటివాళ్ళకి మనమెన్ని కబుర్లు చెప్పినా వేరు. మన పిల్లల దారి వేరు. ఏదైనా సరే బాల్యంలో వేసిన బీజమే, చెట్టై ఎదుగుతుంది మనూ. సో ఆశయాలని ముందుకు నడిపించే వారసులు అతనికున్నారు. నావంశంలో నేనొక్కడినే. నాకు పెళ్ళీ కాలేదు. పిల్లలూ లేరు. సో.. ముందునుంచీ హెడ్ ఎవరో వారి మాటే చెల్లుబాటౌతుంది. కేశవన్న నిజాయితీకి మారుపేరు. పెదనాన్న చనిపోయినప్పుడు పదవి వచ్చినా అడ్డదారులు తొక్కాల్సి వస్తుందని రాజకీయాలనే కాదనుకున్న వ్యక్తి. అంతకంటే మంచివాడు దొరకడు. ఏమిటాలోచిస్తున్నావ్?"

"దూరంగా వున్నవాడే అంత మంచివాడైతే... అందులో దిగి కూడా వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోని వారెంత మంచివారా అనీ..."

చిన్నగా నవ్వాడు. "అర్థమైంది.. థ్యాంక్స్ ఫర్ సేయింగ్ సో..."

"ఇంతకీ ఇదంతా నాకెందుకు చెప్తున్నారు."

"తెలుసుకో మనూ.. తెలుసుకుంటే తప్పులేదుగా.. "

"ఓ.. ఇన్ఫర్మేషన్ కోసమా.. నేనింకా వేరే అనుకున్నానులెండి." అల్లరిగా అంది.

"వేరేదేంటి? ఏమనుకున్నావ్?"

"వారసుల్లేరూ... లేరూ.. అంటుంటే.. త్వరగా ఇమ్మంటున్నారేమోననీ." సిగ్గుగా నవ్వేసింది.

ఆశ్చర్యంగా తలెత్తాడు, "ఏమన్నావ్?"

"ఏంలేదు.. వెళ్దాం పదండి. ఆకలేస్తోంది..."

ఆమె చెయ్యిపట్టి కూర్చోబెడుతూ అన్నాడు, "ఏంటీ వెళ్ళిపోతున్నావ్? ఏదో అనేసి.. ఏం ధైర్యం నీకైనా.. ఐనా అనుకోగానే పుట్టేస్తారా.. అది కూడా నాకు ఈ ఏజ్ లో..."

"అఫ్కోర్స్ ఎన్ని సినిమాల్లో చూడలేదు."

"ఏం చూశావేంటి..?"అనుమానంగా అడిగాడు.

"ఛ.. మీరూ...ఓ వర్షం కురిసిన రాత్రి... హీరో-హీరోయిన్ని కాపాడతాడు.. పెద్ద పిడుగు... కట్ చేస్తే... ఓ ఇరవై ఏళ్ళతరవాత హీరో టూ వాళ్ళని కలుపుతాడు.. హా.. హా... కాస్త మార్పులతో ఎన్ని సినిమాలొచ్చుంటాయి ఈ కాన్సెప్ట్ తో" నవ్వేసింది.

నవ్వాడు "ఐతే..."

"ఐతే మళ్ళీ వర్షం పడకపోతుందా అనీ."

"ఏంటీ...?"

"లేదూ... ఇప్పుడే నాకో డౌట్ ఫ్లాషైంది. అదే ఆలోచిస్తున్నాను.."

"ఏంటి చెప్పు.. వర్షం ఎప్పుడు పడుతుందనేనా?" నవ్వుతూ అడిగాడు.

"లేదూ.. ఒక వర్జిన్ తో, కేవలం ఒక్క వర్షం రాత్రి కే హీరో టూ ఎలా వచ్చేస్తాడా అనీ... స్స..." భరద్వాజ పకపకా నవ్వడంతో ఆగిపోయి చిన్నగా తల కొట్టుకుంది. "సారీ... ఐ డిన్ట్ మీన్ టూ సే.. " సిగ్గుపడింది.

"మై... గాడ్... నాకూ కరెక్ట్ గా తెలీదు. తెలుసుకోవాలంటే కాస్త కో-ఆపరేషన్ కావాలేమో." నవ్వాపుకుంటూ చెప్పాడు.

"మీరూ... పదండి వెళ్దాం."

"ఓహ్.. ఇంత కోఆపరేషనా.. గ్రేట్.. పద మరీ"

"ఏయ్.. అందుక్కాదు. బ్రేక్ఫాస్ట్ కి."

"నేను చెప్పిందీ బ్రేక్.. ఫాస్ట్ గురించే" నవ్వాడు అర్థవంతంగా.

"గాడ్ యూ ఆర్ ఇంపాసిబుల్." అతన్నే ఇమిటేట్ చేస్తూ చెప్పింది.

ఒక్కసారిగా నవ్వేసారిద్దరూ.

"ఔనూ..ఇంతకీ మూడో కారణం ఏంటి?"

"వెల్.. చెప్తే ఫీలవుతావ్.. "

"లేదు.. చెప్పండి.. "

"నా మీద ఇప్పటికే రెండుసార్లు అటాక్స్ జరిగాయి. సో.. నాకన్నా సేఫ్ జోన్ ఐతే కేశవే కదా. ఏ రోజు ఛస్తానో తెలీని నాకంటే " మాట పూర్తయ్యేలోపు తాకిందతని చెంపకి ఆమె చెయ్యి ఛెళ్ళు మంటూ.

"జస్ట్.. షటప్.. భరద్వాజా..షటప్.. హౌ కుడ్ యూ సే దట్? "ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"సారీ..." అంటూ అయోమయంగా ఆమె వైపు చూస్తూ అప్రయత్నంగా చెంప తడుముకున్నాడు. తననామె కొట్టిందన్న విషయం అప్పటికర్థమై చప్పున చుట్టూ చూశాడు. ఎవ్వరూ లేరు.

అంతలో తేరుకుందామె. తనేం చేసిందో రియలైజ్ అయ్యి అదిరిపడింది. "గాడ్.. నేను.. నేను.. అయామ్ సో సారీ.. అస్సలనుకోలేదు.. మీరలా అనేసరికి కోపంలో.. నిజంగా .. చాలా.. చాలా తప్పు చేసేశాను.. క్షమించండి భరద్వాజా.. రియల్లీ..వెరీ సారీ.." వణికిపోయింది భయంతో, బాధతో.

ఒక్కసారిగా పకాల్న నవ్వేశాడు, "ఇట్స్.. ఓ.కే.. మై గాడ్.. షాక్ ఆఫ్ లైఫ్.. మనూ.. చూడ్డానికంత సన్నగా వున్నావ్. బానే కొట్టావే. ఏం తింటుంటావేంటి?"

"అయ్యో.. రియల్లీ సారీ .. గట్టిగా తగిలిందా?"అతని చెంపని బెరుగ్గా స్పృశిస్తూ అంది.

నవ్వాడు. "ఏంటీ.. ఆరోజు కొట్టానని.. పగకి పగ టైప్ లో..."

"అయ్యో నిజం భరద్వాజా. ఒట్టు.. అదేంలేదు. సారీ.. మీరు చనువిచ్చారు కదా అని మరీ నెత్తెక్కేశాను. అనుకుని చేసిన పని కాదు. నమ్మండి.. రియల్లీ వెరీ.."

"ష్... జోక్ తల్లీ.. ఇక వదిలెయ్.."

"మీరు నన్ను క్షమించారా?"

"నీ మొహం.. ఇప్పుడేమైందనీ... ఐనా అంతంత పెద్ద మాటలు నీకు సూటవ్వవు గానీ నడు.. వెళ్దాం.." అంటూ లేచాడు. దిగులుగా చూసింది.

"ఆ కళ్ళు తుడుచుకో ముందు. ఏమో అనుకున్నాగానీ. నీక్కోపం కాస్త ఎక్కువే. ఇదుగో ఇప్పుడే చెప్తున్నా మళ్ళీ మళ్ళీ అంటే మాత్రం కుదరదూ.. నావల్ల కాదు తల్లీ " వెక్కిరింతగా అన్నాడు.

"ఛ.. వెరీ సారీ... ఇప్పటికే చాలా గిల్టీగా.. ఇంకెప్పుడూ జీవితంలో అలా జరగదు.. సారీ.. "

"ఆ సారీల దండకం ఆపేస్తావా.. నేనెళ్ళిపోనా?"సీరియస్ గా అడిగాడు.

"ఓ.కే.. పదండి..." ఇబ్బందిగా లేచింది.

లేచి నడుస్తుంటే హఠాత్తుగా గట్టిగా నవ్వేసాడు.

అశ్చర్యంగా చూస్తూ అడిగింది, "ఏమైందీ? "

నవ్వాపుకుంటూ చెప్పాడు, "నాకు పన్నెండేళ్ళున్నప్పుడనుకుంటాను. స్కూలెగ్గొట్టి సినిమాకెళ్తేనో లేక ఏదో చేస్తే. నాన్న కొట్టారు. అదే మొదటిదీ – చివరిదీ... ఆ తర్వాత.. ఇదో.. ఇప్పుడే.." నవ్వసాగాడు.

గిల్టీగా తలొంచుకుంది, అంతలో తలెత్తి, "నిజంగా చాలా గిల్టీగా వుంది కానీ.. ఎట్ ది సేమ్ టైమ్.. ఇది విన్నాకా మాత్రం గర్వంగా వుంది... ది గ్రేట్ జే.కే. గార్ని కొట్టి బతికిపోవడం అంటే.. సంథింగ్ సెన్సేషనలే కదూ.."

"ఈమధ్య అలాంటి గ్యారంటీలేమీ లేవు తల్లీ. అసెంబ్లీలో ఎప్పుడు ఎవడు వాయిస్తాడో తెలీదు, పబ్లిక్ మీటింగ్స్ లో ఏ చెప్పు దెబ్బలు పడతాయో తెలీదు. చాలా మందికే సత్కారాలయ్యాయి. ఏదో దేవుడి దయవల్ల ఇప్పటి దాకా బతికిపోయానుగానీ.. కాన్ట్ సే..." నవ్వాడు.

"కానీ.. నా చేతి దెబ్బ తిన్నారుగా." అల్లరిగా అంది మామూలైపోతూ.

"ఛ.. వాళ్ళతో నీకు పోలికేంటీ.. నువ్వెప్పుడూ అంటావే.. అయాం ఆనర్డ్ అనీ. ఇప్పుడు నాటర్న్. అయాం ఆనర్డ్ టూ మిస్.."

గిల్టీగా తలొంచుకుంది. చిన్నగా నవ్వి ఆమె భుజం చుట్టూ చేయి వేసి నడిపిస్తూ అన్నాడు, "ఏం ఫీలవకు.. అందరికీ జే.కే.నే గానీ.. నీ వరకూ భరద్వాజనే కదా. ఎప్పుడూ చెప్పేదే ఇప్పుడూ చెప్తున్నా. యూ కేన్ బీ లైక్ ఎ ఫ్రీ బర్డ్ విత్ మీ.. ఏం చెయ్యాలన్నా ఏం అనాలన్నా ఆలోచించకుండా ఇలాగే వుండు. ఎప్పటికీ సరేనా..!!?"

తలూపింది మంత్రముగ్ధురాలిలా చూస్తూ. క్షణం తర్వాత నెమ్మది గా అంది, "ఇట్స్ ఎ ప్రివిలేజ్ భరద్వాజా.. చాలామందికి దక్కనిది.. మీరు నాకిచ్చారు. నిజంగా నే.. నేను చాలా.. చాలా లక్కీ.. టూ.. లక్కీ టూ హేవ్ యూ ఇన్ మై లైఫ్.. అయామ్.. " పూర్తి చేయలేక ఆపేసింది. చిన్నగా నవ్వి అర్థమైనట్టు తలూపి ఆమె నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు.

"జతిన్...!!

ఏంట్రా.. వారం రోజులకోసారి ఫోన్లో మాట్లాడుతూ కూడా మళ్ళీ ఈ వుత్తరం ఏంటని చూస్తున్నావా. కొన్ని విషయాలని మాటలకన్నా అక్షరాలే బాగా కన్వే చేస్తాయని నువ్వే అనేవాడివి కదరా. మన మౌనాన్ని కూడా వినగలిగినవాడు నిజమైన స్నేహితుడట.'అలా నా మనసుకి దగ్గరైనవాడివి నువ్వే. కానీ నీలాంటి ఫ్రెండ్ తో కూడా షేర్ చేసుకోలేని కొన్ని పేజీలు నా లైఫ్ బుక్ లో వున్నాయని అనేవాణ్ణి గుర్తుందా? కానీ వాటిని సైతం షేర్ చేసుకోగలిగే ఓ తోడు నాకు దొరికిందటే నమ్ముతావా. అంతటి ఆలంబన నాకిచ్చినది ఓ అమ్మాయంటే. అందులోనూ నాకంటే 22 సంవత్సరాలు చిన్నదీ.. అంటే అసలు నువ్వు నమ్మగలవా..?

అవున్రా.. మనోజ్ఞ పరిచయం ఓ అద్భుతం..

ఎలా చెప్పను జతిన్..!

తన ఆలోచనల తాకిడికి నన్ను నేను కోల్పోతున్నానని చెప్పాలంటే ఒకవైపు చాలా ఆక్వర్డ్ గా, గిల్టీగా, మరోవైపు గర్వంగా, ఆనందంగా వుంది నాకు.

నాకెప్పుడూ అర్థం అయ్యేది కాదు మిమ్మల్నందర్నీ చూస్తే – ఈ ప్రేమంటే ఏమిటా అనుకునేవాడ్ని.. తెలిసేది. ఐనా ఏదో కన్ఫ్యూజన్. గుర్తుందా జతిన్, నిరుపమకి నయమయ్యాకా మనం మీ ఇంటి డాబా మీద ఒకసారి మాట్లాడుకున్నాం.. ఆరోజు నేను నిన్నడిగాను, ప్రేమంటే ఏమిట్రా?'అని.నువ్వు నవ్వావు.

"నిన్నటి వరకూ ఎవరో తెలియని మనిషి, ఒక్క క్షణం లో నీ ప్రపంచం అయిపోవడమే ప్రేమంటే" అని చెప్పావు. ప్రేమ గురించి ఎంతో చదివాను, ఎన్నో విన్నాను. కానీ అంత అందంగా, అద్భుతంగా, సూటిగా ఎవరూ చెప్పలేదురా.

చాలామంది కాకపోయినా నాలైఫ్ లోకీ కొందరు వచ్చి, పోయారు. నీకూ తెలుసుగా. కానీ వాళ్ళెవరితోనూ ఇలా కాలేదురా. నిన్నూ–నిరుపమనీ, కేశవన్నా–పాయల్ వదినలనీ చూసినప్పుడూ, మొదట్లో కాస్త నవ్వొచ్చేది. తర్వాత్తర్వాత

కాస్త మెచ్యూరిటీ వచ్చాకా నా భావన తప్పని తెలుసుకున్నాను. ప్రేమ కోసం నువ్వు పడ్డ యాతన, ఆరాటం చూసాకా అనిపించింది మే బీ... ప్రేమంటే ఎంతో గొప్ప ఫీలింగ్ ఏమో అని అనుకున్నాను. కానీ చాలా వున్నతంగా ప్రేమించుకుని, జీవితంలో అడ్జస్ట్ అవలేక బాధపడే జంటల్ని చూసినప్పుడు మాత్రం హోస్లే నయం.. నాకీ ప్రేమా తెలీదు, ఆ బాధా తెలీదని ' హాయిగా నిట్టూర్చేవాణ్ణి.

కానీ, జీవితపు ఈ టర్నింగ్ లో, టీనేజ్ లో కాదు, కాలేజ్ లో కాదు, యంగేజ్ లోనూ, కనీసం మిడిల్ ఏజ్ లోనూ కాదు. ఓల్డేజ్ మొదటి మెట్టు ఎక్కుతుంటే ఇప్పుడు సడెన్ గా ఎదురైందిరా జీవితంలో నాకేనాడూ తెలియని ప్రేమ మనోజ్ఞ రూపంలో.

పైకి మిమ్మల్నెంతగా సపోర్ట్ చేసినా, కనీసం భాషేంటో తెలీకుండా వాళ్ళూ, కుటుంబ పరిస్థితులు తెలిసీ మీరూ.. అంతమాత్రం ఆలోచించకుండా ఎలా ప్రేమించారా అని అప్పుడప్పుడూ అనుకునేవాణ్ణి. అలా అనుకున్నందుకు క్షమించరా! బహుశా అందుకేనేమో ఈ రోజు ఆ పైవాడు నన్నిలా టెస్ట్ చేస్తున్నాడు. రోజుకి వందసార్లు నా వయసునీ, పరిస్థితుల్నీ గుర్తు చేసుకుంటాను. నాకు నేను నచ్చజెప్పుకుంటాను. కానీ, ఆమెకి దూరంగా క్షణం వుండడం కూడా అసాధ్యమైపోతోంది. ఇది ఆకర్షణా, ప్రేమా, వాంఛా, లేక వ్యామోహమా అని నన్నునేను ఎన్నోసార్లు ప్రశ్నించుకున్నాను. ఐనా ఇవన్నీ తను కనిపించేవరకే. ఒక్కసారి ఆమె నా ముందుకి రాగానే జే.కే. వుండడక్కడ

**మనోజ్ఞని** ఆరాధించే ఓ ప్రేమికుడే వుంటాడు. భరద్వాజే వుంటాడు. ఓహ్ చెప్పలేదు కదూ... షీ కాల్స్ మీ భరద్వాజ.. ఆశ్చర్యంగా వుందా జతిన్. అంత దగ్గరగా రానిచ్చానంటే నమ్మబుద్ధికావట్లేదు కదూ.

ఆమె ఆలోచనల ఒరవడిలో కొట్టుకుపోతూ నా ఆధారం కూడా ఆమె ఊహే, ఆమె తలపే అయిపోయి.. తలమునకలైనంత అవస్థలో వున్నాను. ప్రేమిస్తే కవిత్వం వస్తుందా అనేవాణ్ణి, ఆఖరుకి నాక్కూడా వచ్చేసింది... చూశావా..? తన చిరుస్పర్శకి సైతం చలించిపోయేలా వున్న నన్ను చూస్కుంటే నాకే వింతగా వుంది. నువ్వు చూసుంటే ఇంకెంత ఆశ్చర్యపోయేవాడివో.

తననే చూస్తూ, ఆమె మాటలే వింటూ అలా జీవితాంతం గడిపెయ్యాలని అనిపిస్తోంది. ఇది పిచ్చో, ప్రేమో ఏమీ అర్థం కావట్లేదు. ఏం చెయ్యాలో తెలీనిస్థితిలో వున్నాను. ఒక్కపని చెయ్యాలన్నా, అన్నీ ఆలోచించి చూసుకుని చేసేవాడ్ని. కానీ ఇప్పుడు, ఎవరూ పట్టకుండా, ఏమీ పట్టించుకోకుండా.. మనూయే లోకంగా తిరుగుతున్నాను. తను వ్యక్తం చేస్తున్న ప్రేమనీ, చూపిస్తున్న అభిమానాన్ని ఒప్పుకోనూ లేను. అలాగని తప్పుకోనూ లేను, ఎవరికీ చెప్పుకోనూ లేక నరకం చూస్తున్నాను. ఐనా తనతో గడిపే ఆ క్షణాలు తెలియని హాయినే ఇస్తున్నాయి. మెడమీద కత్తిలాంటి సమస్యలు కూడా ఆమె సాన్నిధ్యంలో, సామీప్యంలో మర్చిపోగలుగుతున్నాను.

ఇదంతా ప్రేమే కదా జతిన్..! నీకూ నిరుపమ కీ ఇలాగే జరిగిందా..? ఈ వయసులో ఓ చిన్నపిల్లని భ్రమింపజేసి నా వెంట తిప్పుకుంటున్నానేమో అని భయం, తనని వదిలి బతికేదెలా.. అనే బాధ.. ఈ రెండూ నన్ను రెండువైపులా పదునున్న రంపంలా నా మనసుని కోసేస్తున్నాయి.

'నా ప్రాణం మీరే, నా లోకం మీరే.. 'అని తను అంటుంటే ప్రపంచాన్నే గెలిచినంత ఆనందంగా గర్వంగా వుంది. తన కళ్ళలో నా మీద వున్న ఆరాధన, ప్రేమ చూసి.. నన్ను నేను ఎంత నిగ్రహించుకున్నా వల్లకాక, ఆగలేక, బయటపడిపోయాను. దాంతో తను నాకు మరింత దగ్గరైపోయింది. అతి కష్టంమీద తమాయించుకుని వయసు తేడా గురించీ, ఫ్యూచర్లో వచ్చే బాధల గురించి చెప్పాలని చూసినా నేను మీకంటే చిన్నదాన్నే గానీ, చిన్నపిల్లనైతే కాదు నా డెసిషన్ నాకు తెలుసంటుంది. పాపం ఆ పిచ్చిపిల్ల నా నుంచి అసలు దూరం కాలేకపోతోంది. కానీ ఎలా చెప్పను. నాదీ అదే భావన అనీ, ఇండైరెక్ట్ గా ఎంకరేజ్ చేసి తప్పుచేస్తున్నానా.. లేక.. కాన్ట్ సే జతిన్. తనని దూరం చేసుకోనివ్వని స్వార్థం నన్ను పూర్తిగా ఆక్రమించుకుంటోంది. ఇది స్వార్థమో, ప్రేమో, ..., మరేమో..., దీనంటినీ దాటి వెళ్ళిపోవడం ఈవెన్ నాతరం కూడా కావట్లేదు.

అంతర్మధనమే అంటారో లేక ఆత్మ సంఘర్షణే అంటారో నాకు తెలీదు గానీ, నా మనసుతో జరిగే ఈ సంఘర్షణని నేను గెలవగలిగితే, మా ప్రేమ నా భయాన్ని జయిస్తే, నీకన్నా సగం వయసున్న నీ 'భాభీ 'ని నీకు పరిచయం చేస్తాను. నువ్వంటావు చూడు, "వో మేరీ పూరీ జిందగీ పే ఛాగయీ" అని. దట్స్ వాట్ ఈజ్ హాపెనింగ్ టూ మీ మై ఫ్రెండ్. అయామ్ ట్రూలీ, మాడ్లీ, డీప్లీ ఇన్ లవ్ విత్ హర్. అర్థం చేసుకోగలవు కదూ..!

ఒకవేళ ఓడిపోతే మాత్రం నా ఈ జీవితం పూర్తిగా శూన్యం జతిన్. ఎందుకంటే,

"నిన్నటి వరకూ ఎవరో తెలియని 'మనోజ్ఞ 'ఒక్క క్షణం లో నా ప్రపంచం అయిపోయింది."

– జే.కే.

మెయిల్ సెంట్ సక్సెస్ఫుల్లీ... అన్న అక్షరాలు స్క్రీన్ మీద మెరుస్తున్నాయి. ఛైర్లో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు భరద్వాజ.

చాలా పెద్ద భారం దించుకున్న ఫీలింగ్. జతిన్ తో తన మనసులో విషయాలని షేర్ చేసుకోగానే చాలా హాయి గా అనిపించింది. మే బీ ఇన్నేళ్ళ లో ఇంత ఓపెన్ గా తాను డిస్కస్ చేసిన విషయం ఇదేనేమో. మనోజ్ఞ తో ఈ విషయం ఎంత మాట్లాడినా గిల్టీగా అనిపించేది. ఇంకెవరిని చూసినా తనని తప్పుపడుతున్నారేమో అనే భావనుండేది. జతిన్ గురించి తెలుసు. కుండబద్దలు కొట్టినట్టు ముఖం మీద నిజమే చెపుతాడు. మే బీ తన డెసిషన్ రైటో,రాంగో చెప్పగల ఏకైక వ్యక్తి వాడేనేమో... పాణి, స్నిగ్ధ, మురళి, అమ్మ, నాన్న... ఊహు.. ఎవరితో చెప్పినా ఏదో ఒక చోట బయాస్డ్ గా ఆలోచిస్తారనే

ఫీలింగ్ వుంటుంది. వాడేమన్నా ఎలాగూ తన డెసిషనే ఫైనల్ .. కానీ ఇదో కన్ఫెషన్ లాంటిది.. తన మనసులోని కల్లోలాన్ని కడిగి పునీతం చేసే ప్రక్షాళన.

పార్క్ అంతా గోల గోలగా వుంది. అప్పటిదాకా పిల్లలతో చేరి ఆడుతున్న సంజయ్, ఆనంద్ లు అలసటగా వచ్చి కూలబడ్డారు. మనోజ్ఞ నవ్వుతూ వాటర్ బాటిల్ అందించింది.

"ఏంటీ.. జే.కే. సర్ వస్తారని చెప్పావ్. ఇంకా రాలేదు. ఆయన టైమంటే టైమేనని ఓ తెగ మోస్తావ్ కదా.. ఏరి మేడమ్ మీ అసెంబ్లీ రౌడీ.....?"వెక్కిరింతగా అడిగాడు సంజయ్.

"ఏయ్", కోపంగా చెయ్యెత్తింది.

"ష్.. అదుగో ఆయనొచ్చారు.. మీరు నోళ్ళు మూయండి.."కంగారుగా చెప్పింది నవ్య.

"ఎలా వున్నారూ.. ?"భరద్వాజ చిరునవ్వుతో అందర్నీ పలకరించాడు బెంచ్ మీద కూర్చుంటూ.

"బాగున్నాం సర్" కోరస్ లా చెప్పారంతా.

"హలో ఆనంద్. మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే.. అయాం హియర్ టూడే యాజ్ ప్రామిస్డ్.." నవ్వుతూ చేతి లో వున్న గిఫ్ట్ ప్యాకెట్ ఆనంద్ కి అందించి షేక్ హాండ్ ఇచ్చాడు.

"థ్యాంక్యూ సో మచ్ సర్.. మీరు రారేమో అని భయపడ్డాను.."

"చెప్పానుగా.. ఇక్కడుంటే తప్పక వస్తాననీ.. "

"కానీ ఎక్కడో నాకే గిల్టీగా.. "

"కమాన్.. డోన్ట్ బ్రూడ్ ఓవర్ దట్.. ఇంతకీ ఆ గన్ ఏంటి చేతిలో.. "

ఇదా హుషారు గా నవ్వి, "వీడ్ని చంపడానికి.. ఆ పిల్లల దగ్గర తీస్కున్నాను", సంజయ్ ని చూపిస్తూ నవ్వాడు.

"ఓహ్.. థ్యాంక్స్ నన్నైతే కాదు కదా.. ఐనా బర్త్ డే కి నిజంగానే చిన్నపిల్లవాడివైపోయావే.." నవ్వాడు భరద్వాజ.

"ఆల్మోస్ట్... యూ నో సర్... ఇది చాలా బాగుంది. మంచి సౌండ్.. ఇట్స్ సో రియల్... నిజంగానే గన్ పేల్చినంత ఎఫెక్ట్ వస్తుంది.. కావాలంటే చూడండి... బోనస్ గా వీడ్ని చంపిన సాటిస్ఫాక్షన్ కూడా..." సీరియస్ గా ముఖం పెట్టి సంజయ్ కి గురిచూసి పేల్చాడు.

భరద్వాజ వారించేలోపే పెద్ద శబ్దం చేస్తూ పేలిందది. క్షణంలో భరద్వాజ సెక్యూరిటీ అతన్ని చుట్టుముట్టడం, వారిలో ఒక ఆఫీసర్ చేతిలోని గన్ ఆనంద్ నుదుటికానడం సెకన్లలో జరిగిపోయాయి. బిత్తరపోయారంతా.

"విశ్వనాథ్.. వెయిట్..", ముందుగా తేరుకున్న భరద్వాజ చప్పున చెప్పాడు. అంతలోనే ఆనంద్ చేతిలో గన్ పరిశీలించి అది బొమ్మదని గ్రహించి తన రివాల్వర్ దింపాడతను, "సారీ సర్.." అంటూ భరద్వాజకి చెప్పి ఆనంద్ వైపు తిరిగి "సారీ యంగ్ మాన్... పార్ట్ ఆఫ్ డ్యూటీ.. ఏమనుకోకండి.." చెప్పాడతను. షాకింగా చూస్తూ తలూపాడు ఆనంద్.

"యూ మే గో ఆఫీసర్స్.. ప్లీజ్ స్టే ఎట్ ది పార్కింగ్.. ఐ డోన్ట్ వాన్ట్ ఎనీ వన్ హియర్.." గంభీరంగా చెప్పాడు భరద్వాజ. దాంతో మరోసారి అపాలజైజ్ చేసి వచ్చినవాళ్ళు వచ్చినట్టు మాయమయ్యారు.

"అయాం రియల్లీ సారీ ఆనంద్.. నేను చెప్దామనుకున్నాను సౌండ్ రియల్ గా వస్తే మా వాళ్ళు వచ్చేస్తారని, అంతలోనే నువ్వు పేల్చేసావ్.. రియల్లీ సారీ.. నీ బర్త్ డే రోజున నా మూలంగా ఇలా జరిగినందుకు...."

"అయ్యో అదేం లేదు సర్. ఇదో డిఫ్రెంట్ ఎక్స్పీరియన్స్.. కాకపోతే.. నాకో డౌటూ ఒకవేళ మీరు గట్టిగా వెయిట్ అనకపోతే వాళ్ళు నన్ను కాల్చేసేవారా..?"తేరుకుని భయం నటిస్తూ అడిగాడు ఆనంద్.

పకాల్న నవ్వేసాడు భరద్వాజ, "నో... వెల్.. ఐనా... అది సిట్యుయేషన్ ని బట్టీ.. నేను బాగానే వున్నాను. మోరోవర్ నువ్వది సంజయ్ కి ఎయిమ్ చేసావు లక్కీగా. అదే నాకైతే ఐ డౌట్ ఇట్..."

"అమ్మో థ్యాంక్స్ చెప్పారు. ఏదో చనువు గా వున్నారు కదా కొద్దిగా ఎక్కువ ఓవర్ చేసుంటే.. బర్త్ డే కాస్తా డెత్ డే.. అయి.."

"నందూ.." మందలింపుగా ఆపారంతా.

"ఓకే., ఓకే... ఏమనను గానీ.. అసలు మీకు సెక్యూరిటీ వున్నట్టే కనిపించదు. వీళ్ళంతా ఎక్కడ్నించి వచ్చారు సర్.." ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎందుకుండదు.. మస్ట్ అది. కాకపోతే నా గోల పడలేక కాస్త దూరంలో వుంటారంతే. మన స్టేట్ హిట్ లిస్ట్ లో మొట్టమొదటి పేరు నాదే కదా.. సో.. తప్పదు." నవ్వాడు.

"ఎంత కూల్ గా చెప్తున్నారు సర్ మొదటి పేరని. ఏదో గెస్ట్ లిస్ట్ లో ఫస్ట్ నేమ్ అన్నట్టు. కానీ మీరు చూస్తే ఏ జాగ్రత్తలూ తీసుకున్నట్టు కనిపించరు. పైగా వీళ్ళ నంబర్ కూడా ఇంత తక్కువ వుందీ.. ?" సాలోచనగా అడిగాడు సంజయ్.

"వెల్.. ప్రొటోకాల్ పాటించడానికి, కొన్ని సందర్భాలలో క్రౌడ్ నుండి తప్పించుకోవడానికీ తప్ప నాకు వీటి మీద నమ్మకం లేదు. ఐనా కేవలం సెక్యూరిటీ పెంచుకోవడం వల్ల, చావుని తప్పించుకునైతే తిరగలేం కదా సంజయ్. ఇఫ్ ఇట్స్ డిస్టైన్డ్.. జరిగి తీరుతుంది..."

"భరద్వాజా.." చప్పున అంది మనోజ్ఞ.

"ఎస్.. మనూ... దట్స్ హండ్రడ్ పర్సంట్ ట్రూ.. నేనకపోవడంవల్ల ఆగిపోదది. తప్పదని రాసుంటే అది గార్డుల రూపంలోనే రావచ్చు ఇందిరా గాంధీలా.., లేక.."

"చాల్చాలు. మీ సెక్యూరిటీ ఆస్పెక్ట్స్, అభిప్రాయాలూ, మాకేం చెప్పొద్దు గానీ.. ముందీ జ్యూస్ తీసుకోండి." చిరుకోపంగా అంది అతని మాటలకి.

తేలిగ్గా నవ్వేసాడు, "ఓ.కే.. సారీ... నేనెందుకు మీ మూడ్ పాడుచెయ్యాలి గానీ.. ఔనూ... నీ పార్టీ పార్క్ లో ఏంటి ఆనంద్?"

"ఫర్ ఎ ఛేంజ్ సర్.. రెస్టారెంట్ అంటే కాస్త భయం వేసింది ఆ రోజుతో... కానీ ఇప్పుడు పార్కంటేనూ దడ పుట్టించారు మీ వాళ్ళు..."

"ఓహ్ ..అయాం రియల్లీ వెరీ సారీ ఫర్ దట్.."

"నో.. నో.. సర్... భలేవారే.. జస్ట్ కిడ్డింగ్.. ముందు స్నాక్స్ తీస్కోండి..."

కాసేపటికి కబుర్లలో పడ్డారంతా. డిన్నర్ కి కూర్చుంటుంటే మోగింది భరద్వాజ సెల్.

"వన్ సెకన్ ప్లీజ్.." అంటూ సెల్ ఆన్సర్ చేసాడు సంతోషంగా, "హేయ్.. స్నిగ్ధా.. ఆఫ్టర్ ఎ లాంగ్ టైమ్.. నైస్.. సర్ప్రైజ్.. ఏంటీ టైమ్ లో.. మీరీపాటికి నిద్దరోతుండాలిగా?", చిరునవ్వుతో మొదలుపెట్టిన భరద్వాజ ముఖంలో నవ్వు మాయమైంది అవతలనుంచి ఏడుపు వినపడడంతో.

"స్నిగ్ధా.. అంతా ఓకే నా... కిరణ్, పిల్లలూ.. "

"అంతా ఓ.కే... కానీ... మురళీ.. జే.కే.... మన మురళి... " సన్నగా రోదించసాగింది.

కూర్చున్న చోట నుండి లేచాడు టెన్షన్ గా, "మురళికేమైంది.. స్పీకౌట్.. ఈజ్.. హీ.. ఐ మీన్.. ఆక్సిడెంట్.. ఏమన్నా...?"

"నో.. హీ ఈజ్ ఎలైవ్.. కానీ.... జే.కే.. స్ట్రోక్... మాసివ్ పెరాలిటిక్ స్ట్రోక్... రాత్రి... రైట్ సైడ్... కంప్లీట్ గా పారలైజ్ అయిపోయింది..." ఏడుస్తోంది స్నిగ్ధ.

"వ్వాట్... ప్యారలైజా?" ఆగిపోయాడు. హుషారుగా నవ్విస్తూ తిరిగే మురళిని వీల్ ఛైర్లో నిస్సహాయం వూహించుకుంటూనే గుండెల్లో ఎవరో గుచ్చిన ఫీలింగ్. బలవంతంగా తేరుకోవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు, "కంగారు పడకు.. స్ట్రోక్ కి గురి అయిన వాళ్ళందరూ పూర్తిగా ప్యారలైజ్ కావలని లేదు. వాడు కోలుకుంటాడు... డోన్ట్ లూజ్ హోప్.. "అన్నాడు ఓదార్పుగా.

"మాసివ్ స్ట్రోక్ జే.కే. ఐనా ట్రీట్ చేస్తున్నది కిరణే...", భారంగా అంది.

గాడ్ .. ఇంకే హోప్ లేదు. కిరణ్ చెప్పాడంటే.. టాప్ న్యూరాలజిస్ట్ అక్కడ కిరణ్.. అంటే మురళి పరిస్థితి... శాశ్వతంగా మంచంలో.. గాడ్ .. న్నో...

"స్నిగ్ధా.. మరి వాణి, పిల్లలూ.." తేరుకుంటూ అడిగాడు.

"లోపలున్నారు. మాట్లాడతావా..?"

"ఇవ్వు..." అస్పష్టంగా గొణిగాడు. కొద్దిసేపటి నిశ్శబ్దం తర్వాత వాణి లైన్లోకి వచ్చింది.

"అన్నయ్యా.. ఏమైందో చూసారా.. ఆయన... ఆయన... మా లైఫ్ మొత్తం చీకటైపోయింది.."వాణి గొంతులో వేదన స్పష్టమౌతోంది.

"వాణీ.. కంగారు పడకమ్మా. కోలుకుంటాడు. వాడు.. వాడికేం కాదు." మాటలు పేర్చుకుంటూ అతికష్టం మీద చెప్పాడు.

"కష్టమని చెప్పేసారు. ఇక మాగ్జిమమ్ మాట తెప్పించడానికి ట్రైచేస్తామని చెప్పారు. అది కూడా చాలా తక్కువ ఛాన్సుందనీ...", వాణి ఏడవసాగింది. గాడ్... ఎప్పుడూ రఫీ పాటలు పాడుతూ తిరగే మురళి గొంతు గుర్తొచ్చింది. కళ్ళు మూసుకున్నాడు బాధగా.

"...ఏడవకమ్మా. నువ్వంతలా అయిపోతే పిల్లలు భయపడతారు. ఈ రోజుల్లో ఇవన్నీ పెద్దవి కావు. వి విల్ ట్రై ది బెస్ట్ మెడికేషన్ ఇన్ ది వర్ల్డ్... ఐ ప్రామిస్... వాణీ... బీ బ్రేవ్.. నేనొస్తాను"అంటూ అన్నివిధాలా ధైర్యం చెప్పసాగాడు. కాసేపటికి నిగ్రహించుకుంది ఆమె.

తేరుకుంటూ చెప్పింది, "చాలా థ్యాంక్సన్నయ్యా. కానీ మీరు ఇప్పుడే రాకండి. మీరన్నట్టే ఆయన కాస్త కోలుకుని ఇంటికి వచ్చాకా, మాట్లాడేటప్పుడు రండి. ఆయనకీ కాస్త రిలీఫ్ గా వుంటుంది."

"తప్పకుండా. ఫోనోసారి స్నిగ్ధకివ్వు..."

"చెప్పు జే.కే.." స్నిగ్ధ గొంతు భారంగా ధ్వనించింది.

"నువ్వేడ్చి ఆ అమ్మాయిని కంగారు పెట్టకు స్నిగ్ధా.. ధైర్యం చెప్పు.. ఏం కావాలన్నా జస్ట్ లెట్ మీ నో. అంటే ఐ నో యూ విల్ బీ దేర్ అనీ.. బట్ స్టిల్ లెట్ మీ నో ఇఫ్ ఐ కెన్ డూ ఎనీ థింగ్.. ఏదున్నా కాల్ చెయ్యి. మోస్ట్ లీ తొందర్లోనే వస్తాను. కీప్ మీ అప్డేటెడ్." చెప్పాడు.

"ఓ.కే. నువ్వు జాగ్రత్త జే.కే. కీప్ యువర్ సెల్ఫ్ ఫిట్. మనం ఇంక చిన్నపిల్లలం కాదు. పాణికీ చెప్పు. మేం మురళీకి చాలా సార్లు చెప్పాం. వాడు చాలా రెక్లెస్ అబౌట్ హెల్త్... ఐనా ఇట్స్ డెస్టినీ అనుకో.. బట్ మన జాగ్రత్తలో మనముండాలికదా. ఐనా నువ్వేం వర్రీకాకు. ఐ విల్ లుక్ ఆఫ్టర్ ఎవ్రీ థింగ్ హియర్. ఎనీ వేస్..." చెప్పింది.

"టేక్ కేర్..." కాల్ కట్ చేసాడు. నెమ్మదిగా తలతిప్పి చూసాడు. అందరూ తనవైపే చూస్తున్నారు, తన మాటల్లో విషయం అర్థమైనట్టుంది. తేరుకుంటూ వాళ్ళవంక చూసి, 'సారీ టూ స్పాయిల్ యువర్ మూడ్ అగైన్.. ఆనంద్ ఐ హావ్ టూ గో.. మరోలా భావించకు..." మాటలు పెగుల్చుకుంటూ అన్నాడు.

"ఛ.. అదేం లేదు సర్.. ఎవరికైనా ఏమైనా.."

"తర్వాత కలుద్దాం." వాళ్ళ ప్రశ్నలకి జవాబు చెప్పే ఓపిక లేనట్టు లేచాడు.

"కనీసం తినేసి వెళ్ళండి సర్.. మిమ్మల్ని చూస్తే వెళ్ళాకా తినేట్టు లేరు."అడిగాడు సంజయ్.

"వద్దు.. థ్యాంక్స్." తల అడ్డంగా తిప్పుతూ అక్కడనుంచి నడిచాడు. కామ్ గా అతన్ననుసరించింది మనోజ్ఞ.

ఫోన్ తీసి డయల్ చేసాడు 'విశ్వనాథ్.. ఐ నీడ్ సంబడీ టూ డ్రైవ్ మీ హోమ్.. కార్ తీసుకుని పార్క్ ఎంట్రన్స్ కి రండి." చెప్పి ఫోన్ కట్ చేస్తూ మనోజ్ఞ వైపు చూసాడు.

"నువ్వెళ్ళు మనోజ్ఞా.."

"అయాం సారీ... ఎలా వున్నారాయన.. అదే మురళిగారు?"అడిగింది.

"స్టిల్ ఇన్ ఇన్టెన్సివ్ కేర్..తెలియాలి.. ఎంతవరకూ ఆర్గాన్స్ డామేజ్ అయ్యాయో.", ఆగాడు బాధగా.

"...నేనూ మీతో రానా?" బెరుగ్గా అడిగింది.

"వద్దు మనూ.. ఐ నీడ్ టూ సీ పాణి ఇమ్మీడియట్లీ.. నేను, జతిన్ కంటే కూడా వాళ్ళిద్దరూ చాలా క్లోజ్, ఆల్మోస్ట్ బ్రదర్స్.. సియామీ ట్విన్స్ అని పిలిచేవాళ్ళం.. పాణికిది చాలా పెద్ద షాక్.. ఐ నీడ్ టూ బీ విత్ హిమ్ ఫర్ సమ్ టైమ్."

కారు వచ్చి ఆగింది. "భరద్వాజా... మీ దగ్గర స్లీపింగ్ పిల్స్ వున్నాయా..?" చప్పున అడిగింది. వున్నాయన్నట్టు తలూపాడు.

"ఐతే కొద్దిగా పాలు తాగి, టాబ్లెట్ వేసుకుని పడుకోండి. యూ నీడ్ సమ్ స్లీప్.. "మృదువుగా అంది. డోర్ మీద చెయ్యివేసి ఆమెవైపు చూసాడు. ముందుకి కదిలి అతని చేతిమీద చెయ్యివేసి మెల్లగా నొక్కింది. కొన్ని భావాలకి ఓదార్చే మాటలే అక్కర్లేదు. తనవారి నుంచి నీ బాధ నాదంటూ, నీకు నేనున్నానని చెప్పే చిరు స్పర్శ చాలదూ. క్షణకాలం ఆమె వైపుచూసి నెమ్మదిగా సీట్లో కి చేరి వెనక్కి వాలాడు.

"పాణెక్కడ?"కాటేజ్ లో అడుగుపెడుతూనే అడిగాడు.

"ఆయన రూమ్ లోనే వున్నారు సర్. పిలుస్తాను." కదలబోతున్న శరత్ ని వారిస్తూ చెప్పాడు భరద్వాజ "వద్దు.. నేనే వెళ్తాను.." అంటూ. ఆశ్చర్యంగా చూసాడతను.

డోర్ తోసి లోపలికి ఎంటరయ్యాడు.

ఎప్పుడూ ఆక్టివ్ గా తిరుగుతూ, ఏదో ఓపని చేస్తూ ఎవర్ బిజీగా కనిపించే పాణి స్తబ్దంగా మంచం మీద కూర్చుని దిగులుగా శూన్యంలోకి చూస్తున్నాడు.

"పాణీ.. " ఓదార్పుగా భుజంమీద చెయ్యి వేస్తూ పిలిచాడు.

చప్పున లేవబోయాడు, "మీరా సర్." అంటూ.

"కూర్చో పాణీ.. బాస్ గా కాదు వట్టి జే.కే. గానే వచ్చాను. కాసేపు మాట్లాడనీ.." పాణి పక్కన కూర్చుంటూ చెప్పాడు భరద్వాజ. అతని గొంతులో మార్దవానికి పాణి కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

చాలాసేపు మౌనంగా వుండిపోయారిద్దరూ ఆ విషాదాన్ని పంచుకుంటున్నట్టు.

"వెళ్ళాలనుకుంటే వెళ్ళు పాణీ... వాడినోసారి చూసిరా.. అరేంజ్మెంట్స్ చేయమని శరత్ కి చెప్పనా?" మృదువుగా ప్రశ్నించాడు.

"వద్దు.. వద్దు సర్..."

"నా గురించా.. ఏం పర్లేదు. ఐ విల్ మ్యానేజ్.. శరత్ వున్నాడుగా. ఏదైనా వుంటే నిన్ను ఫోన్లో కాంటాక్ట్ చేస్తాడులే.. అవన్నీ పెట్టుకుని మానేయకు.. " ఆప్యాయంగా చెప్పాడు.

తలెత్తి చూసాడు పాణి. ఎలాంటి స్థితి లో నైనా అన్ని యాంగిల్స్ ఆలోచించే వాడ్ని పొలిటీషియన్ అంటారేమో గానీ హ్యూమన్ యాంగిల్ కూడా ఆలోచించే వాడిని మాత్రం ఖచ్చితంగా జే.కే. అనే అంటారు.

"లేదు సర్.. అందుకోసం కాదు. నిజంగా కాదు. మీరిలా చెప్తారని నాకు తెలుసు. కానీ వాడ్నలా.. వాడిని చూడలేనిప్పుడు. "పాణి గొంతు వణికింది. ఓదార్పుగా భుజం చుట్టూ చెయ్యి వేసి అతన్ని దగ్గరకి తీసుకున్నాడు.

"తప్పదు పాణీ. వీ హేవ్ టూ ఏక్సెప్ట్ ద ఫ్యాక్ట్స్. నీకు తెలియనిది కాదు. మనం వాటినుంచీ పారిపోనూలేం.. కావాలంటే నేనూ వస్తాను.." ఆగాడు. "ఒక్కసారి రామ్ కి ఇన్ఫామ్ చేసి, దెన్ లెట్స్ గో..."

"వద్దు సర్.. నా వల్ల కాదు. వాడు హాస్పిటల్ నుంచైతే రానివ్వండి. వెళ్దాం. తర్వాత.. తర్వాత చూద్దాం. ఐనా ఫ్యాక్ట్స్ నుంచి శాశ్వతంగా పారిపోయే అవకాశం ఎవ్వరికీ వుండదు.." బాధగా చెప్పాడు.

తలూపాడు భరద్వాజ. "సరే. యాజ్ యూ విష్. ఏమైనా తిన్నావా?" అని అతని సమాధానం కోసం చూడకుండా మళ్ళీ చెప్పాడు, "పాలు, నిద్రకో టాబ్లెట్ పంపిస్తాను. వేసుకుని పడుకో. ఆరోగ్యం జాగ్రత్తని స్నిగ్ధ చెప్పమంది. ఏం ఆలోచించకు. ఇట్ ఈజ్ గాడ్స్ విల్..." చెప్పి బయటకి నడిచాడు.

టాబ్లెట్ వేసుకుని నిస్తేజంగా మంచం మీద కూర్చున్నాడు భరద్వాజ. పక్కనే పాలగ్లాసు కనిపించింది. ఖాళీ చేసి వెనక్కి వాలాడు. మనోజ్ఞ గుర్తొచ్చింది. నిజంగానే బాధ కలిగినప్పుడు భోజనం మీదకి మనసుపోదు. అలాగని ఏమీ

తీసుకోకపోతే శరీరమూ అలిసిపోతుంది. అందరూ తినమని చెప్పేదందుకే. కానీ అలాంటప్పుడు ఆ చెప్పడం కూడా విసుగు తెప్పిస్తుంది. తనకేం అవసరమో గ్రహించి వెంటనే ఎక్కువ ఫస్ లేకుండా జస్ట్ ఒక్క ముక్క లో చెప్పింది. గుడ్ స్పాంటైనిటీ... అందుకే తను అదే సలహా పాణికీ చెప్పగలిగాడు.. అచ్చు తనలాగే ఆలోచించింది... నిజంగానే..

పాపం మురళి...! వాణి ఎలావుందో.. పిల్లలూ.. చిన్నవాళ్ళు... లాస్ట్ టైమ్ ఏక్లాసులని చెప్పారూ.. ఒకళ్ళు లెవెంత్.. మరొకరూ... అలసటగా కళ్ళు మూసుకున్నాడు. కాసేపటికి, టాబ్లెట్ ప్రభావంతో నిద్ర ముంచుకురాసాగింది. మురళీ... బాధగా తలుచుకున్నాడు.

అంతలో స్నిగ్ధ మాటలు గుర్తొచ్చాయి.

పెరాలిసిస్... శాశ్వతంగా పడిపోయాయి.. వాణి.. పిల్లలూ.. మనం చిన్నపిల్లలం కాదు జే.కే.. ఏమైనా వస్తే కష్టం... టేక్ కేర్ ఆఫ్ యువర్ హెల్త్.. యువర్ హెల్త్... పెరాలిసిస్... జీవితాంతం.. వాణీ.. మనోజ్ఞా... ఎవరది మురళిలా వున్నాడే.. కాదు.. కాదు.. తనే కదూ ఆ మంచంలో, వీల్ ఛైర్లో, ఎవరది.. తన పక్కన... ఎవరది.. తన భార్యా.. తనకి పెళ్ళెక్కడైంది.. ఎవరో నర్సా.. కాదు.. తన భార్యే.. నిరాశగా, నిర్జీవంగా... ఎవరదీ... మనోజ్ఞ కదూ... దిగ్గున లేచి కూర్చున్నాడు. పూర్తిగా చెమటలు పట్టి తడిసిపోయాడతడు. సన్నగా రొప్పుతున్నాడు. చుట్టూ చూసాడు. కలే అని అర్థమైంది. కొన్ని నిజాలకి, తన భయాలని జోడించి భవిష్యత్ చూపించి, జడిపించిన కల.. కాదు.. కాదు.. భవిష్యత్ దర్శిని. లేచి నెమ్మది గా వాటర్ బాటిల్ తీస్కుని ఒక్కసారి గటగటా తాగాడు.

ఏం చేయబోయాడు తను. ఏదైనా అయ్యి తానొక్క నిమిషంలో పోతే పరవాలేదు. నెమ్మదిగా కోలుకుని మే బీ కొన్నాళ్ళకైనా వేరే లైఫ్ స్టార్ట్ చేస్తుంది. కానీ... ఒకవేళ ఇలా జరిగితే.. గాడ్.. నరకం.. తనని వదిలేయలేదు. ఖచ్చితంగా మనోజ్ఞలాంటి అమ్మాయి అస్సలు వదలదు. అప్పుడు పరిస్థితేంటి.. అలాగే..

తలవిదిల్చాడు.

నో... తాను జరగనీయడు.. ఖచ్చితంగా జరగనీయడు. తానెంత బాధ పడినా.. ఆమెంత బాధపడినా.. ఇది తన ఫైనల్ నిర్ణయం.. జరిపించి తీరుతాడు. ఎట్ ఎనీ కాస్ట్...

"సర్.." అప్పుడే వాకింగ్ నుంచి వచ్చి షూ విప్పుతున్న భరద్వాజ శరత్ పిలుపుకి తల తిప్పి చెప్పమన్నట్టు చూశాడు.

"పాణిగారూ వాళ్ళ మదర్ కి హార్ట్ అటాక్ మళ్ళీ వచ్చిందట సర్.. క్రిటికల్ అంటున్నారు.. "

చప్పున లేచాడు. గాడ్ఈ మధ్యలో మంచి వార్తలేమీ వినరావా ఇంక.. శైలజ, మురళి, ఇప్పుడు ..

"పాణెక్కడ..?"

"ఇప్పుడే బయటికెళ్ళారు సర్.. "

"అదేంటి.. ఎక్కడికీ..?"

"తెలీదు సర్..."

"సరే.. రాగానే నా ఛాంబర్ కి రమ్మన్నాని చెప్పు. "

"ఎస్సర్.. "

"సర్... రమ్మన్నారట."

"ఆ.. పాణీ.. ఇంకా ఇక్కడే వున్నావేంటి నువ్వు..? ఇందాకే శరత్ చెప్పాడు. డోన్ట్ వర్రీ... అమ్మకేం కాదు.. ధైర్యంగా వెళ్ళు.. " ఆప్యాయంగా చెప్పాడు భరద్వాజ.

కళ్ళల్లో అంతులేని బాధ, వేదనలతో నిస్సహాయంగా చూసి తలొంచుకున్నాడు పాణి.

"ఏమైంది పాణీ.. ఏమన్నా కావాలా?", అతన్ని పరీక్షగా చూస్తూ అడిగాడు భరద్వాజ "ఏదైనా చెప్పాలనుకుంటున్నావా.. ఆపరేషన్ కి అమౌంట్ ఏమన్నా.."

"లేదు సర్.. అది.. నేను.. నేను.. "తడబడ్డాడు. ఒక్కక్షణం ఆగి నెమ్మదిగా "నేను.. మీకు.. చా.. చాలా ద్రోహం చేసాను సర్.. అనుక్షణం మీ.. మీ వెంట వుంటూనే.. మోసం.. మీకు.. మిమ్మల్ని దగా చేసాను సర్..." కన్నీళ్ళ పర్యంతమయ్యాడు.

"ఏం మాట్లాడుతున్నావ్ పాణీ.. హావ్ యూ గాన్ మ్యాడ్.. నువ్వు దగాలూ, ద్రోహాలూ చేయడం ఏంటీ.. మే బీ.. ఓహ్.. గాడ్.. ఐ గెస్.. యూ ఆర్ ఇన్ డీప్ షాక్... జరిగినవి అలానే వున్నాయి కదా. ఏంచేస్తాం. ఖంగారు పడకు.. రా ఇలా కూర్చో.. నిన్న మురళి హెల్త్.. ఇప్పుడు అమ్మ.. ఐ కెన్ అండర్ స్టాండ్.. మరీ ఇంత వీక్ ఐతే ఎలా.. ఏమైందసలూ?" మృదువుగా అతన్ని సోఫాలో కూర్చోబెడుతూ అన్నాడు.

దాంతో మరింత వేదనగా అన్నాడు పాణి, "మీరు.. దేవుడు సర్.. నేను.. నేను.. మీగురించి.. అన్నీ.. అంతా చెప్పేసాను సర్.. అతను చాలా పగతో వున్నాడు. చిన్ననాటి స్నేహం.. అంటూ... నేను.. అంతలా ఎలా డ్రైవ్ అయిపోయానో తెలియనే లేదు సర్.. అన్నీ చెప్పేశాను సర్.. నన్ను క్షమించండి.. చాలా ప్రమాదంలో వున్నారు సర్.. "

నిశ్చేష్టుడై చూశాడు భరద్వాజ, "విషయం చెప్పు పాణీ.." గంభీరంగా అన్నాడు.

వణికే కంఠంతో అంతా చెప్పసాగాడు. మౌనంగా అంతా విన్నాడు భరద్వాజ. ఒక్కసారి కూడా రియాక్ట్ కాలేదు.

"నన్ను.. నన్ను క్షమించండి సర్... మీరే శిక్ష విధించినా సిద్ధమే సర్... కానీ.... మీరిక్కడుండడం మాత్రం చాలా ప్రమాదం సర్.. మీరిక తను కోరినదానికి ఒప్పుకోరని అర్థమైపోయినప్పటినుంచీ బాగా కసితో వున్నాడు." భయంగా అన్నాడు పాణి చివరకి.

తలెత్తి చూశాడు భరద్వాజ. తన రియాక్షన్ కోసం ఆత్రంగా చూస్తున్నాడు పాణి. చాలా వరకూ తన వర్షన్ బాగానే చెప్పాడు ఎక్కడా తన తప్పు కనిపించకుండా. వాళ్ళు తనని మాటలతో ఎలా డ్రైవ్ చేసారో, ఎలా తన దగ్గర్నుంచి ఇన్ఫర్మేషన్ రాబట్టారో.. చాలా తెలివి గా ప్రజెంట్ చేసాడు. లోక సహజం. రీజన్స్ ... తాము చేసిన పని కి కారణాలు, సమర్థింపులు ఎన్నో వెతుకుతారు. తప్పుని ఒప్పుకోవాలంటే చాలా ధైర్యం కావాలి. అది దైవత్వం. అందరి వల్లాకాదు. మరి తనో.. తనూ మనిషేగా... కానీ.. ఇప్పుడు ఆవేశం, కోపం రావట్లేదు. దుఃఖం వస్తోంది. అన్ని విషయాల్లో తనకి తోడుగా నడిచిన పాణి... పాణేనా..

అయితే.. అయితే ఏమయింది..? ఏం తనే అంటాడుగా అందరూ మనుషులే కానీ మహాత్ములు కారని. అన్నింట్లో తోడుగా వున్నాడు. ఓ చిన్ననాటి స్నేహితుడి మాటలు నమ్మి కాస్త దారి తప్పాడు. నేరమేమీ కాదే. తన విషయాలు చేరవేయడం తప్పే. కానీ.. ఆగ్రహించడానికో, శిక్షించడానికి తనెవరు.. ఐనా శిక్ష కంటే క్షమే పెద్ద పరీక్ష.. పశ్చాత్తాపమో, పరితాపమో.. కడగనీ మనసుని.. నిజంగా మనసునీ, మనిషినీ ప్రక్షాళన చేసి పునీతం చేసే శక్తి పశ్చాత్తాపానికుంటే.. ఆ జడిలో తడవనీ.. తానెందుకు తీర్పు తీర్చాలి. తానేమీ భగవంతుడు కాదే...

"సర్.." పాణి పిలుపుతో తెప్పరిల్లి చూశాడు భరద్వాజ. ఆలోచనల వరదలో కొట్టుకుపోతున్న మనసు ఎప్పటికైనా, ఏనాటికైనా ఓ దరి చేరుతుందా.. సేద తీరుతుందా... మనోజ్ఞ గుర్తొచ్చింది. ఈ వేదనని పంచుకోకుండా ఎలా మోయను.. దిగులుగా అనుకున్నాడు.

"నాకు.. చెప్పావు కదా. ఇక మర్చిపో పాణీ..." నిర్లిప్తంగా చెప్పాడు.

తుళ్ళిపడి చూసాడు పాణి., "కానీ.. అలా అనకండి సర్.. అతనివల్ల ఎప్పటికైనా ప్రమాదమే... ఏదైనా చేసేద్దాం." వణికిందతని గొంతు. బాల్యస్నేహాన్ని తలుచుకునేమో.

"ఏం చేసేస్తాము పాణీ.." మందలింపుగా అనబోయాడు.

"చంపేస్తాను. వదలను.. వాళ్ళు మీ జోలికి వచ్చేలోపే.. మిమ్మల్ని చంపాలన్న ఆలోచన మళ్ళీ చేసేలోపే..."

"స్టాపిట్ పాణీ.. ఇక చాలు.. వాళ్ళు మననీ, మనం వాళ్ళనీ,.. ఏంటది... మనం ఫ్యాక్షనిస్టులం కాదు.. వదిలేద్దాం.. మనవాళ్ళు చేసిన పనులకే అసలీ విషయం ఇంతదూరం వచ్చింది. తప్పు చేస్తే కాళ్ళు విరిచేయడం, విషం పెట్టెయ్యడాలు.. ఏంటదంతా.. వాళ్ళ జనరేషన్ వేరు. ఇక మనం.. ఏకంగా చంపేద్దామా.. ఇక ఇక్కడెందుకు. అడవుల్లోకి వెళ్ళిపోదాం. మృగధర్మమే పాటించేటట్టైతే ఇక ఇక్కడెందుకు..?"కోపంగా అన్నాడు.

"కానీ వాళ్ళు.. "

"వదిలెయ్ పాణీ. ఇది నా సమస్య. తీర్చుకుంటానో.. ఏం చేసుకుంటానో.. నా నిర్ణయం... నువ్వు కలిగించుకోవద్దు.." కఠినంగా చెప్పాడు.

తలొంచుకున్నాడు పాణి.

"మరో విషయం పాణీ.. భార్య తప్పు చేస్తే భర్తది రెస్పాన్సిబిలిటీ, ప్రజలు తప్పుచేస్తే రాజుది తప్పు, అని ఎక్కడో విన్నాను. అలాగే నావాళ్ళు తప్పు చేస్తే ఆ తప్పు నాది. ఇప్పుడు తొందరపాటుతో నువ్వేం చేసినా ఆ పాపం నాదౌతుంది. యజమానినని ఆర్డర్ వేయడంలేదు. బాస్ నన్న గౌరవమో, స్నేహితుడినన్న అభిమానమో ఏదో వుండబట్టేగా ఇదంతా నాకు చెప్పావు. సో అదే గౌరవంతో కామ్ గా వుండు. అదంతా మర్చిపో. ఇది ఆర్డర్ కాదు రిక్వెస్ట్.. పైన నీ ఇష్టం..." స్పష్టంగా చెప్పాడు.

"సర్.. "విలవిల్లాడుతూ చూశాడు పాణి. అంత ఎదిగిపోయిన భరద్వాజ వ్యక్తిత్వం ముందు తాము మరింత కుత్సితంగా, నీచంగా కనిపించగా, బాధతో అతని గుండె బరువయ్యింది. తనెంతగా అతనితో కలిసిపోయాడో, ఎలా ఆలోచించాడో తలుచుకుని అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇంత తెలిసినా తనకి మంచి చెప్తున్నాడే గానీ, మాటలనడంలేదు, ఆదరిస్తున్నాడే గానీ అసహ్యించుకోవడంలేదు. చంపాలనుకున్న వాళ్ళని కూడా క్షమించగలగడం.. ఎంత అల్పులం మేము భరద్వాజా.. ఎంత ఉన్నతమైన వ్యక్తి మీరు..

"అతనికి మిమ్మల్ని చంపెయ్యాలన్నంత కక్ష... కోపం వున్నాయి సర్.. వూరికే వుండడు.." పాణి దిగులుగా చూసాడు.

"అనుకుంటే చంపేస్తారా పాణీ.. చాలా అనుకుంటాం.. అన్నీ చేసేస్తామా.. అలా ఐతే నాకూ అమెరికా ప్రెసిడెంటవ్వాలనుంది.." నవ్వుతూ అన్నాడు భరద్వాజ. అతని నవ్వు లో విషాదం తొణికిసలాడింది.

"అలా అనకండి.. సర్.. అతనూ.."

"చంపెయ్యాలన్నంత కోపం రావడం వేరు.. చంపెయ్యడం వేరు పాణీ. ఇవన్నీ మర్చిపోయి వెళ్ళి మీ అమ్మగారి హెల్త్ సంగతి చూడు. డబ్బేమైనా కావాలంటే.."

"ఇక్కడ సేఫ్ కాదు సర్.. సిటీకి వెళ్ళిపోండి.. ప్లీజ్.." వేడికోలుగా అన్నాడు.

**పకాల్న నవ్వాడు**, "ఏం సిటీలో వుంటే చంపడానికి దూరం అయిపోతుందా.. ఫ్లైట్ ఛార్జెస్ ఎక్కువా.. వదిలెయ్ పాణీ.."

"లేదు సర్ .. అంతమంది సెక్యూరిటీ దాటి వాళ్ళు మీవరకూ రాలేరక్కడ. ఇక్కడ మీ సెక్యూరిటీ తక్కువ. చుట్టూ అడవి, లోయలు, చెట్లూ చేమలూ, ...ఏమూలనుండి ఎవరు వస్తారో తెలీదు. పోనీ.. సెక్యూరిటీ పెంచుకుందాం సర్.. లేదా.."

"ఇంతకుముందైతే నీ మాటకి నేనూ వెళ్ళిపోయే వాడినే. ఇప్పుడు వెళ్ళలేను. నీకూ తెలుసు. కొద్దిరోజుల్లో ఎలాగూ తప్పదు. ఇప్పుడు కాదు. చుట్టూ వందమంది గార్డులతో నేనెప్పుడూ ఫ్రీగా వుండలేను. నీకూ తెలుసు. అయినా రాసుంటే చావుని ఆపగల గార్డెవరు..? నో అనవసరం గా ఆలోచించి మనసు పాడుచేసుకోకు. వెళ్ళిరా."

"కానీ వాళ్ళలా వున్నప్పుడు మనం మాత్రం మహాత్ముల్లా ఎందుకు వుండాలి సర్. సుఖ్ రామ్ విషయంలో జనాలకోసం ఇలాంటి పరిస్థితుల్లోనే మనం.."

"దేర్ యూ ఆర్ పాణీ.. ఇక్కడ 'మనం' అక్కడ 'జనం'.. అదీ వృత్తి ధర్మమే.. కాకపోతే కాస్త దాన్నుంచి కాస్త డీవియేట్ అయ్యి న్యాయం చేయడానికి ప్రయత్నించాం. అంతేగానీ వ్యక్తిగత వ్యవహారాల్లో అలాంటివి.. వద్దు పాణీ.. మరీ అంత దుర్మార్గం వద్దు. ఉద్యోగం తుపాకీ ఇచ్చిందని పోలీసులు తమ పర్సనల్ రైవల్స్ ని చంపుకుంటూ పోతారా.. అలా ఆలోచించకు.. దానికి అంతముండదు. పదిమందికి న్యాయం చేయడానికో, జరిగే అన్యాయాన్ని ఆపడానికో అయితే నా పవర్ వాడుకున్నాను గానీ, నా కక్షలు తీర్చుకోవడానికి ఏనాడూ చేయలేదు. నా పర్సనల్ విషయల్లో నాకు ఇలాంటివి వద్దు. తాతయ్య వేరు. నేను వేరు. ఐనా.. అదే చేయాలంటే ఇన్నేళ్ళూ ఆగే వాడినే కాదు..." స్థిరంగా చెప్పాడు.

"ఇదంతా నావల్లే వచ్చింది సర్.. నేనే మూర్ఖంగా నమ్మి.."

"వెళ్ళిరా పాణీ.."

"సర్.. " సందిగ్ధంగా చూసాడు.

లేచి నిలబడ్డాడు భరద్వాజ. అప్పటి వరకూ వున్న నిర్వేదం తొలగిపోయి అతని ముఖంలో అంతులేని ప్రశాంతత చోటు చేసుకుంది.

"ఈ ప్రపంచం లో తామెందుకు చనిపోతున్నారో తెలియకుండా వెళ్ళిపోయేవాళ్ళు చాలామందున్నారు పాణీ. ఒకవేళ చావంటూ నా ముందుకొస్తే కనీసం కారణమైనా తెలుసు నాకు. అది చాలు. విధి ఎలా రాసుంటే అలా జరుగుతుంది వెళ్ళిరా.." గంభీరంగా చెప్పి అక్కడనుండి వెళ్ళిపోయాడు.

"ఎలా వున్నారు భరద్వాజా... " ఆప్యాయంగా అడిగింది. అలసటగా చూసాడు.

"రా.. మనూ.. కూర్చో.."చెప్పాడు నెమ్మదిగా.

"పొద్దున్న వాకింగ్ లోనూ ఇలాగే డల్ గా వున్నారు. మధ్యాహ్నం లంచ్ కూడా ఏం తినలేదు.. మురళిగారికేం కాదు భరద్వాజా.. మీరిలా అయిపోతే ఎలా.. ఐ కెన్ అండర్ స్టాండ్ యువర్ ఫీలింగ్స్.. కానీ ఇలా వుంటే .. నో వే.. నేనొప్పుకోను.. శైలూ గురించి నేను డల్ అయితే మీరొప్పుకున్నారా.." తదేకంగా అతన్నే చూస్తూ అడిగింది.

"వెల్.. నాట్ ఎంటైర్లీ మురళీయే కాదులే మనూ.. అంత గొప్ప స్నేహితుడ్ని కూడా కాదు.." నిర్లిప్తంగా అన్నాడు. అతని చేతిమీద చెయ్యి వేసింది.

"ఏమైంది భరద్వాజా.. అతని వల్లా.. లేక... ఏదైనా వేరే.. ప్రాబ్లెమా... నేను తెలుసుకోవచ్చా..?"లాలనగా అడిగింది.

నిస్పృహగా చూసాడు.

"గుడి గురించి అతనికి తెలిసిపోయింది మనూ... మా ప్రాజెక్ట్ గురించీ... అంతా... అంతా.."

"మై గాడ్... అసలెలా తెలిసింది...? ఇప్పుడెలా.. ఐ మీన్ .. డిడ్ హీ కాంటాక్ట్ యూ.. ?"

తలూపాడు, "వాళ్ళకి ఆ గుడి ధర్మకర్తృత్వం ఇవ్వాలట..."

"నాన్సెన్స్.. మీరుండగా.. ఎలా సాధ్యం.."

"నేను ధారపోయొచ్చు.. నాకు వారసులు లేరు కాబట్టి.. యోగ్యులైన వారికి..." నిర్లిప్తంగా చెప్పాడు.

"యోగ్యులా..మై ఫుట్.. ఐనా కేశవన్న కూడా వున్నారు గా.."

"నో ఛాన్స్.. కోర్ట్ లో కేసు గెలిచింది మా తాతగారు.. కదా.."

"ఐనా మీరెందుకు వప్పుకుంటారు..?"

"తల్లి పరువు బేరం పెడితే లొంగని వాడెవ్వడు మనూ..."

"భరద్వాజా... అయాం.. వెరీ సారీ... పోనీ మీరే కోర్టుకెళ్ళో.. లేక ఏదైనా కిట్టించో..."

"...అతనికి కావల్సింది ఆస్తిలో వాటాయే కాదు, గుడి మాన్యమే.. కాదు.. అన్నీ కావాలి.. తాతయ్య పేరు లో చోటుతో సహా..."

"వాట్..మై గాడ్..మరి..మరి మీ నాన్నగారికి తెలిస్తే..."

"హీ హాజ్ ఎ హయ్యర్ ప్లాన్ నౌ... మా వాళ్ళు చేసిన అన్యాయానికి బదులు తీర్చుకోమంటున్నాడు అమ్మ కొడుకుగా అవసరం లేదట. చనిపోయిన మా మామయ్య కొడుగ్గా లోకానికి పరిచయం చెయ్యమంటున్నారు..."

"వ్వాట్..."మనోజ్ఞ గొంతు కీచుమంది. "అదేంటి అదెలా సాధ్యం.. ఎన్నున్నాయి తెలిసిపోతుంది కదా.. డీ.ఎన్.ఏ. టెస్ట్ లూ.. పెటర్నిటీ..."

"నేనో హోమ్ మినిస్టర్ ని మనూ. నేను తల్చుకుంటే రిపోర్టులు తారుమారౌతాయి. నిజాలు అబద్ధాలౌతాయి, అబధ్ధాలు నిజాలౌతాయి., ఆ సంగతి మనం మర్చిపోయినా వాళ్ళు మర్చిపోరు....లేదంటే తను అమ్మ కొడుకునని ఓపెన్ చేస్తానూ అలా ఐతే తనకి ఎలాగూ వారసత్వపు ఆస్తిలో వాటా వస్తుంది, మా పరువూ పోతుంది అంటున్నాడు.."

"మై గాడ్ చాలా.. చాలా పెద్ద వ్యూహం .. ఏం చేస్తారు. ఇప్పుడెలా....? "

"...చాలా సహనం పాటించేసాను మనూ..చాలిక...ఇన్నాళ్ళూ ఇది నా సమస్య. ఇప్పుడు ప్రజల డబ్బది. తాతయ్య గౌరవం. అమ్మ పరువూ.. అని ఆలోచిస్తే.. అంతా అన్యాయమైపోతుంది. ఇప్పుడిక కొంచెం భరద్వాజ మరో రూపం కూడా రుచి చూడనీ అతన్ని.." కసిగా చెప్పాడు.

"తొందర పడకండి భరద్వాజా.. మీరేంచేసినా.. మీ కుటుంబం కూడా ఇన్వాల్వైవుందిక్కడ.. మీరేమన్నా చేస్తే ఆ కక్షతో అతనినేమైనా చేసినా.. మీ అమ్మానాన్నలూ.. ఈ వయసు లో.. మోరోవర్ అతని తండ్రికూడా చాలా క్రూయల్ అన్నారు కదా.."

"అతని తండ్రి ఇప్పుడు బ్రతికిలేడులే మనూ.. ఐనా చాలా ఆలోచించాను.. చాలు.. చాలా రోజులు ఇలా ఆలోచించే ఇంతవరకూ వచ్చింది విషయం. ఐనా నా కుటుంబం చల్లగా వుండాలని మావయ్య జీవితానికి మచ్చపూయలేను... రిడిక్యూలస్.. తాతయ్య ఆత్మ క్షోభిస్తుంది.."

"పైనున్న ఆత్మలకంటే బతికున్న మనుషుల క్షేమం ఆలోచిస్తే మంచిదేమో భరద్వాజా.." సూటిగా అంది.

"లేదు మనూ.. ఒకవేళ నేను వీక్ అయ్యి ఆస్తిలో వాటాకీ, తాతయ్య పేరులో స్థానానికీ వప్పుకున్నా అతని గోల్ అది కాదు. అలాంటి వాడిని ఆలయానికి ధర్మకర్తని కానివ్వలేను. ప్రజల కోసం వేసిన స్కెచ్, చేసిన కృషీ, అన్నీ నాశనం అయిపోతాయి. ప్రతిక్షణం ఏదో ఒక కొత్త టార్చర్ తో పదేళ్ళుగా నరకం చూసింది చాలు మనూ.. ఐనా ప్రతీ క్షణం నాతో కంపార్ చేసుకుని రగిలిపోతే నేనేం చెయ్యను. మా నాన్న వల్ల నేనిక్కడున్నాను. వాళ్ళ నాన్న వల్ల వాడక్కడ మిగిలిపోయాడు. బేసిక్ పాయింటది. ఎవరూ మార్చలేనిది. ఐనా తాతయ్యే రైటేమో మనూ.. ఎక్కడో ఏదో అడ్డొచ్చి, ప్రాణం తీసే మనసు రాలేదు నాకు. అసలు అప్పుడే తీసేసి వుంటే ఈ నిమిషనిమిషానికీ టార్చర్ తప్పేదేమో నాకు. వ్యక్తిగత కక్షలకి అలా దిగజారకూడదనుకుని ఇంతవరకూ తెచ్చుకున్నాను.. చాలిక... అయాం... టయర్డ్... " ఉద్వేగంగా అనేసి బాధగా వెనక్కివాలాడు.

ఓదార్పుగా అతని చేతిమీద చేయివేసింది. ఆమె వైపు చూసి నిర్లిప్తంగా నవ్వాడు. "నాతో వుంటే చాలా టెన్షన్స్ అనుభవించాలి మనూ.. ఆడుతూ పాడుతూ వుండాల్సిన వయసు నీది.. ఇవన్నింటితో నింపేయడం స్వార్థమే కానీ... "

"ష్... అలా మాట్లాడకండి మీరు.. నేనూ మీరూ వేర్వేరు కాదు.. మీకు సలహా ఇవ్వచ్చో లేదో తెలీదు.. ఐనా .. ఏం చేసినా ఆలోచించి చేయండి.." కాస్త బెరుగ్గా అంది.

"ఆలోచించే శక్తి నశించిపోయింది మనూ.. ఎవరు నావాళ్ళో, ఎవరు పగవాళ్ళో తెలీని పరిస్థితి.. నాప్రతి కదలికా వాళ్ళకి తెలుసు.. " నిర్లిప్తంగా అన్నాడు.

"మై గాడ్... అదేంటి.. ఎలా..?" తెల్లబోతూ అడిగింది. పాణి గురించి చెప్పబోయి ఆగాడు. పాణి తప్పేముంది. తనని హెచ్చరించి మరీ వెళ్ళాడు. ఇప్పుడా విషయాలన్నీ ఏకరువుపెడితే విని, అర్థం చేసుకుని, భయపడకుండా వుండేంత స్థైర్యం ఈ అమ్మాయికుందా.. అయినా బాధని పంచుకోవచ్చు. కానీ, భయన్ని పంచుకుంటే పెంచినవాడౌతాడేమో..

"చూద్దాంలే మనోజ్ఞా.. ఏదో ఒక మార్గం దొరకకపోదు. వదిలెయ్. కాకపోతే చాలా ఋణపడిపోతున్నాను నీకు..."

"ఛ.. ఏం మాటలవి.. టీ.వీ. లో తెలుగు సినిమాలెక్కువ చూస్తున్నారా ఏంటీ.. ?"నవ్వింది.

భరద్వాజ చిన్నగా నవ్వి లేచాడు. ఆమె తలమీద చిన్నగా తట్టి, "పద.. ఆకలేయట్లేదా.. తిందాం లోపలికి నడు..." అన్నాడు.

తేటపడ్డ అతని ముఖం వంక ఆనందంగా చూసి లేచింది. నడుస్తూనే జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడు. ఆశ్చర్యంగా చూసింది.

"ఏం.. భరద్వాజ టీ టోట్లర్ అనుకున్నావా.. ఆరోజు మొదటిసారి డ్రింక్ చెప్పినప్పుడూ ఇలాగే చూసావ్..?" అడిగాడు.

"ఊహు.. చాలా టెన్షన్ లో తప్ప సిగరెట్ కాల్చననీ ఓసారి చెప్పారు కదా..."

తలూపాడు, "ఏం ఇప్పుడేమన్నా తక్కువ టెన్షన్ లో వున్నాననిపిస్తోందా.. ?"

"వెల్.. ఐతే.. టెన్షన్ పోగొట్టేందుకు సిగరెట్ ని మించిన మందొకటి వుంది. మీకు ఓ.కే. ఐతే ఇస్తాను.." హ్యాండ్ బ్యాగ్ తెరుస్తూ చెప్పింది.

" అవునా.. ఏదీ ఇవ్వు.. పోనీ ట్రై చేద్దాం.. " సాలోచనగా చెయ్యి చాపుతూ అన్నాడు.

ఆమె బ్యాగ్ లో వెతుకుతూ "ముందా ఆర్నమెంట్ పడెయ్యండి.."

"ఓహ్.. రైట్.." సిగరెట్ దూరంగా విసిరేస్తూ అడిగాడు, "ఇంతకీ అదేంటీ.. నికోటిన్ ప్యాచెస్ లాగా టాబ్లెట్స్ కూడా వచ్చాయి అని రాస్తున్నారూ... అదా?"

"ఊహు.."

"వాటరక్కర్లేదా.. "

"ఊహు" సాచిన చేతిని తోసేస్తూ "ఏదీ.. నోరు తెరవండి.." అంది.

"వద్దులే ఇలా ఇవ్వు "అన్నాడు ఇబ్బందిగా.

"అలా ఇచ్చేది కాదు..." అంటూ బ్యాగ్ లోంచి ట్యాబ్లెట్ తీసింది. అప్రయత్నంగా నోరు తెరిచాడు. ట్యాబ్లెట్ వేస్తున్నట్టు దగ్గరకొచ్చి అతని చెంపని గాఢంగా ముద్దాడి రివ్వున లోపలికి తూనీగలా పరిగెట్టింది. ఉలిక్కిపడి చెంప తడుముకుని చుట్టూ చూశాడు ఖంగారుగా, "మనూ.... యూ నాస్టీ గర్ల్.." కోపం నటిస్తూ అరిచాడు వస్తున్న నవ్వాపుకుని.

లోపలికొస్తూనే ఏమీ ఎరగనట్టు వున్న మనోజ్ఞని చూసి ఏదో అనబోయాడు. అంతలో ఫోన్ రింగయింది. చప్పున అలర్ట్ అయ్యాడు స్క్రీన్ మీద కనిపించిన పేరు చూస్తూనే.

"హలో రామ్.. చెప్పండి.. "

"కాన్ఫరెన్స్ లోకి రా జే.కే... ఇట్స్ ఇంపార్టెంట్... మన పర్సనల్ ఐడీ లో లాగిన్ కా.. క్విక్.."

"జస్ట్ టూ మినిట్స్.." చెప్తూ ఫోన్ కట్ చేసాడు.

"పద.." తన ఛాంబర్ లోకి దారితీస్తూ చెప్పాడు. అయోమయంగా అతన్ననుసరించింది. వెనకే డోర్ క్లోజ్ చేసి బోల్ట్ వేసాడు. భయంగా చూసిందతని వైపు. సిస్టమ్ ఆన్ చేసి అది బూట్ అవుతుంటే చెప్పాడు, "భయపడకు.. రామ్.. అదే .. సీ.ఎమ్. తో కాన్ఫరెన్స్.. ప్రైవేట్ అనీ బోల్ట్ వేశాను. వెయ్యకపోయినా ఎవరూ రారనుకో.. స్టిల్.."

"పోనీ నేను.. వెళ్ళిపోనా .. ప్రైవేట్ కదా.. "

"నో నీడ్.. ఆ పక్కన కూర్చో.. రామ్ కి కనపడకుండా చాలు.." ఆగాడు. "థ్యాంక్స్ మనూ.. నీ ట్యాబ్లెట్ చాలా బాగా పని చేసింది. అయాం బెటర్ నౌ.. రిలీవ్డ్.. థ్యాంక్స్ ఎలాట్.. యూ నో వన్ థింగ్.. ఇవాళ మోర్నింగ్ నుంచి రామ్ ని అవాయిడ్ చేస్తున్నాను.." అంటూ సిస్టమ్ లో పాస్వర్డ్ టైప్ చేసాడు.

మనోజ్ఞ మాట్లాడే లోపు సీ.ఎమ్. కనిపించారు స్క్రీన్ మీద.

"చెప్పండి రామ్.." ఛైర్ సిస్టమ్ దగ్గరగా జరుపుకుంటూ అన్నాడు.

సర్వశక్తులూ పోయినవాడిలా అలసటగా చూస్తూ, "విషయం తెలిసింది కదా జే.కే..?" అడిగాడాయన.

తలూపాడు భరద్వాజ. అతను కంప్లీట్ గా సీరియస్ గా వున్నాడు. కళ్ళు తీక్షణత సంతరించుకున్నాయి.

"జే.కే. మొత్తం అయిపోయింది. ఆ రత్నాకర్ మీడియాకి లీక్ చేయబోతున్నాడు. అదే జరిగితే వీ ఆర్ ఫినిష్డ్.. అపోజిషన్ వాళ్ళు ఆడుకుంటారు. ప్రజలు దుమ్మెత్తిపోస్తారు. అట్టుడికిపోతుంది. గవర్నమెంట్ కూలిపోతుంది. మొత్తం.. ఆ పురుషోత్తమ్ గాడూ... ఆ.. బాస్ట..."

"రామ్.. వారిస్తూ అన్నాడు భరద్వాజ, "మనకి తెలీదు ఇప్పుడు ఈ టాక్ కూడా ఎవరైనా టాప్ చేస్తున్నారేమో.. మీరు కొంచెం కంట్రోల్ చేసుకోండి.. "

"ఎలా జే.కే.. ఎలా..? తెల్లవారితే రోడ్డుమీదుంటాం.. నువ్వు... నువ్వు.. రాలేవా.." అడిగాడు సీ.ఎం. గొంతులో జీర.

"నేనా.. !"

"ఔను జే.కే. నిన్ను జనం నమ్ముతారు. పార్టీ నుంచి పురుషోత్తమ్ ని ఎక్స్పెల్ చేద్దాం.. సెంటర్ కి ఇన్ఫామ్ చేసి.. సీ.బీ.ఐ. ని డీల్ చేయమందాం.. ఇంకా యాజ్ యాన్ ఇమ్మీడియట్ యాక్షన్ అతన్ని అరెస్ట్.. "

"తర్వాత.. తర్వాతేం చేసేద్దాం రామ్.. మన చేతుల్లో వుంటుందా ఏమన్నా... పరిస్థితి అది కాదు. ప్రాక్టికల్ గా మాట్లాడండి రామ్. మీరో–నేనో ముందు నిలబడతాం. అయితే..? సో.. వాట్..? సమాధానపరచడానికి, సర్దిచెప్పడానికి ఇదేమీ స్కామ్ కాదు.. నలభైమందిని మింగిన మారణహోమం.. మసైపోతాం రామ్... దూ యూ గెట్ ఇట్.."

ఉలిక్కిపడి చూసింది మనోజ్ఞ. వాళ్ళెంత సీరియస్ విషయం మాట్లాడుతున్నారో అప్పుడర్థమైందామెకి.

"దెన్.. మరేం చేద్దాం జే.కే..? ఈ పొజిషన్ లో వుండీ, గవర్నమెంట్ కుప్పకూలిపోతుంటే.. చేతకానివాళ్ళలా.. నిలబడి చూద్దామా సెంటర్ ముందు..", ఉద్వేగంగా అన్నాడు.

"మీకేం కావాలి రామ్..?"గంభీరంగా అడిగాడు భరద్వాజ.

నమ్మలేనట్టు ఆశ్చర్యంగా చూసాడు సీ.ఎమ్. భరద్వాజ సలహాలిచ్చే హోమ్ మినిస్టర్ లా కాక వరాలిచ్చే దేవుడిలా కనపడ్డాడో ఏమో హఠాత్తుగా అతని ముఖం విప్పారింది.

పట్టరాని టెన్షన్ తో ముందుకు వంగాడు, టేబుల్ మీద చేతులు వత్తి పట్టి, "పరువు.. నా పరువు, గవర్నమెంట్ పరువు..." చెప్పాడు.

"షూట్ ఇట్ రామ్.. డైరెక్ట్ గా చెప్పండి. మీకు గవర్నమెంట్ నిలబడాలి అంతేగా..?"

"ఎస్స్.... అంతే.. కానీ.. ఎలా.. ఏం చేస్తావు జే.కే.. ఎలా.. ?"

"ఏం చేస్తావు అని కాదు, ఏం కావాలి అని అడగండి రామ్..?"భరద్వాజ కళ్ళలో తీక్ష్ణత అంత సీనియర్ పొజిషన్ లో వున్నవాడిని కూడా భయపెట్టేలా వుంది.

"చెప్పు జే.కే. ఎనీథింగ్ యూ సే..."

"ఒక్క 18 గంటలు కళ్ళు, చెవులు మూసేయండి రామ్... జస్ట్ ఒక్క 18 గంటలు..."

సీ.ఎమ్ నిటారుగా కూర్చున్నాడు. ఏదో అర్థమైనట్టు చూసాడు. "అంటే యూ మీన్..." ఆగిపోయాడు.

"ఎస్.. ఐ మీన్.. మీకు పరువు, గవర్నమెంట్ స్థిరత్వం కావాలి. నాకు నలభైమంది జీవితాలకి సరైన సమాధానం కావాలి..", భరద్వాజ గొంతు లో కర్కశత్వం తెలుస్తోంది. ఎప్పుడూ చూడని తీవ్రత.

వాళ్ళేం మాట్లాడుతున్నారో తెలిసి ఆమె వళ్ళంతా చెమట్లు పట్టాయి. క్షణాల్లో తడిసిముద్దైంది.

"మై గుడ్నెస్... నో.. జే.కే. నువ్వనేది.. ఐ కాన్ట్ లెట్ యూ డూ సచ్ ఎ థింగ్.. అప్పుడు.. అప్పుడు మనకీ, అతనికీ తేడా ఏముంటుందీ..?"

"తప్పకుండా వుంటుంది రామ్. జింకల్ని వేటాడ్డానికీ, వేటగాడ్ని వేటాడ్డానికీ వున్న తేడా..!! ఐనా ఇందులో మీ ఇన్వాల్వ్మెంట్ ఏమీ లేదు రామ్. ఇది ప్యూర్లీ నా డెసిషన్. కానీ మీకు చెప్పి చేయడం నాధర్మం. ఆల్రెడీ అన్నీ డిసైడ్ అయిపోయాయి. ఒక్క చిన్న సైగ.. అంతే.. అంతా అయిపోతుంది. యూ నో దట్ వెల్.. జస్ట్ సే ఎస్ రామ్. ఇది కోర్టుకి లాగి, సాక్ష్యాలూ, బెయిళ్ళూ, జైల్లో రాజభోగాలూ, మానవహక్కుల సంఘాల సమర్థింపులూ, ఒక డిప్యూటీని రక్షించడానికి వెయ్యి చేతులొస్తాయి. న్యాయమనేది కనుచూపు మేర ఎక్కడా కనపడదు. మీకూ తెలుసు. నాకూ తెలుసు. ఐనా ఆర్గ్యుమెంట్స్ అనవసరం.. మీ నిర్ణయం చెప్పండి. ఒకవేళ గవర్నమెంట్ రేపు పడిపోయినా.. జరగబోయేదదే.. నే చెయ్యబోయేదిదే.. నలభైకి నలుగురు... ఆటవికమే అయినా అదే నా న్యాయం.. నిర్ణయం.." చెప్పాడు భరద్వాజ. అతని మాటల్లో పూర్తి కన్విక్షన్, స్థిరత్వం ధ్వనించాయి.

కొద్దిసేపు అక్కడ ఒకవిధమైన నిశ్శబ్దం చోటుచేసుకుంది. భరద్వాజ అలాగే నిశ్చలంగా స్క్రీన్ వైపు చూస్తున్నాడు. సీ.ఎం. అనీజీగా కదిలాడు. కళ్ళు మూసుకుని కొద్దిసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు. తేరుకుని స్క్రీన్ వైపు చూశాడు.

"బ.. బయటకి.. తెలిస్తే.." నెమ్మదిగా అడిగాడు.

అంతసేపటి సంభాషణలో మొదటిసారి నవ్వాడు భరద్వాజ., "మోరల్ రెస్పాన్సిబిలిటీ కింద హోమ్ మినిస్టర్ రాజీనామా చేస్తాడు.." తాపీగా చెప్పాడు.

నమ్మలేనట్టు చూశాడు సీ.ఎం. అతని ముఖం వెలిగిపోయింది. "నేనెందుకు యాక్సెప్ట్ చేస్తాను..?"

"ఇట్స్ అప్ టూ యూ.. అప్పటి పరిస్థితిని బట్టీ మీరే నిర్ణయం తీసుకున్నా నాకు సమ్మతమే.. నాక్కావల్సింది మొత్తం టెన్యూర్ లో కనీసం ఒక్క మంచి.. అది చాలు నాకు.."

"మరి అంటే.. అప్పుడు రత్నాకర్ రిలీజ్ చేసినా.."

"గుడ్ నైట్ రామ్. ప్రశాంతంగా నిద్రపొండి. మీ ప్రశ్నలన్నింటికీ రేపు జవాబులు దొరుకుతాయి.. "

"గుడ్ నైట్ జే.కే. ఓ చిన్న మాట చెప్పనా.. మేమంతా రాజకీయవాదులం మాత్రమే.. కానీ.. నీలాంటి నిజమైన న్యాయవాది.. ప్రతి గవర్నమెంట్ లోనూ కనీసం ఒక్కడున్నా దేశం కొంచెమన్నా బాగుపడుతుంది.." మనస్ఫూర్తిగా చెప్పాడు.

"ఉంటాను రామ్..", క్లుప్తంగా చెప్పి లైన్ కట్ చేసాడు.

సెల్ చేతిలోకి తీసుకుని డయల్ చేసాడు, "లెటర్.. పోస్ట్ చేసేయండి.." చెప్పి డిస్కనెక్ట్ చేసాడు.

మెల్లగా లేచి జగ్ లోంచి నీళ్ళునింపి గ్లాస్ తెచ్చి మనోజ్ఞకందించాడు. అప్పటికే భయంతో స్పృహతప్పేలా వుందామె. వేగంగా గ్లాస్ అందుకుని గటగటా తాగింది.

"ఇంకా కావాలా.." అడిగాడు. తల అడ్డంగా తిప్పింది బెదురుగా. పక్కనున్న మోడా లాక్కుని ఆమెకెదురుగా కూర్చున్నాడు.

"భయం వేస్తోందా..?"ఆమె కళ్ళలోకి చూస్తూ అడిగాడు. మౌనంగా తలూపింది అవును,కాదుల మధ్యలో.

"మరి..? అర్థమైందిగా మేమేం మాట్లాడామో.. ?"అడిగాడు.

గొంతు పెగుల్చుకుంది, "నల.. నలభైమందికి.. ఏమైంది..? "వణికే గొంతుతో అడిగింది.

"ఊచకోత... ఒకప్రాంతంలో తన పలుకుబడి వల్లవచ్చిన అహంకార మదం. ఓ అన్యాయం జరిగింది. ఇదేమని ఎదిరించిన వాళ్ళని గుట్టుచప్పుడు కాకుండా నరికేసారు. ఒక జర్నలిస్ట్ సాక్ష్యాలు సంపాదించాడు. వాడ్నీ చంపేసేవారే. కాస్త తెలివిగా బిహేవ్ చేసి తప్పించుకున్నాడు. తానెక్కడున్నాడో తెలియకుండా దాచి రేపు మధ్యాహ్నం రాష్ట్రం మొత్తం తెలిసిపోయేలా ఏర్పాటు చేసేసాడు.. "

"ఇంత పెద్ద పొజిషన్ లో వుండీ మీరేం చెయ్యలేరా.. అదీ చట్టం మీ చేతులో వుండీ.. "బెరుగ్గా అడిగింది.

"పలుకుబడి, అధికారం ప్రతి అన్యాయాన్నీ న్యాయం చేయడానికి రెడీగా వుంటాయి మనోజ్ఞా. ఇది వ్యక్తిగతమైతే ఆగేవాడ్ని, పోరాడేవాడ్ని, ఎన్నేళ్ళైనా చట్టం, న్యాయం అంటూ... కానీ.. జనం మనోజ్ఞా.. ఒక్కడివల్ల మళ్ళీ ఎంతోమంది సఫర్ అవుతారు. గ్యారెంటీగా అదే జరుగుతుంది. ఇది సమర్థింపుకాదు. పదవికోసమో, ప్రభుత్వం కోసమో కాదు. నాకు తోచిన న్యాయం. అంతే.. చెప్పానుగా ఆటవికమే.. కానీ, నరరూపరాక్షసుల ముందు నీతి, న్యాయం, చట్టం అంటూ కూర్చుంటే ఏమీ రాదు. మరింత అరాచకం తప్ప. దయ్యాల ముందు వేదాలు వల్లించే వాళ్ళలో వాడు కాదీ జే.కే. నీకు తెలియాలనే ఇక్కడ వుండమన్నాను. ఇది యుద్ధం మనూ.. దుర్మార్గుల్ని నాశనం చేయడానికి భగవంతుడికైనా ఆయుధం పట్టకతప్పదు, నీతి తప్పకా తప్పలేదు. మేమెంత.. ఐనా ఇందులో సమర్థించుకోవడానికేమీ లేదు. నేనూ రాక్షసుడినే.. చాలామంది బాగుకోసం కొంతమంది వినాశనం అనుకో... ఎవ్రీథింగ్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్.. అండ్ దిస్ ఈజ్ ఎ వార్.. సో.. ఇది నా పూర్తి రూపం... ఇకనైనా నీ జీవితం గురించి ఆలోచించుకో..." అంటూ మెల్లగా ఆమె చేతి మీద చెయ్యి వేసి చిన్నగా తట్టాడు.

"నువ్వూహించుకున్నంత అందంగా వుండదు మనూ నా ప్రపంచం. మొన్న నువ్వు చెప్పినట్టు లవ్వే సినిమానూ కాదు.. మరే కథా అంతకంటే కాదు. జీవితం.. నిజాలు భరించలేనంత అసహ్యంగానూ, నమ్మలేనంత నిర్దాక్షిణ్యంగానూ వుంటాయి. తట్టుకోలేవు. ఇక్కడ మంచి చెడూ వేర్వేరుగా వుండవు. అన్నీ కలిపి స్వీకరించడానికీ, చెడుపట్ల బ్లైండ్ ఐ టర్న్ చేయడానికి చాలా తెగింపూ, ధైర్యం కావాలి. నీ ముందు ఎంతో జీవితముంది. సో.. జాగ్రత్తగా చూసి వెయ్యి ప్రతి అడుగు.. నిన్నిష్టపడ్డ వ్యక్తి గా కాదు, నీ వెల్ విషర్ గా చెప్తున్నాను..."

నిశ్శబ్దంగా లేచి నిలబడింది. జాలిగా చూసాడు. ఏదో అనబోయి మళ్ళీ సందిగ్ధంగా ఆగింది. "పద మనూ... రేపు మాట్లాడుకుందాం.." బయటకి దారి తీస్తూ క్లుప్తంగా చెప్పాడు.

యాంత్రికంగా అతని వెంట కదిలి కారెక్కి నిస్త్రాణగా కళ్ళు మూసుకుంది. అతనూ మాట్లాడించే ప్రయత్నం చేయలేదు. కాటేజ్ దగ్గర దింపి వెళ్ళిపోయాడు.

లేస్తూనే గబగబా పేపర్ తీసి చూసింది. ఏమీ లేదు.. రిలీఫ్ గా కళ్ళుమూసుకుంది. అంతలో చప్పున ఏదో ఫ్లాషై టీ.వీ. ఆన్ చేసింది.

"డిప్యూటీ సీ.ఎమ్. పురుషోత్తమ చక్రవర్తి దుర్మరణం...." టీ.వీ.లో తెలుగు ఛానెల్ స్క్రోలింగ్. పైన యాక్సిడెంట్ వివరాలు చూపిస్తున్నారు.

స్థాణువై నిలబడిపోయింది. కొద్ది గంటల ముందు తెలిసిన నిజం అంతలోనే పెరిగి పెరిగి పెనుభూతమై కళ్ళముందు నిలువగా నిస్తేజంగా కూలబడింది.

భరద్వాజా.. వై డిడ్ యూ డూ దిస్... ఆమె గుండె ఆక్రోశించింది.

ఎదురుగా స్క్రీన్ మీద పురుషోత్తమ్ కుటుంబసభ్యులు హృదయవిదారకంగా రోదిస్తున్నారు.

తీవ్ర దిగ్భ్రాంతి ని వ్యక్తం చేసిన సీ.ఎం. కోదండరామి రెడ్డి, గవర్నర్ దేశ్ పాండే., హోమ్ మినిస్టర్ జే.కే.భరద్వాజ,., ఫైనాన్స్ మినిస్టర్ ప్రతాపరెడ్డి... తదితరులు.. సంఘటనా స్థలానికి హుటాహుటిన బయల్దేరిన సీ.ఎం. మరియూ అనుచర వర్గం, అనారోగ్య కారణాల వల్ల రాలేకపోయిన హోమ్ మినిస్టర్ జే.కే. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. సంఘటన పూర్వాపరాలు తెలుసుకోవలసిందిగా పోలీస్ శాఖకి ఆదేశాలు జారీ చేసారు. తదుపరి చర్యలు పర్యవేక్షిస్తాని హామీ...

టీవీ లో న్యూస్ రీడర్లు చెప్పుకుని పోతున్నారు. శక్తి మొత్తం ఇంకి పోయినట్టు కూర్చుని వుంది మనోజ్ఞ.

"వాక్ కి వెళ్ళలేదా.." బద్ధకంగా చూస్తూ అడిగింది రేఖ. మనోజ్ఞ జవాబివ్వలేదు. ఏమీ మాట్లాడే ఓపిక పోయిందామెలో.

"పొద్దున్నే టీ.వీ.పెట్టావేం.?" అని యధాలాపంగా టీవీకేసి చూసి చప్పున లేచి కూర్చుంది రేఖ., "అరే.. డిప్యూటీ పోయాడా...?"అంటూ.

"పాపం వచ్చేనెల వాళ్ళమ్మాయి పెళ్ళటే... "జాలిగా అంది రేఖ న్యూస్ చూస్తూ.

ఎవరో ఛెళ్ళున చరిచినట్టైంది. అంతలో బెల్ మోగింది. కదలకుండా కూర్చున్న మనోజ్ఞవైపు ఆశ్చర్యంగా చూసి, "నీకేమైందే.. పోయింది పురుషోత్తం కాదూ, ఏదో మీ చుట్టమే అన్నట్టు ముఖం పెట్టావ్.. అయినా ఈమధ్య పొలిటీషియన్లందరూ నీ ఆత్మ బంధువులైపోయారులే..." అని వెక్కిరింతగా అంటూ వెళ్ళి తలుపుతీసి గతుక్కుమంది.

"సర్ మీరా.. రండి.. రండి.."అన్న రేఖ మాటలకు తలతిప్పి చూసింది. భరద్వాజ.. ఎదురుగుండా టీ.వీ.లో పురుషోత్తమ్ శవం రక్తసిక్తమైవుంది. నెమ్మదిగా లోపలికి అడుగుపెట్టాడతను.

మనోజ్ఞ తలమీద చెయ్యి వేసి నిమిరాడు ఆమె మానసిక స్థితి అర్థం చేసుకున్నట్టుగా. అంతలో రేఖ అతని వెనకే లోపలికొస్తూ, "సర్.. పురుషోత్తమ్ గారు పోయారట కదా పాపం.." అంది. ఆమె ముఖంలో సింపతీ కంటే ఎక్కువ కుతూహలం ప్రస్ఫుటంగా తెలుస్తోంది. నెమ్మదిగా అక్కడున్న సోఫాలో కూర్చుంటూ తలూపాడు.

"అందుకే వాక్ కి వెళ్ళలేదేమో కదా.. అదే అనుకున్నాము.. వీ ఆర్ వెరీ సారీ.." తన సానుభూతిని తెలుపుతూ అంది రేఖ.

"వెరీమచ్ టయర్డ్.. రాత్రిమొత్తం నిద్రలేదు... కాస్త టీ ఇస్తావామ్మా..?" అలసటగా చూస్తూ అడిగాడు.

"అయ్యో ఎంతమాట సర్.. ఇప్పుడే తెస్తాను. మనూ.. నువ్వు సర్ తో మాట్లాడుతుండు.." మాట్లాడమని సైగ చేస్తూ కిచెన్ కేసి నడిచింది.

టీ.వీ. వైపు చూసాడు. మౌనంగా ఆఫ్ చేసింది. చేతిలో గీతలు చూసుకుంటూ గడిపింది. రేఖ తెచ్చిన టీ తాగి థ్యాంక్స్ చెప్పి లేచాడు.

"నేనూ వస్తాను మీ కాటేజ్ వరకూ.. " చెప్పింది మనోజ్ఞ. ముందే వూహించినట్టు తలూపాడు రమ్మని. చాలా సేపటి మౌనం తర్వాత కాటేజ్ దగ్గరౌతుంటే అన్నాడు.

"...నాకు తెలుసు మనూ.. ఇట్స్ డిఫికల్ట్.. నీ కళ్ళముందున్న వ్యక్తి అలాంటి పని చేయించాడంటే నమ్మడం చాలా కష్టం. కానీ, అదే వాస్తవం.. నువ్వెంత తొందరగా రియలైజ్ అయ్యి బయటపడితే అంత మంచిది..."

తలెత్తి సూటిగా అతని వైపు చూసింది చాలాసేపటి తర్వాత.

"చాలా కరెక్ట్ గా చెప్పారు భరద్వాజా.. రియలైజ్ అవడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఆ రియలైజేషన్ తోటే జీవితాంతం బతకాలి కదా.."

అదిరిపడ్డాడు. "యూ.. మీన్.." అనుమానంగా అన్నాడు.

"ఎస్ ఐ మీన్ ఇట్.. సొసైటీ కోసం.. అంతర్మథనాన్ని, అంతరాత్మని చంపుకోవడానికి మీరు సిద్ధమైతే, మీకోసం మిమ్మల్ని మీరుగా ఒప్పుకోలేనా... ఆఫ్టాల్.. ఎవ్రీ థింగ్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్..." తాపీగా అంది.

"నాన్సెన్స్.."అరిచాడు. "నీకర్థంకాదేం... పిచ్చా నీకేమన్నా... ఇంత జరిగాకా కూడా నేనెలాంటివాడ్నో ఇంకా గ్రహించలేని నీ మెంటాలిటీని మొండితనమనాలా.. లేక మూర్ఖత్వమనాలా.. అసలూ.."

చెయ్యెత్తి అతన్ని వారిస్తూ చెప్పింది., "మిమ్మల్ని ప్రేమించడం అంటే మీలోని మంచి, చెడూ రెండూ కలిపే కదా భరద్వాజా. ఐనా మీరే అన్నారు గా అన్నీ ఈ లోకంలో అన్నీ ప్యాకేజెస్ గానే వస్తాయి అని. అయినా యుద్ధం లో చెడుని చంపేవాడిని వీరుడంటారు. దుర్మార్గుడనరుగా.. అండ్ మోరోవర్ నేనేమీ దావూద్ నో , వీరప్పన్ నో కోరుకోవట్లేదు, మీరు చేసే పని కి మరో కోణం చూసీ, ఆలోచించే చెప్తున్నాను..."

నవ్వాడు, "తరచి చూస్తే వాళ్ళకి కూడా వాళ్ళు చేసే పనులకి జస్టిఫికేషన్, రాదర్ మరో కోణం వుంటుంది మనోజ్ఞా. అంత ఆలోచించే వయసూ, పరిణతీ, అనుభవం ఏవీ నీకిప్పుడు లేవు. ఐ కేన్ అండర్ స్టాండ్.. అవేశంలో అంటున్నావు.. ఐనా ...ఇదో సాలెగూడు.. ఇక్కడ... అసలూ...."

"బై భరద్వాజా..." ఆమె కళ్ళు తడిగా మెరిసాయి.

"మనూ..." సందిగ్ధంగా అన్నాడు.

"ఇప్పుడు నాకు చాలా ప్రశాంతం గా హాయిగా వుంది భరద్వాజా. నన్నింతగా ప్రేమించి, నా గురించే అనుక్షణం ఆలోచించే వ్యక్తి వుండగా నేనింక దేనికీ వర్రీ కానక్కర్లేదు.. అయామ్ సో లక్కీ.. బై..." నవ్వుతూ వెనుదిరిగింది. నిశ్చేష్టుడై చాలాసేపు అలాగే నిలబడ్డాడు. తర్వాత మెల్లగా ఛాంబర్లోకి వచ్చి మంచం మీద వాలాడు. అతని పెదాల మీద చిరునవ్వు వెలసింది. కళ్ళల్లో నీళ్ళూ చిప్పిల్లాయి.

మనూ.. ఇది.. ఇదంతా నిజమేనా.. నన్నునన్నుగా యాక్సెప్ట్ చేయడం ఇంత హాయినిస్తుందా.. నీలో అంత ప్రేమ దాగుందా.. ఆనందం అర్ణవమైన ఈవేళ నీ ఒడిలో సేద తీరాలనే కోరికెందుకు వేధిస్తోంది నన్ను.

ఎంత గొప్ప భావన.. ఎంత ఉన్నతమైనది నీ మనసు... చిన్నపిల్లవంటూ ఇన్నాళ్ళూ నిన్ను చిన్నబుచ్చాను.. ఇప్పుడు నీ ముందు నేనెంత చిన్నవాడినో తెలుస్తోంది. కానీ ఈ ఓటమీ హాయిగానే వుంది. కళ్ళుమూసుకున్నాడు. రెప్పల్లో దాగిన కన్నీరు మెల్లగా పక్కకి జారి దిండులో ఇంకిపోయింది.

గుండె లోతుల్లోంచి పొంగుకొస్తున్నదేంటిది.. దుఃఖమా.. ఆనందమా.. వద్దు మనూ.. తగనని చెప్పి వెళ్ళిపో.. ఇంత ప్రేమని ఈ గుండె తట్టుకోలేదు. భరించలేను... వద్దు మనూ... ఓ మై ఏంజిల్.. డోన్ట్ గో ఎనీ వేర్..ఎందుకు వెళ్ళాలని ప్రశ్నించి నాతోనే వుండిపోవూ..!!

ఈ మనసెంత స్వార్థపూరితం.. క్షణం క్రితం వరకూ నువ్వు నన్ను అపార్థం చేసుకోకుంటే – కనీసం అసహ్యించుకోకుంటే చాలంది... ఇప్పుడూ.. నీతో మమేకం కావాలని తపనపడుతోంది చూశావా....?

ఇది...స్వార్థమా..ప్రణయమా...

ప్రేమంటే నిజంగా ఇంత అద్భుతమా...!?

**యాంత్రికంగా** ఇంటర్కమ్ ఆన్ చేసిన వాడల్లా, "సర్.." అన్న శరత్ గొంతుకి కళ్ళు విప్పాడు.

"చెప్పు శరత్.. "

"పాణి గారి మదర్..అవుటాఫ్ డేంజర్ అని తెలిసింది సర్.. "

"గుడ్ టూ నో శరత్.. చాలా రోజులకో మంచివార్త.. ఫైన్.. ఓ.కే. దెన్.."అంటూ ఫోన్ క్రెడిల్ చేసేలోపే శరత్ చెప్పాడు, "మీ కోసం మనోజ్ఞా మేడమ్ వెయిట్ చేస్తున్నారు సర్.."

"వ్వాట్.. మనోజ్ఞా.. ఎంతసేపయ్యింది..?"

"ఆల్మోస్ట్ ఒక వన్ అవర్.. "

"వై డిన్ట్ యూ ఇన్ఫార్మ్ మీ దెన్.." కటువుగా అన్నాడు.

"మేడమ్ వద్దన్నారు సర్.. మీరు లేచాకే కలుస్తానన్నారు." వణికింది శరత్ గొంతు భయంతో.

"ఇట్స్ ఓ.కే. సెండ్ హర్ ఇన్.."

రెండుక్షణాలతర్వాత మనోజ్ఞ లోపలికి రాగానే కోపంగా అన్నాడు, "ఏం మనూ.. లేపాల్సింది కదూ నన్ను."

"మీకు రెస్ట్ అవసరమనీ.. ఎట్ ది సేమ్ టైమ్.. లంచ్ కూడా అవసరమని వచ్చాను.. వెళ్దామా?" తనదైన చిరునవ్వుతో అడిగింది.

ఒకసారి ఆమెవైపు చూసాడు, మురళి గుర్తొచ్చాడు, స్నిగ్ధమాటలు, పాణి గుర్తు చేసిన థ్రెట్.. ఇక ఆమెతో తన ఫైనల్ డెసిషన్ చెప్పాల్సిన టైమ్ వచ్చేసింది. ఇక ఆలస్యం చేయడం మంచిది కాదు. తలూపి లేచాడు.

"చాలా డల్ గా అయిపోయారు మీరీ రెండురోజుల్లో.." కామ్ గా లంచ్ చేస్తున్న భరద్వాజని దిగులుగా చూస్తూ అంది.

నిర్లిప్తంగా నవ్వాడు, "జరిగినవేవీ చిన్న సంఘటనలు కాదుగా. ఐనా నీ ముందు కాబట్టి నా టెన్షన్ తెలియనిస్తున్నాను. "

తెలుసన్నట్టుగా తల పరికించింది, "వదిలేయండి. ఇంతకీ పాణిగారెప్పుడు వస్తారు."

పాణి ప్రస్తావన రాగానే అతను చెప్పిన సంగతులు గుర్తువచ్చి మనసు మరింత చేదెక్కింది.

"తెలీదు. ఐ మీన్ మాట్లాడలేదు. నువ్వేంటి హడావిడిగా కానిచ్చేస్తున్నావ్ లంచ్ ఏదైనా పనుందా?"

"ఔను మీతో లంచ్ చెయ్యడానికి ఫస్ట్ హాఫ్ సెమినార్స్ ఎగ్గొట్టానుగా.. తొందరగా వెళ్దామని వస్తే మీరేమో పడకేసారు కదా.."

"ఓహ్ సారీ.. లేపాల్సింది కదా.."

"ఇట్స్ ఓ.కే. డోన్ట్ బాదర్.. ఫోర్ కి చాలా ఇంపార్టెంట్ సెషన్ వుంది.. లివర్ ట్రాన్స్ప్లాన్ట్ గురించి మీనన్ సర్ స్పీచ్. నన్ను డ్రాప్ చేస్తారుగా.."

అనీజీగా చూసాడు, "ఓహ్.. వెళ్ళాలా.. ఐ థాట్.. సరే పద డ్రాప్ చేస్తాను."లేచాడు.

"ఏమైంది భరద్వాజా? ఎనీథింగ్ స్పెసిఫిక్? "

"వెల్.. స్పెసిఫిక్ అవునో.. కాదో.. కొంచెం మాట్లాడాలనుకున్నాను.. నీతో.." సాలోచనగా చూస్తూ చెప్పాడు.

"ఓ.కే. ఇఫ్ దట్ ఈజ్ ద కేస్.. ఐవిల్ స్టే బ్యాక్. " తిరిగి కూర్చుంటూ అంది.

"నో.. నో.. వెళ్ళాలన్నావ్ కదా.. మళ్ళీ ఇంపార్టెంట్ సెషన్."

"మీకంటే ముఖ్యంకాదేదీ." స్థిరంగా చెప్పింది. అతను వాదించలేదు. నిశ్చలంగా ఓసారి ఆమె ముఖంలోకి చూసాడు.

"సరే పద.. ఇక్కడ కాదు." క్లుప్తంగా చెప్పి కదిలాడు.

దారంతా ఏమీ మాట్లాడకుండా దీక్షగా కారు నడుపుతున్న భరద్వాజ వైపు కుతూహలంగా చూసింది.

"మౌనవ్రతం ఏమన్నా మొక్కుకున్నారా? కార్లో మాట్లాడననీ." అల్లరిగా నవ్వుతూ అడుగుతున్న ఆమె వైపు జాలిగా చూసాడు. ఇంకెంతసేపా అల్లరీ, నవ్వులు.. తానవన్నీ కన్నీళ్ళుగా మార్చబోతున్నాడుగా... భగవంతుడా శక్తినివ్వు.. చెప్పేశక్తి నాకూ, విని తట్టుకునే స్థైర్యం ఆమెకీ... నిశ్శబ్దంగా దేవుడిని ప్రార్థించాడు.

ఛాంబర్లో అడుగుపెడుతూనే అతని ముఖంలో మరింత సీరియస్నెస్ చోటు చేసుకుంది. సోఫాలో కూర్చుని ఆమె వైపు చూశాడు. ఒక్కసారి తను మాట్లాడేసాకా ఆమె తనని అసహ్యించుకుని వెళ్ళిపోతే ఇక ఆమెని చూడడం ఇదే ఆఖరు. బహుశ జీవితంలో తామిద్దరూ ఇక కలవలేకపోవచ్చు. బహుశా ఇక తానీ పర్ణశాలకి కూడా మళ్ళీ రాకపోవచ్చు. పర్ణశాలే ఏమిటి? తామిద్దరూ కలిసి కలిసి నడిచిన ఈ నేల.. ఈ ఊరూ.. ఇక ఇక్కడ కాలు మోపడేమో తను. గుండెని చీలుస్తున్న బాధ. ఎంతో జీవితాన్ని చూసిన తనకే ఇలావుంటే.. పాపం మనూ.. న్నో.. చెప్పాలి.. చెప్పెయ్ భరద్వాజా.. ఇంకామె లైఫ్ తో ఆడుకోకు.. చెప్పెయ్... ఎంత కష్టమైనా.. ఆమె జీవితం బాగుండాలంటే...

"నాతో మాట్లాడాలి అన్నారు. వచ్చి ఇంతసేపయ్యింది మాట్లాడరేం?" అడిగింది మనోజ్ఞ భరద్వాజ వైపు చూస్తూ. గంభీరంగా చూశాడు.

"అసెంబ్లీ సెషన్స్ కి ఇంక పది రోజులే టైమ్ వుంది. ఆల్ ఆర్ ఈగర్లీ వెయిటింగ్ ఫర్ మీ.. ముఖ్యంగా పురుషోత్తమ్ ఇష్యూ తరవాత .. అక్కడ రామ్ కి టెన్షన్ పెరిగింది కూడా. ఇప్పటికే చాలాసార్లు ప్లాన్ చేసి కాన్సిల్ చేసాను. ఇక ఏమన్నా చేస్తే గౌరవంగా కూడా వుండదు మనూ.. "

సాలోచనగా చూసింది, "ఓ.కే. అర్థం చేసుకోగలను.. ఎప్పుడు వెళ్దాం?" ఆమె సింపుల్ గా అడిగిన ప్రశ్న తూటాలా పేలిందతని గుండెల్లో.

తుళ్ళిపడి చూసాడు. కొన్ని క్షణాల తరువాత నెమ్మది గా అన్నాడు, "మనూ.. నువ్వు నమ్ముతావో లేదో.. రెండు రోజుల క్రితం వరకూ నేనూ నీలాగే ఆలోచించాను. నాతోపాటూ నిన్ను తీసుకెళ్ళిపోదామనే అనుకున్నాను.. "

"ఇందులో నమ్మకపోవడానికేముంది భరద్వాజా.. ఇప్పుడేమైంది.. మీరు అర్జెంట్ గా వెళ్ళేదుందా? అలా ఐతే వెంటనే బయల్దేరదాం. దానిదేముంది.. ఐ విల్ మేక్ సమ్ ఆర్ ద అదర్ ఎక్స్ కూజ్ ఫర్ ద సెమినార్స్.. దానికెందుకంత వర్రీ..." అంటూ ఇంకేదో చెప్పబోయి ఆగిపోయింది. ఆమె ముఖంలో నవ్వు చెరిగిపోయింది.

"వెళ్తున్నానని చెప్తున్నారా భరద్వాజా?" హఠాత్తుగా బలహీనమైన ఆమె స్వరం చెప్తోంది ఆమెకి అర్థమైపోయిందని.

నెమ్మదిగా తలూపాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"ఇంత సడెన్ గా... ఏమైంది భరద్వాజా? నావల్లేమన్నా తప్పు.." బేలగా వున్న ఆ చూపుల్లో వేల ప్రశ్నలు.

"న్నో.. నో.. మనూ.. ఇది... నేను అన్నివిధాలా ఆలోచించి తీసుకున్న నిర్ణయం. నీ వైపునించి కూడా. అలా చేసే హక్కునాకు లేదని తెలుసు.. కానీ తప్పదు. ఒక్క రేపొద్దున్న జరిగే పరిణామాలకంటే ఇప్పుడు కలిగే బాధ. చాలా... ఐ నో.. చిన్నది కాదని.. కానీ భరించాలి తప్పదు. ఆశపెట్టి మోసం చేసాననుకున్నా సరే. ఇది మంచికే మనూ. ప్లీజ్ అర్థం చేస్కోవూ." గుండె దిటవు చేస్కుని ఒక్కోమాటా చెప్పేసాడు.

బ్లాంక్ గా చూసిందామె"ఎవరి మంచికి.. భరద్వాజా?"

"..........''నిస్సహాయంగా చూశాడు.

"నేను మీకు నచ్చలేదా?" నెమ్మదిగా అడిగింది. భరద్వాజ కళ్ళలో నీళ్ళూరాయి. అదేం కాదన్నట్టు తల అడ్డంగా తిప్పి, తలొంచుకున్నాడు.

"ఐతే... మీ పరువు పోతుందనా?"

"మనూ..." విలవిల్లాడినట్టు చూసాడు.

"ఐతే..."

"అవేం కాదు మనూ. నేనిదివరకే చెప్పాను. నాకూ ఇదేమంత ఈజీ కాదు. కానీ తప్పదు.. అదే మంచిది.." అతని గొంతు వణికింది.

"ఏది మంచో నిర్ణయించడానికి మనమెవరం? రాదర్ మీరెవరు? ఐనా నాకు కారణం తెలియాలి. ఇన్నాళ్ళ మన పరిచయంలో అంతైతే ఐ డిజర్వ్ కదా..లేక?"

"మనూ.. ప్లీజ్.. రేప్పొద్దున్న నాకేదైనా జరిగితే వాణిలా నీ జీవితం కాకూడదు. అండ్ నా లైఫ్ ఇప్పుడు కత్తి అంచు మీదుంది. ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలీదు. అలాంటి గాల్లో దీపంలాంటి జీవితంలోకి నిన్నాహ్వానించలేను. ఐ కాన్ట్ డూ దట్ టూ యూ..."

"అబద్ధం.. నేను మీకీ నెలరోజుల్లోనూ బోరుకొట్టేసాను కదూ.."

బాధగా చూశాడు. అంతలోనే తమాయించుకున్నాడు "నువ్వేమనుకున్నా సరే.."

"మిమ్మల్ని మీరు మోసంచేసుకుంటున్నారు. ఐ నో. మురళిగారిలాగే అందరి జీవితాలూ వుండాలని ఏముంది? మీ తాతగారు, మీ నాన్నగారు.. వాళ్ళంతా డెబ్బై ఏళ్ళొచ్చేవరకూ బాగానే వున్నారుగా. మీకూ వాళ్ళ పోలికే రావచ్చుగా!?"

"ఐ కాన్ట్ టేక్ రిస్క్ మనూ.."

"నన్ను ప్రేమించడంలేదని చెప్పండి ఒక్కమాట అడగకుండా వెళ్ళిపోతాను. అంతేకానీ మంచీ చెడూ అని చెప్పకండి భరద్వాజా. మీతో లైఫ్ ఎన్నాళ్లున్నా సరే.. ఏమిచ్చినా సరే.. ఐవిల్ టేక్ ఇట్..."

"నాకు తెలుసు మనూ.. ఒకవేళ నా పొజిషన్ లో నువ్వుంటే..."

"మీలా పిరికివాడిలా పారిపోను" కసిగా చెప్పింది.

తలూపాడు, "ఐ నో.. బట్ అయామ్ వెరీ."

"సారీ అని మాత్రం చెప్పకండి భరద్వాజా! మీకా అర్హత లేదు." రోషంగా చెప్పింది. ఆమె కళ్ళలోంచి జలజలా నీళ్ళు రాలాయి. అరచేతుల్లో ముఖం దాచుకుంది. నిశ్శబ్దంగా లేచి ఆమె పక్కన సోఫాలో కూర్చున్నాడు.

"తెలుసు మనూ.. ప్లీజ్.. ఏడవకు.. నువ్విలా ఏడవకూడదనే. ఇలాంటి బిట్టర్ పరిస్థితిలో నిన్నొదలకూడదనే ఇన్నాళ్ళూగా ఎన్నోసార్లు వెళ్ళబోయి, వెళ్ళలేక ఆగిపోయాను.. చివరికి నీ ప్రేమలో మునిగిపోయాను. కానీ.. మేలుకోక తప్పలేదు మనూ.. ఒక్కసారి కాదు ఎన్ని రాత్రులు  మనగురించి ఆలోచించానో ఎంత మధనపడ్డానో నీకు తెలీదు. నీ జీవితం ఇక్కడితో ఆగకూడదు మనూ.. ఇప్పుడు బాధపడ్డా తర్వాత నువ్వు తప్పకుండా బాగుంటావు. మనం విడిపోవడం లేదు. మనం అనుకున్నా విడిపోలేము. మన మనసులెప్పుడూ కలిసే వుంటాయి. అది చాలదా చెప్పు. పెళ్ళి.. పిల్లలు.. కలిసి బతకడం.. ఇవేవీ జరగవు. కానీ నీ మనసులోంచి నన్ను నా మనసులోంచి నిన్ను చెరపగలవారెవ్వరు? మన ప్రేమ వల్ల మనిద్దరిలో ఏ ఒక్కరూ కష్టపడకూడదు మనూ! అదేగా ప్రేమంటే.. నిన్నిలా చూడలేను. నాకోసం.. నా కోసం ఎన్నోసార్లు నీ బాధనీ వేదననీ పక్కన పెట్టావు. మరొక్కసారి చివరిసారి నా మాట వినవూ!? నేను వెళ్తేనే మంచిది మనూ... ఇలా వెళ్ళడానికి కూడా నాకు చాలా ధైర్యం కావాలి. నిజంగా నాకా ధైర్యంలేదు మనూ.. చాలా పిరికివాడినే. ఈ డెసిషన్ నీ

సపోర్ట్ లేకుండా. చూసావా!? నిన్ను బాధపెడుతూ కూడా చివరికి నీ సాయమే అర్థిస్తున్నాను. నాలాంటి స్వార్థపరుడితో జీవితం వద్దు మనూ. నువ్వు కాదంటే నేను వెళ్ళలేను. ఒక్కసారి ధైర్యం తెచ్చుకుని చెప్పు వెళ్ళమనీ.. వెళ్ళిపోమని... నేను వెళ్ళాలి.. మనూ.. నేను.. నేను.." ఆగిపోయాడు భరద్వాజ, ఇంకేం మాట్లాడలేక నిస్సహాయంగా తలపట్టుకుని కూర్చున్నాడు.

చాలాసేపటి మౌనం తరవాత తలెత్తింది., "చాలాసార్లు ప్రయత్నించారు కదా భరద్వాజా! ఏంటి నమ్మకం ఇప్పుడు మాత్రం వెళ్ళగలరని.. అందుకే..." ఆగింది.

సందిగ్ధంగా తలతిప్పి చూసాడు.

"అందుకే.. నేను వెళ్తాను.. రేపే.. మీ జీవితంలోంచి.. ఈ ఊళ్ళోంచి.. ఫర్ ఎవర్.." స్థిరంగా చెప్పింది.

నిశ్చేష్టుడై చూసాడు. మాటలు రానట్టు ఆమె వైపు చూస్తున్నాడతను.

"అవును భరద్వాజా.. మీ వల్ల కావట్లేదుగా. ఐ విల్ మేక్ యవర్ డెసిషన్ ఈజియర్. ముందు నేను వెళ్తాను. తర్వాత మీరు హ్యాపీ గా వెళ్ళచ్చు. భయపడకండి. ఏ అఘాయిత్యమూ చేసుకోను. చెప్పానుగా. అంత వీక్ కాదు నేనని. ఐనా మీరు ముందు జాగ్రత్తగా మాట కూడా తీసుకున్నారు కదా. మీకిచ్చిన మాట నేను తప్పను భరద్వాజా.. వెళ్తాను భరద్వాజా.. ఇన్నాళ్ళ ఈ టుగెదర్ నెస్ కీ మీ పరిచయానికీ.. థ్యాంక్స్.. రేపట్నుంచి యూ ఆర్ ఆన్ యువర్ ఓన్.." లేచి నిలబడింది.

"రేపేనా...?" అతని గొంతు తీవ్రమైన షాక్ తో అస్పష్టమైంది.

"వెళ్ళడం అనేది ఖచ్చితమైనప్పుడు అది ఎంత తొందరగా జరిగితే అంత మంచిది. వుంటాను భరద్వాజా.. ఐ.." చెప్పబోయి ఆగిపోయింది. ఒక్క క్షణం అతనివైపు చూసి నెమ్మదిగా అతని ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని నుదుటి మీద ముద్దాడింది. కన్నీళ్ళతో నెమ్మదిగా "ఐ లవ్ యూ భరద్వాజా..." చెప్పి గిరుక్కున వెనుదిరిగింది.

అతను లేచినిలబడ్డాడు, మనసు ఆపమని చెప్తోంది, బుద్ధి వద్దని వారిస్తోండగా స్థాణువై నిలిచాడు. మనోజ్ఞ నిశ్శబ్దంగా అక్కడ్నుంచి నిష్క్రమించింది.. కేవలం అక్కడ్నుంచే కాదు. అతని జీవితంలోంచి కూడా..

అలా ఎంతసేపు నిలబడ్డాడో తెలీదు. కొద్ది క్షణాల తర్వాత అతనికర్థమైంది జరిగిందేమిటో..

....మనోజ్ఞ వె..ళ్ళి..పో..యిం..ది... శాశ్వతంగా.... తనే దూరం చేసుకున్నాడు.. పిచ్చివాడిలా... తనంతట తనే... తన ప్రాణాన్ని.. తన జీవితాన్నీ.. తన సర్వస్వాన్ని ... పూర్తిగా.. శాశ్వతంగా...

మోకాళ్ళమీద కూలబడి అరచేతుల్లో ముఖందాచుకుని ఏడవసాగాడు.. గుండెలోతుల్లోంచి దుఃఖం పొంగుకురాగా తన నలభై ఆరేళ్ల జీవితంలో మొట్టమొదటిసారి గుండె పగిలేలా నిస్సహాయంగా విలపించసాగాడు..

అలా ఎంతసేపు వుండిపోయాడో అతనికే తెలియలేదు. పొద్దున్న అలారం మోగే వరకూ.. నిర్వేదంగా సెల్ వంక చూసాడు..

ఏదో ఆశ.. ఆరస్ట్ యూ రెడీ ఎట్ మిస్టర్.. అంటూ మెరిసే అక్షరాల కోసం మనసు ఎదురుచూస్తోంది. నో్.. భరద్వాజా .. కంట్రోల్ యువర్ సెల్ఫ్... నెమ్మదిగా కదిలి, వాక్ కి రెడీ అవసాగాడు.

యాంత్రికంగా రెడీ అయ్యి సోఫాలో కూర్చున్నాడు. నెమ్మదిగా సెల్ తీసాడు. మనోజ్ఞ ఫొటో నిర్మలంగా నవ్వుతోంది. అలాగే చూస్తున్నాడు. కన్నీటి తెరల మధ్య ఆమె రూపం మసకబారింది. నిస్త్రాణ గా వెనక్కి వాలాడు.

"వెళ్తాను.. రేపే.. ఫర్ ఎవర్.." ఆమె మాటలు చెవుల్లో రింగుమన్నాయి.

రివ్వున లేచాడు. విసురుగా బయటకి నడిచి కార్ స్టార్ట్ చేసాడు..

గబగబా కాటేజ్ మెట్లు ఎక్కి ఆగకుండా బెల్ ప్రెస్ చేసాడు. తలుపు తీసిన నవ్య బిత్తరపోయి చూసింది.

"సర్..రండి.."

"మనూ.. ఎక్కడ..?" ఆత్రంగా ప్రశ్నించాడు. అయోమయంగా చూసిందామె. "లేదు.. బహుశా వాక్ కే వెళ్ళినట్టుం.." ఆమె మాట పూర్తయ్యేలోపు గిరుక్కున వెనుదిరిగాడు.

రివ్వున వెనక గేట్ లోంచి కారు గ్రీన్ లాన్స్ లోకి ఎంటరైంది. వేగంగా అడుగులేస్తూ బెంచ్ దగ్గరకు చేరుకున్నాడు. అతని అంచనా తప్పలేదు. పక్కనే సూట్కేస్, బ్యాగ్ ల తో నిర్వేదంగా నిలబడివుంది. రిలీఫ్ గా చూస్తూ ఆమెని చేరుకున్నాడు.

అతన్ని చూడగానే పొంగుకొస్తున్న బాధని దిగమింగుకుంటూ చెప్పిందామె, "వెళ్ళేముందు ఒక్కసారి మిమ్మల్ని చూసి వెళ్దామనీ.. అంతే.. అంతే.." ఆగింది. "సెండాఫ్.. చెప్పడానికొచ్చారా?" తడి కళ్ళతో అతన్ని తదేకంగా చూస్తూ ప్రశ్నించింది.

నెమ్మదిగా ఆమె కి దగ్గరగా వచ్చాడు, "కాదు... నిన్ను తీసుకుని వెళ్ళడానికి"

సందిగ్ధంగా చూసింది. "ఎయిర్ పోర్ట్ లో డ్రాప్ చేయడానికా."

తల అడ్డంగా తిప్పాడు "ఊహు.. కాదు... ఇక ఎప్పటికీ డ్రాప్ చేసుకోకుండా వుండడానికి.." నెమ్మదిగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ చెప్పాడు.

ఆమె ముఖంలో విస్మయం. నమ్మలేనట్టు చూసింది.

"నన్ను క్షమించగలవా మనూ..." ఆర్తిగా అడిగాడు. ఆశ్చర్యంగా చూస్తోందామె. ఇంకా తేరుకోక ముందే నెమ్మదిగా ప్రశ్నించాడు.

"విల్ యూ మ్యారీ మీ ఏంజిల్.?"

"భరద్వాజా.." ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"సే ఎస్ మై డియర్... సే యస్.." ఆర్తిగా ఆమె చేతుల్ని తన గుండెకి హత్తుకుంటూ అన్నాడు.

"ఎస్ భరద్వాజా...ఎస్..." ఆనందంతో ఆమె వుక్కిరిబిక్కిరైంది. మృదువుగా ఆమె కన్నీళ్ళు తుడిచి ఆప్యాయంగా దగ్గరకి తీసుకున్నాడు.

"థ్యాంక్యూ.. థ్యాంక్యూ.. మై డియర్.."

"ఇది.. ఇదంతా నిజమేనా భరద్వాజా.. నిజంగా.."

సున్నితంగా ఆమెని వారిస్తూ చెప్పాడు, "నిజంగా నిజం మనూ.. చాలా బాధ పెట్టాను కదూ.. ఐనా నువ్వు నన్ను కాదనలేదు.. అందుకే నిన్ను ఏంజిల్ అనేది... ఇంక ఈ కన్నీళ్ళొద్దు.. వీటికి చోటివ్వను మన మధ్య అయామ్ ఆనర్డ్ మనూ.. జీవితంలో మొదటిసారి ఒక అమ్మాయికి ప్రపోజ్ చేసాను.. వెంటనే ఆ అమ్మాయి ఒప్పుకుంది చూసావా.. ఎంత లక్కీనో నేను.." నవ్వాడు.

తేరుకున్న మనోజ్ఞ పెదాల మీద నవ్వు పరుచుకుంది. తలూపింది నిశ్శబ్దంగా.

"పద సెలిబ్రేట్ చేసుకుందాం.." చెప్పాడతను.

"ఇప్పుడా.. ఎలా..?"అడిగిందామె.

"పెళ్ళి చేసుకునీ.." తాపీగా చెప్పాడు. అదిరిపడిచూసింది. "వ్వాట్ ఇప్పుడా..!!"

"ఎస్.. ఇప్పుడే.. ఐనా ఎక్కడో ఎందుకు, వీలైతే ఇక్కడే. నీకభ్యంతరంలేదుగా..?"సూటిగా చూస్తూ అడిగాడు.

"ఆర్యూ సీరియస్ భరద్వాజా?"సూటిగా ప్రశ్నించింది.

"డ్యామ్ సీరియస్. ఇప్పటికే చాలా ఎక్కువ ఆలోచించేసాను. ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యదలుచుకోలేదు. పద..." స్థిరంగా చెప్పాడు.

"ఐతే సరే.. ఒక్క నిమిషం.." అంటూ వంగి తన బ్యాగ్ లోంచి ఏదో తీసి పైకి లేచి అతని వైపు చెయ్యిసాచింది. ఆమె చేతిలోని చిన్నభరిణలో ఎర్రగా మెరిసింది కుంకుమ.

"పెళ్ళంటే నమ్మకం అని మీరే చెప్తారుగా భరద్వాజా.. నేను మిమ్మల్ని నమ్ముతున్నాను. మీకు కూడా నమ్మకముంటే..." ఆమె మాట పూర్తయ్యేలోపుగా కుంకుమ చేతిలోకి తీసుకుని జేబులో పెట్టుకుంటూ చెప్పాడు, "పద.."అయోమయంగా చూసిందతనివైపు, "ఎక్కడికి? "

ఏమీ జవాబు చెప్పే ప్రయత్నం చేయలేదతను, ఆమె లగేజ్ తీసుకుని కార్ లో పెట్టాడు. కార్ డోర్ తెరిచి ఆమె వైపు చూసి, "ఏం ఆలోచిస్తున్నావ్ మనూ, పదా.." అంటూ కార్ ఎక్కించాడు.

నిమిషాల్లో వాళ్ళ కారు గుడి ముందాగింది. ఆశ్చర్యంగా చూస్తూ అతన్ననుసరించింది. నెమ్మదిగా తన జేబులోంచి చిన్న బాక్స్ తీసాడు భరద్వాజ అందులో వున్న మంగళసూత్రాన్ని సంభ్రమంగా చూసింది. సంతోషంతో ఆమె కళ్ళు తళుక్కుమన్నాయి.

"మాకు పెళ్ళి చేయండి పురోహితులుగారూ, ఇప్పుడే.. " అంటూ తాళిని తాంబూలం పళ్ళెంలో వుంచాడు.

"ఇప్పుడా బాబూ.. అదీ.. " సందిగ్ధంగా ఆగాడాయన.

"వారం, వర్జ్యం.. ముహూర్తం ఏమీ చూడకండి.. ఇప్పుడే మా పెళ్ళి చేయండి." స్థిరంగా చెప్పాడు

"ఇదంతా.. ఆ మంగళసూత్రం." వింతగా చూస్తూ అడిగింది మనోజ్ఞ.

"బంధువుల పెళ్ళికోసం అమ్మ పంపించింది. మంచిదేగా మన పెళ్ళికి ఉపయోగపడుతోంది." నవ్వాడు.

కొద్ది క్షణాల్లో కలలా జరిగిపోయిన తమ పెళ్ళిని నిజమని నమ్మడానికి ప్రయత్నిస్తూ తన మెడలో పచ్చగా మెరుస్తున్న తాళిబొట్టుని చూసి అతని వైపుకి చూసింది.

"ఇదంతా నిజమేనా భరద్వాజా!? " తడికళ్ళతో అతన్ని ప్రశ్నించింది.

తన మెడలోంచి చైన్ తీసి ఆమె మెడలో వేస్తూ చెప్పాడు, "ఈ క్షణం నుంచి మనసా, కర్మణా.. నువ్వు నా భార్యవి.. పెళ్ళిలో చేసే ప్రమాణాలకర్థం నాకు తెలీదు గానీ, నీకు మాటిస్తున్నాను, ఇక నుంచి నీకు నేనుంటాను. కష్టమైనా, సుఖమైనా.. నేనున్నాను. నీ ప్రతి ఆశా, కలా నెరవేరుస్తాను. నీ మంచి, చెడూ నావే.. ట్రస్ట్ మీ..." ఉద్వేగంగా చెప్పాడు.

నెమ్మదిగా ఆమె నుదుట బొట్టు పెట్టి, పాపిట నింపాడు. ఆమె కళ్ళు మెరిసాయి. చేజారిందనుకున్న కల మళ్ళీ తన సొంతమైందనీ, శాశ్వతమైందనీ అర్థమై అప్రయత్నంగా తన మెడలో గొలుసు చూసుకుంది. సూర్యుడి షేప్ లో వున్న లాకెట్.. 'మా హెరిడిటరీ సెంటిమెంట్.. మాకందరికీ వుంటుంది..' అన్న అతని మాటలు గుర్తొచ్చి నెమ్మదిగా తలెత్తి అతని వైపు చూసింది. చిరునవ్వు నవ్వి దగ్గరకి తీసుకున్నాడు. "ఇప్పుడు సంతోషమేనా.." తలూపి అతని భుజానికి తలానించుకుంది. "పద మరి తొందరగా.."నవ్వాడు.

"ఎక్కడికీ, దేనికీ.. అంత తొందర.." తృప్తిగా అతన్ని చూసుకుంటూ అంది.

"ఇప్పుడేగా పెళ్ళైంది.. మరి బ్రైడల్ కిస్ తీసుకోవద్దా.. "నవ్వాడు అల్లరిగా.

ఉలిక్కిపడిచూసి, "మనమేమన్నా క్రిస్టి.."అనబోతున్న ఆమె ని వారిస్తూ చెప్పాడు, "మంచి ఎక్కడున్నా తీసుకోవాలి మిసెస్ భరద్వాజా.."

అతని మాటలకి, పిలుపుకి సిగ్గుముంచుకురాగా అప్రయత్నంగా కళ్ళువాలిపోయాయి.

"సో.. పద మరి.."అంటూ ఆమె సూట్కేస్ అందుకున్నాడు, "అయ్యో మీరూ..." కంగారుగా వారించబోయింది. చిన్నగా నవ్వాడామె కంగారు చూసి. "ఆహా.. ఇట్స్ మై డ్యూటీ.. మోయనీ ఇక నుండీ నీ బరువు బాధ్యతలన్నీ మోయాల్సింది నేనే కదా.."

ఆ మాటకి ఏదైనా వేరే అర్ధముందేమో అని అనుమానంగా చూసింది. అతని ముఖంలో అలాంటి భావమేమీ కనిపించకపోయేసరికి చిన్నగా నవ్వుతూ అతన్ననుసరించింది.

"థ్యాంక్ గాడ్.. అయామ్ గ్లాడ్ ఈ రోజు కార్ తెచ్చాను నిన్ను తీసుకెళ్ళడానికి.. ఎంతైనా కొత్త పెళ్ళికూతురివి కదా.."

"ఆహా.. లేదంటే.. "

"లేదంటే రెండుచేతులమీదా ఎత్తుకుని తీసుకెళ్ళేవాడిని. ఎనీ డౌట్స్" నవ్వాడు ఆమెకి కార్ డోర్ తెరిచిపట్టుకుని. కలలా చూస్తూ కారెక్కింది.

"ఇది... ఇదంతా కలకాదుగా భరద్వాజా.. " కార్ స్టార్ట్ చేస్తున్న అతన్ని చూస్తూ అడిగింది.

"ఊహు.. నిజంగా నిజం.. " అంటూ ఆమెని దగ్గరికి తీసుకుని పాపిట ముద్దు పెట్టుకున్నాడు. "చూసావా కుంకుమ అంటింది.. ఇంకా నమ్మకపోతే .. పోనీ ఎక్కడైనా గిచ్చీ.. గిల్లీ.. ప్రూవ్ చేయమంటావా..? " అల్లరిగా నవ్వాడు. అదిరిపడిచూసి తలఅడ్డంగా తిప్పింది., "మీరిలా కూడా మాట్లాడతారా.. నాకు తెలీదే..." ఆశ్చర్యంగా చూస్తూ అంది.

"ఇంకా ఏం చూసావ్.. చూద్దువు గానీ రియల్ భరద్వాజ ఏమిటో. ఇన్నాళ్ళూ.. భయాలతో చాలా వరకూ నన్ను నేను అణిచేసుకున్నాను.. ఇంక పోను పోను తెలుస్తుంది మేడమ్ గారికి.. తమరి శ్రీవారి తడాఖా.." నవ్వుతూ కారు టర్న్ చేసాడు.

"సో.. ఎప్పుడు చెప్తావ్ మీ డాడీ కి.. లేదా నన్ను మాట్లాడమంటావా?" ఆమె చేతి గాజులు సవరిస్తూ అడిగాడు.

ఊహు మీరొద్దు.. నేనే చెప్తాను. నా బర్త్ డే కి మాగ్జిమమ్ వస్తారు.. అప్పుడే.. లేదూ అంటే అక్కడికి వెళ్ళగానే.. "

"ఇట్ విల్ బీ షాక్ ఆఫ్ హిజ్ లైఫ్.. పాపం.. ఐ ఫీల్ సో సారీ ఫర్ హిమ్. చాలా ఆశలుండుంటాయాయనకి నీ పెళ్ళి గురించి కదా.. బాగా హర్ట్ అవుతారు. "బాధగా అన్నాడు.

తలూపింది, "హర్ట్ ఐతే అవుతారు.. బట్ ఐ నో ఐ కెన్ కన్విన్స్ హిమ్.. "

"యా.. ఐ నో యూ.. నన్నే కన్విన్స్ చేసావంటే ఎవర్నన్నా చెయ్యగలవులే"నవ్వాడు.

"ఆహా.. నేనేమీ కన్విన్స్ చెయ్యలేదు.. మీరే పరిగెట్టుకొచ్చారు.. నన్ననకండి" గలగలా నవ్వేసింది.

"సరే.. నీతో ఎవరు మాట్లాడి ఎవరు గెలవగలరు గానీ... ముందైతే మాట్లాడి చూపించు మీ డాడ్ తో తర్వాత నేను ఆయన్ని కలుస్తాను"

"మీరా..!?"

"అఫ్కోర్స్.. నేనే.. ఐ ఫీల్ ఐ ఓవ్ హిమ్ ఏన్ ఎక్స్ ప్లనేషన్.. అని.." నిట్టూర్చాడు.

నిశ్చలంగా చూసిందతన్ని, "కనిపించరుగానీ మీరు చాలా టచీ భరద్వాజా.. వెరీ సెంటిమెంటల్.. నిజంగా కలుస్తారా ఆయన్ని?"

"ఆహా.. ఐనా కలవకుండా ఎలా.. పైగా పేరంట్స్ వచ్చి మ్యాచ్ మాట్లాడ్డానికి అయామ్ నాట్ ఏన్ యంగ్ చాప్.."

"అబ్బా.. ఎటొచ్చీ అక్కడికే వస్తారు మీరు.. సర్లెండి ఇంతకీ మీ వాళ్ళకి ఎప్పుడు చెప్తారు?" కుతూహలంగా అడిగింది.

"వెల్.. మీ ఫాదర్ గో ఎహెడ్ అనగానే.."

"అంటే నా మీద అనుమానమా?" కోపంగా అంది.

"నో డియర్.. నెవర్.. నేనైతే ఇప్పుడంటే ఇప్పుడే చెప్పడానికి రెడీ గా వున్నాను.. కాకపోతే నీ పేరు చెప్పడానికి ముందు మీ ఫాదర్ అనుమతి.."

"ఆహా.. పెళ్ళి చేసుకువడానికొద్దుగానీ.. ఇప్పుడు గుర్తొచ్చిందా?" వెక్కిరించింది.

నవ్వాడు, "ఐతే నీకభ్యంతరం లేదుగా నేను వాళ్ళకి చెప్పేస్తే..."

"లేదంటే ఇప్పుడే ఫ్లైటెక్కేటట్టే.." అంటూ వెక్కిరించబోయి సెల్ తీసి నంబర్ డయల్ చేస్తున్న అతన్ని ఆశ్చర్యంగా చూసింది.

"వాళ్ళ రియాక్షన్ వింటావా?" అంటూ స్పీకర్ ఆన్ చేసాడు.

"అరె.. ఫోన్లోనా?" అంటూ కంగారుగా ఆమె ఏదో చెప్పేలోపు అవతల్నుంచి ఫోన్ లిఫ్ట్ చేసారెవరో.

"నాన్నా.. నేను.."

"ఎలా వున్నావురా? ఏంటీ ఇంత రాత్రివేళ ఫోన్ చేసావు..?" అటునుంచి భరద్వాజ తండ్రి గొంతు ఆదుర్దాగా వినిపించింది.

"బాగానే వున్నాను.. మీతోటే.. కాస్త మాట్లాడదామనీ.. అంటే నాన్నా..." ఆగాడు భరద్వాజ. ఊపిరి బిగపట్టి చూస్తోంది మనోజ్ఞ అతని వైపు.

"చెప్పు కన్నా.. ఏంటి విషయం?"

"అదీ.. అమ్మెప్పుడూ అంటూ వుంటుంది కద నాన్నా.. ఒక్క మాట సరే అనైతే చెప్పరా.. ముహూర్తం పెట్టించేస్తాను సిద్ధాంతి గారితో అనీ.." ఆగి గాఢంగా ఊపిరి తీసుకుని చెప్పాడు,

"..నేను సరే అన్నాను..అని చెప్పండి నాన్నా.."

**"కన్నా.."** అటునుంచి ఆయన గొంతులో విస్మయం. భరద్వాజ ఏంచెప్తున్నాడో పూర్తిగా అర్థం చేసుకోవడానికో నిమిషం పట్టిందాయనకి., "అంటే... ఓహ్.. నిజమా బిట్టూ.." ఆనందంతో ఉక్కిరిబిక్కిరౌతూ అన్నాడాయన. చిన్నగా నవ్వాడు భరద్వాజ., "ఔను నాన్నా.."

"ఇదిగో.. యశోధరా.. ఇలారా.. విన్నావా నీ కొడుకేం చెప్తున్నాడో. ముహూర్తం పెట్టించమంటున్నాడు చూడూ. " ఆయన హడావిడి తెలుస్తోంది ఫోన్లోనే.

"ముహూర్తమా దేనికండీ...?" భరద్వాజ తల్లి గొంతు లీలగా వినిపిస్తోంది.

"ఇంక దేనికే పిచ్చిదానా.. మన ఇంటికో మహలక్ష్మిని తీసుకురావడానికీ. నీ కోరిక ఇన్నేళ్ళకి తీరుస్తున్నాడు. మాట్లాడు మరీ." నవ్వుతున్నరాయన హాయిగా.

"కన్నా.. నిజమా.. నిజమే..?"ఆవిడ గొంతు వణికింది. మనోజ్ఞ అప్రయత్నంగా భరద్వాజ వైపు చూసింది. అతని ముఖంలో కాస్తంత మొహమాటం తొణికిసలాడింది.

"అవునమ్మా.."

"చాలురా. ఇంకేమీ అక్కర్లేదు మాకు. ఇంకీ జన్మలో నీ పెళ్ళి చూస్తామనుకోలేదురా. మన ఇల్లూ కోడలూ, మనవలతో కళకళ్ళాడుతుందంటే. చాలురా. నిజంగా నీకింత మంచి బుద్ధిపుట్టించిన ఆ పిల్లకి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలంరా. ఇదంతా నిజమే కదూ. నువ్వేమీ వేళాకోళం.." ఏడ్చేసిందావిడ. వాళ్ళెంతగా భరద్వాజ లైఫ్ సెటిలవ్వాలని కోరుకుంటున్నారో అర్థమై మనోజ్ఞ కళ్ళలో నీళ్ళొచ్చాయి.

"అమ్మా.. ఛ.. ఏంటది.. ఏడుస్తున్నావా? ఇది నిజమేనమ్మా.." లాలనగా చెప్పాడు.

"అదేం లేదురా.. ఇంతకీ ఎప్పుడు తీసుకొస్తావురా అమ్మాయిని ఇంటికి? " ఆత్రంగా అడిగింది.

"చాలా తొందర్లో.. అమ్మా ఇంకో మాట.. నే వచ్చేవరకూ.. " తటపటాయిస్తూ ఆగాడు.

చిన్నగా నవ్విందావిడ, "అర్థమైందిరా.. నువ్వు కోడల్ని తీసుకుని ఇంటికొచ్చేవరకూ నేనెవరికీ చెప్పనులే.."

"ఐ నో మామ్.. యూ ఆర్ సింప్లీ వండర్ఫుల్.. వుండనా మరీ. "

"సరే.. అమ్మాయిని అడిగానని చెప్పు. ఇదిగో నాన్నగారు మాట్లాడుతున్నారు."

"సరే.. చెప్పండి నాన్నా."

"అమ్మాయి ఇంట్లో వాళ్ళతో మాట్లాడ్డానికి ఎప్పుడు రావాలో చెప్పు కన్నా."

పకాల్న నవ్వాడు భరద్వాజ, "నాన్నా.. అయామ్ ఆల్మోస్ట్ ఫిఫ్టీ.."

"ఐనా.. నా కన్నా పాతికేళ్ళు చిన్నవాడివేరా. సరే నీకెలా వీలైతే అలాగే కానివ్వు కన్నా. కానీ... తొందరగా రా మీ అమ్మ ఆత్రం నేనెక్కువరోజులు ఆపలేను సుమా."

"గుడ్నైట్ నాన్నా...థ్యాంక్స్.." సెల్ ఆఫ్ చేసి మనోజ్ఞ వైపు చూసాడు.

"మై గాడ్.. అలా చెప్పేసారూ." అంది అప్పటివరకూ ఆపుకున్న ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

"మరింకెలా చెప్పాలి? ఏమైనా కథలూ కవిత్వాలూ చెప్పి, చెప్పాలా?"

"మీరే అంటే వాళ్ళూ ఏమీ అడగలేదు నాగురించి. ఎవరు, కులమేమిటి, మతమేమిటి, వయసెంత, ఆస్తిపాస్తులూ, పేరెంట్స్ ఎక్కడి వాళ్ళూ, ఎలా పరిచయం.. అసలు కనీసం నా పేరేమిటో కూడా.. "

"చెప్పానుగా వాళ్ళకి నేను పెళ్ళి చేసుకోవడమే చాలా పెద్ద గిఫ్ట్. దాని ముందివన్నీ జస్ట్..నథింగ్. అఫ్కోర్స్ నీవయసు చెప్పినప్పుడు వాళ్ళకి కాస్త.. కాస్తేంటి బానే షాక్ తగులుతుందనుకో. కాకపోతే మీవాళ్ళకి తగిలేంతకాదు, బట్.. దే విల్ నాట్ బీ కన్సర్న్డ్ అబౌట్ ఇట్ వెరీ మచ్.. ఇంతకీ నువ్వేంటి ఆల్మోస్ట్ కళ్ళనీళ్ళు పెట్టేసుకున్నావ్ నేను వాళ్ళతో మాట్లాడుతుంటే?"

"వాళ్ళ సంతోషం చూస్తే.. ఐ మీన్ వింటే.. ఎందుకో చప్పున కాస్త ఎమోషనల్ అయిపోయాను." తేరుకుంటూ చెప్పింది.

"నాట్ బ్యాడ్.. కొద్దిగా సెంటిమెంట్స్ వున్నాయి.." నవ్వేసాడు ఆమె తల మీద చిన్నగా తడుతూ.

"అమ్మ గుర్తొచ్చింది ", నెమ్మదిగా అంది.

చటుక్కున తలతిప్పి చూశాడు. ఓదార్పుగా ఆమె భుజం చుట్టూ చేయి వేసి దగ్గరకి తీసుకుంటూ, "ఆవిడుంటే నీ నిర్ణయానికి చాలా బాధ పడేవారేమో కదూ.." నెమ్మదిగా అడిగాడు.

"ఊహు.. ప్రేమంటే ఏమిటో తనకి తెలుసు, నన్ను తప్పక అర్థం చేసుకునేది... "

నవ్వాడతను., "ప్రేమంటే అందరికీ తెలుస్తుంది మనూ. కానీ తమ పిల్లల విషయానికొచ్చేసరికి వాళ్ళ ప్రేమ కంటే కన్న ప్రేమే గొప్పది అన్న కంపారిజన్ తో పాడుచేసుకుంటారు చాలామంది. అసలూ..." ఆగిపోయాడు ఆమె ముఖం చూసి, "మనూ... "

"లేదు భరద్వాజా... అమ్మకి ప్రేమంటే ఏమిటో చాలాబాగా తెలుసు. తన గురించి మీకు చెప్పాలి. తనో మామూలు, పల్లెటూరి అమ్మాయి.ఎక్కువ చదువుకోలేదు. ఓ పెళ్ళి లో తనని చూసిన నాన్న ఆమె అందాన్ని చూసి చాలా ఇష్టపడి, పట్టుపట్టి ఆమెని పెళ్ళి చేసుకున్నారు. కానీ, పెళ్ళి అయిన కొన్నాళ్ళకే నాన్నకి ఆవిడలో లోపాలు కనిపించడం మొదలైంది.

ఆవిడ ఎక్కువ చదువుకోలేదనీ, పదిమందిలోకి తీసువెళ్ళడం నామోషీగా భావించేవారాయన. నెమ్మది, నెమ్మదిగా తనకి ఆవిడ తగదనే ఫీలింగ్ చాలా ఎక్కువైపోయిందాయనలో. అది వారి మధ్యలో కనిపించని అగాధాన్ని పెంచేసింది. దానితో బాగా కృంగిపోయింది తను. కనీసం పిల్లలు కలిగితే ఐనా నాన్న లో మార్పు వస్తుంది, తనకీ ఓ తోడు వుంటుంది అని భావించింది. కానీ ఆ దేవుడు ఆవిడకి ఆ విషయంలోనూ చాలా పరీక్షలు పెట్టాడు. పిల్లలు పుట్టడానికి ఆవిడ ఆరోగ్యం సహకరించలేదు. తన కుటుంబాన్ని పరిపూర్ణం చేసుకోవాలనే కోరిక, నాన్న తనని గుర్తిస్తారనే ఆశతో ఆవిడ చాలా మొండిగా నన్ను కనడానికి సిద్ధపడ్డారు.

అంతలోనే హాస్పిటల్ కన్స్ట్రక్షన్ లో నాన్న పూర్తిగా మునిగిపోయారు. అలాగని నాన్న చెడ్డవారు కాదు, అమ్మంటే ఇష్టంలేకా కాదు, జస్ట్ నిర్లక్ష్యం అంతే.., అది చాలదూ ఓ పార్ట్నర్ మనసుని సమూలంగా తుంచేయడానికి. అమ్మకోసం కూడా కొంత టైం ఇవ్వాలనే సంగతి పూర్తిగా మర్చిపోయారు. తానో డాక్టర్ అయివుండి కూడా తన భార్య ఆరోగ్యాన్నీ, పుట్టబోయే వారి గురించిగానీ ఆలోచించాలన్న బాధ్యత విస్మరించారు. అది అమ్మని మరింత క్రుంగదీసింది. తన పట్టుదల ప్రకారం తన ఊపిరి నాకు పోసి నన్ను ఈ భూమ్మీద పడేసింది. నేను పుట్టిన మరుక్షణం నన్ను వదిలి వెళ్ళిపోయింది.. పెళ్ళైంది మొదలు ప్రతిక్షణం ప్రేమ కోసం, గుర్తింపుకోసం తపించీ, తపించీ చివరకి ఓడిపోయింది, వెళ్ళిపోయింది.. " నిట్టూర్చింది దిగులుగా.

కొద్దిసేపు మౌనంగా వుండిపోయాడు భరద్వాజ, "చాలా మంది చేసే తప్పే అది. జీవితం లో ఏదో కావాలన్న ఆరాటంలో, ఏదో పొందుతున్నామన్న భావనలో తమ జీవితాల్లో ముఖ్యమైన కుటుంబజీవితాన్ని పోగొట్టుకుంటారు.."

చిన్నగా నిట్టూర్చింది మనోజ్ఞ, "తను చనిపోయాకా నాన్న అమ్మ రాసుకున్న డైరీలలో ఆమె గుండెకోత తెలుసుకున్నారు. కానీ, అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. అందుకేనేమో నాన్న నా పెంపకంలో ఏ లోటూ రానివ్వలేదు. తానెంత బిజీగా వున్నా నాకిచ్చే టైమ్ అండ్ అటెన్షన్ లో ఏ లోపం జరగనివ్వరు. మొదట్లో నేను బర్త్ డే సెలిబ్రేట్ చేసుకోనేదాన్ని. కానీ మా అమ్మ కి నేను పుట్టడం ఎంత ఇంపార్టెంటో చెప్పి నా ఆలోచన మార్చారు. అప్పటి నుండీ నేను తప్పక సెలిబ్రేట్ చేసుకుంటున్నాను. నాన్న కూడా నా ప్రతి పుట్టినరోజుకీ ఎక్కడ వున్నా వచ్చేస్తారు. ఇన్ఫాక్ట్ ఎల్లుండి కూడా.. "

"రియల్లీ.. సో ఎల్లుండి యూ ఆర్ బిజీ అన్నమాట. " మాట మార్చడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"ఎస్.. ఆరోజే ఆయనకి మీ గురించి చెప్పబోతున్నాను. " చెప్పింది నెమ్మదిగా.

"ముందుగా బర్త్ డే కేక్ కట్ చేసి సెలిబ్రేట్ చేసుకున్నతరువాత, ప్లీజ్.. ఎందుకంటే ఇది నాతో చేసుకుంటున్న మొదటి బర్త్ డే కదా.." అడిగాడు.

" ష్యూర్ భరద్.. మీరెలా అంటే అలా." చిరునవ్వు తో చెప్పింది.

" హేయ్ థ్యాంక్యూ సో మచ్.. చెప్పు నీకేం కావాలి గిఫ్ట్? " ఉత్సాహంగా అడిగాడు.

" నేను అడిగేవాటన్నింటికంటే పెద్ద గిఫ్ట్ మీరు నాకు ఇచ్చేశారు భరద్..", తన మెడలో తాళిని చూపుతూ చెప్పింది. "ఐ డోన్ట్ వాన్ట్ ఎనీథింగ్ మోర్.."

చిన్నగా నవ్వి ఆమెని ఆప్యాయంగా దగ్గరకి తీసుకున్నాడు.

❦❦❦

"మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ద డే మై ఏంజెల్" చిరునవ్వుతో ఆమె చేతిని రిసీవ్ చేసుకున్నాడు. అందంగా అలంకరించిన ఛాంబర్ నీ, టేబుల్ మీద అందంగా అమర్చిన కేక్ ని చూస్తూ అంది., "వావ్.. అన్ని అరేంజ్మెంట్స్ చేసేసారే.. "

"ఎస్ మిస్.. ఇట్స్ మై ఏంజెల్స్ బర్త్ డే.. ద ఫస్ట్ సెలిబ్రేషన్ .. మన పెళ్ళి తరువాత.. మోరోవర్ ఈ రోజు మీ ఫాదర్ తో మాట్లాడాకా మన మ్యారేజ్ అఫీషియల్ కూడా కానుంది.. మరి ఇంత స్పెషల్ రోజు ఎలా జరగాలి చెప్పండీ? " నవ్వాడు హుషారుగా

"ఔనా.. " నవ్వేసింది హాయిగా.

"కమ్.. త్వరగా కేక్ కట్ చెయ్.. యూ హావ్ ఎ స్పెషల్ గిఫ్ట్ వెయిటింగ్ ఫర్ యూ.. " అంటూ ఆమెని కేక్ వైపు నడిపించాడు.

"ఓకే బాస్ సో.. హియర్ ఈజ్ యువర్ కేక్.." తియ్యగా నవ్వుతూ అతనినోటికందించింది.

"నౌ నా కోసం.. తినిపించండి" అంటూ వెంటనే మరో కేక్ పీస్ అతని చేతికి అందించింది.

చిరునవ్వుతో ఆమెని చూస్తూ కేక్ అందుకుంటున్న భరద్వాజ భృకుటి ముడిపడింది. తూలబోయిన శరీరాన్ని అప్రయత్నంగా సోఫా అంచుని పట్టుకుని నిలదొక్కుకున్నాడు. తల బలంగా విదిలించి "ఆ కేక్.. కేక్ వద్దు..వద్ద్ మనూ..సంథిగ్ రాంగ్.. " అతి కష్టం మీద చెప్పాడు.

"ఏం మీ సెలక్షనేగా, టేస్ట్ బాలేదా?" అని అల్లరిగా తలెత్తి అతన్ని చూసిన మనోజ్ఞ ముఖం పాలిపోయింది. "భరద్వాజా.. వాట్స్ రాంగ్.. " అంటూ కంగారుగా అతన్ని పట్టుకోబోయింది. అప్పటికే నేలపైకి జారిపోయాడతను..

"విశ్వనాథ్.. గార్డ్స్.. హెల్ప్" గొంతు చిట్లిపోయేలా అరుస్తూ సహాయంకోసం పరుగుతీసింది...

"మీకేంకాదు భరద్వాజా.. చూడండి మనం ఆల్రెడీ హాస్పిటల్ కి దారిలో వున్నాం.. టూ మినిట్స్... ఇప్పుడే సెట్ అయిపోతుంది.. ప్లీజ్ హ్యాంగ్ ఆన్..." బాధతో, నొప్పితో మెలిదిరిగిపోతున్న అతన్నిచూస్తూ, కళ్ళ నీళ్ళు ధారలు కదుతుంటే బలవంతంగా తనని తాను నిగ్రహించుకుంటూ అతని స్పృహ పోకుండావుండడానికి ఆపకుండా మాట్లాడుతోంది మనోజ్ఞ.

అంబులెన్స్ కన్నా వేగంగా ఆమె గుండె పరుగెడుతోంది.

రెండుకళ్ళూ గట్టిగా మూసుకుంది మనోజ్ఞ, ఏం జరగనుంది.. భరద్వాజ ఇదంతా ఎలా తట్టుకుంటున్నారు.. అంత నొప్పి, బాధ ఎలా ఓర్చుకుంటున్నారు.. ఎందుకిలా.. అతనివల్లే ఇది జరిగుంటుంది ... ఎందుకు.. తన మెడలో తాళి కట్టగానే ఇంత ప్రమాదం జరిగిందని తనని బ్యాడ్ లక్ అని వదిలెయ్యరు కదా. ఛ ఆయన అలా ఆలోచించే వ్యక్తి కాదు. ఐనా ఓ పక్క ఆయన బాధతో వుంటే ఏంటీ ఆలోచనలు.. ఒకవేళ అమ్మని తీసుకుపోయినట్టు ఇప్పుడు తననుంచి భరద్వాజని దూరం చేయడు కదా ఆ దేవుడు.. లేదు.. లేదు లేదు.. ఏ కీడూ జరగదు, జరగడానికి వీల్లేదు, దేవుడా ఏ దారుణమైన ప్రమాదాలు వద్దు.. ఆయన్ని క్షేమంగా వుంచు.. చాలు.. నాకింకేమీ అక్కర్లేదు.. భరద్వాజ క్షేమంగా వుండాలి..

ఎమర్జెన్సీ ఎయిడ్ కోసం పెట్టిన ఆక్సిజెన్ మాస్క్ అతికష్టం మీద తీసేస్తూ పిలిచాడు భరద్వాజ "మనూ..." అంటూ, "భరద్వాజా..భరద్..", కన్నీటితో ముందుకి వగింది ఏమిటో చెప్పమన్నట్టు, ఎగసిపడుతున్న ఊపిరిని కూడగట్టుకుంటూ చెప్పాడు "ఈ పెళ్ళి మన మధ్యే వుండిపోవాలి, ఎవ్వరికీ తెలియకూడదు...ఎవ్వరికీ.. మనూ.. నువ్వు.. మళ్ళీ పెళ్....పెళ్ళి చేసుకోవాలి నాకోసం.. ప్లీజ్...నువ్..సు..ఖం..గా..వుండాలి..చాలా..సు..ఖం..గా" ఇక మాటివ్వమన్నట్టుగా లేపిన చేయి జారిపోవడంచూసి నిశ్చేష్టురాలై అతని చేతిని పట్టుకుంది.. "మీకేంకాదు భరద్..ఏమీ కాదు.. " కన్నీటితో అతన్ని మాస్క్ తో కవర్ చేస్తూ దగ్గరకి తీసుకుంది.

అతని పెదవుల మీద సన్నటి నవ్వు మెరిసింది. ఇదేనా మరణమంటే.. వెళ్ళపోతున్నాననే ఈ బాధ.., జీవితంమీద కలుగుతున్న వాంఛ.., తన వారికి ఏదో-ఎన్నో చెప్పాలన్న ఆతృత, శరీరం కంటే మనసు ఎక్కువ బాధతో విలవిలలాడుతోందేమిటీ.. ప్రాణం మీద తీపి అంటారు ఇదేనా.. ఇది ఆగే పయనం కాదని తెలిసినా గడువీయమంటూ పరమాత్ముడిని అర్థించే ఈ ఆశ.. ఓ దైవమా... ఇదేనా మరణమంటే.. నెమ్మదిగా ఆ నవ్వు విశాలమైంది.

***ఉపసంహారం***

"డాక్టర్! మీకోసం ఒక విజిటర్ వున్నారు... వెయిటింగ్ ఫ్రంమ్ టూ అవర్స్.. " చెప్పింది అసిస్టెంట్. అలసటగా కుర్చీలో చేరిన మనోజ్ఞ ఆశ్చర్యంగా చూసింది, విజిటర్.. ఈ టైమ్ లోనా.. అప్రయత్నంగా వాచ్ చూసింది.

"హీ ఈజ్ ఫ్రమ్ ఇండియా అన్నారు, పైగా.. చాలా అర్జెంట్ అని కూడా అన్నారు అందుకే గట్టిగా వెళ్ళిపోమనలేకపోయాను..." గబగబా చెప్పింది స్నేహ.

చిన్నగా నవ్వింది మనోజ్ఞ, స్నేహకి ఇండియా నుండి ఎవరైనా రావడం అంటే ఎంత అపురూపమో తెలుసామెకి. దూరంగా వున్నప్పుడే మన దేశం, మన వాళ్ళు అనే ఫీలింగ్ ఎక్కువగా వుంటుంది. దూరమైన వాటి విలువేంటో వాటి గురించి తపించే వారికే తెలుస్తుంది... ఆలోచనలు ముసురుతుంటే చిన్నగా తలవిదిల్చి వాటర్ గ్లాస్ చేతిలోకి తీసుకుంది.

"సారీ మేడమ్.. మిమ్మల్ని అడక్కుండా వుండమని చెప్పేశాను.. మీరు టయర్డ్ గా వున్నారంటే పోనీ రేపు వచ్చి కలవమని చెప్పమంటారా.." బెరుగ్గా అడిగింది.

"నో.. నో.. దట్స్ ఓకే స్నేహా... పంపించు లోపలికి.. పేరేమిటన్నావ్.. ఇంతకీ.. .ఈజ్ హీ ఎ పేషెంట్ ఆర్ రెలెటివ్.. " అంటున్న తన మాట పూర్తి కాకుండానే స్నేహ మెరుపులా మాయమయ్యేసరికి చిన్నగా నవ్వుకుంది.

లోపలకి అడుగుపెడుతున్న అతన్ని చూస్తూనే మనోజ్ఞ ముఖం పాలిపోయింది.

ఆ వచ్చినవ్యక్తి పా...ణి.... సారంగ పాణి

"మీరా..?" అంది నెమ్మదిగా కొద్ది క్షణాల తర్వాత తేరుకుంటూ.

తలూపాడతను. "చెప్పకుండా వచ్చినందుకు క్షమించాలి మనోజ్ఞా.. కూర్చోవచ్చా.." అడిగాడు. తలూపింది యాంత్రికంగా.

"చాలా చిరాగ్గా, కసిగా వుంది కదూ నన్ను చూస్తుంటే.. అసహ్యం కూడా కలుగుతుండచ్చు. తప్పులేదు.. ఐ డిజర్వ్ ఇట్.. నాక్కూడా నీ ముందుకొచ్చే ధైర్యం లేదు. ఐనా నీ ముందుకు రాక తప్పలేదు మనూ.. నీకు తెలియాల్సిన, రాదర్ తెలపాల్సిన విషయాలు కొన్ని వున్నాయి... ఆగాడు.

స్తబ్దంగా చూస్తోంది మనోజ్ఞ.

"అతను..చనిపోయాడు..మనోజ్ఞా.. " ఆగాడు.

"వ్వా..ట్...." అంటూ తుళ్ళిపడి లేచిందామె కుర్చీలోంచి.. అప్పటి వరకు నిర్లిప్తంగా చూస్తున్న ఆమె ముఖంలో ఉద్వేగం.. టేబుల్ అంతుని బలంగా వత్తి పట్టి ముందుకు వంగుతూ ఆత్రంగా అడిగింది "..నిజమా మీరు.. చెప్పేది... అతను.. అతను.." వణికిందామె గొంతు.

"ఎక్కడినుండి చెప్పాలి?" తనలోతను గొణుక్కున్నట్టుగా అనుకుని ఆగాడు.

"నిజం.. హీ ఈజ్ డెడ్.. ఎవరైతే నీ జీవితంలో అన్ని సంతోషాలని దూరంచేసాడో.. ఆవ్యక్తి ఇక లేదు మనోజ్ఞా.. ఒక మంచి మనిషిని, మన మనిషిని ... మనందరినుండీ దూరంచేసిన వాడిక లేడు. చంపేశాను. నా చేతుల్తో వాణ్ణి చంపి. జే.కే. కి నివాళి సమర్పించాను. మీ అందరికీ నేను చేసిన అన్యాయానికి ఓ చిన్న క్షమాపణ సమర్పించుకున్నాను..."

నిశ్చేష్టురాలై చూసిందామె. " పాణిగారూ.. ఏంటి మీరు మాట్లాడేది...మీరు..మీరు..."

అభావంగా చూశాడతను., "అవునమ్మా.. జే.కే. కి సంబంధించిన వివరాలు మూర్ఖత్వంతో చెప్పి అతని ప్రాణాలు పోవడానికి కారణమయ్యాను. అమ్మని చూసి తిరిగివచ్చేసరికి నాకు దొరికిన స్వాగతం. జే.కే. మరణం.. అన్నేళ్ళ స్నేహానికీ, ఆయనిచ్చిన గౌరవానికీ విలువ పోగొట్టిన నాకు ఆయన చివరిచూపు కూడా దక్కలేదు. జీవం లేని ఆయన్నీ, జీవచ్ఛవంలా పడున్న నిన్ను చూసాకా నాకింక బ్రతకాలనిపించలేదు. నా పాపానికి పరిహారం చేసుకుని ఈ జీవితాన్ని ఆత్మహత్యతో

ముగించెయ్యాలని నిర్ణయించుకున్నాను. అందుకే, ఏ కారణంతో జే.కే. అన్నేళ్ళూ మౌనంగా వున్నాడో ఆ కారణాన్ని తుడిచేశాను. వాడిని ఈ ప్రపంచం నుండి తొలగించేశాను.. నాకున్న మొత్తం పరపతిని ఉపయోగించి వాడి వల్ల జరిగిన జే.కే. మరణాన్ని, ఆ విషప్రయోగాన్ని కేవలం ఒక కార్డియాక్ అరెస్ట్ గా మాత్రమే మిగిల్చాను. తర్వాత మిగిలిన పని నా మరణం.. కానీ... " కాస్త ఆగి అక్కడున్న నీళ్ళగ్లాసు తీసుకుని ఒక్క గుక్కలో ఖాళీ చేశాడు.

అప్పటికే మనోజ్ఞ కళ్ళు కన్నీటి చెలమలయ్యాయి. అతనివైపు నిశ్చేష్టురాలై చూస్తోంది. ఆమె రియాక్షన్ తో సంబంధం లేనట్టుగా ఓ కన్ఫెషన్ లాగా చెప్పుకుపోతున్నాడతను.

"కానీ.. జే.కే. తల్లితండ్రుల దగ్గర్నుంచీ కబురొచ్చింది. ఏ తల్లితండ్రుల సంతోషం కోసం తాను అంత మెంటల్ టార్చర్ అనుభవించాడో, వారు జే.కే. మరణంతో పూర్తిగా ఒంటరివారయ్యారు. వారి ఆస్తిపాస్తులన్నీ గుడికీ, కేశవన్న ప్రోజెక్ట్ కీ ఇచ్చేయమన్నారు. వారు చెప్పినవన్నీ పూర్తిచేసి వారి కోరిక ప్రకారం వారిద్దరినీ అరుణాచలంలో ఆశ్రమంలో దిగబెట్టి, నేనూ వారికి సేవకుడిగా వుండిపోయాను. వారు నన్ను మరో కొడుకు అనుకుంటున్నారు. నేను వారికి దాసుడిననుకుంటున్నాను. ఈ వయసులో ఆ వృద్ధులకి జరిగిన విషయాలేవీ తెలపలేను. అందుకే.. వారికే నా జీవితాన్ని సమర్పించేశాను. జే.కే.కి నేను చెల్లించగల ప్రాయశ్చిత్తం అదే అనుకున్నాను. నాలుగేళ్ళుగా అలాగే వున్నాను. పర్ణశాలను ఓ హాస్పిటల్ గా మార్చాలన్న వారి కోరిక విని, ఆ విషయం మాట్లాడడానికి హైదరాబాద్ వెళ్ళినప్పుడు అనుకోకుండా ఆనంద్ ని కలిశానమ్మా. మీ పెళ్ళి గురించి తెలుసుకున్నాను. "

ఇంకేదో చెప్పబోతూ మనోజ్ఞ వైపు చూసి ఆగిపోయాడు. టేబుల్ మీద తలానించి వెక్కివెక్కి ఏడుస్తోందామె. మౌనంగా కొద్దిసేపామెని రోదించనిచ్చాడు. కాసేపటితరువాత నెమ్మదిగా అన్నాడు,

" ఏంటమ్మా ఇదీ.. పిచ్చిపిల్లా.. జరిగినది తెలిస్తే జే.కే. హంతకుడిక లేడని ముఖ్యంగా నీకు తెలియాలనీ, నీ నుంచి సాధ్యమైతే ఓ చిన్న క్షమాపణ పొందాలనీ వచ్చానేగానీ, నీ గుండెలో గాయం మళ్ళీ రేపడానికి కాదమ్మా.. అలా బాధపడకు.. నీ బాధకి మరోసారి కారణమైతే ఆ జే.కే. నన్ను మరణించాకకూడా క్షమించడు తల్లీ.. ప్లీజ్ వూరుకో"

మెల్లగా తలెత్తింది. కన్నీళ్ళ మధ్య అతనికి చేతులు జోడించింది.

"లేదు పాణిగారూ.. మీరు ఏ గాయాన్నీ రేపలేదు. నిజానికి నా గుండెలో ఏళ్లనుంచి మండుతున్న మంటని చల్లార్చారు.. భరద్వాజ మరణానికి కారణమైన వ్యక్తి ఎవరో తెలిసీ, ఎవరికీ చెప్పలేక, అతన్ని శిక్షింపజేయలేక, నా .. భరద్వాజను అంత దారుణంగా హత్య చేసిన వాడు హాయిగా తిరుగుతుంటే నేను ఎలా చేతులుముడుచుకుని వున్నాను అనే నిస్సహాయతతో బతకలేక, చావలేక నరకం అనుభవిస్తున్నాను పాణిగారూ.. మీరు.. మీరు చేసినది తప్పో ఒప్పో నాకు తెలియదు, కానీ, నాకు మాత్రం చాలా గొప్ప సాయం చేసారు.. నాకు మనశ్శాంతినిచ్చారు. క్షమాపణ ఏంటి పాణిగారూ.. మీరు నాకు జన్మనిచ్చిన తండ్రితో సమానం సర్.. తండ్రితో సమానం.. మరో జన్మనిచ్చిన తండ్రి మీరు.." ఏడ్చేసిందామె.

"మనోజ్ఞా.. " కదిలిపోయాడామె మాటలకి. ..వారిద్దరి కలల పందిరి కూల్చేసిన కటికవాడు తను.. అలాంటి తనని ద్వేషించాల్సిన స్థానంలో క్షమించిన ఆమె సున్నితత్వానికి చలించిపోయాడు. ..చాలు భగవాన్..ఈ జన్మకిది చాలు.. మనసులోనే దేవుడికి నమస్సులందిచాడు.

కాసేపటికి తేరుకుందామె, "నేనూ మీకు ఒకటి చెప్పాలి పాణిగారూ.. ఆయనకిచ్చిన మాటకోసం మళ్ళీ పెళ్ళిచేసుకున్నాను.. ఐ మీన్.. " తడబడింది.

"నాకు తెలుసు.. భరద్వాజ చనిపోయిన నాలుగునెలలకే నువ్వు పెళ్ళి చేసుకున్నావంటే దాని వెనుక కారణం ఆయనే అని అంతమాత్రం ఐతే ఊహించగలను ..." చెప్పాడతను.

"ఆయనకోసం చేసే అతి పెద్ద నివాళి అదే అని భావించాను. కానీ మీ సాహసం ముందు నా నిర్ణయం ఎంత మామూలుదో తెలుస్తోంది.. " అంది నెమ్మదిగా.

తల అడ్డంగా తిప్పాడతను" లేదు తల్లీ, నేనే సాహసం చేయలేదు, నా పాపాన్ని మరో పాపం చేసి కడుక్కున్నాను అంతే.. కానీ, నువ్వు జే.కే. కి ఇచ్చిన మాట కోసం వేరే వ్యక్తిని పెళ్ళి చేసుకోవడానికి ఎంత మధనపడివుంటావో, ఎంత నలిగిపోయివుంటావో నేనూహించగలను.. కారణాలేవైనా ఇక అవన్నీ తెరమరుగు చెయ్యమ్మా.. ఇప్పుడు నీ మనసు శాంతించింది కదా.. మరి ఇకనైనా సంతోషంగా వుండాలి నువ్వు... " అన్నాడు మృదువుగా.

మౌనంగా తలదించుకుని అరచేతులవంక చూసుకుంది. తాను ఎందుకు ఆనంద్ నే పెళ్ళిచేసుకుందో, వెంటనే ఇంత దూరం వేరే దేశం ఎందుకు వచ్చేసిందో అతనూహించగలడని ఆమెకి తెలుసు.

నెమ్మదిగా లేచి నిలబడ్డాడతను, "..వెళ్తున్నాను మనోజ్ఞా.. నేను నీ తండ్రితో సమానం అని చెప్పి నాకెంతో ఊరటనిచ్చావ్.. ఆ మాట నిజమైతే, అతి చనువుతీసుకుంటున్నాననుకోకపోతే ఓ మాట చెప్పనామ్మా..."

" అయ్యో ఎంతమాట.. చెప్పండి.. " చప్పున లేస్తూ అంది.

" అతను నీ సుఖం కోరుకున్నాడు ఎప్పుడూ. అందుకే నిన్ను, నీ ప్రేమనీ యాక్సెప్ట్ చేయడానికి అన్ని రోజులు తీసుకున్నాడు.. జే..కే. గురించి బాగా తెలిసిన వ్యక్తి గా చెప్పట్లేదు.. అతని చివరి డైరీ చదివిన వ్యక్తిగా చెపుతున్నాను. జే.కే. కోరుకున్నది నీవు పెళ్ళి చేసుకోవడం మాత్రమే కాదు మనోజ్ఞా... అది మాత్రమే కాదు. మెడలో తాళి, పాపిట్లో కుంకుమ, కాళ్ళకి మెట్టెలు.. ఇవి కాదు నీ పెళ్ళి అంటే అతని దృష్టిలో.. నువ్వు, నీ భర్త, పిల్లాపాపలు.. ఓ పరిపూర్ణమైన జీవితం.. నీ సుఖం.. సంతోషం.. అదీ అతను కోరుకున్నది.. సాధ్యమైతే.. భరద్వాజని ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమించిన వ్యక్తిగా అతని కోరిక తీర్చు... అతనికి శాంతినివ్వు. ఇది అతని గుర్తుగా నీకోసం.. వుంటాను మరీ.." చెప్పేసి ఆమె జవాబు కోసం చూడకుండా జే.కే. డైరీ అక్కడుంచి బయటికి దారితీశాడతను.

నెమ్మదిగా టాక్సీలో చేరి తలుపుమూస్తుండగా లీలగా వినిపించిందామె పిలుపు.

"పాణీగారూ, "వడివడిగా వచ్చి టాక్సీ విండోలోంచి అతని వైపు చూస్తూ చెప్పింది, "రేపే ఇండియా తిరిగి వెళ్తాను.. భరద్వాజ కోరిక తీరుతుంది పాణిగారూ.. తీరుస్తాను..అదీ సంతోషంగా.. ఆయన ఎక్కడున్నా సంతోషంగా వుండాలి.. వుంటారు.. వుంచుతాను... " తడికళ్ళతో చెప్పి వెనుదిరిగింది.

ఓ చిన్న పరిచయం బంధమై, అనుబంధమై... చివరికో గుండెలో నిక్షిప్తమై శాశ్వతంగా నిలిచిపోయింది.. ఓ జ్ఞాపకమై....